
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 17
సంచిక: 45


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'


సోఫీ డివైన్ 'షో'
రెండో వన్డేలో భారత మహిళల జట్టుపై 76 పరుగులతో నెగ్గిన కివీస్ -12లో



'ఈక్విటీ'లపై పన్ను సున్నా!
చట్టంలో పలు వెసులుబాట్లు.. వాటిని అనుసరిస్తే పన్ను భారం పడదు -13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


ఖమేనీ ఆరోగ్యం విషమం?
ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ (85) ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు 'న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది.
వివరాలు 6లో ▸


'డిజిటల్ అరెస్టు'కు భయపడకండి
సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. 'డిజిటల్ అరెస్టు' ఫ్రాడ్‌కు భయపడవద్దని సూచించారు.
వివరాలు 6లో ▸



ఓట్లు తగ్గినా గద్దెనెక్కవచ్చు!
అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గమ్మత్తైన పరోక్ష ఎన్నిక విధానం అమల్లో ఉంది. అధ్యక్షుడిని ఎలక్టోరల్ కాలేజ్ సభ్యులే నిర్ణయిస్తారు.
వివరాలు 6లో ▸


వాళ్లే.. మా శత్రువులు
మతతత్వ శక్తులు, అవినీతిపరులే తమకు శత్రువులని టీవీకే పార్టీ అధ్యక్షుడు, ప్రముఖ తమిళ నటుడు విజయ్ చెప్పారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

'నాతో వస్తే.. పిల్లలు పుట్టిస్తా'



టీడీపీ నేత వేధింపులు తాళలేక మరో మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. నెల్లూరు జిల్లా చేజర్ల మండలంలో టీడీపీ నేత మల్లినేని పెంచలయ్య 'నాతో వస్తే పిల్లలు పుట్టిస్తా' అంటూ అసభ్యకరంగా మాట్లాడటంతో గిరిజన మహిళ మనస్తాపానికి గురైంది. గుళికలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు.
వివరాలు 10లో ▸

కూటమి నేతల మధ్య 'మట్టి' రగడ



శ్రీసత్యసాయి జిల్లాలో కూటమి నాయకుల మధ్య 'మట్టి వార్' తారాస్థాయికి చేరింది. ధర్మవరం మండలం రేగాటిపల్లిలో మట్టిని అక్రమంగా తవ్వుతున్న టీడీపీ నాయకులకు చెందిన జేసీబీని జనసేన నేతలు ధ్వంసం చేశారు. ఇక్కడ మట్టిని తాము తప్ప మరెవ్వరూ తవ్వకూడదని జనసేన నాయకులు హుకుం జారీ చేశారు.
వివరాలు 10లో ▸

3 పోర్టులు బలి

బాబు 'ప్రైవేటు' మమకారానికి..


రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులకు సర్కారు 'టెండర్'

రూ.13 వేల కోట్లకుపైగా వ్యయంతో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పోర్టులు ప్రైవేటు పరం

నిధులు సైతం సమకూర్చిన జగన్ సర్కారు
శరవేగంగా పూర్తవుతున్న దశలో ఆపాలని కూటమి ప్రభుత్వం ఆదేశం
నిర్మాణం, నిర్వహణ కోసం ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లు ఆహ్వానం
రాష్ట్ర ఆదాయానికి తూట్లు.. మరో స్కామ్‌కు నాంది!
10 ఫిషింగ్ హార్బర్లను సైతం ప్రైవేటు పరం చేయడానికి టెండర్లు
మూడు పోర్టులను నాడు ప్రభుత్వ రంగంలోనే చేపట్టిన వైఎస్ జగన్
ప్రైవేటులో నిర్మిస్తే రాష్ట్రానికి లాభం ఉండదనే ఈ నిర్ణయం
ఇప్పటికే రామాయపట్నంలో 65 శాతం పనులు పూర్తి
ఇక్కడ ఒక బెర్తు వాణిజ్య కార్యకలాపాలకు సిద్ధం
మిగిలిన రెండు పోర్టుల్లో 50 శాతం పనులు పూర్తి
2లో

- నిన్న మెడికల్ కాలేజీలు.. నేడు పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు!! ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రారంభానికి సిద్ధమైన 5 కొత్త వైద్య కళాశాలలను ఈ సర్కారు అడ్డుకోవడంతో మనకు ఈ ఏడాది అదనంగా రావాల్సిన 700 ఎంబీబీఎస్ సీట్లు పోయాయ్!! తాజాగా సర్కారు పీ4 జపానికి ఏకంగా 3 పోర్టులు.. 10 ఫిషింగ్ హార్బర్ల సంతర్పణ! 'ప్రైవేట్' పార్టీలకు పోర్టులు! వెరసి రాష్ట్ర ఆదాయానికి తూట్లు.. మరో స్కామ్‌కు నాంది!


నిర్మాణంలో ఉన్న రామాయపట్నం పోర్టు


Andhra Pradesh Maritime Board,
Government of Andhra Pradesh, India
Expression of Interest (EOI) from Potential Applicants
for
Construction , Development, Operation and Maintenance of ports in Andhra Pradesh

ఇప్పటికే నిర్మాణంలో ఉన్న పోర్టులకు తిరిగి టెండర్లు పిలిచిన కూటమి ప్రభుత్వం

కరెంట్ చార్జీల పెంపు దీపావళి కానుకా?

సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్

విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పారు
అవసరమైతే 35 శాతం తగ్గిస్తామని హామీ ఇచ్చారు



- ప్రజలపై అదనపు చార్జీలు వేయడమేనా మీ విజన్?
- 5 నెలల్లోపే రూ.6,072.86 కోట్ల భారం మోపడం భావ్యమేనా?
- మాట తప్పడమే మీ నైజమని మరోసారి నిరూపించుకున్నారు
- ఇకనైనా అబద్ధాలు మానండి.. తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేయకండి
- తక్షణమే చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి
- లేదంటే ప్రజలు క్షమించరు.. వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదు

2లో

> అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంత భారీ స్థాయిలో విద్యుత్ చార్జీలు పెంచి మాట తప్పడమే మీ (చంద్రబాబు) నైజమని మరోసారి రుజువు చేశారు. ఇకనైనా అబద్ధాలు చెప్పడం, ప్రజలను తప్పుడు హామీలతో మోసం చేయడం మానండి. విద్యుత్ చార్జీల భారం వేయాలన్న మీ కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి. లేదంటే ప్రజలు క్షమించరు. వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదు.
> - వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దక్షిణాదిలో.. అంతరించిపోతున్నాయి

కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ నివేదిక 'ఎన్విస్టాట్స్ ఇండియా 2024' ప్రకారం.. దేశంలో అంతరించిపోతున్న వృక్ష జాతుల సంఖ్య 159 కాగా, జంతు జాతులు 175. ఈ జాబితాలో అత్యధికంగా దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి.

	వృక్ష జాతులు	జంతు జాతులు
కేరళ	26	13
తమిళనాడు	23	16
కర్ణాటక	16	16
ఉత్తరాఖండ్	16	15
జమ్మూ కశ్మీర్	20	10
పశ్చిమ బెంగాల్	2	17
హిమాచల్ ప్రదేశ్	8	10
మిజోరం	8	8
ఒడిశా	1	13


బెయిల్ రద్దు కుట్రలో భాగమౌతారా..?

షర్మిలపై విజయసాయిరెడ్డి మండిపాటు

సరస్వతి షేర్ల బదిలీపై సుప్రీం రిటైర్డ్ జడ్జీల న్యాయ సలహాను సైతం మీకు పంపినా పెడచెవిన పెడతారా?

- ఇప్పటికే పదేళ్లలో రూ.200 కోట్లు ఇచ్చిన అన్నకు.. సొంత ఆస్తిలో 40 శాతం వాటా రాసిచ్చిన జగనన్నకు మీరు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ ఇదేనా?
- వైఎస్సార్ చనిపోయిన పదేళ్ల తరువాత.. మీ వివాహమైన 20 ఏళ్ల తరువాత తన సొంత ఆస్తిలో వాటా ఏ అన్న అయినా ఇస్తాడా?
- కనీస కృతజ్ఞత చూపకపోగా శత్రువుల కుట్రల్లో పాలు పంచుకుంటారా?

3లో



మీడియాతో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

- మీరు తాజ్‌మహల్, విప్రో కావాలని అడిగితే ఇచ్చేస్తారా షర్మిలా?
- అతి మంచితనం వల్లే జగన్ సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు



డైవర్షన్ పాలిటిక్స్‌ను తిప్పికొడదాం

శ్రేణులకు వైఎస్సార్‌సీపీ పిలుపు

ప్రజా వ్యతిరేకత నుంచి దృష్టి మళ్లించేందుకు నెలకో వివాదం
ఇందులో భాగంగా వైఎస్ కుటుంబ వ్యక్తిగత అంశాల వక్రీకరణ
ఈ విషయంలో అన్ని వివరాలను ప్రజల ముందు ఉంచాం
ఏది మంచి, ఏది చెడు అన్నది ప్రజలే నిర్ణయించుకుంటారు
ఇంతటితో ఈ వివాదానికి ముగింపు పలుకుదాం
3లో

వ్యాపారం.. వెలగని భూచక్రం

బాణసంచా విక్రయాలు నేలచూపు



- 75 శాతం అమ్మకాలు తగ్గాయంటున్న వ్యాపారులు
- వరదలు, తుపానులు, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలే కారణం.. ఏటా ఇప్పటికే 90 శాతం విక్రయాలు పూర్తయ్యేవంటున్న హోల్‌సేలర్లు
- ఈ ఏడాది తెచ్చిన సరుకు అమ్ముడుకాలేదని ఆందోళన

2లో

కోరలు చాస్తున్న క్యాన్సర్

కేవలం రొమ్ము క్యాన్సర్‌తోనే 2022లో 98,337 మంది మృతి

- నోటి క్యాన్సర్‌కు 79,979 మంది బలి
- 2045 నాటికి క్యాన్సర్ కేసులు, మరణాల్లో గణనీయమైన వృద్ధి
- క్యాన్సర్ కేసుల్లో 2025లో భారత్‌లో 12.8 శాతం వృద్ధి ఉంటుందని అంచనా

10లో



ఇదండీ సంగతి



నది స్వచ్ఛత చేకూరడానికి ఎంత కాలం పడుతుందో తెలియదు కానీ.. మీకు మాత్రం చాలా సమయమే పడుతుంది!!

పోలీస్‌స్టేషన్‌లో అల్లు రమణ, మన్మథరావుపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు



హత్యకు యత్నం.. స్టేషన్‌కెళ్తే అక్కడా దాడి

10లో

శ్రీకాకుళం జిల్లాలో బరితెగించిన టీడీపీ నేతలు

హత్యాయత్నంపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన బాధితులు

పోలీసుల్ని తోసేసి మళ్లీ వారిని తీవ్రంగా కొట్టిన టీడీపీ నాయకులు
కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఘటన.. మాజీ మంత్రి అప్పలరాజు హౌస్ అరెస్ట్



సైనికుడిని చితకబాదిన తెలుగు తమ్ముళ్లు

- దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తించే సైనికుడిపై టీడీపీ నేతలు విచక్షణారహితంగా దాడి చేశారు. తమ అక్రమాలను నిలదీసినందుకు వాహనాల్లో వెంబడించి మరీ సైనికుడిని, అతని సోదరుడు, డ్రైవర్‌ను కర్రలు, రాళ్లతో కొట్టారు. ఈ అరాచక ఘటన చిత్తూరు జిల్లా బోయకొండలో జరిగింది.

5లో



సామాజిక సేవలో కార్పొరేట్స్

క్రీడలు, ఆర్ట్, లింగ వివక్ష నిర్మూలనకు భారీగా పెరిగిన సీఎస్ఆర్ నిధులు
ఆరోగ్యం, పర్యావరణంకు తగ్గిన నిధులు
2022-23లో రూ. 29,987 కోట్లు ఖర్చు చేసిన కార్పొరేట్స్
ఇందులో ఒక్క విద్యారంగానికే అత్యధికంగా రూ.10,085 కోట్లు కేటాయింపు
ముందంజలో హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్, టీసీఎస్, రిలయన్స్

- వివరాలు 10లో

ప్రాణం తీసిన ఈత సరదా

కృష్ణానది ఊబిలో కూరుకుపోయిన ఐదుగురు యువకులు.. ముగ్గురిని కాపాడిన మత్స్యకారులు.. ఇద్దరు మృతి



- గుంటూరు జిల్లా సీతానగరం రైల్వే బ్రిడ్జ్ సమీపంలో ఈతకొట్టేందుకు కృష్ణా నదిలో దిగిన ఐదుగురు యువకులు ప్రమాదవశాత్తూ ఊబిలో కూరుకుపోయారు. వారిలో ముగ్గుర్ని మత్స్యకారులు కాపాడగా.. ఇద్దరు మరణించారు. మృతులు విజయవాడలోని రాజరాజేశ్వరిపేటకు చెందిన వారని పోలీసులు తెలిపారు.

- వివరాలు 5లో

క్లుప్తంగా...

తిరుపతిలో వరుస బాంబు బెదిరింపులు



తిరుపతి క్రైమ్: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో వరసగా బాంబు బెదిరింపులు వస్తున్నాయి. గత వారం రోజుల్లో పలుమార్లు నగరంలోని ప్రముఖ హోటల్స్‌ను టార్గెట్ చేస్తూ బాంబులు పెట్టామని మెయిల్స్ ద్వారా బెదిరిస్తున్న దుండగులు తాజాగా తిరుపతిలోని ఇస్కాన్ టెంపుల్‌లో బాంబు పెట్టామని ఆదివారం బెదిరింపులకు దిగారు. దీంతో పోలీసు యంత్రాంగం ఇస్కాన్ టెంపుల్ వద్ద డాగ్, బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టింది. జాఫర్ సాధిక్ అనే పేరుతో బాంబు బెదిరింపు మెయిల్ వచ్చినట్లుగా పోలీసులు గుర్తించారు.

6న కేబినెట్ భేటీ

పూర్తిస్థాయి బడ్జెట్‌పై చర్చించే అవకాశం?

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు అధ్యక్షతన నవంబర్ 6వ తేదీ ఉదయం 11గంటలకు సచివాలయంలో రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. మంత్రిమండలి సమావేశానికి తీసుకువెళ్లాల్సిన ప్రతిపాదనలను నవంబర్ 4వ తేదీ సాయంత్రం 4 గంటలకల్లా సాధారణ పరిపాలన శాఖ (కేబినెట్ విభాగానికి) పంపాలని అన్ని శాఖలను సీఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాల నిర్వహణపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని అధికార వర్గాల సమాచారం. ప్రస్తుత ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నవంబర్ నెలాఖరుకు ముగియనుంది. నవంబర్ రెండో వారంలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



చిలకలపూడి(మచిలీపట్నం): నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఆదివారం మచిలీపట్నంలో జరిగింది. బొప్పరాజు మాట్లాడుతూ.. ఉద్యోగులు జీపీఎఫ్ రుణం కోరిన వెంటనే మంజూరు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన ఏపీజీఎల్ఐ తదితర సదుపాయాలను ప్రాధాన్యత క్రమంలో చెల్లించాలని సీఎంను కోరినట్లు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో జీపీఎఫ్ రుణాలు ఇస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు ఎస్.నాగమల్లేశ్వరరావు, ఆర్లయ్య, తోట చెన్నప్ప, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీని వెంటనే నియమించాలి

11వ పీఆర్సీ బకాయిలను తక్షణమే చెల్లించాలి

తెనాలి: ఏపీ ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల మెయింటెనెన్స్ అండ్ ప్రాజెక్ట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 7వ రాష్ట్ర మహాసభలు ఆదివారం తెనాలిలో జరిగాయి. 13 ఉమ్మడి జిల్లాల నుంచి 90 మంది హాజరయ్యారు. 12వ పీఆర్సీని వెంటనే నియమించాలని, డీఏ, జీపీఎఫ్, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని, 11వ పీఆర్సీ బకాయిలు, రిటైరైన వారి బెనిఫిట్స్, మెడికల్ బిల్లులు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మహాసభలో తీర్మానించారు. తెలంగాణ రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి వీరభద్రరావు, తెలంగాణ వర్క్‌చార్జ్‌డ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి హాజరయ్యారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌డబ్ల్యు రోషన్, కోశాధికారిగా నూరుద్దీన్, మరో 12 మందితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలుత అసోసియేషన్ దివంగత నేతలకు నివాళులర్పించారు.

ఈ-చలాన్ పేరిట సైబర్ మోసాలు

అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: వాహనదారులను బురిడీ కొట్టించేందుకు సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్ లింక్‌లు పంపుతున్నారు. అందులో.. మీ వాహనాలపై ఉన్న ఈ-చలాన్‌లు చెల్లించండని.. పేర్కొంటున్నారు. ట్రాఫిక్ చలాన్లు చెల్లించాలని వచ్చే ఎస్ఎంఎస్‌లో నకిలీ వెబ్‌సైట్ లింక్ ఉంటుందని, వాహనదారులు దీన్ని క్షుణ్ణంగా గమనించాలని పోలీసులు సూచిస్తున్నారు. వాస్తవానికి ఈ-చలాన్‌కు సంబంధించిన నిజమైన వెబ్‌లింక్ https://echallan. parivahan.gov.in/కాగా దీన్ని కొద్దిగా మార్పు చేసి సైబర్ నేరగాళ్లు https://challaanparivahan.in/ను పంపుతున్నట్టు తెలిపారు. ఇలాంటి అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కరెంట్ చార్జీల పెంపు దీపావళి కానుకా?

'ఎక్స్' వేదికగా సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: 'కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న దీపావళి కానుక కరెంటు చార్జీలు పెంచడమేనా..' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే 30 శాతం తగ్గిస్తామని ఎన్నికల ముందు ప్రచారంలో ఇచ్చిన హామీ ఏమైంది చంద్రబాబూ? అంటూ సూటిగా ప్రశ్నించారు. 'టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే విద్యుత్ చార్జీలు తగ్గించేవాళ్లం అని గతంలో చెప్పిన మీరు.. ఇప్పుడు ప్రజలు ఎంతగా వద్దని వేడుకున్నా వినిపించుకోకుండా రూ.6,072.86 కోట్ల భారం వేయడం భావ్యమేనా? ఎన్నికల ముందు అధికారం కోసం ఇచ్చిన హామీ మేరకు ఈ చార్జీలను ప్రభుత్వమే భరించాలని వినియోగదారులు చేసిన విజ్ఞప్తులను ఎందుకు పెడచెవిన పెట్టారు? ప్రజలపై అదనపు చార్జీల భారం వేయడమే మీ విజనా?' అంటూ చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

మీరు తప్పు చేసి మాపై నిందలా?

- ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఐదు నెలల్లోపే వినియోగదారులపై ఎఫ్‌పీసీసీఏ చార్జీల భారం రూ.6,072.86 కోట్లు మోపింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను సిగ్గు లేకుండా వదిలేసి ఎఫ్‌పీసీసీఏ చార్జీల పేరిట వసూలు చేస్తున్నప్పటికీ.. అవి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కార్యకలాపాలకు సంబంధించిన చార్జీలంటూ మా ప్రభుత్వంపై నిందలు మోపడానికి ప్రయత్నించడం ఎంత వరకు సమంజసం? ప్రభుత్వమే ఈ చార్జీలు భరించాలని, ప్రజలపై వేయడానికి వీల్లేదని ఏపీఈఆర్సీ విచారణలో పాల్గొన్న వివిధ వర్గాల ప్రజలు కోరారు. వారం రోజులపాటు ప్రభుత్వ స్పందన కోసం ఏపీఈఆర్సీ ఎదురు చూసినా కూటమి ప్రభుత్వం చార్జీలు భరించేందుకు ముందుకు రాలేదంటే అర్థం ఏమిటి? ఎన్నికలప్పుడు ఇచ్చిన వాగ్దానానికి అర్థమేమిటి బాబూ?
- ప్రజలపై చార్జీల భారం వేయాలన్నదే మీ ఉద్దేశమని ఇక్కడ స్పష్టమైంది. గతంలోనూ ఇలాగే చార్జీలు పెంచి, ఇదేమి న్యాయం అని అడిగిన ప్రజలను బషీర్‌బాగ్‌లో గుర్రాలతో తొక్కించి.. తుపాకీలతో కాల్పించి చంపించిన చరిత్ర మీదే. ఇప్పటికైనా విద్యుత్ చార్జీల భారం వేయాలన్న మీ కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి. లేదంటే ప్రజలు క్షమించరు. వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదు.

ఆ రోజే డిస్కంలను అప్పులపాలు చేశారు

- గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇలాగే విద్యుత్ రంగాన్ని నాశనం చేశారు. అనవసర విద్యుత్ కొనుగోలు ఒప్పందాల కారణంగా డిస్కంలను అప్పులపాలు చేశారు. అవసరం లేకపోయినా పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పీపీఏ)లను అధిక ధరలకు కుదుర్చుకున్నారు. దాదాపు 8 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాల వల్ల విద్యుత్ సంస్థలపై 25 ఏళ్లపాటు ఏటా అదనంగా రూ.3,500 కోట్ల భారం పడుతోంది.
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2015–16లో 76 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తే రూ.140.10 బిల్లు వచ్చేది. 2018–19కి వచ్చే సరికి ఇదే వినియోగానికి వచ్చిన బిల్లు రూ.197.60. అంటే 41.04 శాతం పెరిగింది. 2016–18లో 78 యూనిట్లకు రూ.145.30 నుంచి రూ.202.80 అంటే 39.57 శాతం, 80 యూనిట్లకు రూ.150.50 నుంచి రూ.208 అంటే రూ.38.21 శాతం పెంచేశారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా, విద్యుత్ చార్జీల విషయంలో, విద్యుత్ రంగం విషయంలో ఇలాంటి కుట్రలే చేస్తుంటారని మరోసారి ప్రజలకు అర్థమయ్యేలా చేశారు.
- 2014–19లో చంద్రబాబు సీఎంగా ఉండగా.. విద్యుత్ శాఖను అసమర్థంగా నిర్వహించిన కారణంగా డిస్కంలకు సంచిత నష్టాలు రూ.22,089 కోట్లు వచ్చాయి. అప్పటికే ఉన్న రూ.6,625 కోట్ల నష్టాలతో కలుపుకుని మొత్తంగా రూ.28,715 కోట్లకు నష్టాలు పెరిగాయి. డిస్కంల సంచిత నష్టాలు 4.35 శాతం రెట్లు పెరిగాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యుత్ రంగ సంస్థలపై అప్పులతోపాటు బకాయిల భారం 2014లో రూ.29,552 కోట్లు ఉండగా, అది 2019లో రూ.86,215 కోట్లకు చేరింది.
- టీడీపీ ప్రభుత్వం కాలానుగుణంగా ట్రూ అప్ పిటిషన్లను ఏపీఈఆర్‌సీకి దాఖలు చేయాలి. కానీ అలా చేయలేదు. అందువల్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు టీడీపీ సర్కార్ హయాం నాటి ట్రూ అప్ పిటిషన్లు పెండింగ్‌లో ఉండిపోయాయి. అయితే ఆ భారాన్ని వినియోగదారులపై పూర్తిగా మోపకుండా అతి తక్కువ భారం పడేలా చేసింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ట్రూఅప్, ఎఫ్‌పీసీసీఏ తదితర కొత్త పేర్లతో ప్రజలపై భారం మోపి కష్టాలపాలు చేస్తోందంటూ అప్పటి ప్రతిపక్ష పార్టీలైన టీడీపీ, జనసేనలు నానా రాద్ధాంతం చేశాయి.



10-8-2022: టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే విద్యుత్ చార్జీలు తగ్గించేవారమని, గతంలో స్వల్పంగా పెంచిన విద్యుత్ చార్జీలపై ఆందోళనలకు పిలుపునిచ్చిన చంద్రబాబు



16-8-2023: టీడీపీ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, వీలైతే తగ్గిస్తామని విశాఖలో విజన్-2047 డాక్యుమెంట్ విడుదల సందర్భంగా చంద్రబాబు ప్రకటన

బాబు 'ప్రైవేటు' మమకారానికి మూడు పోర్టులు బలి



నిర్మాణంలో ఉన్న మూలపేట పోర్టు

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులకు సర్కారు 'టెండర్'

సాక్షి, అమరావతి: ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడంలో మరెవరికీ సాధ్యం కాని రికార్డులను నెలకొల్పిన సీఎం చంద్రబాబు ఈ దఫా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మూడు ప్రధాన పోర్టులపై కన్నేశారు. వీటిని ప్రైవేటు పరం చేసేందుకు శర వేగంగా చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో ఒక్కో రంగాన్ని ప్రైవేట్ పరం చేసి సీఎం చంద్రబాబు చేతులు దులుపుకొంటున్న విషయం తెలిసిందే. ఒకవైపు కొత్త పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతున్న తరుణంలో వాటిని తన వారికి అప్పగించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. 65 శాతానికి పైగా పనులు పూర్తయిన రామాయపట్నం పోర్టును, 50 శాతానికి పైగా పనులు జరిగిన మచిలీపట్నం, మూలపేట పోర్టులను ప్రైవేటుకు అప్పగించేందుకు టెండర్లు పిలవడం అధికార, పారిశ్రామిక వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. అంతిమంగా ఇది న్యాయ వివాదాలకు దారి తీసి పోర్టుల నిర్మాణాలు నిలిచిపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మూడు పోర్టుల నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నిధులను కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సమకూర్చింది. వివిధ బ్యాంకుల, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకొని ఫైనాన్షియల్ క్లోజర్ పూర్తి చేసిన తర్వాతే పనులు ప్రారంభించారు. కాబట్టి ఇప్పుడు ఈ పోర్టుల నిర్మాణ పనులు కొనసాగించడానికి నిధుల కొరత కూడా లేదు. నిర్మాణ పనులు దాదాపు సగానికిపైగా పూర్తయి వచ్చే ఏడాది అందుబాటులోకి రానున్న తరుణంలో అసంబద్ధంగా ప్రైవేటీకరణ చేయడంలో ఎటువంటి ప్రజా ప్రయోజనాలు లేవని, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్నిచ్చే పోర్టులను ప్రైవేటీకరణ చేస్తున్నారంటే దీని వెనుక ఏదో కుంభకోణం ఉండవచ్చని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ఇక రాష్ట్రంలో మత్స్యకారులకు మేలు జరిగేలా, లక్షల మందికి ఉపాధి కల్పించి వలసలను నివారించేలా, మత్స్య సంపదను పెంపొందించే దిశగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన 10 ఫిషింగ్ హార్బర్లను సైతం ప్రైవేటుకు అప్పగించేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టడం తీవ్ర విస్మయం కలిగిస్తోంది.

రామాయపట్నం

ప్రాజెక్టు వ్యయం:	రూ.3,736.14 కోట్లు
తొలి దశలో పోర్టు సామర్థ్యం:	34.04 ఎంఎంటీపీఏ
తొలి దశలో బెర్తులు:	నాలుగు
పనులు ప్రారంభించిన తేదీ:	జూన్ 24, 2022

మచిలీపట్నం

ప్రాజెక్టు వ్యయం:	రూ.5,254 కోట్లు
తొలి దశలో పోర్టు సామర్థ్యం:	35 ఎంఎంటీపీఏ
తొలి దశలో బెర్తులు:	నాలుగు
పనులు ప్రారంభించిన తేదీ:	మే22, 2023

మూలపేట

ప్రాజెక్టు వ్యయం:	రూ.4,361.91 కోట్లు
తొలి దశలో పోర్టు సామర్థ్యం:	23.5 మిలియన్ టన్నులు
తొలి దశలో బెర్తులు:	నాలుగు
పనులు ప్రారంభించిన తేదీ:	ఏప్రిల్19, 2023



ఫిషింగ్ హార్బర్లు

ఫిషింగ్ హార్బర్	ప్రాజెక్ట్ వ్యయం	మత్స్యకారులకు లబ్ధి	బోట్లు నిలిపే సామర్థ్యం
జువ్వలదిన్నె	రూ.288.80 కోట్లు	6,100	1,250
నిజాంపట్నం	రూ.451 కోట్లు	9,000	1,600
మచిలీపట్నం	రూ.422 కోట్లు	3,300	550
ఉప్పాడ	రూ.361 కోట్లు	17,700	2,500
మంచినీళ్లపేట	డీపీఆర్ దశలో ఉంది		
బుడగట్ల పాలెం	రూ.365.80 కోట్లు	3,840	780
పూడిమడక	రూ.392.53 కోట్లు	4,870	930
కొత్తపట్నం	రూ.392.53 కోట్లు	4,200	820
ఓడరేవు	రూ.417.55 కోట్లు	9,500	1,650
బియ్యపు తిప్ప	రూ.429.43 కోట్లు	2,348	441
మొత్తం	రూ.3,520.56 కోట్లు	60,858	10,521

వాణిజ్యం, ఉపాధికి ఊతమిచ్చేలా

రాష్ట్రానికి ఉన్న విస్తారమైన సముద్ర తీరాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధి, ఆదాయాన్ని పెంచడం లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగు పోర్టుల నిర్మాణాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. తొలిదశలో రూ.13వేల కోట్లకు పైగా వ్యయంతో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణాన్ని గత ప్రభుత్వమే చేపట్టింది. కాకినాడ గేట్‌వే పోర్టు నిర్మాణాన్ని పీపీపీ విధానంలో చేపట్టింది. ఇవి అందుబాటులోకి రావడం వల్ల వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకోవడమే కాకుండా పెద్ద ఎత్తున పరిశ్రమలు కూడా వస్తాయి. భారీ సంఖ్యలో యువతకు ఉపాధి కూడా లభిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో నిర్మిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దగా ఆదాయం ఉండదన్న ఉద్దేశంతో గత సర్కారు ల్యాండ్‌లార్డ్ మోడల్‌లో పోర్టుల నిర్మాణం చేపట్టింది. ప్రతి పోర్టుకు ప్రత్యేకంగా స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేసి రుణాలు తీసుకొని వేగంగా పనులు చేపట్టింది.

న్యాయ వివాదాలతో ఆగిపోయే ప్రమాదం..!

ఇప్పటికే మూడు పోర్టు పనులను మూడు సంస్థలు చేస్తుండగా.. కొత్తగా తిరిగి నిర్మాణ పనుల కోసం మారిటైమ్ బోర్డు ఈవోఐ పిలవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ టెండర్ల గురించి తమతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని, ఓపక్క తాము పనులు చేస్తుండగా మళ్లీ టెండర్లు ఎందుకు పిలిచారో అర్థం కావడంలేదని కాంట్రాక్టు సంస్థలు వాపోతున్నాయి. నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాకుండానే అప్‌గ్రెడేషన్, పోర్టు మోడర్నైజేషన్ అంటూ టెండర్లు ఎలా పిలుస్తారని పేర్కొంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను ఎక్కడికక్కడ నిలిపేసి మొత్తం మూడు పోర్టులను ప్రైవేటు పార్టీలకు అప్పగించడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఈ వ్యవహారాలను దగ్గర నుంచి గమనిస్తున్న అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పనులు చేస్తున్న సంస్థలను బెదిరించడానికి టెండరు నోటీసు ఇచ్చినట్లుగా ఉందని మరో సీనియర్ అధికారి వ్యాఖ్యానించారు. ఇప్పటికే పలుచోట్ల భూసేకరణ వివాదాలు నడుస్తున్నాయని, పోర్టులు ప్రైవేటు పరమైతే ఇవి మరింత జటిలమై న్యాయపరమైన చిక్కులతో నిర్మాణాలు ఆగిపోయే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య నుంచి వివరణ తీసుకోవడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. గతంలో పీపీపీ విధానంలో నిర్మించిన గంగవరం, కాకినాడ, కృష్ణపట్నం పోర్టులను దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం సొంతంగా పనులు చేపట్టిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ 4) పేరుతో అన్నింటినీ ప్రైవేటుపరం చేస్తోందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఒకేసారి 3 పోర్టులు చరిత్రలో తొలిసారి

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒకేసారి 3 పోర్టుల నిర్మాణాన్ని చేపట్టడం దేశ చరిత్రలో తొలిసారి. ఈ ఘనతను గత వైఎస్ జగన్ ప్రభుత్వం సాధించింది. రామాయపట్నం పోర్టు పనులను అరబిందో, మచిలీపట్నం పోర్టును మెగా, మూలపేట పోర్టు నిర్మాణ పనులను విశ్వసముద్ర సంస్థలు దక్కించుకున్నాయి. రామాయపట్నం పోర్టులో బల్క్ కార్గో బెర్తు పనులు 100 శాతం పూర్తయ్యాయి. కేంద్రం నుంచి అనుమతులు వస్తే బెర్త్ వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించవచ్చు. ఈ దశలో చంద్రబాబు ప్రభుత్వం వాటిని ప్రైవేటుకు అప్పగించేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదాయానికి తూట్లు పొడిచి ప్రైవేటుకు లబ్ధి చేకూర్చేందుకు సన్నద్ధమైంది. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులను నిర్మించి అభివృద్ధి చేసి నిర్వహించడంపై ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్ల (ఈవోఐ)ను ఆహ్వానిస్తూ ఏపీ మారిటైమ్ బోర్డు టెండర్లను పిలిచింది. నవంబర్ 4లోగా బిడ్లు దాఖలు చేయాలని టెండర్ నోటీసులో పేర్కొంది.

ఫిషింగ్ హార్బర్లు కూడా..

మన మత్స్యకారులు ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లకూడదనే లక్ష్యంతో వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.3,500 కోట్లతో పది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని చేపట్టింది. ఈ పది హార్బర్లు అందుబాటులోకి వస్తే 10,521 మెకనైజ్డ్ బోట్లు నిలిపే సామర్థ్యంతో పాటు 4.5 లక్షల టన్నుల అదనపు మత్స్య సంపదను పెంచుకునే వెసులుబాటు కలుగుతుంది. వీటిలో ఇప్పటికే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బరు పూర్తి కాగా ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన విషయం తెలిసిందే. మిగిలిన హార్బర్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని కూడా చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటుకు అప్పగించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. మొత్తం పది పిషింగ్ హార్బర్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి నిర్వహించేందుకు ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానిస్తూ కూటమి ప్రభుత్వం తాజాగా టెండర్లను పిలిచింది.

వ్యాపారం.. వెలగని భూచక్రం

- బాణసంచా విక్రయాలు నేలచూపు
- 75 శాతం అమ్మకాలు తగ్గాయంటున్న వ్యాపారులు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ)/సాక్షి నెట్‌వర్క్: దీపావళి పర్వదినం సమీపిస్తోంది. ఈ పండుగ పేరు చెబితే అందరికీ గుర్తొచ్చేది టపాసులే. కానీ.. ఈ ఏడాది బాణసంచా మార్కెట్‌లో పండుగ సందడి అసలు కనిపించడం లేదు. ఏటా ఈ సమయానికి హోల్‌సేల్ మార్కెట్‌లో 90 శాతం టపాసులు అమ్ముడయ్యేవి. దీపావళికి మూడు రోజులే సమయం ఉండగా.. కనీసం 25 శాతం బాణసంచా కూడా అమ్ముడుపోలేదని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. విజయవాడ నగరంలో ఐదుగురు హోల్‌సేల్ వ్యాపారులు అనేక దశాబ్దాలుగా టపాసుల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. వీరినుంచి 150 మంది రిటైల్ వ్యాపారులు బాణసంచా కొనుగోలు చేస్తారు. వీరంతా వివిధ ప్రాంతాల్లో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి మూడు, నాలుగు రోజులపాటు విక్రయాలు జరుపుతుంటారు. కానీ.. ఈ ఏడాది రిటైలర్లు హోల్‌సేలర్ల వద్ద బాణసంచా కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు.



విజయవాడలో బాణసంచా హోల్‌సేల్ దుకాణం

దీపావళిని కమ్మేసిన వరద, భారీ వర్షాలు

సెప్టెంబర్ మొదటి వారంలో ఎన్టీఆర్ జిల్లాను బుడమేరు వరద ముంచెత్తింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసి పలు ప్రాంతాల్లో వరద చేరింది. లక్షలాది మంది ముంపునకు గురై ఇప్పటికీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఇంట్లో రూ.లక్షల మేర నష్టం వాటిల్లింది. బాధితుల్లో అత్యధికులు ప్రభుత్వ సాయం అందక లబోదిబోమంటున్నారు. వరద ప్రభావం బాణాసంచా విక్రయాలపై తీవ్రంగా పడిందని, అందువల్లే హోల్‌సేల్ వ్యాపారానికి గండిపడిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

నిత్యావసర ధరలు పెరిగిపోవడంతో..

భారీగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు ప్రజల ఆర్థిక పరిస్థితులను దిగజార్చాయి. ఈ ప్రభావం బాణాసంచా విక్రయాలపై అధికంగా కనిపిస్తోంది. వంటనూనె, ఇతర నిత్యావసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో వాటిని కొనుగోలు చేసేందుకే ప్రజల దగ్గర డబ్బులు లేవని.. ఈ పరిస్థితుల్లో బాణసంచా కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

సంక్షేమం లేదు.. సంక్షోభమే

గత ప్రభుత్వ హయాంలో తల్లికి వందనం, విద్యా దీవెన, వసతి దీవెన, రైతుభరోసా వంటి పథకాల ద్వారా ఎన్నో కుటుంబాలకు సాయం అందేది. కూటమి ప్రభుత్వం రాకతో సంక్షేమ పథకాల సాయం అందటం లేదు. మరోవైపు ఖర్చులు భారీగా పెరిగిపోవడం పండుగపై ప్రభావం చూపుతోందని చెబుతున్నారు. ఈ పరిస్థితులన్నీ టపాసుల కొనుగోళ్లపై ప్రభావాన్ని చూపుతున్నాయని, ఈ ఏడాది సరైన వ్యాపారమే జరగలేదని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. ఏటా దసరా నుంచి మొదలై.. ఈ సమయానికి 90%వ్యాపారం పూర్తయ్యేదని.. ఈ ఏడాది దానికి భిన్నమైన పరిస్థితులు వల్ల 75% అమ్మకాలు తగ్గాయని వ్యాపార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

విక్రయాలు భారీగా తగ్గాయి



ఈ ఏడాది బాణాసంచా విక్రయాలు భారీగా తగ్గాయి. వర్షాలు, వరదలు దీపావళి సీజన్‌పై తీవ్ర ప్రభావం చూపాయి. ఏటా దీపావళికి నెల ముందే బాణసంచా తీసుకెళ్లే రిటైల్ వ్యాపారులు ఈ ఏడాది కొనుగోళ్లకు ముందుకు రాలేదు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు కొనుగోలుదారులపై ప్రభావం చూపుతున్నాయి. పండుగకు ముందు జరిగే వ్యాపారంలో 50 శాతం కూడా జరగలేదు.

– గర్రె బాబూరావు, బాణసంచా వ్యాపారి, చిలకలూరిపేట

ఎక్కడా కనిపించట్లేదు



ఈసారి దీపావళికి టపాసులు పేలేలా కనిపించడం లేదు. టపాసుల విక్రయాలు ఎక్కడా జరగటం లేదు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఏటా ముందుగానే టపాసులు కొనేవారు. ఇటీవల వచ్చిన అకాల వర్షాలు, ధరల పెరుగుదలతో ఆ పరిస్థితి కనిపించడం లేదు. షాపులు నెలకొల్పేందుకు కూడా వ్యాపారులు ముందుకు వస్తున్న పరిస్థితి లేదు.

– ఎస్.రాజారావు, బైరివానిపేట, శ్రీకాకుళం జిల్లా

బెయిల్ రద్దు కుట్రలో భాగమౌతారా?

షర్మిలపై విజయసాయిరెడ్డి మండిపాటు



సాక్షి, హైదరాబాద్: ఈడీ జప్తు చేసిన, హైకోర్టు స్టే విధించిన సరస్వతి పవర్ షేర్లను ట్రాన్స్‌ఫర్ చేస్తే వైఎస్ జగన్‌కు ఇబ్బందులు ఎదురై బెయిల్ రద్దు అయ్యే పరిస్థితి ఉత్పన్నం అవుతుందని తెలిసినా షర్మిల రాజకీయ కుట్రలో భాగస్వామిగా మారి కుట్రపూరితంగా వ్యవహరించారని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ పక్ష నేత వి.విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. దీనిపై వైఎస్ జగన్ రిటైర్డ్ సుప్రీం కోర్టు జడ్జీల న్యాయ సలహాను షర్మిలకు పంపించినా పెడచెవిన పెట్టారని చెప్పారు. ఏ చెల్లి అయినా ఇలా చేస్తుందా? అని సూటిగా ప్రశ్నించారు. వైఎస్సార్ చనిపోయిన పదేళ్లకు.. షర్మిలకు వివాహమైన 20 ఏళ్ల తరువాత తాను వ్యాపారాల ద్వారా సంపాదించిన వాటిల్లో రూ.200 కోట్లు ఇచ్చిన అన్న పట్ల.. తన సొంత ఆస్తిలో 40 % ఇవ్వటానికి సిద్ధపడిన అన్నపై కనీస కృతజ్ఞత లేకపోగా నువ్వు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ ఏమిటంటే.. చంద్రబాబుతో కలసి బెయిల్ రద్దు చేసే కుట్రలు పన్నటమేనని షర్మిలను విమర్శించారు.

మీరు తాజ్‌మహల్, విప్రో కావాలని అడిగితే ఇచ్చేస్తారా షర్మిలా? అని ప్రశ్నించారు. చంద్రబాబు కుయుక్తులను షర్మిల తెలుసుకోవాలని హితవు పలికారు. అతి మంచితనం వల్లే జగన్ అనర్థాలు కొని తెచ్చుకుంటున్నారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు, ఆయన ఎల్లో మీడియాతో కలిసి నిర్వహించే మీడియా సమావేశాల్లో ప్రజా సమస్యల కంటే జగన్‌పై దూషణలకే షర్మిల 95 శాతం ప్రాధాన్యమిస్తోందన్నారు. తల్లి విజయమ్మ కన్నీళ్లు తుడవడానికే ఇదంతా అని షర్మిల చెప్పడం అబద్ధమని, చంద్రబాబు కళ్లల్లో ఆనందం చూడటానికే అన్నపై కుయుక్తులు పన్నుతూ మీడియా సమావేశాలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు. తనపై, వైవీ సుబ్బారెడ్డిపై షర్మిల చేసిన వ్యాఖ్యలు, ఆస్తుల విషయంలో జగన్‌పై చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. షర్మిలది ఆస్తి తగాదా కాదని, అధికారానికి సంబంధించిందన్నారు. జగన్‌ను తిరిగి సీఎం కాకుండా చేయాలన్నదే షర్మిల ఆలోచనని, చంద్రబాబు ఇచ్చిన అజెండాతోనే ఆమె పనిచేస్తున్నారన్నారు. షర్మిల పీసీసీ అధ్యక్షురాలిగా ఉన్నా, కేంద్రంలో ఆ పార్టీకి ఎన్‌డీఏ వ్యతిరేకమైనా, ఆమె బాబుతో లాలూచీపడి జగన్‌పై కుట్రలు చేస్తోందన్నారు.

షర్మిల మాటలను ప్రజలు నమ్మరు

తల్లిని, చెల్లిని మోసం చేసిన వ్యక్తి ప్రజలకు ఏం లబ్ధి చేకూరుస్తారని ప్రశ్నించడం, జగన్‌ను నమ్మొద్దని చెప్పడం ఎంత ద్రోహమో, అన్యాయమో తన మనస్సాక్షిని ప్రశ్నించుకోవాలని షర్మిలకు సూచించారు. చంద్రబాబు మాటలనే ఆమె వల్లిస్తున్నారని, ఆయన అజెండాను నెత్తిన పెట్టుకున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ కోటిన్నర కుటుంబాలకు, 80 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు ఆసరా ఇచ్చారని, 45 లక్షల మందికి అమ్మ ఒడి అమలు చేశారని, అలాంటి సీఎం దేశంలో ఉన్నారా? అని ప్రశ్నించారు. ఇంత మందికి మేలు చేసిన జగన్ సొంత ఇంట్లో తల్లి, చెల్లికి అన్యాయం చేస్తారని కుట్రపూరితంగా చెబుతుంటే ఎవరు నమ్ముతారని షర్మిలను నిలదీశారు. మహిళల్లో జగన్ పట్ల వ్యతిరేకత పెంచాలనే చంద్రబాబు దుర్మార్గ అజెండాకు షర్మిల సహకరిస్తోందన్నారు.

తండ్రి మృతికి కారణమైన బాబుతో దోస్తీ

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి మృతికి కారణమైన చంద్రబాబుతో కలిసి షర్మిల కుట్రలు చేయడం దుర్మార్గమని సాయిరెడ్డి పేర్కొన్నారు. తన తండ్రి మరణానికి చంద్రబాబే కారణమని షర్మిల గతంలో అనేకసార్లు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. 'రాజశేఖర్‌రెడ్డి మరో 15 రోజుల్లో దుర్మార్గమైన చావు చస్తాడని' అంతకుముందు చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను గుర్తు తెచ్చుకోవాలన్నారు. వైఎస్ మరణానికి చంద్రబాబే కారణమని దీన్ని బట్టి అర్థం కావడం లేదా? అని నిలదీశారు. అలాంటి వ్యక్తితో కలిసి పనిచేయడం, పసుపు చీర కట్టుకుని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించడం, చర్చలు జరపడం, కుట్రలు చేయడం... ఇంతకన్నా అమానవీయ ప్రవర్తన ఉంటుందా? అని ప్రశ్నించారు. శంకర్రావు, ఎర్రన్నాయుడు, అశోక్ గజపతిరాజు, బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిని వాడుకుని జగన్‌ను తప్పుడు కేసుల్లో ఇరికించి జైలుకు పంపిన విషయం మరిచిపోయారా? అని షర్మిలను ప్రశ్నించారు. జగన్ మోచేతి నీళ్లు తాగుతూ అనుకూలంగా మాట్లాడుతున్నామని తనను, వైవీ సుబ్బారెడ్డిని షర్మిల విమర్శించడం సహేతుకం కాదన్నారు. శత్రువుకు మేలు చేసేందుకు సొంత అన్ననే వేటాడి, వెంటాడి కాటేసే చెల్లెమ్మ షర్మిల మినహా ఎక్కడా చూడలేదన్నారు. వైఎస్సార్ ఆత్మ క్షోభకు కారణమైన షర్మిల ఎల్లో మీడియా ముందు పెట్టే కన్నీటికి విలువ లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయని చంద్రబాబు ప్రజల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించే కుట్రలకు షర్మిలను వాడుకుంటున్నాడని విమర్శించారు.

దేశంలో ఇలాంటి అన్న ఉంటాడా?

వైఎస్ఆర్ బతికి ఉన్నప్పుడే ఆస్తుల పంపకం జరిగిందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. వైఎస్ఆర్‌కు వచ్చిన ఆస్తులను కుమారుడు, కుమార్తెకు ఆయన జీవించి ఉన్నప్పుడే పంచారని తెలిపారు. విజయలక్ష్మీ మినరల్స్, కోడూరు మిల్స్, కోడూరు ఆఫీసు ఆస్తులు, బైరైటీస్ మినరల్స్ స్టాక్స్, 25 మెగావాట్ల సరస్వతి పవర్, ఎస్ఆర్ఎస్ హైడ్రో, 51 ఎకరాల ఇడుపులపాయ భూములు, 79 ఎకరాల శెట్టిగుంట ఆస్తులు, 7.6 ఎకరాల పులివెందుల భూములు, బంజారాహిల్స్‌లోని 280 గజాలు, విజయవాడలోని రాజ్‌యువరాజ్ థియేటర్లు షర్మిలకు అప్పగించారని చెప్పారు. వైఎస్ జగన్ తనకు వచ్చిన ఆస్తులను అభివృద్ధి చేశారన్నారు. జగన్ నెలకొల్పిన భారతీ సిమెంట్స్ కోసం తొలుత రూ.1,400 కోట్లు అప్పు చేశారని, ఆ తర్వాత తీర్చారని తెలిపారు. సాక్షి మీడియా మొదట్లో నష్టాన్ని చవిచూసిందన్నారు. ఈ నష్టాలు, అప్పులను షర్మిల ఎప్పుడూ పంచుకోలేదన్నారు. ఇవన్నీ జగన్ తన దక్షతతో అభివృద్ధి చేసి, లాభాల్లోకి నడిపించారని గుర్తు చేశారు. ఆయన అభివృద్ధి చేశారు కాబట్టే వాళ్ల పేర్లు పెట్టారని, తానే ఆ పేర్లు సూచించానని వెల్లడించారు. ఆమెకు ఏదైనా కంపెనీ నచ్చితే ఎవరైనా ఇస్తారా? అని ప్రశ్నించారు. జగన్ ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే ఆస్తుల పంపకాలు ఏ విధంగా జరిగాయో తెలుస్తుందన్నారు.

అమ్మ తటస్థతపై సందేహాలు!



తన అసంబద్ధ చర్యలు కుమారుడి బెయిల్ రద్దు పరిస్థితికి దారి తీసే ప్రమాదం ఉందని తెలిసినా ఆ కుట్రలకు వైఎస్ విజయమ్మ పరోక్షంగా సహకరించడంపై సర్వత్రా తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది. విజయమ్మ తటస్థతపై పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.విజయమ్మను మొదటి నుంచి భావోద్వేగాలకు గురిచేసి షర్మిల ప్రభావితం చేస్తున్నట్లు పలు సందర్భాల్లో స్పష్టమైందని నెటిజన్లు, ప్రజలు చర్చించుకుంటున్నారు. న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని తెలిసినా సరస్వతి షేర్ల ట్రాన్స్‌ఫర్ పత్రాలపై సంతకాలు చేయడం.. పలు సందర్భాల్లో షర్మిలకు అనుకూలంగా వ్యవహరించడం ఆమె తటస్థ వైఖరిని ప్రశ్నార్థకంగా మార్చినట్లు చర్చించుకుంటున్నారు.

సార్వత్రిక ఎన్నికల సమయంలో సైతం కొద్ది గంటల్లో ఎన్నికల ప్రచారం ముగియనున్న సమయంలో విదేశాల నుంచి విజయమ్మ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వీడియో సందేశాన్ని విడుదల చేయటాన్ని గుర్తు చేస్తున్నారు. ఇద్దరు పిల్లలను సమానంగా చూడాల్సిన అమ్మ ఒకవైపే మొగ్గడం సరికాదని పేర్కొంటున్నారు. నీ అత్యాశ, కుతంత్రాల్లో అమ్మను కూడా పావుగా వాడుకున్నావు. తప్పుడు ప్రకటనలకు అమ్మను ఓ సాక్షిగా, అమలుకర్తగా చేశావంటూ వైఎస్ జగన్ తన సోదరికి రాసిన లేఖను గుర్తు చేస్తున్నారు. 'క్షమార్హం కాని అక్రమ చర్యల్లో అమ్మను భాగం చేశావు. గత కొద్ది సంవత్సరాలుగా అమ్మను భావోద్వేగాలకు నువ్వు వాడుకుంటున్న విషయం జగమెరిగిన సత్యం. నీ సొంత వ్యూహాల్లో అమ్మను భాగం చేశావు. కోర్టు అనుమతి లేకుండా షేర్లను బదిలీ చేస్తే నాకు న్యాయపరమైన సమస్యలు వస్తాయని తెలిసీ బదలాయింపు చేశావు. అంతేకాక షేర్ సర్టిఫికెట్లు, షేర్ ట్రాన్స్‌ఫర్ ఫారాలు పోయినట్లుగా అమ్మ చేత తప్పుడు ప్రకటనలు ఇప్పించావు. అంతిమంగా అక్రమ పద్ధతిలో వాటాలను బదలాయింపు చేశావు. దీనివల్ల కుమారుడిగా నాకు న్యాయపరమైన ఇబ్బందులు వస్తాయని తెలిసి కూడా నీ చర్యల్లో భాగస్వామి అయింది. ఆమె తటస్థతపై ప్రశ్నలు తలెత్తున్నాయి. అంతేకాక ఆమె ఒకవైపే ఉందన్న భావన కలిగిస్తోంది...' అని తీవ్ర ఆవేదనతో వైఎస్ జగన్ లేఖ రాయటాన్ని నెటిజన్లు, ప్రజలు ఉదహరిస్తున్నారు.కొద్దిరోజులుగా వరుసగా జరుగుతున్న పరిణామాలు ఈ సందేహాలకు బలం చేకూరుస్తున్నట్లు విస్తృతంగా చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా...

నేడు అగ్రిగోల్డ్ బాధితుల విజ్ఞాపన దీక్ష

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అగ్రిగోల్డ్ బాధితులు సోమవారం మహా విజ్ఞాపన దీక్ష చేపట్టనున్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఉదయం 11 గంటలకు విజయవాడ ధర్నా చౌక్‌లో దీక్షను చేపడుతున్నట్టు అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం చేతిలో మోసపోయిన బాధితులకు రూ.10వేల లోపు డిపాజిట్లను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించి ఆదుకుంది. రూ.20వేల లోపు డిపాజిట్లు ఉన్న వారికి కూడా చెల్లించి ఆదుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మహా విజ్ఞాపన దీక్ష చేపడుతున్నారు.

పర్యాటకాభివృద్ధి సంస్థ వీసీ, ఎండీగా ఆమ్రపాలి

తెలంగాణ నుంచి వచ్చిన పలువురు ఐఏఎస్‌లకు పోస్టింగ్



సాక్షి, అమరావతి: తెలంగాణ ప్రభుత్వం నుంచి రిలీవై రాష్ట్రానికి వచ్చిన ఐఏఎస్‌లకు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శిగా వాణీప్రసాద్‌ను నియమించింది. ప్రస్తుతం ఈ బాధ్యతలను అదనంగా చూస్తున్న ఎం.ఎం. నాయక్‌ను రిలీవ్ చేసింది. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌గా వాకాటి కరుణ, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, ఎండీగా ఆమ్రపాలిని నియమించింది. అలాగే ఏపీ టూరిజం అథారిటీ సీఈవోగా ఆమ్రపాలికి అదనపు బాధ్యతలను అప్పగించింది. అలాగే జాతీయ హెల్త్ మిషన్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను వాకాటి కరుణకు ఇచ్చింది. పురావస్తు, మ్యూజియం శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న వాణీమోహన్‌ను సాధారణ పరిపాలన (సర్వీసెస్) ముఖ్యకార్యదర్శిగా బదిలీ చేసింది. ప్రస్తుతం అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పి.భాస్కర్‌ను రిలీవ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు.

చిన్నారిని చిదిమేశాడు

విజయనగరంలో ముక్కుపచ్చలారని బాలికపై యువకుడి లైంగిక దాడి

గంట్యాడ: విజయనగరం జిల్లా గంట్యాడ మండలం కొఠారుబిల్లిలో మూడున్నరేళ్ల చిన్నారిపై ఒక యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లాకు చెందిన దంపతులు తమ కుమార్తెతో కలిసి ఆదివారం కొఠారుబిల్లి జంక్షన్‌లో బంధువుల ఇంట్లో ఒక వేడుకకు హాజరయ్యారు. ఈ క్రమంలో జంక్షన్‌కు చెందిన రవి అనే యువకుడు చిన్నారి తల్లిదండ్రులు ఫంక్షన్‌లో తలమునకలై ఉండగా పాపను టింబర్ డిపోవైపు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. కాసేపటికి పాప ఫంక్షన్ వద్ద కనిపించకపోవడంతో తల్లిదండ్రులు వెతకగా పాప ఏడుస్తూ వచ్చింది. దీంతో పాపను రవి అనే యువకుడు తీసుకువెళ్లడం చూశామని కొందరు చిన్నారి తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో వారు గంట్యాడ పోలీసులను ఆశ్రయించారు. వారు విజయనగరం దిశ పోలీసులకు సమాచారం అందించడంతో దిశ ఎస్ఐ ఎన్.పద్మావతి ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు రవిని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు. చిన్నారిని వైద్య పరీక్షల కోసం తరలించారు.

10 మంది టీజీఎస్పీ సిబ్బంది డిస్మిస్

తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: సెలవుల్లో మార్పులు, ఇతర డిమాండ్లతో ఆందోళనలు చేపట్టిన తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బందిపై ఆ రాష్ట్ర ప్రభుత్వం కఠిన వైఖరి తీసుకుంది. 10 మందిని ఆర్టికల్ 311 ప్రకారం ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించింది. పోలీస్ మ్యాన్యువల్‌కు విరుద్ధంగా వ్యవహరించడం, ఆందోళనలను రెచ్చగొట్టడం, మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తూ, సోషల్ మీడియాలో పోస్టులు చేస్తూ క్రమశిక్షణను ఉల్లంఘించిన నేపథ్యంలో డిస్మిస్ చేశామని డీజీపీ కార్యాలయం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

డైవర్షన్ పాలిటిక్స్‌ను తిప్పికొడదాం

- శ్రేణులకు వైఎస్సార్‌సీపీ పిలుపు

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత నుంచి తప్పించుకోవడానికి నెలకో అంశాన్ని తెరపైకి తెచ్చి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీస్తోందని, దీన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టడం ద్వారా ప్రజా గొంతుకగా నిలుద్దామని కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చింది. 'జగన్ ఇంతే చేశాడు.. మేం అంతకన్నా ఎక్కువ చేస్తాం' అంటూ చంద్రబాబు కూటమి ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని.. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా చేసిందేమీ లేదని మండిపడింది. వైఎస్సార్ కుటుంబంలో వ్యక్తిగత అంశాలను సైతం రచ్చకీడ్చి, వాటిని వక్రీకరించి వైఎస్ జగన్ ప్రతిష్టను దెబ్బతీయాలనే చంద్రబాబు, ఎల్లో మీడియా దుర్బుద్ధిని ఎండగట్టాలని చెప్పింది. ఈ అంశంపై అన్ని వివరాలను ఇప్పటికే ప్రజల ముందు ఉంచామని, ఇప్పుడు ఎవరిది మంచి? ఎవరిది చెడు? అన్నది ప్రజలే నిర్ణయించుకుంటారని పేర్కొంది. 'ఈ వ్యవహారం న్యాయస్థానాల్లో ఉన్నందున, ఇక వాదనలు ఏవైనా కోర్టుల్లోనే చేసుకునే వెసులుబాటు ఎవరికైనా ఉన్నందున, దీనికి ఇక్కడితో ముగింపు పలకాలని వైఎస్సార్‌సీపీ భావిస్తోంది. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్సార్‌సీపీ జెండా, అజెండా ప్రజలే. ఇదే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ నయవంచనలను నిలదీయడంపై మన పార్టీ శ్రేణులు దృష్టి పెట్టాలి' అని ఎక్స్ వేదికగా ఆదివారం పిలుపునిచ్చింది. అందులో ఇంకా ఏం చెప్పిందంటే..

- చంద్రబాబు కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేయడానికి పూనుకుంది. ఈ కుట్ర రాజకీయాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలి.
- జూన్‌లో రుషికొండ భవనాలు, జూలైలో శ్వేతపత్రాలు, మదనపల్లె ఫైల్స్..., ఆగస్టులో ముంబై నటి వ్యవహారం, సెప్టెంబర్‌లో బోట్లతో బ్యారేజీని ధ్వంసం చేసే యత్నం చేశారని దుష్ప్రచారం, శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారని ఆరోపణలు గుప్పించడం .. అక్టోబర్‌లో వైఎస్సార్ కుటుంబం వ్యవహారంపై విష ప్రచారం.. తదితర విషయాలన్నింటినీ ప్రజలకు వివరించాలి.
- గత ప్రభుత్వంలో అమల్లో ఉన్న పథకాలను ఎత్తివేసింది. కూటమి ప్రభుత్వం కొత్తగా ఒక్క పథకమూ అమలు చేయ లేదు. అన్ని రంగాల్లో తిరోగమనమే కనిపిస్తోంది. మహిళలకు రక్షణ లేని పరిస్థితులు, రెడ్‌బుక్ రాజ్యాంగం, సూపర్ సిక్స్.. సూపర్ సెవెన్ మోసాలు.. విద్య, వైద్యం, వ్యవసాయం, డోర్ డెలివరీ గవర్నెన్స్.. ఇలా అన్నీ పడకేసిన దుస్థితి.
- వీటికి తోడు ఉచిత పంటల బీమాకు మంగళం, కరెంటు చార్జీల బాదుడు.. మరో వైపు ఇసుక, లిక్కర్ స్కాం, వరద సహాయంలో అంతులేని అవినీతి.. ఇలా అన్ని అంశాలను ప్రజల్లోకి గట్టిగా తీసుకువెళ్లాలి.

బాబు వదిలిన విషపు బాణం షర్మిల

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకరరెడ్డి
- రాజన్న ఆనవాళ్లను తుడిచేసేందుకు బాబు కుట్ర
- ఇప్పటికైనా షర్మిల వాస్తవాలు తెలుసుకోవాలి



సాక్షి ప్రతినిధి తిరుపతి: రాజకీయ కుట్రలో భాగంగా చంద్రబాబు వదలిన విషపు బాణంలా షర్మిలమ్మ వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆనవాళ్లే లేకుండా చేసేందుకు చంద్రబాబు షర్మిలను పావుగా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షర్మిలమ్మ తెలంగాణ నుంచి చాపచుట్టేసి ఏపీకి వచ్చాక జగన్‌ను ఒంటరి చేసేందుకు చంద్రబాబుతో చేతులు కలిపి నేరుగా మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఆమెకు ఒక్కరూ మద్దతుగా లేరని, కుటుంబంలోనూ ఏకాకిగా మిగిలారని చెప్పారు. సరస్వతి షేర్లను బదలాయించి, జగన్ బెయిల్ రద్దు చేసేందుకు చంద్రబాబుతో కలసి కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి విషయాలను చూస్తుంటే రాజశేఖరరెడ్డి అభిమానులుగా తమ గుండెలు పగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు అమలు చేయలేని చంద్రబాబు.. ఒక్కో నెలలో ఒక్కో అంశంపై వివాదం లేవనెత్తుతూ నెట్టుకొస్తున్నారని విమర్శించారు. రుషికొండ ప్యాలస్, శ్వేతపత్రం, హీరోయిన్ కాదంబరి, శ్రీవారి లడ్డూ.. ప్రస్తుతం షర్మిలమ్మ ఎపిసోడ్ నడుస్తోందన్నారు.

ఎల్లో మాధ్యమాలు మిమ్మల్ని ఎందుకు మోస్తున్నాయి?

అన్న మీకు అన్యాయం చేశాడని మీరు చేసే అబద్ధపు ప్రచారాన్ని తెలుగుదేశం పార్టీకి సంబంధించిన ప్రచార మాధ్యమాలు ఎందుకు భుజానికెత్తుకున్నాయని భూమన ప్రశ్నించారు. ముకేష్ అంబానీ, అనిల్ అంబానీ ఆస్తుల పంపకాలను బిజినెస్ పేజీలో చిన్న చిన్న వార్తలకే పరిమితం చేసిన ఎల్లో మీడియా.. జగన్ కుటుంబ విషయం అనగానే పతాక శీర్షికలతో రాస్తూ పైశాచికానందం పొందుతోందని విమర్శించారు. చంద్రబాబు.. ఆయన తమ్ముడు, అక్క, చెల్లెలికి ఏ మేరకు ఆస్తులు పంచారని నిలదీశారు. చంద్రబాబు తమ్ముడు రామ్మూర్తి నాయుడు నాతో పలు విషయాలు చెప్పుకుని బోరున విలపించారు' అని వివరించారు. షర్మిలమ్మ మీ పార్టీలో చేరుతుందో, మీతోనే పయనిస్తూ జగన్ మీద దుష్ప్రచారం చేస్తుందో వారికే తెలియాలన్నారు. జగన్ భార్యగా, తన వదినగా భారతమ్మను షర్మిల అభినందించాలని చెప్పారు.

మీరు కూడా జగన్ మోచేతి నీళ్లు తాగినవాళ్లే

విజయసాయిరెడ్డిపై షర్మిల మండిపాటు



సాక్షి, అమరావతి: విజయసాయిరెడ్డి మాట్లాడింది జగన్ రాసిచ్చిన స్క్రిప్టేనని.. ఆయన కూడా జగన్ మోచేతి నీళ్లు తాగిన వారేనని ఏపీసీసీ చీఫ్ షర్మిల మండిపడ్డారు. జగన్ వల్ల రాజకీయంగా, ఆర్థికంగా బలపడిన విజయసాయిరెడ్డి ఇలా కాకపోతే ఇంకెలా మాట్లాడుతారని విమర్శించారు. విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై ఆమె 'ఎక్స్' వేదికగా స్పందించారు. వైఎస్సార్ మరణానికి కాంగ్రెస్ ముమ్మాటికీ కారణం కాదని షర్మిల వెల్లడించారు. వైఎస్సార్ మరణానికి చంద్రబాబు కారణమైతే.. అధికారంలో ఉన్న ఐదేళ్లు గాడిదలు కాశారా? అని మండిపడ్డారు. ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క ఎంక్వైరీ కూడా వేయలేదని విమర్శించారు.

'వన్ నేషన్.. వన్ అసోసియేషన్' దిశగా..

వైవీయూ: 'వన్ నేషన్.. వన్ అసోసియేషన్' దిశగా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అడుగులు వేస్తోందని మాజీ సైనికుల సంక్షేమ సంఘం వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లా కడప నగరంలోని ఐఎంఏ హాలులో ఆదివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన మాజీ సైనికుల సంక్షేమ సంఘ నాయకుల సమావేశం జరిగింది.

భోగాపురంలో ఎయిర్ సర్వీస్ వర్సిటీ

- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడి
- విశాఖ నుంచి విజయవాడకు మరో రెండు విమాన సర్వీసులు ప్రారంభం

సాక్షి, విశాఖపట్నం: భోగాపురంలో అంతర్జాతీయ స్థాయి ఎయిర్ సర్వీసెస్ యూనివర్సిటీ ఏర్పాటుచేస్తామని.. 500 ఎకరాల్లో ఏవియేషన్ సర్వీసులు, సౌకర్యాల కోసం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుచేయనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విశాఖ నుంచి ఎయిర్ కనెక్టివిటీ విస్తరణకు కృషిచేస్తున్నామని చెప్పారు. విశాఖ నుంచి వారణాశి, అయోధ్యకు విమాన సర్వీసులు ఇవ్వాలన్న ప్రతిపాదన ఉందని.. దీనిపైనా దృష్టిసారిస్తామని తెలిపారు. విశాఖపట్నం–విజయవాడకు ఎయిర్ ఇండియా, ఇండిగోకు చెందిన కొత్త సర్వీసుల ప్రారంభోత్సవ కార్యక్రమం విశాఖ విమానాశ్రయంలో ఆదివారం నిర్వహించారు. కొత్త సర్వీసులకు టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులకు మంత్రితో పాటు ఎంపీలు గొల్ల బాబూరావు, కేశినేని శివనాథ్ కలిసి బోర్డింగ్ పాస్‌లు అందించారు.



విశాఖ–విజయవాడ ఎయిర్ సర్వీసుల్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు బాబూరావు, కేశినేని చిన్ని

కొత్త విమానాల వేళలివే..

ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ.. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఉ.9.35కు విశాఖలో ప్రారంభమై 10.35కు విజయవాడ చేరుకుంటుందని.. అలాగే, తిరుగు ప్రయాణంలో రాత్రి 7.55కు బయలుదేరి, 9 గం.కు విశాఖ చేరుతుందని తెలిపారు. అదేవిధంగా ఇండిగో సర్వీసు రోజూ రాత్రి 7.15కు విజయవాడలో బయలుదేరి 8.20కి విశాఖపట్నం చేరుకుంటుందని.. తిరుగు ప్రయాణంలో 8.45 గం.కు బయలుదేరి రాత్రి 9.50 కి విజయవాడకి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం బాదుడే బాదుడు

- ట్రూఅప్ ఛార్జీలతో కరెంట్ బిల్లుల షాక్
- ప్రజలపై ఏకంగా రూ.6,072 కోట్ల భారం
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓ పక్క మండిపోతున్న నిత్యావసరాల ధరలను అస్సలు పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు కరెంట్ చార్జీల బాదుడుకు సిద్ధమైందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ మండిపడ్డారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.6,072 కోట్ల భారం వేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐదేళ్ల విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన నాలుగున్నర నెలల్లోనే నయవంచన చేస్తున్నారని, ఒక్కో యూనిట్‌పై ఏకంగా రూ.1.58 పెంపు అత్యంత హేయమని ఆయన ఆక్షేపించారు. అలాగే, ఉచిత పంటల బీమాకు మంగళం పాడి రైతులకు నష్టం చేస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పటికీ వారికీ పెట్టుబడి సాయం ఇవ్వలేదని గుర్తుచేశారు. ఒక టీవీ షోలో చంద్రబాబు అన్నీ పచ్చి అబద్ధాలు చెప్పారని.. ఎన్టీఆర్ మరణంపై కూడా ఆ షోలో మాట్లాడితే బాగుండేదని చురకలంటించారు. ఇక మాట తప్పడం, సమస్య వచ్చినప్పుడల్లా ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న చంద్రబాబు తాజాగా బుల్లితెర మీద 'అన్‌స్టాపబుల్'గా అబద్ధాలు ఆడారని అనిల్‌కుమార్ విమర్శించారు.

మా భూములను వదలం

- ఎయిర్‌పోర్టుకు పంట పొలాలను ఇచ్చేది లేదని స్పష్టం చేసిన రైతులు
- ఇప్పటికే పోలవరం, పుష్కర, హైవే, రైల్వేలైన్లకు ఇచ్చి నష్టపోయామని ఆవేదన
- బెండపూడిలో జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు

తొండంగి: తరతరాల నుంచి సాగు చేసుకుంటున్న రెండు పంటలు పండే వరి భూములను వదులుకునే ప్రసక్తి లేదని బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు భూముల బాధిత రైతులు స్పష్టం చేశారు. బెండపూడి, పి.ఇ. చిన్నాయపాలెం ప్రాంతాల్లో విమానాశ్రయం కోసం 757 ఎకరాల జిరాయితీ వరి పొలాలను ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిని వ్యతిరేకిస్తూ ఆదివారం బెండపూడిలో ఈ భూములకు సంబంధించిన రైతులు సమావేశమయ్యారు. గతంలో పోలవరం కాలువ, పుష్కర కాలువ, జాతీయరహదారి నిర్మాణం, రైల్వే లైనులకు వందలాది ఎకరాలను ఇచ్చి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఎయిర్‌పోర్టు పేరుతో 800 ఎకరాలను సేకరిస్తే సాగుపై ఆధారపడిన కౌలు రైతులు, కూలీలు ఇతర వర్గాల ప్రజల జీవనోపాధి పోతుందన్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులే అధికంగా ఉన్నామన్నారు. ప్రతిపాదించిన భూములన్నీ ప్రస్తుతం మార్కెట్‌లో ఎకరా ధర జాతీయ రహదారిని ఆనుకుని రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు పలుకుతోందని, మిగిలిన ప్రాంతంలో రూ.80 లక్షలకు పైగా పలుకుతుందని వివరించారు.

సంస్కృతికి, చదువుకు చిరునామా త్రిపుర

ఆ రాష్ట్ర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి



తాడేపల్లిగూడెం/భీమవరం అర్బన్: సంస్కృతికి, చదువుకు చిరునామా త్రిపుర అని ఆ రాష్ట్ర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. త్రిపురలో అక్షరాస్యత 97 శాతం ఉందన్నారు. విద్యలో గౌహతి తర్వాతి స్థానం త్రిపురదేనని అన్నారు. 65 శాతం అటవీ ప్రాంతం కలిగిన త్రిపురలో అగర్ ఉడ్, రబ్బరు పరిశ్రమకు ప్రాముఖ్యత ఎక్కువన్నారు. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో ఉందని ఇంద్రాసేనారెడ్డి అన్నారు. భీమవరం మండలం దొంగపిండి గ్రామంలో ఆదివారం ఆక్వా రైతులు, గ్రామస్తులతో మాట్లాడారు. ఆనంద ఫీడ్ ఫ్యాక్టరీని పరిశీలించారు. లోసరిలో చేపల చెరువును, తుందుర్రులో గోదావరి మెగా ఫుడ్ పార్కులో ఆక్వా ఉత్పత్తులను పరిశీలించారు.

కడప నుంచి హైదరాబాద్‌కు విమాన సర్వీసు

ప్రారంభించిన మంత్రి మండిపల్లి

కడప (కోటిరెడ్డి సర్కిల్): కడప నుంచి హైదరాబాద్ వెళ్లే ఇండిగో ఫ్లైట్‌ను రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం కడప విమానాశ్రయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడప నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే ఎంతో సమయం పడుతుందని, ప్రయాణికుల సమయాన్ని వృథా చేయకుండా విమాన సర్వీసులు ప్రారంభించామని చెప్పారు. రాబోయే రోజుల్లో కడప నుంచి ఇతర ప్రాంతాలకు మరిన్ని విమాన సర్వీసులను అందుబాటులోకి తెస్తామన్నారు.

పవర్ ఇక ప్రీ పే!

- ముందస్తు చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా
- స్మార్ట్ మీటర్లకు విద్యుత్ సంస్థ ఏర్పాట్లు
- మొదటిగా ప్రభుత్వ కార్యాలయాలకు
- రీచార్జి విధానంలోకి ఏపీ ఈపీ డీసీఎల్
- బకాయిల బాధ ఉండదంటున్న అధికారులు

కొత్తపేట: రానున్న రోజుల్లో విద్యుత్ చార్జీల చెల్లింపు విధానం ప్రీపెయిడ్ విధానంలోకి మారనుంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానే స్మార్ట్ మీటర్లు రానున్నాయి. మొదట మాన్యువల్ మీటర్ల నుంచి ప్రారంభమైన విద్యుత్ మీటర్లు ఆధునిక పరిజ్ఞానానికి అనుగుణంగా మారుతూ వచ్చాయి. ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల వంతు వచ్చింది. ప్రీపెయిడ్ ఆప్షన్‌తో ఈ మీటర్లు రూపొందించారు. సాధారణంగా ఈ నెల వినియోగించిన విద్యుత్ బిల్లును వినియోగదారులు మరుసటి నెల చెల్లిస్తున్నారు. బిల్లు ఇచ్చిన 15 రోజుల వరకు ఎటువంటి అపరాధ రుసుం చెల్లించవలసిన అవసరం లేదు. ఈ లెక్కన వినియోగదారుడికి బిల్లు చెల్లించడానికి దాదాపు నెల వరకు సమయం ఉంటుంది. ఇప్పటి వరకు అనుసరిస్తున్న పద్ధతి ఇదే. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దశల వారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మీటర్లలో ప్రీపెయిడ్ ఆప్షన్ జతచేశారు. దీని ద్వారా విద్యుత్ సరఫరా కోసం ముందుగానే రీచార్జి చేయాల్సి ఉంటుంది. అలా చేయకపోతే సరఫరా ఆటోమేటిక్‌గా ఆగిపోతుంది.

విద్యుత్ మీటర్లలో మార్పులు

మొదట మెకానికల్ (మాన్యువల్) మీటర్లు ఉండేవి వాటిలో యూనిట్లు చూసి రీడర్లు బుక్‌లో రీడింగ్ రాసుకునేవారు. తర్వాత ఎలక్ట్రో మెకానికల్ మీటర్లు, హై యాక్యురసీ మీటర్లు వచ్చాయి. ఆ తరువాత ఐఆర్ పోర్ట్ అంటే స్కాన్ చేస్తే రీడింగ్ ఆటోమేటిక్ రికార్డు అవుతుంది. ఇప్పుడు స్మార్ట్ మీటర్లు వస్తున్నాయి. ఇవన్నీ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా రూపొందించినవే. ఇప్పటి వరకు అమలవుతున్న విధానానికి అలవాటు పడిన వినియోగదారులకు స్మార్ట్ మీటర్‌పై మరింత అవగాహన కల్పించాల్సి ఉంటుంది.



మెకానికల్ (మాన్యువల్) మీటర్

జీతాలకు కోట్లు

విద్యుత్ శాఖ పరిధిలో వేల సంఖ్యలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రతి నెలా విద్యుత్ శాఖ జీతాలు, పింఛన్లు చెల్లించడానికి రూ.కోట్లు కావాల్సి వస్తోంది. ఇక శాఖాపరంగా అభివృద్ధి కోసం వందల కోట్లు కావాల్సి వస్తోంది. వీటికి మూలాధారం విద్యుత్ బిల్లుల ద్వారా వచ్చే ఆదాయమే. జిల్లాలో నెలకు సుమారు రూ.50 కోట్లకు పైగా విద్యుత్ బిల్లుల రూపంలో ఆదాయం వస్తోంది. అదే స్మార్ట్ మీటర్లు పెడితే ఇంకా పెరుగుతుందని అంచనా.

ప్రభుత్వ బకాయిలు రూ.103 కోట్లు

జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖలు, పంచాయతీలు, పరిశ్రమలు, వ్యాపార, గృహావసరాలు కలిపి మొత్తం 6,12,317 సర్వీసులు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాల పరంగా ఇప్పటి వరకు రూ.103 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. ఆ బకాయిల చెల్లింపుల కోసం ఎన్ని నోటీసులు ఇచ్చినా వసూళ్లు మాత్రం అంతంత మాత్రమేనని ఆ శాఖ రెవెన్యూ అధికారులు చెపుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలే కదా విద్యుత్ సరఫరా కట్ చేయరనే భావన ఏర్పడడంతో అవి మొండి బకాయిలుగా మారాయి. స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రీపెయిడ్ విధానం అమలులోకి వస్తే విద్యుత్ శాఖకు బకాయిల బాధ ఉండదు.

ఉపయోగాలు..

- సెల్ ఫోన్లో బ్యాలెన్స్ ఏ విధంగా చూసుకుంటామో.. ఇక్కడ అదే విధంగా యాప్‌లో చెక్ చేసుకోవచ్చు.
- బ్యాలెన్స్ ఉన్నంత వరకే విద్యుత్ సరఫరా ఉంటుంది. నగదు అయిపోయిన వెంటనే సరఫరా బంద్ అవుతుంది. రీచార్జి చేస్తేనే విద్యుత్ వెలుగులుంటాయి.
- బ్యాలెన్స్ ఎంత ఉందో ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవచ్చు.

నష్టాలూ..

- విద్యుత్ సంస్థను నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా మీటర్ రీడర్లు పనిచేస్తున్నారు. ఈ విధానం పూర్తిస్థాయిలో అమలైతే వారి ఉపాధికి పెద్ద దెబ్బేనని చెప్పొచ్చు.
- అవగాహన లేమితో రీచార్జ్ చేసుకోవడంలో వినియోగదారులు ఏ మాత్రం అలసత్వం వహించినా, సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం ఉంటుంది.
- విద్యుత్ చౌర్యం పెరిగే అవకాశం ఉంది. లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



"స్నేహితుడిని పొందే ఏకైక మార్గం స్నేహితుడిలా ఉండటమే!

– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి

సోమవారం, 28 అక్టోబర్ 2024

సువర్ణ వాకిలి

'చూశావా... ఏం తెచ్చానో' అన్నాడతను స్కూటర్ ఇంటి ముందు ఆపి. వెనుక ట్రాలీ వచ్చి ఆగింది. అన్నీ మొక్కలే. నర్సరీ నుంచి తాజాగా దిగినవి. 'అడిగావుగా... మల్లెతీగ తెచ్చాను'... 'ఇదిగో... నీకు ఇష్టమైన బంతి. కుండీలోనే ఎన్ని పూసేసిందో చూడు'... 'చిట్టి రోజాలు... రెక్క చామంతులు... ఈ మందారం కొమ్మలేసేంతగా పెరిగితే చాలా బాగుంటుంది'... వరుసగా చూపుతున్నాడు. ఎన్నాళ్లుగానో అడుగుతోంది. ఇవాళ ఉదయాన్నే లేచి, చెప్పా పెట్టకుండా వెళ్లి తెచ్చాడు. సంతోషంగా, సంబరంగా, ప్రేమగా చూస్తోంది వాటన్నింటిని! 'నన్నూ తీసుకెళ్లుంటే బాగుండేదిగా'... 'ఇంట్లోకి మొక్కలు వస్తున్నప్పుడు నువ్వు ఎదురు రావాలనీ'... ఆమె చేతిలో చాలా పూలున్న చిన్న కుండీని పెట్టి సెల్ఫీ దిగాడు. ఇద్దరూ హాయిగా నవ్వారు ఫొటోలో. 'దీని పేరు బెగోనియా అట. బాగుంది కదూ'...

మరోచోట మరో ఇంటతను రెండు రోజులుగా ఇల్లు సర్దుతున్నాడు. భార్యను పిలిచి 'అనవసరమైన సామాను చాలా పేర్చిపెట్టావు చూడు' అని బుజ్జగించి పారవేయించాడు. మాసిన కర్టెన్లు తీసి, ఉతికిన కర్టెన్లు మార్చాడు. దుమ్ము పట్టిన లైట్లను తుడిచాడు. అన్నీ చక్కగా అమర్చి హాల్లో రెండు ర్యాకులను ఖాళీగా సంపాదించగలిగాడు. 'ఇప్పుడు ఏం చేద్దామని ఈ ర్యాకులను' అందామె. 'చెప్తా' అని సాయంత్రం పిల్లల్ని తీసుకొని ఆటో ఎక్కి పుస్తకాల షాపుకు చేరాడు. 'పిల్లలూ... ఒక ర్యాకుకు సరిపడా పుస్తకాలు మీరు కొనుక్కోండి. ఒక ర్యాకుకు సరిపడా మేము కొనుక్కుంటాం'.... పెళ్లికి ముందు వారిద్దరూ పుస్తకాలు చదివేవారు. సంసారంలో పడి వదిలేశారు. 'ఇష్టమైన అలవాటు. తిరిగి మొదలెడదాం' అన్నాడు భార్యతో. అప్పటికే ఆమె పుస్తకాలు ఎంచి ఒకవైపు పెట్టేస్తోందిగా!

ఇంకో నగరం. ఉదయపు ఎండ ఎక్కువగా లేదు. అలాగని తక్కువగా లేదు. మంచి గాలి వీస్తున్నందు వల్ల బాల్కనీలో ఎదురూ బొదురూ సమయం ఆహ్లాదంగా ఉంది. 'నీ ఫోను ఇవ్వు' అన్నాడామెతో భర్త. తీసుకుని స్విగ్గి, జొమాటో లాంటి యాప్స్ డిలీట్ చేశాడు. తన ఫోన్ ఆమెకు ఇచ్చాడు. 'ఫుడ్ డెలివరీ యాప్స్ తీసెయ్' అన్నాడు. తీసేసింది. 'ఇవాల్టి నుంచి బయటి తిండి వద్దు. ఈ ఇంట్లోకి ఏది వచ్చినా ఇకపై హెల్దీదే వస్తుంది. నేను వారంలో మూడు బ్రేక్‌ఫాస్ట్‌లు, కనీసం రెండు డిన్నర్లు నువ్వు కిచెన్‌లోకి రానవసరం లేకుండా చేయగలను. మిగిలింది నువ్వు చేయి. అసలు పొయ్యి ఎక్కవలసిన అవసరం లేని మంచి తిండి కూడా పిల్లలతో కూచుని డిజైన్ చేద్దాం. ఫేస్‌బుక్, యూట్యూబ్‌లకు వెచ్చించే సమయం మన ఉదరం కోసం వెచ్చిస్తే తెలిసి తెలిసీ ద్రోహం చేసుకోని వాళ్లం అవుతాం. మన తాత ముత్తాతలు వండుకోవడానికి తిండిలేక ఏడ్చేవాళ్లు. మనకు అన్నీ ఉన్నా వండుకోవడానికి ఏడిస్తే ఎలా? పరుగు పెట్టి సంపాదించి పట్టెడు మెతుకులు తినలేని స్థితికి చేరితే సంతోషమా మనకు?'

అబ్బో! ఆ ఇంటిలో సందడి వేరేగా ఉంది. కోడలు మాటిమాటికీ ఊరికి ఫోన్లు మాట్లాడుతూ ఉంది. టికెట్ల ఏర్పాటు చూస్తూ ఉంది. అంత వరకూ ఖాళీగా ఉన్న మూడో బెడ్‌రూమును సిద్ధం చేస్తూ ఉంది. కొడుకు ఉద్వేగంగా ఉన్నాడు. కలా నిజమా తేల్చుకోలేక ఉన్నాడు. సాకులు వెతుక్కున్నారు తనూ తన భార్య. లేనిపోని తప్పులు వెతికారు తనూ తన భార్య. మా జోలికి రావద్దని తేల్చి చెప్పారు ఇద్దరూ కలిసి. బాగానే ఉంది. హాయిగా ఉంది. కాని బాగానే ఉందా... హాయిగా ఉందా... తల్లితండ్రులు అడుగుపెట్టి నాలుగేళ్లు అవుతున్న ఈ ఇల్లు. వారి ఆశీర్వాదం తాకని ఇల్లు. వారి మాటలు వినపడని, వారి గదమాయింపులూ ఆత్మీయ హెచ్చరికలూ లేని ఇల్లు. పశ్చాత్తాపం పిల్లలకు మరో పుట్టుక ఇస్తుంది. ఈ పుట్టుక తల్లితండ్రులను కోరింది. మనవలు వెళ్లి రిసీవ్ చేసుకొని తీసుకువస్తే కొడుకూ కోడల్ని కన్నీటి కళ్లతో చూస్తూ లోపలికి అడుగు పెట్టారు తల్లితండ్రులు. విశేషం చూడండి. ఆ రోజు 'ధన్‌తేరస్'.

సాధారణంగా ధన్‌తేరస్‌కి ఇంటికి బంగారం వస్తే మంచిది అనంటారు. కాని పై నాలుగు ఇళ్లలో బంగారం వంటి నిర్ణయాలు జరిగాయి. సిసలైన 'ధన్‌తేరస్' అదే కావచ్చు.

ధనం వల్ల ధన్యత రాదు. ధన్యత నొసగే జీవితం గడపడమే నిజమైన ధనం కలిగి ఉండటం. గాలినిచ్చే మంచి చెట్టు, పుష్టినిచ్చే తాజా ఆహారం, కష్టసుఖాలు పంచుకునే నిజమైన మిత్రులు, బుద్ధీ వికాసాలు కలిగించి ఈర్ష్యా వైషమ్యం పోగొట్టే పుస్తకాలు, సదా అమ్మా నాన్నల సాంగత్యం, కుటుంబ సభ్యులంతా కలిసి భోం చేయగల సమయాలు, కనీస వ్యాయామం... ఇవి ఏ ఇంట ప్రతిరోజూ ఉంటాయో, అడుగు పెడతాయో, అంటిపెట్టుకుని ఉన్నాయన్న భరోసా కల్పిస్తాయో ఆ ఇల్లు సదా సమృద్ధితో అలరారుతుంది. అక్కడ అనివార్యంగా సంపద పోగవుతుంది. ఉత్తమమైన లోహం బంగారం. అది ఉత్తమమైన నివాసాన్నే ఎంచుకుంటుంది.

శీతగాలులు ముమ్మరమయ్యే ముందు ఉల్లాస, ఉత్సాహాల కోసం దీపావళి. పనికి మనసొప్పని ఈ మందకొడి రోజులలో జీవనోపాధి దొరకకపోతే గనక జరుగుబాటుకు దాచిన ధన్‌తేరస్ పసిడి. పెద్దలు ఏం చేసినా ఆచితూచి, ఆలోచించి చేస్తారు. ధన్‌తేరస్‌కు తప్పక బంగారం, వెండి, వస్తువులు కొనదలుచుకుంటే కొనండి. కాని ప్రతి ఇల్లూ ఒక సువర్ణ వాకిలి కావాలంటే మాత్రం అహం, అసూయ, అజ్ఞానాలను చిమ్మి బయట పారబోయండి! 'వాడికేం... బంగారంలా బతికాడు' అంటారు. అలా బతికి అనిపించుకోండి!

ధన త్రయోదశి శుభాకాంక్షలు. ప్రతి ఇంటా వికసిత కాంతులు కురియుగాక!

ముఖాముఖి సంభాషణల్లో మేటి

కామెంట్



కరణ్ థాపర్


ఒక మనిషిని ఇంటర్వ్యూ చేయడమంటే పైపై ప్రశ్నలు అడగటం కాదు. లోతుగా, సునిశితంగా, ప్రేక్షకులకు మరింత సమాచారాన్ని, ఆ విషయం మీద మంచి అవగాహనను ఇచ్చేలా ఆ సంభాషణ జరగాలి. అలాంటి అర్థవంతమైన ఇంటర్వ్యూలకు పెట్టింది పేరు బీబీసీలో వచ్చే 'హార్డ్‌టాక్'. 1997లో మొదలైన ఈ కార్యక్రమం ఆంగ్లంలో వార్తలు చూసేవారికి ప్రపంచవ్యాప్తంగా సుపరిచితం. అసలు బీబీసీ వరల్డ్ సర్వీస్‌ను ప్రేక్షకులు ఇష్టపడేదే ఈ ఇంటర్వ్యూ కోసం! నెల్సన్ మండేలా, మిఖాయిల్ గోర్బచేవ్, కోఫీ అన్నన్, బేనజీర్ భుట్టో, హ్యూగో చావెజ్ లాంటి ఎందరో భిన్న దేశాల నాయకులను ఇందులో ఇంటర్వ్యూ చేశారు. అయితే, పాతికేళ్లుగా వస్తున్న ఈ కార్యక్రమాన్ని ఖర్చులు తగ్గించుకోవడానికి ఆపేస్తున్నారని తెలియడం నిరాశ కలిగిస్తోంది.

'హార్డ్‌టాక్' పేరుతో బీబీసీలో ఓ కార్యక్రమం వస్తుంది. నాకు చాలా ఇష్టమైన ప్రోగ్రామ్. ప్చ్... రానున్న మార్చి నుంచి ఈ కార్యక్రమం ఉండదు. ఈ వార్త నన్ను ఆశ్చర్యపరిచింది. కొంత నిస్పృహ కూడా ఆవరించింది. అసలా నిర్ణయమే మూర్ఖమైంది అనుకుంటున్నా. అయితే నిర్ణయం జరిగిపోయింది, ఇక చేసేందుకు ఏమీ లేదు.

ఖర్చులు తగ్గించుకునే కార్యక్రమంలో భాగంగా బీబీసీ... హార్డ్‌టాక్‌ను నిలిపేస్తోందని తెలిసింది. సుమారు 70 కోట్ల పౌండ్లు సంస్థకు ఆదా చేయాలన్నది ఆలోచన. అసలీ ప్రోగ్రామ్‌కు ఎంత ఖర్చు అవుతోందో నాకు స్పష్టంగా తెలియదు కానీ... 70 కోట్ల పౌండ్లలో చాలా చాలా తక్కువ భాగమని మాత్రం అనుకుంటున్నా. నా భయమల్లా ఇది ఏదో చేయబోయి, ఇంకేదో అయినట్లు అవుతుందేమో అని! ఈ నిర్ణయం తీసుకున్నందుకు భవిష్యత్తులో బీబీసీ కచ్చితంగా పశ్చాత్తాపపడుతుంది. వీటన్నిటికంటే ముఖ్యమైన విషయం... నా లాంటి ఫాలోయర్లు బాగా నిరుత్సాహపడతారు. ఎందుకంటే హార్డ్‌టాక్ కేవలం ఒక టాక్‌షో కాదు... బీబీసీలో ఇలాంటి ప్రోగ్రామ్ ఇంకోటి లేదు. అంతెందుకు చాలా ఛానెళ్లలోనూ లేదు. ఒక విషయం మీద సంపూర్ణ అవగాహన, విషయాన్ని పైస్థాయిలో చూడగలగడం, ఉద్వేగపూరిత లోతు ఉండే ఇలాంటి కార్యక్రమాలు ఎక్కడో తప్ప కనబడవు.

సరే... ఏంటి హార్డ్‌టాక్ ప్రత్యేకత? ముఖాముఖి ఇంటర్వ్యూలలో దీర్ఘకాలం నడుస్తున్న ప్రోగ్రామ్ ఇది. నిర్దిష్ట అంశంపై ప్రముఖుడు ఒకరు మాట్లాడటం ఈ కార్యక్రమంలో జరుగుతుంది. ముఖాముఖి ఇంటర్వ్యూల్లో చాలా దూకుడుగా ఉంటుంది. చర్చకు ఉద్దేశించిన అంశం ముందు వెనుకల గురించి క్షుణ్ణంగా పరిశీలించి, అర్థం చేసుకున్న తరువాతే కార్యక్రమం జరుగుతుంది. ప్రోగ్రామ్ పూర్తయిన తరువాత మనకు విషయ పరిజ్ఞానం పెరుగుతుందనడం అతిశయోక్తి కాదు. ఉన్న అనుమానాలు తీరతాయి కూడా! ఏ న్యూస్ బులిటెన్ కూడా విడమరచి చెప్పలేని విధంగా హార్డ్‌టాక్‌లో విషయాలపై చర్చ జరుగు తుంది. క్లుప్తంగా చెప్పాలంటే ఈ కార్యక్రమం ఛానల్‌లో అవశేషం కాదు... గుండెకాయ లాంటిది!

కొంచెం వివరంగా ఆలోచిస్తే ఇంకో విషయం స్పష్టమవుతుంది.



బీబీసీకి అసలు విషయం అర్థం కాలేదనాలి. సుదీర్ఘ ఇంటర్వ్యూలు... ప్రశ్నించేందుకు, వివరాలు తెలుసుకునేందుకు, మనం అనుకున్న విషయాలపై పట్టుబట్టేందుకు, విషయం లోతుల్లోకి వెళ్లేందుకు అవకాశం కల్పిస్తాయి. ఇది చిన్న చిన్న ఇంటర్వ్యూల ద్వారా అసాధ్యం. హార్డ్‌టాక్ వంటి కార్యక్రమాలను నిర్వహించడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. కానీ... చాలామంది ఇష్టపడే కార్యక్రమం.

చాలా ఎక్కువగా పొగుడుతున్నానని అనుకుంటూ ఉంటే ఒకసారి ఆలోచించండి. బీబీసీలో హార్డ్‌టాక్ ప్రెజెంటర్లకే పేరు ప్రఖ్యాతులు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకు? అప్పట్లో టిమ్ సెబాస్టియన్ చాలామంది అభిమానం, ఆరాధన పొందిన హార్డ్‌టాక్ ప్రెజెంటర్ (1997 నుంచి ఎనిమిదేళ్ల పాటు చేశారు)! ఈయనతో ఇంటర్వ్యూ అంటే... చాలామంది ఇబ్బంది పడేంత జనాదరణ సంపాదించుకున్నారు టిమ్. ఇంటర్వ్యూలు ఎదుర్కొన్న వారు టిమ్‌ను ఇష్టపడలేదన్నది బహిరంగ రహస్యం.

2005 నుంచి హార్డ్‌టాక్ కార్యక్రమాన్ని స్టీఫెన్ సాకర్ నిర్వహిస్తున్నారు. ఈయన టిమ్ కంటే చాలా భిన్నం. కానీ ఆదరణ మాత్రం బాగా ఉంది. టిమ్ వైఖరి చాలా దూకుడుగా ఉండేది. అవతలి వ్యక్తికి పదే పదే అడ్డు తగిలేవాడు. సూటి ప్రశ్నలు సంధించేవాడు. స్టీఫెన్ కొంచెం ఆలోచించి ప్రశ్నలు వేస్తాడు. కొన్నిసార్లు ప్రొఫెసర్ మాదిరిగా వ్యవహరిస్తాడు కూడా! టిమ్ విధ్వంసం లాంటి వాడైతే స్టీఫెన్ నెమ్మదిగా అవతలి వ్యక్తి మెదడును ఆక్రమించేసే టైపు. టిమ్, స్టీఫెన్‌లు ఎవరైనా సరే... నిష్ఠుర సత్యాలతో అతిథిని ఇబ్బందికరమైన పరిస్థితుల్లోకి నెడతారు.

నా భయమల్లా బీబీసీ మరీ మొద్దుబారిపోతోందేమో అని! అత్యద్భుతమైన కార్యక్రమాలను అకస్మాత్తుగా నిలిపివేయడం ఈ మధ్యకాలంలో ఇది రెండోసారి. 'న్యూస్‌నైట్' ఛానెల్ మొత్తానికి హైలైట్‌గా ఉండేది. రెండు మూడు కథనాలను మాత్రమే చర్చించేవారు కానీ... చాలా లోతుగా సాగేది. ఈ కార్యక్రమ ప్రెజెంటర్ జెరెమీ ప్యాక్స్‌మన్ మంచి జర్నలిస్టుగా ఇంగ్లిష్ మాట్లాడే దేశాల్లో పేరొందారు. న్యూస్‌నైట్‌లో వచ్చిన మరో గొప్ప వార్తా కథనం ప్రిన్స్ ఆండ్రూతో ఎమిలీ మైట్లిస్ నిర్వహించిన ఇంటర్వ్యూ.

అన్నీ పోయాయి. ఇప్పుడు కార్యక్రమాలన్నీ న్యూస్ బులిటెన్‌ను మరింత పొడిగించినట్లు మాత్రమే కొనసాగుతున్నాయి. ప్రతి వారం రాత్రి 10 గంటలకు తప్పకుండా చూడాలని అనుకునే స్థాయి నుంచి ఇప్పుడు... చూడకపోయినా ఏం కాదులే అన్న స్థితికి వచ్చేశాం. చాలా మంది పరిస్థితి కూడా ఇదే!

విచిత్రమైన విషయం ఏమిటంటే... బీబీసీ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ 'వరల్డ్ సర్వీస్' కోసం అదనపు నిధులు కావాలంటూ ఒక పక్క బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడుతున్నారు. హార్డ్‌టాక్ మూతపడుతోందన్న వార్తలు రాగానే స్టీఫెన్ చేసిన ఒక ట్వీట్ గుర్తుకొస్తోంది: ''అద్భుతమైన ప్రొడ్యూసర్లు, పరిశోధకులు ఉన్న బృందాన్ని విడదీశారు. బీబీసీ వరల్డ్ సర్వీస్ కార్యక్రమం అనేది ప్రజాస్వామిక భావప్రకటనకు ఎంత ముఖ్యమో టిమ్ ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు.''

హార్డ్‌టాక్ ప్రభావశీలత, ఆ కార్యక్రమం ద్వారా వ్యక్తమయ్యే భావాలు ఎంత కీలకమైనవో టిమ్ డేవీకి తెలుసా? బీబీసీ వరల్డ్ కార్యక్రమం చూసేదే అందులోని హార్డ్‌టాక్ కోసమని ఆయన అర్థం చేసుకున్నారా? 'హార్డ్‌టాక్'ను ఎత్తేయడం ఇప్పుడు దాన్ని చూడకుండా ఉండటానికి మరో అదనపు కారణం అవుతుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నింద వెనుక...



ఈ రోజుల్లో ఎవరినైనా నాజీ అనడం అంటే దానర్థం, 'నీకు అభిప్రాయం ఉండే హక్కును నిరాకరిస్తున్నాను' అని చెప్పడం.

– రసెల్ బ్రాండ్, నటుడు

తప్పకొంటారా?



(నవంబర్‌లో మొదలుకానున్న) ఆస్ట్రేలియా టూరు మొదలుకాకముందే టెస్టు క్రికెట్ నుంచి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తమ విరమణను ప్రకటిస్తారని నాకు గట్టిగా అనిపిస్తోంది.

– మోహన్ సిన్హా, వ్యాఖ్యాత

అసలు విలాసం



ఆధునిక జీవితంలో విలాసం ఏమిటంటే, సాధారణ, ప్రశాంతమైన జీవితం గడపగలగడం! అది మితిమీరిన వస్తువులు కలిగివుండటం వల్లనో, అందరికీ తెలిసేట్టుగా వాటిని వినియోగించడం వల్లనో రాదు.

– తాహిర్ అష్రఫ్, పోలీసు అధికారి

ప్రేమ లోతు



ప్రేమ అనేది అద్భుతమైన, ఉదాత్తమైన భావన. కానీ అది ఉచితంగా రాదు. మనం ఇతరుల జీవితాల్లోకి సంతోషాన్ని తేగలిగినప్పుడే దాన్ని పొందగలం. అప్పుడు మాత్రమే ఈ అందమైన, తేజోవంతమైన అనుభూతి తాలూకు పూర్తి లోతులను అనుభవించగలం.

– జాఫర్ మీర్జో, రచయిత

అలా మొదలు...



ఫాసిజం ఎలా మొదలవుతుందని (బ్రిటిష్ తత్వవేత్త) బెర్ట్రాండ్ రసెల్‌ను అడిగితే ఆయన ఇలా జవాబిచ్చారు: 'ముందు వాళ్లు మూర్ఖులను ఫాసినేట్ (భ్రమ కల్పించడం) చేస్తారు. తర్వాత తెలివైనవాళ్ల నోళ్లు మూస్తారు.'

– బిల్ మాడెన్, సంగీతకారుడు

ఇంకోలా తీయొచ్చా?



నాకు ఎనిమిదేళ్లు ఉన్నప్పుడు విటోరియో డెసికా దర్శకత్వం వహించిన 'బైసికిల్ థీవ్స్'(1948) సినిమా చూశాను. సినిమాలను ఇంకా ఎన్నో రకాలుగానో తీయొచ్చన్న ఆలోచనల వరదను అది పుట్టించింది.

– అల్ఫాన్సో క్వేరన్, మెక్సికో దర్శకుడు

అంతటా దయే!




మీరు గెలిచినప్పుడు దయగా ఉండండి. మిమ్మల్ని పట్టించుకోనప్పుడు దయగా ఉండండి. మీరు నిలిచిపోయినప్పుడు దయగా ఉండండి. మీరు నిరాశగా ఉన్నప్పుడు దయగా ఉండండి. మీరు సంశయంలో ఉన్నప్పుడు దయగా ఉండండి. మీరు భయంలో ఉన్నప్పుడు దయగా ఉండండి. దయ అనేది బలహీనతకు సంకేతం కాదు. దయ అనేది మీకు ఎప్పుడూ మేలే చేస్తుంది.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

ఇన్ బాక్స్

ఇది నిజంగా యుద్ధమే!

దళితోద్యమనాయకులు, కవి, రచయిత అయిన కత్తి పద్మారావు స్వీయ చరిత్ర 'అస్పృశ్యుని యుద్ధ గాథ' మూడో భాగం ఇటీవల వెలువడింది. నిచ్చెన మెట్ల భారతీయ సమాజంలో ఒక సాధారణ దళితుని జీవనమే పెద్ద యుద్ధంతో సమానం. అటువంటిది దళితుల పక్షాన ఉద్యమించి, ఒక నాయకునిగా అవతరించడానికి ఎంతటి యుద్ధం చేయవలసి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఆయన చేసిన దళిత పోరాటాలు, దళిత బహుజన జీవన సంస్కృతులపై ఆయన



విశ్లేషణ, ఆయనలో దాగి ఉన్న తాత్వికత, హేతుబద్ధత, ప్రకృతితో ఆయన మమేకమైన తీరు ఈ పుస్తకంలో చూడవచ్చు. తన స్వీయ చరిత్ర మొదటి, రెండవ భాగాలలో తన బాల్యం, కారంచేడు పోరాటాల గురించి రాశారు. ప్రస్తుత మూడో భాగంలో సామాజిక, సాంస్కృతిక, కవిత్వ, తాత్విక జీవిత యానాన్ని దృశ్యీకరింపజేశారు. ప్రకృతిలో భాగంగా బతికే యానాదులంటే తనకు ఇష్టమనీ, అందుకే తన జీవితానికీ వారి జీవితానికీ దగ్గరి సంబంధం ఉందంటారాయన.

స్వయంగా బౌద్ధ మతాన్ని ఆచరించే ఈయన బౌద్ధాన్ని స్త్రీవాద కోణం నుండి అధ్యయనం చేశారు. దానికి సంబంధించిన వివరాలు ఈ పుస్తకంలో ఎన్నో ఉన్నాయి. అలాగే సాంఖ్య, యోగ దర్శనాల గురించీ అనేక వివరణలు ఇందులో ఇచ్చారు. ఇటీవల హిందూ మతం పునర్జీవనం కావడానికి కొన్ని సంస్థలు చేస్తున్న ప్రయత్నానికి కొన్ని దళితవాడలు దోహదకరంగా ఉన్నాయనీ, ఈ రివైవలిజం 10 శాతం దళిత ఉద్యోగుల్లో, దళిత వాడల్లో జరుగుతోందనీ కత్తి గమనించారు. సంస్కృతం లెక్చరర్‌గా పనిచేసిన ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేసినప్పుడు... 'నేను దిగులు పడింది జీతం గురించి కాదు, పాఠం చెప్పే అవకాశం పోయింది' అని ఆనాటి తన మానసిక స్థితిని పేర్కొన్నారు. అయితే ఉద్యమ ప్రస్థానంలో వందలాది సభల్లో లక్షలాదిమందిని ఉద్దేశించి చేసిన ప్రసంగాలు తనకు తృప్తినిచ్చాయంటారాయన.

ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమిది. దీన్ని చదివితే కుల నిర్మూలనా చైతన్యం, ఆచరణ సంస్కృతి ప్రతి ఒక్కరిలో కలుగుతుంది. ఈ పుస్తకం సమకాలీన చరిత్రను గ్రంథస్థం చేసిన అమూల్యమైన రికార్డుగా చెప్పడం అతిశయోక్తి కాదు.

– బండి రుక్మిణీ ప్రసన్న, నూజివీడు

సామాన్యుల భాషలో... సన్నిహితమైన న్యాయం

సందర్భం



తడకమళ్ల మురళీధర్

మన దేశంలోని అన్ని హైకోర్టుల్లో అధికారికంగా వాడేది ఇంగ్లీషు భాష. కానీ కేసులో గెలిచినవాడు, ఓడిన సామాన్యుడు కూడా తమ గెలుపోటములకు కారణాలు అర్థం చేసుకోలేని పరిస్థితి. అందుకే తీర్పుల్లోని కారణాలు అర్థమయ్యే భాషలో తెలియజేసి, సామాన్యుడికి న్యాయ వ్యవస్థ చేరువ కావాలనే సదుద్దేశ్యంతో సుప్రీంకోర్టు, దేశంలోని అన్ని హైకోర్టులు వారి తీర్పులను ప్రాంతీయ భాషల్లోకి అనువదించి, ఉచితంగా అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి.

ఇటీవల తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తాము ఇంగ్లీషులో వెలువరించే ముఖ్యమైన తీర్పులను తెలుగులోకి అనువాదం చేయించే ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టింది. తదనుగుణంగా ఇంగ్లీషు నుండి తెలుగులోకి తర్జుమా చేయటానికి విశ్రాంత ఉద్యోగులు, విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయవాదుల సేవలు వినియోగించుకుంటోంది. అనువాదకుల కొరత మూలాన ప్రస్తుతానికి ముఖ్యమైన తీర్పులకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

అనువాదకుల సేవలు ఉచితంగా స్వీకరించటం లేదు. వారి సేవలకు గాను, హైకోర్టు ప్రతి పేజీకి మూడు వందల రూపాయలు చెల్లిస్తుంది. ఇంగ్లీషులో వెలువరించిన తీర్పుల కాపీలను వారి ఇంటి దగ్గరే అనువాదం చేసి, సహేతుకమైన సమయంలో అనువాదాన్ని హైకోర్టులోని సంబంధిత అధికారులకు స్వయంగా అందజేయడం లేదా ఆన్‌లైన్‌లో పంపించటం అనువాదకుల పని.

ఈ కార్యక్రమ సక్రమ నిర్వహణ కోసం హైకోర్టు తన పరిపాలనా భవనంలో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగంలో తెలుగు భాషపై పట్టున్న ఇద్దరు విశ్రాంత జిల్లా న్యాయమూర్తులను ఎడిటర్, డిప్యూటీ ఎడిటర్‌గా; ఒక విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జిని రిపోర్టర్‌గా నియామకం చేసింది. ఇంగ్లీషు నుండి తెలుగులోకి ప్రైవేటు అనువాదకులు తర్జుమా చేసిన ముఖ్యమైన తీర్పులను జాగ్రత్తగా పరిశీలించి, ప్రతి తీర్పుకు అందులో ఉన్నటువంటి ముఖ్యాంశాలను జోడించి, వాటిని తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్‌లో నెల వారీగా పెట్టవలసిన బాధ్యత వీరికి అప్పగించింది. వెబ్‌సైట్‌ను 2024 ఆగస్టు 15న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమైన తీర్పుల తెలుగు ప్రతులను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొని చదువుకునే అవకాశం కల్పించారు.

అనువాదకులను శాశ్వత ప్రాతిపదికన నియమించుకోడానికి, రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు అనుమతి ఇచ్చింది. 25 తెలుగు అనువాదకులు, 10 డేటా ఎంట్రీ



ఆపరేటర్లు, 5 తెలుగు టైపిస్ట్ పోస్టులను కూడా మంజూరు చేసింది. త్వరలో హైకోర్టు ఈ పోస్టులను భర్తీ చేసే అవకాశం లేకపోలేదు. తెలుగు అనువాదకులు దొరకటం అంత సులభమేమీ కాదు. ఎందుకంటే తెలంగాణ సచివాలయంలో కూడా ఈ కొరత ఉందని తెలుస్తోంది.

మరో విషయమేమంటే ప్రతి పౌరుడికీ హైకోర్టు వెబ్‌సైట్ ద్వారా ముఖ్యమైన తెలుగు తీర్పులను డౌన్‌లోడ్ చేసుకునే సౌలభ్యం ఉందనే విషయం తెలియజేయాలనే ఆశయంతో... జిల్లా న్యాయమూర్తులు, జిల్లా, మండల న్యాయ సేవాధికార సంస్థలు; సంబంధిత జిల్లా ప్రభుత్వ అధికారులు న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా ప్రచారం కల్పించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతగా ప్రచారం కల్పించినా తెలుగులో తీర్పులు చదువుకోవాలనుకునే విషయం, అది ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉందనే విషయం అంత సులువుగా సామాన్యుడికి తెలియకపోవచ్చు. అవగాహన కల్పించటానికి సకల ప్రయత్నాలు చేయటానికి న్యాయ వ్యవస్థ గట్టిగానే కృషి చేయాలి. దీనికి న్యాయవాదుల పాత్ర పరిమితమని అనుకోవద్దు.

ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశం ఏమిటంటే, కక్షిదారులు తాము దాఖలు చేసిన కేసుల్లో న్యాయమూర్తులు ఇంగ్లీషులో వెలువరించిన తీర్పులను తమ భాషలో చదివి అర్థం చేసుకొని సంతృప్తి పడాలనే దృక్పథం. అనువాదం అంటే ప్రస్తుత కాలంలో ఎవరికీ అర్థం కాని పూర్తి గ్రాంథిక భాషా ప్రయోగం చేయకుండా, వ్యవహారిక భాషను వాడాలనీ, అవసరమైతే దైనందిన ఇంగ్లీషు పదాలను అదే విధంగా వాడాలనీ హైకోర్టు సూచన చేసింది.

టెక్నాలజీ అతి వేగంగా దూసుకుపోతున్న ప్రస్తుత కాలంలో, ఇప్పటికే హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్లలో రికార్డ్ చేసిన సాక్ష్యాల నకళ్ళను అప్పటికప్పుడు ఇరు పక్షాలకు ఉచితంగా అందజేసే ఏర్పాటు ఉంది. అదే విధంగా హైకోర్టు రిజిస్ట్రీ జోక్యం లేకుండా, తీర్పు చెప్పిన రోజే తీర్పు ప్రతిని ఇరుపక్షాలకు కోర్టులోనే ఉచితంగా అందజేయాలి. దిగువ కోర్టుల్లో కూడా సివిల్, క్రిమినల్ తీర్పు అనే భేదం లేకుండా, ఇదే పద్ధతి పాటించడానికి ఎటువంటి ఆటంకం ఉండకపోవచ్చు.

అయితే నూటికి నూరు శాతం తీర్పుల తెలుగు అనువాదం సరైనది లేదా తప్పులు లేనిదని చెప్పలేం. ఈ తెలుగు తీర్పుల అనువాదం కేవలం చదువుకొని అర్థం చేసుకోవడానికి మాత్రమే పరిమితం. తెలుగు అనువాదం ఆధారంగా ఎవరు కూడా తప్పొప్పులు ఎంచి దానిపై అప్పీళ్ళు వేసే అవకాశం లేదు. ఇందు కోసం హైకోర్టు వెబ్‌సైట్‌లో డిస్ క్లెయిమర్ కూడా చొప్పించారు.

వ్యాసకర్త విశ్రాంత జిల్లా జడ్జి
మొబైల్: 98485 45970

మానవతకు ప్రతిరూపం

మహిళలకు సరైన విద్యావకాశాలు కల్పించి విద్యావంతులను చేసినపుడే దేశం అభివృద్ధి చెందు తుందని ఉద్ఘాటించిన సిస్టర్ నివేదిత మహిళా విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. వివేకానందుడి బోధనలకు ప్రభావితమై హిందూ (ధర్మం) మతాన్ని స్వీకరించిన మొదటి విదేశీ మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ఐర్లాండులో ఆమె 1867 అక్టోబర్ 28న జన్మించారు. ఆమె అసలు పేరు మార్గరెట్ ఎలిజబెత్ నోబెల్. 1895లో భారత మహిళా ఔన్నత్యంపై స్వామి వివేకానంద లండన్‌లో చేసిన ప్రసంగాలు మార్గ రెట్ జీవితాన్ని మార్చాయి. భారతీయ స్త్రీ గొప్పదనం గురించి విన్న ఆమె... వివేకానందను కలిసి 1898 జనవరి 28న భారత్ వచ్చింది. ఆమెకు వివేకానంద 'నివేదిత' అని నామకరణం చేశారు. నివేదిత అంటే భగవంతునికి సమర్పణ చేయబడినది అని అర్థం. వివేకానంద బోధన గురించి, తనపై వాటి ప్రభావం గురించి తాను రాసిన 'ద మాస్టర్ యాజ్ ఐ సా హిమ్' పుస్తకంలో వివరించారు. ఇతరుల పట్ల దయతో మెలిగే ఆమె మంచి అభిరుచి గల కళాకారిణి. సంగీతంలోనూ, చిత్రకళలోనూ ఆమెకు ప్రవేశం ఉండేది.



సిస్టర్ నివేదిత

ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవం ఉన్న నివేదిత భారత్‌లోనూ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ముఖ్యంగా బాలికల విద్య కోసం ఆమె 1898 నవంబరులో కలకత్తాలోని బాగ్ బజారులో పాఠశాలను ప్రారంభించారు. కనీస విద్య లేని బాలికలకు విద్యను అందించడం లక్ష్యంగా ఆమె పనిచేశారు. 1899 మార్చిలో కలకత్తా వాసులకు ప్లేగువ్యాధి సోకినప్పుడు తన శిష్యులతో కలిసి వైద్యసేవలు అందించారు.

భారత మహిళల ఔన్నత్యంగురించీ, ఆచార వ్యవహారాల గురించీ న్యూయార్క్, షికాగో వంటి నగరాల్లో ప్రసంగించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ చురుకైన పాత్ర పోషించారు. 1906లో బెంగాల్‌కు వరదలు వచ్చినప్పుడు బాధిత ప్రజలకు ఆమె చేసిన సేవ, అందించిన మానసిక ధైర్యం ఎంతో విలువైనవి. 1911 అక్టోబర్ 13న డార్జిలింగ్‌లో మరణించిన సిస్టర్ నివేదిత తలపెట్టిన పనులను విస్తరించడమే మనం ఆమెకు ఇవ్వగల నివాళి.

– సాకి। 99511 72002
(నేడు సిస్టర్ నివేదిత జయంతి)



గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.ఏకాదశి ఉ.8.47 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పుబ్బ సా.5.04 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** రా.1.00 నుండి 2.44 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.09 నుండి 12.57 వరకు, తదుపరి ప.2.27 నుండి 3.15 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.04 నుండి 11.48 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.00, **సూర్యాస్తమయం:** 5.28.

ఎస్వీయూ విద్యార్థులను
చితకబాదిన పోలీసులు

మ్యూజికల్ లైవ్ షో సందర్భంగా ఘటన



పోలీసుల లాఠీ చార్జ్‌లో గాయపడ్డ విద్యార్థులు

తిరుపతి క్రైం: తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం రాత్రి ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన మ్యూజికల్ లైవ్ షో విషయంలో నిరసన తెలిపిన విద్యార్థులను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి చితకబాదారు. జరిగిన ఘటనపై ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి మాట్లాడుతూ.. వర్సిటీలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించవద్దని వినతిపత్రం ఇచ్చిన విద్యార్థి సంఘం నాయకులు నరేంద్ర, వీరేష్ గ్రౌండ్‌లోని మెట్లపై కూర్చొని ఉండగా పోలీసులు వారిని బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. తాము ఎస్వీయూ విద్యార్థులమని చెబుతున్నా వినకుండా 'వర్సిటీ విద్యార్థులైతే పీకుతారా.. ఎస్పీ సైతం నన్నేమీ చేయలేడు' అంటూ రవిబాబు నాయక్ అనే కానిస్టేబుల్ దుర్భాషలాడుతూ లాఠీతో చితకబాదాడని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినట్లు చెప్పారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని సీఐ రామయ్యకు తెలిపామని, డీఎస్పీ వద్దకు వెళ్లి విద్యార్థులను చితకబాదిన రవిబాబు నాయక్‌ను విధుల నుంచి తొలగించాలని వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోకపోతే ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వర్సిటీ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. సోమవారం కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.



సంతలో మద్యం.. ఇదెక్కడి చోద్యం

బెల్టు షాపులను కూడా దాటుకుని సంతలు, వీధుల్లోకి సైతం మద్యం వచ్చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలోని ఆదివారపు సంత మార్కెట్‌లో కూరగాయలు అమ్మినట్టుగా బహిరంగంగా మద్యం విక్రయించడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం షాపులను ప్రైవేటుపరం చేసింది. కూటమి నేతలు మద్యం షాపులను చేజిక్కించుకుని విచ్చలవిడిగా విక్రయాలు చేస్తున్నారు. ఒక్కో మద్యం షాపు పరిధిలో మూడు నుంచి ఐదు వరకు బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. తణుకులో ఒకడుగు ముందుకేసి ఆదివారం నాడు సంత మార్కెట్‌లో కూరగాయల దుకాణాల పక్కనే ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి మరీ మద్యం బాటిళ్లు విక్రయించారు. దీనిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డిని వివరణ కోరగా.. బహిరంగంగా మద్యాన్ని విక్రయించిన విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో విక్రేతలు పరారయ్యారని చెప్పారు. వీడియోలు, ఫొటోల ఆధారంగా మద్యం విక్రయిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. – తణుకు

సైనికుడిని చితకబాదిన తెలుగు తమ్ముళ్లు

- ముగ్గురిపై విచక్షణారహితంగా కర్రలు, రాళ్లతో దాడి
- టాటా సుమోలో వెంబడించి దాష్టీకం



దెబ్బలను చూపిస్తున్న సైనికుడు సురేంద్రరెడ్డి, అతని తమ్ముడు హరినాథరెడ్డి, జానీ

చౌడేపల్లి: దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న సైనికుడిపై టీడీపీ నేతలు విచక్షణారహితంగా దాడిచేసి గాయపర్చిన ఘటన చిత్తూరు జిల్లా బోయకొండలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం.. వైఎస్సార్ జిల్లా గాలివీడు మండలం ఓడిసెలవంకపల్లికి చెందిన సురేష్‌రెడ్డి 15 ఏళ్లుగా లద్దాక్ ప్రాంతంలో సైనికుడిగా విధులు నిర్వహిస్తున్నారు. మొక్కుబడి చెల్లించడానికి ఆదివారం అతని తమ్ముడు హరినాథ రెడ్డి, డ్రైవర్ జానీ కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి బోయకొండకు వచ్చారు. అమ్మవారికి మూడు పొట్టేళ్లతో మొక్కు చెల్లించారు. పొట్టేళ్ల తలకాయలు తమకే కావాలని కోరగా.. టెండరుదారులు అధిక ధరకు వాటిని వేలం వేశారు. ఇదేంటని సైనికుడు ప్రశ్నించగా.. 'మేం స్కూల్ టీచర్లం కాదు మీకు సంజాయిషీ చెప్పడానికి' అని దురుసుగా మాట్లాడటంతో వాగ్వాదం చోటుచేసుకుంది. పొట్టేళ్ల మొక్కు చెల్లించేందుకు రూ.1,200 చెల్లించగా.. అదనంగా మరో వంద ఇవ్వాలని టీడీపీకి చెందిన టెండరు నిర్వాహకులు అడిగారు. అదనంగా ఎందుకివ్వాలని సైనికుడు ప్రశ్నించారు. దీంతో టెండర్ నిర్వాహకులు సైనికుడి తమ్ముడు హరినాథరెడ్డి, డ్రైవర్ జానీపై టీడీపీ వర్గీయులు దాడికి తెగబడ్డారు. అక్కడి నుంచి వారు వెళ్లిపోతుండగా.. టాటా సుమోలో వెంబడించి సైనికుడు సురేష్‌రెడ్డి, తమ్ముడు హరనాథ్‌రెడ్డి, డ్రైవర్ జానీలను కర్రలు, రాళ్లతో చితకబాదారు. బోయకొండ నుంచి గంగాపురం వరకు వెంబడించి మరీ కొడుతూ తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఈవో ఏకాంబరం ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పెద్దభోగం, చిన్నభోగం క్లీనింగ్ నిర్వహిస్తున్న టెండరును రద్దు చేస్తామని ఈవో చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు ఈవోను కోరారు.

క్లుప్తంగా...

వెంటనే వేతనాలు ఇవ్వండి

104 ఉద్యోగుల డిమాండ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబాలు తీవ్ర ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయాయని 104 ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం అన్ని జిల్లాల్లో ఆదివారం 104 ఉద్యోగులు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంటనే జీతాలు విడుదల చేయడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగుల జీతభత్యాలను జీవో నంబర్ 7 ప్రకారం చెల్లించాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వ నర్సుల సంఘం అధ్యక్షురాలిగా రాధమ్మ



నర్సుల సంఘం నూతన కార్యవర్గం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నర్సుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హాలులో సంఘ ఎన్నికలు ఆదివారం జరిగాయి. రాష్ట్ర అధ్యక్షులుగా ఎస్.రాధమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కోటమ్మ, ఉపాధ్యక్షులుగా పుష్పలత, వీపీ చంద్రసాయి, కొత్తపల్లి మంజేష్, గోవిందు శాంతి భవాని, సంయుక్త కార్యదర్శిగా ఎం.దయావతమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.జాన్సన్‌రాణి, కోశాధికారిగా టి.గంగాభవానితోపాటు మరో 13 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. రాష్ట్ర సహకార శాఖ అధికారి ఎస్.శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. నూతన అధ్యక్ష, కార్యదర్శులు రాధమ్మ, కోటమ్మ మాట్లాడుతూ నర్సుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గాన్ని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి అభినందించారు.

బైక్ ఢీకొని ఇద్దరు మహిళలు దుర్మరణం

కృష్ణా జిల్లాలో ఘటన



శబరి భవానీ, వెంకట పద్మకుమారి (ఫైల్)

ఉంగుటూరు(గన్నవరం): బైక్ ఢీకొని ఇద్దరు మహిళలు మృతి చెందిన ఘటన కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం చిన్న అవుటపల్లి వద్ద ఆదివారం జరిగింది. ఆత్కూరు పోలీసుల కథనం మేరకు.. నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన కంభంపాటి శబరి భవానీ (55) చిన్న అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన భర్తను చూసేందుకు, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన మేరుగు వెంకట పద్మకుమారి(55) బంధువులను చూసేందుకు వచ్చారు. ఈ క్రమంలో దాసరి జాన్ తన స్నేహితుడు మహేష్‌తో కలిసి విజయవాడ నుంచి ఏలూరుకు బైక్‌పై వస్తూ చిన్న అవుటపల్లి వద్ద ఆస్పత్రికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న ఇద్దరు మహిళలను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో భవానీ, వెంకట పద్మకుమారి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నారు. జాన్ తీవ్రంగా, మహేష్ స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వారిని పిన్నమనేని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మహిళలు కొద్దిసేపటికే మృతి చెందారు. మహిళల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ నెయ్యి కలకలం

- పిఠాపురంలో జంతువుల కొవ్వుతో యథేచ్ఛగా తయారీ
- ఆలయాలకు సరఫరా
- ఒక్క కేంద్రంపైనే అధికారుల దాడి.. 400 కేజీలు స్వాధీనం



నకిలీ నెయ్యి తయారీ కేంద్రంలో అధికారుల సోదాలు

పిఠాపురం: జంతువుల కొవ్వుతో నెయ్యి తయారు చేస్తూ రూ.కోట్లు కొల్లగొట్టేందుకు పిఠాపురం వేదికగా మారింది. భక్తుల మనోభావాలతో ఆటలాడుతూ అక్రమ వ్యాపారాలతో కల్తీ మాఫియా రెచ్చిపోతోంది. కొద్ది నెలలుగా సాగుతున్న ఈ దందా ఆలస్యంగా వెలుగు చూసింది. పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు ఆధ్వర్యంలో అధికారుల బృందం పక్కా సమాచారం మేరకు పిఠాపురంలో శుక్రవారం ఒక ఇంటిపై దాడి చేయగా జంతువుల కొవ్వుతో నకిలీ నెయ్యి తయారు చేస్తున్నట్టు గుర్తించారు. పిఠాపురంలోని రెండవ రోడ్డులోని పద్మావతినగర్‌లో బండారు ఫణి ప్రసాద్ ఇంట్లో సుమారు 400 కేజీల నకిలీ నెయ్యిని, దాని తయారీకి ఉపయోగించే సామగ్రిని సీజ్ చేశారు. గోవు కొవ్వుతో నెయ్యి తయారు చేసి పలు దేవాలయాలకు సరఫరా చేస్తున్నట్టు తయారీ దారులు కమిషనర్ ఎదుట ఒప్పుకున్నారు. రానున్న కార్తీకమాసాన్ని దృష్టిలో పెట్టుకుని భారీగా నకిలీ నెయ్యి తయారు చేసి ఆలయాల వద్ద విక్రయించడానికి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని కమిషనర్ సైతం ధ్రువీకరించారు. ఇదే పిఠాపురంలో ఇలాంటి కేంద్రాలు ఇంకా ఉన్నాయని, వాటిపై కూడా దాడులు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అసలు దొంగలను పట్టుకోరా?

ఇదిలా ఉండగా, ఈ విషయం బయటకు పొక్కకుండా చూసేందుకు అధికారులు ప్రయత్నించినప్పటికీ.. చాలా మందికి తెలియడంతో విషయాన్ని బయట పెట్టక తప్పలేదు. పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలంలో చెందుర్తి, కొడవలి, తాటిపర్తి తదితర గ్రామాల శివారు ప్రాంతాల్లో అనధికార కబేళాలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇక్కడ యథేచ్ఛగా గోవధ జరుగుతోందని స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. నకిలీ నెయ్యికి ఉపయోగించే జంతు కొవ్వు ఇక్కడ నుంచే సరఫరా అవుతున్నట్లు తెలిసింది. గోవులను చంపి, అందులో కావాల్సిన మాంసాన్ని తీసుకుని.. మిగిలిన వ్యర్థ పదార్థాలను, ఎముకలను కొన్ని రోజుల పాటు నిల్వ ఉంచి, దానిని మరిగించడం ద్వారా నెయ్యిని తయారు చేస్తున్నారు. ఇలా తయారయ్యే నకిలీ నెయ్యిని ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఈ కల్తీ నెయ్యిని పలు ఆలయాల్లో పూజలు, ప్రసాదాల తయారీ, దీపారాధనకు వినియోగిస్తున్నట్లు సమాచారం. కల్తీ నెయ్యి దందా వెనుక పెద్ద ముఠా ఉన్నట్టు తెలిసింది. ఇంత జరిగినా అధికారులు అసలు వ్యక్తులను వదిలేసి.. వీళ్లే నిర్వాహకులంటూ కొందరిపై నామమాత్రపు కేసులు పెట్టి చేతులు దులిపేసుకున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఈడీ కౌంటర్
చంద్రబాబుకు చెంపపెట్టు

మాజీ మంత్రి కన్నబాబు



కాకినాడ రూరల్: డొల్ల కంపెనీలతో స్కిల్ స్కామ్ నడిపి రూ.కోట్ల దుర్వినియోగం చేశారని ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడం చంద్రబాబు, ఆయన మద్దతుదారులకు చెంపపెట్టు అని మాజీ మంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఏడాదిన్నర క్రితం రాష్ట్రంలో స్కిల్ స్కామ్ బయటపడిందన్నారు. 2014–19 మధ్య చంద్రబాబు సీఎంగా ఉండగా నిరుద్యోగులకు నైపుణ్యాలు నేర్పిస్తామనే ప్రచారంతో రూ.వందలాది కోట్ల అవినీతి జరిగిందన్నారు. చంద్రబాబు కోసమే కొన్ని డొల్ల కంపెనీలను సృష్టించి రూ.కోట్లు మెక్కేసినట్టు తేలడం, ఈడీ దర్యాప్తులో ఏ1గా చంద్రబాబు అరెస్ట్ అయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. సీఐడీ తమ చేతిలో ఉంది కదా అని ఈ కేసును కోల్డ్ స్టోరేజీలో పెట్టేశాం అని టీడీపీ నేతలు భ్రమలో ఉండగా.. దర్యాప్తును తాము కొనసాగిస్తున్నామని హైకోర్టులో దాఖలు చేసిన కౌంటరులో ఈడీ తెలియజేసిందన్నారు. రూ.151 కోట్లు దారి మళ్లించి స్వాహా చేశారని స్పష్టంగా పేర్కొందన్నారు. చంద్రబాబును అరెస్ట్ చేస్తే గగ్గోలు పెట్టారని, కొందరు రాజకీయ నాయకులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేశారన్నారు. వాళ్లంతా ఇప్పుడేం చెబుతారని వైఎస్సార్‌సీపీ సూటిగా ప్రశ్నిస్తోందన్నారు. సీఐడీ దర్యాప్తును ఎందుకు పక్కన పెట్టేశారని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రమేయం ఉండటంతో స్వతంత్ర దర్యాప్తు సంస్థతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. టీడీపీ కార్యాలయంపైన చంద్రబాబు ఇంటిపైన దాడులు చేశారంటూ నాటి ఎంపీలు, మంత్రులుగా ఉన్నవారిని విచారణకు పిలవడం, రోజులు తరబడి కూర్చోబెట్టడం చూస్తున్నామన్నారు. అవినీతి కేసులు వదిలేసి, తప్పుడు కేసులతో కక్ష సాధిస్తున్నారన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు నాలుగు నెలల్లోనే రూ.6 వేల కోట్ల విద్యుత్ చార్జీలను ప్రజలపై భారం మోపడానికి సిగ్గు లేదా నిలదీశారు. సీనియర్‌నని చెప్పుకునే చంద్రబాబు శాంతిభద్రతలకు భంగం కలగకుండా పరిపాలన చేయాలని సూచించారు.

బాబు దౌర్జన్యాలు చూడలేకపోతున్నాం

కళ్లకు గంతలు కట్టుకుని శారదాపీఠం మద్దతుదారుల ఆందోళన



కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న శారదా పీఠం మద్దతుదారులు

సీతమ్మధార: విశాఖ శారదా పీఠంపై చంద్రబాబు దౌర్జన్యాలను చూడలేకపోతున్నామంటూ కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని జీవీఎంసీ గాంధీ పార్కులో శారదా పీఠం మద్దతుదారులు ఆదివారం నిరసన చేపట్టారు. జన జాగరణ సమితి ప్రతినిధులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ.. స్వరూపానందేంద్ర స్వామీజీపై ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయంగా కక్షగట్టారని, ప్రధాని మోదీ జోక్యం చేసుకుని విశాఖ శారదా పీఠాన్ని కాపాడాలని కోరారు. గత ప్రభుత్వాలు విశాఖపట్నం, తిరుపతిలో కేటాయించిన భూములను రద్దు చేయడమే కాకుండా ఏకంగా, శారదా పీఠమే అక్రమ కట్టడమంటూ దుష్ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. స్వామీజీలు టీడీపీ చెప్పు చేతల్లో ఉంటేనే ఆంధ్రప్రదేశ్‌లో ఉండాలా? లేకపోతే రాష్ట్రం విడిచి వెళ్లిపోవాలా? అని ప్రశ్నించారు. స్వామీజీలు చంద్రబాబులా అక్రమ కట్టడంలో నివాసం ఉండటం లేదని, బాబు మాదిరిగా రాజకీయాన్ని అడ్డుపెట్టుకుని రూ.వేల కోట్ల వ్యాపారం చేయట్లేదని ఎద్దేవా చేశారు. స్వరూపానందేంద్ర స్వామీజీ కేవలం సనాతన ధర్మ ప్రచారమే చేస్తున్నారని పేర్కొన్నారు.

బాలికపై ఇద్దరు బాలుర అత్యాచారం

- వీరిలో ఒకడు సొంత అన్న
- గర్భం తొలగించడంతో ఆస్పత్రిపాలైన బాలిక
- ప్రకాశం జిల్లాలో దారుణం

ఒంగోలు టౌన్/తాళ్లూరు: ప్రకాశం జిల్లాలో దారుణం జరిగింది. ఇద్దరు బాలురు బాలికను లోబరుచుకున్నారు. వీరిలో ఒకడు బాలికకు సొంత అన్న. తాళ్లూరు మండలం తూర్పు గంగవరంలో జరిగిన ఈ ఘటన సంచలనం కలిగించింది. పోలీసుల కథనం మేరకు.. బాలిక (14)కు గ్రామంలోని మరో బాలుడి (16)తో ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ఆ బాలుడు బాలికను బలవంతంగా లోబరుచుకున్నాడు. ఈ క్రమంలో తన చెల్లెలు తరచు ఆ బాలుడితో సెల్‌ఫోన్‌లో చాటింగ్ చేయడాన్ని గమనించిన అన్న (15) ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెబుతానని బెదిరించి ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడు. ఈ నేపథ్యంలో ఆ బాలిక గర్భం దాల్చింది. శనివారం తెల్లవారుజామున కడుపునొప్పితో బాధపడుతున్న చెల్లికి అన్న మాత్రలు తెచ్చి ఇచ్చాడు. కడుపునొప్పి తగ్గకపోవడంతో తల్లిదండ్రులు బాలికను గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లారు. ఆర్ఎంపీ వైద్యుడు ఇంజక్షన్ చేసిన తరువాత బాలికకు గర్భస్రావం అయింది. పిండం పడిపోయినా మాయ లోపలే ఉండిపోయింది. దీనికితోడు విపరీతంగా రక్తస్రావం కావడంతో బాలికను దర్శి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు శనివారం రాత్రి ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. అప్పుడు ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిసింది. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదివారం రాత్రి బాలికను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. పోలీసులు బాలురిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనుల తనిఖీలు

సాక్షి, అమరావతి: పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతి దశలోనూ నాణ్యతా ప్రమాణాలు తనిఖీ చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం పల్లె పండుగ పనుల పురోగతిపై ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ కృష్ణతేజ, ఇతర ఉపాధి హామీ పథకం, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించినట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఉపాధి హామీతోపాటు 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చిన క్రమంలో వాటిని సక్రమంగా, పారదర్శకంగా సద్వినియోగం చేయాలని స్పష్టం చేశారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో అభివృద్ధి పనుల నాణ్యతను అధికారులు తనిఖీ చేశారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- కృష్ణానది ఊబిలో కూరుకుపోయిన ఐదుగురు యువకులు
- ముగ్గురిని కాపాడిన మత్స్యకారులు.. ఇద్దరు మృతి



దుర్గాప్రసాద్, హేమంత్ (ఫైల్)

తాడేపల్లిరూరల్/అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడసెంట్రల్): ఈతకొట్టేందుకు కృష్ణా నదిలో దిగిన ఐదుగురు యువకులు ప్రమాదవశాత్తూ ఊబిలో కూరుకుపోగా వారిలో ముగ్గుర్ని మత్స్యకారులు కాపాడారు. ఇద్దరు మరణించారు. గుంటూరు జిల్లా సీతానగరం రైల్వే బ్రిడ్జ్ సమీపంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. విజయవాడ రాజరాజేశ్వరిపేటకు చెందిన గుడివాడ వెంకటేశ్వరరావు కుమారుడు దుర్గాప్రసాద్(23), చివుకు రమేష్ కుమారుడు హేమంత్ కుమార్ (17) మరో ముగ్గురితో కలిసి ఆదివారం సాయంత్రం సీతానగరం రైల్వే బ్రిడ్జి వద్ద కృష్ణా నదిలో ఈతకొట్టేందుకు దిగారు. ఈ క్రమంలో రైల్వే బ్రిడ్జి రెండో దిమ్మె వద్ద ఉన్న ఊబిలో కూరుకుపోయారు. హేమంత్, దుర్గాప్రసాద్ పూర్తిగా నీటలో మునిగిపోగా మిగిలిన ముగ్గురూ కేకలు వేయగా మత్స్యకారులు ముగ్గుర్ని కాపాడారు. మరో ఇద్దరు మునిగినిపోయారని చెప్పడంతో మత్స్యకారులు వారిని వెతుకుతుండగా ముగ్గురూ అక్కడినుంచి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు సిబ్బందితో అక్కడికి చేరుకుని మత్స్యకారుల సహాయంతో ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మరణించిన ఇద్దరిలో దుర్గాప్రసాద్ దివ్యాంగుడు, ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ తల్లిదండ్రులకు అండగా నిలుస్తున్నాడు. హేమంత్ ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు.

సూర్యలంక తీరంలో యువకుడు గల్లంతు



కళ్యాణ్ (ఫైల్)

బాపట్ల: బాపట్ల జిల్లా సూర్యలంక తీరంలో స్నానం చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన భారీ అలలకు గుంటూరు కొత్తపేటకు చెందిన రేషి కళ్యాణ్ (20) అనే యువకుడు కొట్టుకుపోయి మృతి చెందాడు. గుంటూరు నుంచి వచ్చిన తొమ్మిది మంది సముద్రంలో స్నానానికి దిగగా ఒక్కసారిగా పెద్ద అలలు రావడంతో కళ్యాణ్ కొట్టుకుపోయాడు.

చిత్తూరులో జోస్ ఆలుక్కాస్ జ్యువెల్లరీ షోరూం



ఆభరణాలను ప్రదర్శిస్తున్న సంస్థ నిర్వాహకులు, సినీ నటి ఐశ్వర్య, ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో ఆదివారం జోస్ ఆలుక్కాస్ ఆభరణాల షోరూంని ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి సినీనటి ఐశ్వర్యరాజేష్ హాజరయ్యారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి షోరూంలోని బంగారు ఆభరణాలను ప్రదర్శించారు. ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ సంస్థ 60వ బ్రాంచ్‌గా చిత్తూరులో షోరూం ప్రారంభమైందన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని వినియోగదారులకు మంచి ఆఫర్లు, బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు. షోరూం నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈనెల 31 వరకు ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నామన్నారు. రూ.60 వేల విలువైన బంగారం, వజ్రాభరణాలను కొనుగోలు చేసిన వినియోగదారులకు బంగారు నాణేన్ని ఇస్తున్నామన్నారు.

తెలంగాణ

కేటీఆర్ బావమరిది ఇంటిపై పోలీసుల దాడి

- లిక్కర్ పార్టీలో పాల్గొన్న ఓ వ్యక్తి కొకైన్ తీసుకున్నట్లు గుర్తింపు



రాజ్ పాకాల ఇల్లు ప్రధాన ద్వారం

శంకర్‌పల్లి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది పాకాల రాజేంద్రప్రసాద్ అలియాస్ రాజ్ పాకాలకు చెందిన ఇంట్లో నిర్వహించిన పార్టీపై ఎక్సైజ్, స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) పోలీసులు దాడిచేశారు. అనుమతిలేకుండా లిక్కర్ పార్టీ నిర్వహించారని, డ్యూటీ ఫ్రీ విదేశీ మద్యం వినియోగించారని గుర్తించారు. పార్టీలో పాల్గొన్న వారిలో మద్దూరి విజయ్ అనే వ్యక్తి కొకైన్ వినియోగించినట్లుగా తేల్చారు. దీంతో రాజ్ పాకాల, మద్దూరి విజయ్‌పై మోకిలా పోలీసులు, రాజ్ పాకాలపై శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మోకిలా ఠాణాలో నమోదైన ఎఫ్ఐఆర్‌లోని వివరాల ప్రకారం.. రాజ్ పాకాల హైదరాబాద్ శివార్లలోని జన్వాడలో ఉన్న షేర్‌మాథే ప్రాపర్టీస్‌లో కొన్నాళ్ల క్రితం ఓ ఇంటిని నిర్మించారు. అందులో తరచూ వీకెండ్ పార్టీలు ఇస్తూ.. పేకాట ఆడుతున్నారు. ఈ నేపథ్యంలో.. విజయ్‌ను శనివారం రాత్రి దీపావళి పార్టీకి రావాలంటూ రాజ్ పాకాల ఆహ్వానించారు. ఈ పార్టీలో వీరిద్దరితో సహా 38 మంది పాల్గొన్నారు. ఈ పార్టీపై పోలీసులు శనివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో దాడిచేశారు. ఎలాంటి అనుమతి లేకుండా పార్టీలో స్థానిక లిక్కర్‌ను, డ్యూటీ ఫ్రీ విదేశీ మద్యాన్ని వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీరికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా మద్దూరి విజయ్ కొకైన్ తీసుకున్నట్లు తేలింది. మహిళలు ఈ పరీక్షలను వ్యతిరేకించారు. 16 మంది మహిళలు సహా మొత్తం 38 మందినీ అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ కోణంలో ముమ్మరంగా విచారణ జరుపుతున్నారు. రాజ్ పాకాలను ఆదివారం ఉదయం విచారణకు రావాలని ఆదేశించినప్పటికీ ఆయన హాజరుకాలేదు. ఆయన మొబైల్ స్విచ్ఛాఫ్ వస్తోందని, గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే.. కేసుల కుట్ర: కేటీఆర్

బీఆర్ఎస్ పార్టీని, తమను రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతూ కుట్రలకు పాల్పడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. జైళ్లకు పంపినా, ఎక్కడికి పంపినా తాము ఉద్యమ బాటలోనే నడుస్తామని.. చావుకు తెగించి ఉద్యమం చేశామని, ఈ కేసులకు, చిల్లర ప్రయత్నాలకు భయపడబోమని స్పష్టం చేశారు. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇంట్లో జరిగిన పార్టీపై కేసు నమోదైన నేపథ్యంలో కేటీఆర్ ఆదివారం రాత్రి మీడియాతో మాట్లాడారు. ''తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వరుస వైఫల్యాలు, ఆరు గ్యారంటీలు, రేవంత్ బావమరిదికి కట్టబెట్టిన అమృత్ టెండర్లు, పౌరసరఫరాల కుంభకోణంపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేస్తున్నారు. వాటిపై మాకు సమాధానం చెప్పే పరిస్థితి ప్రభుత్వానికి లేదు. కానీ ఈ రకంగా గొంతునొక్కి, ఇష్టమొచ్చినట్లు కేసులు పెట్టి.. రాజకీయంగా మా కుటుంబ సభ్యులను వేధించి ఏదో సాధిస్తామని అనుకుంటే మీరు సాధించేది ఏమీ ఉండదు. మా బావమరిది రాజ్ పాకాల తన సొంతింట్లో దావత్ చేసుకుంటే రేవ్ పార్టీ అని పేరుపెట్టి.. దాన్నో సినిమా చేశారు. పార్టీలో ఉన్నది ఎవరో పురుషులు, మహిళలు కాదు.. భార్యాభర్తలు. పొద్దున నాలుగు మందు బాటిళ్లు దొరికాయని ఎక్సైజ్ కేసు పెట్టారు. కానీ సాయంత్రానికి డ్రగ్స్ కేసుగా మారిపోయింది'అని మండిపడ్డారు.

నవంబరులో తిరుమలలో విశేష పర్వదినాలు



తిరుమల: తిరుమలలో నవంబర్ నెలలో జరగనున్న విశేష పర్వదినాల వివరాలను టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. నవంబర్ 1న కేదారగౌరీ వ్రతం, 3న భగినీహస్త భోజనం, శ్రీ తిరుమలనంబి శాత్తుమొర, 5న నాగుల చవితి, పెద్ద శేషవాహనం, 6న శ్రీ మనవాళ మహాముని శాత్తుమొర, 8న వార్షిక పుష్పయాగానికి అంకురార్పణ, 9న శ్రీవారి పుష్పయాగం, అత్రి మహర్షి వర్ష తిరునక్షత్రం, పిళ్లైలోకాచార్య వర్ష తిరునక్షత్రం, పోయిగైయాళ్వార్ వర్ష తిరునక్షత్రం, పూదత్తాళ్వార్ వర్ష తిరునక్షత్రం, వేదాంత దేశికుల శాత్తుమొర, 10న పేయాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 11న శ్రీ యాజ్ఞవల్క్య జయంతి, 12న ప్రబోధన ఏకాదశి, 13న కైశిక ద్వాదశి ఆస్థానం, చాతుర్మాస్య వ్రత సమాప్తి, 15న కార్తీక పౌర్ణమి, 28న ధన్వంతరి జయంతి, 29న మాస శివరాత్రి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

31న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 31న దీపావళి ఆస్థానం సందర్భంగా స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దుచేసింది. ఇందుకు సంబంధించి 30వ తేదీ బుధవారం తిరుమలలో సిఫార్సు లేఖలు స్వీకరించేది లేదని స్పష్టంచేసింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని భక్తులకు విజ్ఞప్తి చేసింది.



ఖమేనీ ఆరోగ్యం విషమం?

కుమారుడే తదుపరి సుప్రీం లీడర్!

టెహ్రాన్: ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ (85) ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఆయన చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. దీంతో ఆయన వారసుడు ఎవరన్న దానిపై చర్చ మొదలైంది. ఖమేనీ తనయుడు ముజ్తబా ఖమేనీ (55) తదుపరి సుప్రీం లీడర్ కావొచ్చని ప్రచారం సాగుతోంది. ఈ మేరకు న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఓ కథనం ప్రచురించింది. ఖమేనీ 1989 నుంచి సుప్రీం లీడర్‌గా ఉన్నారు. రుహొల్లా ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ అత్యున్నత నాయకుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఒకవైపు ఇజ్రాయెల్ దాడులు, మరోవైపు దిగజారుతున్న ఖమేనీ ఆరోగ్య పరిస్థితి నేపథ్యంలో ఇరాన్‌లో పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ఘర్షణలు మరింత ముదరడం తాము కోరుకోవడం లేదని ఇరాన్ అధికారులు చెప్పారు.

'ఇజ్రాయెల్‌కు సత్తా చూపుదాం'

డెయిర్ అల్–బలాహ్: ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులను సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఆదివారం తీవ్రంగా ఖండించారు. ''ఇరాన్ బలాన్ని, శక్తి సామర్థ్యాలు ఇజ్రాయెల్‌కు అర్థమయేలా చేయడం ముఖ్యం. ఇరాన్ సత్తా రుచి చూపిద్దాం'' అంటూ పిలుపునిచ్చారు. అయితే ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ కీలక అణు స్థావరాలు భారీగా దెబ్బతిన్నట్లు ఉపగ్రహ చిత్రాల ఆధారంగా నిపుణులు అంచనాకు వచ్చారు. ''ఆ స్థావరాల్లో సొరంగాలు నిర్మించి అణ్వాయుధ, క్షిపణి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అవిక ఆగిపోయినట్లే. వాటి పునరుద్ధరణకు కనీసం రెండేళ్లకు పైగా పట్టవచ్చు'' అని చెబుతున్నారు.

ఓట్లు తగ్గినా... గద్దెనెక్కవచ్చు!

అమెరికా ఎన్నికల్లో గమ్మత్తు

విజేతను తేల్చేది ఎలక్టోరల్ ఓట్లే	అత్యధిక ఓట్లొచ్చినా ఓటమి సాధ్యమే	ఎలక్టోరల్ కాలేజీ విధానమే కారణం	అగ్రరాజ్యమైనా సుదీర్ఘ ఎన్నికల ప్రక్రియ



అధ్యక్ష తరహా పాలన ఉన్న చాలా దేశాల్లో ఆ పదవికి ప్రత్యక్ష ఎన్నిక జరుగుతుంది. ప్రజలు తమ ప్రెసిడెంట్‌ను నేరుగా ఎన్నుకుంటారు. అత్యధిక ఓట్లు సాధించే వారే విజేతగా నిలుస్తారు. కానీ అగ్రరాజ్యమైన అమెరికాలో మాత్రం గమ్మత్తైన పరోక్ష ఎన్నిక విధానం అమల్లో ఉంది. అక్కడ అధ్యక్షున్ని ఎన్నుకునేది ఎలక్టోరల్ కాలేజీ. మరి పోలింగ్ తేదీన ప్రజలు ఓటేసేది ఎవరికంటారా? ఎలక్టర్లుగా పిలిచే ఈ ఎలక్టోరల్ కాలేజీ సభ్యులకు. అనంతరం వారంతా కలిసి అధ్యక్షున్ని, ఉపాధ్యక్షున్ని నేరుగా ఎన్నుకుంటారు.

విన్నర్ టేక్స్ ఆల్!

అధ్యక్ష ఎన్నిక విషయంలో అమెరికాలోని 50 రాష్ట్రాల్లో 48 రాష్ట్రాలు విన్నర్ టేక్స్ ఆల్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. దానిప్రకారం ఒక రాష్ట్ర ఎలక్టోరల్ ఓట్లన్నీ ఆ రాష్ట్రంలో మెజారిటీ ఓట్లు సాధించే అభ్యర్థికే దక్కుతాయి (మెయిన్, నెబ్రాస్కా మాత్రం అభ్యర్థులు సాధించే ఓట్ల ప్రకారం నైష్పత్తిక పద్ధతిలో వారికి ఎలక్టర్లను కేటాయిస్తాయి). దీనివల్ల దేశవ్యాప్తంగా కలిపి అత్యధిక ఓట్లు (పాపులర్ ఓట్) సాధించే అభ్యర్థి కూడా ఓటమి పాలయ్యే ఆస్కారం పుష్కలంగా ఉంది. గతంలో ఇలా జరిగింది కూడా. 2016లో డెమొక్రాట్ల అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌కు రిపబ్లికన్ ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్ కంటే ఏకంగా 28 లక్షల పై చిలుకు ఓట్లు ఎక్కువగా వచ్చాయి. అయినా ఆమె ఏకంగా 74 ఎలక్టోరల్ ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు! 2000లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి అల్ గోర్ కూడా తన రిపబ్లికన్ ప్రత్యర్థి జార్జి డబ్ల్యు.బుష్ కంటే 5.5 లక్షల ఎక్కువ ఓట్లు సాధించారు. అయినా 271 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు సాధించిన బుష్‌కే పీఠం దక్కింది. 1876, 1888ల్లో కూడా పాపులర్ ఓట్ సాధించిన అభ్యర్థులు ఓటమి చవిచూశారు. కాకపోతే ఇప్పటిదాకా జరిగిన 59 అధ్యక్ష ఎన్నికల్లో ఏకంగా 54సార్లు పాపులర్ ఓట్ సాధించిన అభ్యర్థే విజేతగా నిలిచారు.

ఎందుకీ 'కాలేజీ'...?

ఎలక్టోరల్ కాలేజీ వ్యవస్థ వల్ల చిన్న రాష్ట్రాలకు కూడా అధ్యక్షుని ఎన్నికలో తగిన ప్రాధాన్యం దక్కుతుంది. అంతేగాక అభ్యర్థులు దేశమంతటా కాలికి బలపం కట్టుకుని తిరిగే అవసరముండదు. గెలుపోటములను నిర్దేశించి ఆరేడు స్వింగ్ స్టేట్స్‌పై గట్టిగా దృష్టి పెడితే సరిపోతుంది. కాకపోతే ఈ విధానంలో లోపాలూ లేకపోలేదు. పాపులర్ ఓట్ సాధించిన వాళ్లు కూడా ఓడే ఆస్కారముండటం వాటిలో ప్రధానమైనది. తమ ఓట్లకు ప్రాధాన్యం లేదనే భావనతో జనం ఓటింగ్‌కు దూరమయ్యే ఆస్కారమూ ఉంటుంది.

జనాభాకు తగ్గట్టు...

ప్రతి రాష్ట్రానికి జనాభాకు అనుగుణంగా ఎలక్టర్ల సంఖ్యను కేటాయిస్తారు. ఇది ఆ రాష్ట్రానికి కేటాయించిన ప్రతినిధుల సభ, సెనేట్ సభ్యుల సంఖ్యకు సమానంగా ఉంటుంది. ప్రస్తుతం ఎలక్టోరల్ కాలేజీ ఓట్ల సంఖ్య 538. అధ్యక్ష ఎన్నికలో నెగ్గాలంటే వీటిలో కనీసం 270 ఓట్లు అవసరం. కాలిఫోర్నియాలో అత్యధికంగా 54 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లుంటే వ్యోమింగ్, నార్త్ డకోటా, అలస్కా వంటి రాష్ట్రాల్లో కేవలం మూడే ఉన్నాయి.



అమెరికాలోనూ అప్పుడప్పుడూ గోడదూకుళ్లు!

ఎలక్టర్లు తమ పార్టీ అభ్యర్థికే ఓటేయాలన్న రాజ్యాంగ నిర్బంధమేమీ అమెరికాలో లేదు! 2016లో ఏడుగురు ఎలక్టర్లు ప్రత్యర్థులకు ఓటేశారు. వీరిలో ఐదుగురు డెమొక్రాట్లు కాగా ఇద్దరు రిపబ్లికన్లు. అయితే వారి చర్య తుది ఫలితంపై ప్రభావం చూపలేదు. హిల్లరీ క్లింటన్‌కు 232 ఎలక్టర్ ఓట్లు రాగా 306 ఓట్లతో ట్రంప్ సునాయాసంగా విజయం సాధించారు. ఇలాంటి గోడదూకుడు ఎలక్టర్లకు సంబంధిత పార్టీలు జరిమానా విధించడమే గాక వారిపై అనర్హత వేటు కూడా వేయొచ్చు. వారిపై చట్ట ప్రకారం చర్యలు కూడా చేపట్టమే గాక వారి స్థానంలో వేరేవాళ్లను ఎలక్టర్లుగా నియమించుకునేందుకు వీలు కల్పిస్తూ 32 రాష్ట్రాలు చట్టాలు చేశాయి.

సుదీర్ఘ ప్రక్రియ

అమెరికాలో అధ్యక్ష ఎన్నిక సుదీర్ఘ ప్రక్రియ. ముందుగా ప్రధాన పార్టీలు తమ అధ్యక్ష అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుడతాయి. ఇది పోలింగ్‌కు దాదాపు 9 నెలల ముందుగానే మొదలవుతుంది...

- అధ్యక్ష అభ్యర్థులపై కాకస్‌లు, ప్రైమరీల ద్వారా పార్టీ సభ్యులు, ప్రతినిధులు తమ అభిప్రాయం వెలిబుచ్చుతారు.
- అనంతరం ఆగస్టు/సెప్టెంబర్ నెల్లలో పార్టీ జాతీయ సదస్సులో అభ్యర్థిని అధికారికంగా ప్రకటిస్తారు. అక్కడినుంచి ఎన్నికల పోరు ఊపందుకుంటుంది.
- ప్రచారం, ప్రధాన అభ్యర్థుల డిబేట్లతో పోరు పతాక స్థాయికి చేరుకుంటుంది.
- నవంబర్‌లో తొలి సోమవారం తర్వాత వచ్చే మంగళవారం పోలింగ్ ఉంటుంది.
- విజేత ఎవరో పోలింగ్ ముగియగానే ఆ రాత్రే దాదాపుగా తేలిపోతుంది.
- అయితే అంతకు కొద్ది నెలల నుంచే ముందస్తు ఓటింగ్ సదుపాయం కూడా ఉంటుంది. ఈసారి ఇప్పటికే 3.5 కోట్ల మందికి పైగా అమెరికన్లు ముందుగానే ఓటేయడం విశేషం.

అసలు ఎన్నిక డిసెంబర్ 16న!

ఓటింగ్ ముగిశాక కూడా అమెరికా అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ ఏకంగా మరో రెండు నెలల పాటు సాగుతుంది!

- రాష్ట్రాల స్థాయిలో ఎలక్టర్ల ఎన్నిక ప్రక్రియ దాదాపు నెల పాటు జరుగుతుంది. మెయిన్, నెబ్రాస్కా మినహా మిగతా 48 రాష్ట్రాల్లోనూ మెజారిటీ ఓట్లు సాధించిన పార్టీకే ఆ రాష్ట్రంలోని మొత్తం ఎలక్టోరల్ ఓట్లూ దక్కుతాయి.
- అనంతరం తమ ఎలక్టర్లుగా ఎవరుండాలో సదరు పార్టీ తాలూకు రాష్ట్ర శాఖ నిర్ణయిస్తుంది.
- ఎలక్టర్లుగా ఎన్నికైన వారంతా డిసెంబర్‌లో రెండో బుధవారం తర్వాత వచ్చే సోమవారం ఆయా రాష్ట్రాల రాజధానుల్లో భేటీ అవుతారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థులకు విడివిడిగా ఓటేస్తారు. ఒకవిధంగా అధ్యక్షున్ని వాస్తవంగా ఎన్నుకునేది ఈ రోజే! ఈసారి ఎలక్టర్ల భేటీ డిసెంబర్ 16న జరగనుంది.
- అనంతరం డిసెంబర్ నెల నాలుగో బుధవారం లోగా, అంటే ఎలక్టర్ల భేటీ జరిగిన 9 రోజుల్లోపు వారి ఓట్లన్నీ సెనేట్ అధ్యక్షునికి చేరాల్సి ఉంటుంది.

జనవరి 6న ఫలితం

జనవరి 6న అమెరికా కాంగ్రెస్ సంయుక్త సమావేశం జరుగుతుంది. ఎలక్టోరల్ ఓట్ల లెక్కింపు జరిపి అధ్యక్ష, ఉపాధ్యక్షులను అధికారికంగా ప్రకటిస్తారు. అమెరికా ఉపాధ్యక్షుడు ఈ ప్రక్రియను సెనేట్ అధ్యక్షుని హోదాలో పర్యవేక్షిస్తారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షుల పేర్లను కూడా ప్రకటిస్తారు.

- ఎలక్టోరల్ ఓట్లలో ఏ అభ్యర్థికీ మెజారిటీ రాకపోతే అధ్యక్షున్ని ఎన్నుకునే బాధ్యత ప్రతినిధుల సభపై పడుతుంది. దాని సభ్యులంతా కలిసి అత్యధిక ఎలక్టోరల్ ఓట్లు సాధించిన తొలి ముగ్గురు అభ్యర్థుల్లో నుంచి మెజారిటీ ఓటు ద్వారా ఒకరిని అధ్యక్షునిగా ఎన్నుకుంటారు.
- ఉపాధ్యక్ష పదవికి కూడా అంతే. ఎవరికీ మెజారిటీ రాకపోతే అత్యధిక ఎలక్టోరల్ ఓట్లు సాధించిన తొలి ఇద్దరు అభ్యర్థుల్లో ఒకరిని సెనేట్ సభ్యులు మెజారిటీ ఓటు ద్వారా ఉపాధ్యక్షునిగా ఎన్నుకుంటారు.
- దాంతో అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ కొలిక్కి వచ్చినట్టే. చివరగా జనవరి 20న ప్రమాణస్వీకారం ఉంటుంది. ముందుగా ఉపాధ్యక్షుడు, అనంతరం అధ్యక్షుడు ప్రమాణస్వీకారం చేస్తారు. ఆ రోజు ఆదివారమైతే కార్యక్రమాన్ని జనవరి 21న నిర్వహిస్తారు.
- 1933 దాకా కొత్త అధ్యక్షుడు మార్చి 4న ప్రమాణస్వీకారం చేసేవారు. 1937 నుంచి జనవరి 20కి మార్చారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

'ముంబై' దాడులపై నాడు స్పందనే లేదు!



- యూపీఏ సర్కారుపై జై శంకర్ విసుర్లు
- ఇప్పుడైతే గట్టిగా బదులిస్తామన్న మంత్రి

ముంబై: 2008లో ముంబైలో జరిగిన ఉగ్ర దాడికి సంబంధించి నాటి కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వంపై విదేశాంగ మంత్రి జై శంకర్ పరోక్ష విమర్శలు చేశారు. ఆ దాడికి భారత్ వైపు నుంచి స్పందనే లేకపోయిందంటూ ఆక్షేపించారు. ముంబైలో ఆదివారం మంత్రి మీడియాతో మాట్లాడారు. ''ముంబై దాడి జరిగినప్పుడు భారత్ నుంచి దానిపై స్పందనే లేదు. ఆ సమయంలో ఐరాస భద్రతా మండలిలో భారత్ సభ్య దేశం. ఉగ్రవాద వ్యతిరేక కమిటీ అధ్యక్ష స్థానంలో ఉంది. ఆ కమిటీ భేటీ కూడా ఉగ్ర దాడికి లక్ష్యంగా మారిన ముంబై తాజ్ హోటల్లోనే జరిగింది'' అని గుర్తు చేశారు. ''ఇప్పుడు పరిస్థితి మారింది. నేడున్నది నాటి భారత్ కాదు. ఉగ్ర ఘటనలపై గట్టిగా స్పందిస్తున్నాం. దుస్సాహసం చేస్తే మన సమాధానమే వేరుగా ఉంటుంది'' అని స్పష్టం చేశారు. మనతో పగలు వ్యాపారం చేస్తాం, రాత్రిళ్లు మనపైనే ఉగ్ర దాడులు చేస్తామంటే కుదరదన్నారు. తూర్పు లద్దాఖ్‌లో 2020 నాటి పరిస్థితి నెలకొనాలంటే చైనా సేనలను పూర్తిగా ఉపసంహరించుకోవాల్సి ఉంటుందని జైశంకర్ అన్నారు.

మమత సర్కారు వల్లే బెంగాల్లోకి చొరబాట్లు

మేమొస్తేనే ప్రశాంతత: అమిత్ షా


కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ సర్కారు అసమర్థత వల్లే బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలు, చొరబాట్లు పెచ్చరిల్లుతున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. అవి అంతమైతేనే ఆ రాష్ట్రంలో శాంతి నెలకొంటుందన్నారు. 2026లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక వాటిని అడ్డుకుని ప్రశాంతతను నెలకొల్పుతామన్నారు. బెంగాల్‌లో ప్యాసింజర్ టర్మినల్, కార్గోగేట్ అయిన పెట్రాపోల్ భూతలపోర్ట్‌లో ఆధునీకరించిన 'మైత్రీ ద్వార్'ను ఆదివారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. ''సరిహద్దు వెంట అధికారికంగా ప్రజల రాకపోకలు లేనందువల్లే చొరబాట్లు ఎక్కువయ్యాయి. ఇది రాష్ట్రంలో అశాంతిని రాజేస్తోంది. అన్నారు. కేంద్ర నిధుల్ని మమత సర్కారు దోచేస్తోందని అమిత్ షా మండిపడ్డారు. ''ఒక్క గ్రామీణ ఉపాధి హామీ పథకం కిందే ఎన్డీఏ హయాంలో ఏకంగా రూ.54,000 కోట్ల నిధులు అందాయి. కానీ అవన్నీ టీఎంసీ నేతలకు చేరాయి. ఈ దోపిడీని 2026లో అడ్డుకుంటాం'' అన్నారు. భారత్, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న పెట్రాపోల్ ల్యాండ్‌పోర్ట్ ఆసియాలోనే అతిపెద్దది. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాల్లో కీలకమైంది.

'డిజిటల్ అరెస్టు'కు... భయపడకండి

నేరగాళ్ల ఫోన్లకు బెంబేలెత్తకండి

- అప్రమత్తతతోనే డిజిటల్ భద్రత
- మన్ కీ బాత్‌లో మోదీ సూచన

న్యూఢిల్లీ: దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతుండడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల పెచ్చరిల్లుతున్న 'డిజిటల్ అరెస్టు' ఫ్రాడ్‌ను ఆదివారం 'మన్‌కీ బాత్'లో ప్రధానంగా ప్రస్తావించారు. ''అన్ని వయసుల వారూ వీటి బారిన పడుతున్నారు. కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోతున్నారు'' అని ఆవేదన వెలిబుచ్చారు. సైబర్ నేరగాడికి, బాధితుడికి మధ్య జరిగిన సంభాషణను మోదీ ఉదాహరించారు. ''సైబర్ నేరగాళ్లు తొలుత వ్యక్తిగత సమాచారం సేకరిస్తారు. తర్వాత ఫోన్లు చేసి మీరు నేరాల్లో ఇరుక్కున్నారంటూ భయభ్రాంతులకు గురి చేస్తారు. ఆలోచించుకొనే సమయం కూడా ఇవ్వరు. డబ్బులిస్తారా, అరెస్టవుతారా అంటూ బెదిరిస్తారు. భయపడితే మానసికంగా మరింత ఒత్తిడికి గురి చేసి డబ్బు గుంజుతారు. 'ఆగడం, ఆలోచించడం, చర్య తీసుకోవడం' ఈ మోసాలకు విరుగుడు'' అన్నారు. ''ఇలాంటి గుర్తు తెలియని బెదిరింపు ఫోన్లకు భయపడకుండా ధైర్యంగా ఉండండి. దర్యాప్తు సంస్థలు, పోలీసులు ప్రజలకు ఇలాంటి ఫోన్లు చేయరని, డబ్బులడగరని గుర్తుంచుకోండి. సాయం కోసం జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ '1930'కు ఫోన్ చేయండి. సైబర్ నేరగాళ్లతో సంభాషణను రికార్డు చేసి దర్యాప్తు సంస్థలకు అందించండి. సైబర్ మోసాలపై cybercrime. gov. in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయండి'' అని సూచించారు. ''డిజిటల్ మోసాలు, ఆన్‌లైన్ స్కాములపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. అప్రమత్తతే డిజిటల్ భద్రత కల్పిస్తుంది'' అని ఉద్ఘాటించారు. సైబర్ నేరగాళ్లను సమాజానికి శత్రువులుగా అభివర్ణించారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.



అవి మరపురాని క్షణాలు

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు ఈ నెల 31న ఘనంగా నిర్వహించుకుందామని మోదీ అన్నారు. ''గిరిజన యోధుడు బిర్సా ముండా జయంతి వేడుకలు నవంబర్ 15న ప్రారంభమవుతాయి. గతేడాది జార్ఖండ్‌లో బిర్సా ముండా స్వగ్రామం ఉలిహాతును సందర్శించా. అవి మరపురాని క్షణాలు'' అన్నారు.

యానిమేషన్‌లో అద్భుతాలు

ప్రతి రంగంలోనూ 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తి కనిపిస్తోందని మోదీ హర్షం వెలిబుచ్చారు. ''మన రక్షణ ఉత్పత్తులు 85 దేశాలకు ఎగుమతవుతున్నాయి. యానిమేషన్ రంగంలో మన కళాకారులు గణనీయమైన ప్రగతి సాధించారు. చోటా భీమ్, హనుమాన్, మోటు–పత్లూ, ధోలక్‌పూర్ కా ఢోల్ వంటి యానిమేషన్ సిరీస్‌లు విదేశాల్లోనూ ప్రజాదరణ పొందుతున్నాయి. భారత్‌ను ప్రపంచ యానిమేషన్ పవర్‌హౌస్‌గా మారుద్దాం. ఇండియాలో గేమింగ్ రంగం వేగంగా విస్తరిస్తోంది. మన గేమ్స్‌కు ప్రపంచమంతటా ఆదరణ ఉంది. పర్యాటకానికి వర్చువల్ రియాలిటీ (వీటీ) ఊతం ఇస్తోంది. ప్రపంచంలో తదుపరి సూపర్ హిట్ యానిమేషన్ చిత్రం మీ కంప్యూటర్ నుంచే రావొచ్చు. మరో గొప్ప గేమ్‌ను మీరే సృష్టించవచ్చు'' అని యువతనుద్దేశించి పేర్కొన్నారు.

నెతన్యాహుకు చేదు అనుభవం

టెల్ అవీవ్/దుబాయ్: ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు చేదు అనుభవం ఎదురైంది. గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన అనుమాష దాడికి హీబ్రూ క్యాలెండర్ ప్రకారం ఆదివారానికి ఏడాది నిండింది. ఈ సందర్భంగా జరిగిన సంస్మరణ సభలో నెతన్యాహు ప్రసంగిస్తుండగా నిరసనకారులు అడ్డుకున్నారు. 'సిగ్గు, సిగ్గు' అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. దాంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. నెతన్యాహు మధ్యలోనే ప్రసంగాన్ని ఆపేశారు. ఇజ్రాయెల్ తాజా వైమానిక దాడుల్లో ఇరాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పుకొచ్చారు.

గాజాలో 22 మంది దుర్మరణం

డెయిర్ అల్–బలాహ్: ఉత్తర గాజాలోని బెయిట్ లహియాపై శనివారం రాత్రి ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడుల్లో 11 మంది మహిళలు, ఇద్దరు చిన్నారులు సహా 22 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరగొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బాధితులంతా మూడు కుటుంబాలకు చెందిన వారేనని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. లెబనాన్ నుంచి దూసుకొచ్చిన డ్రోన్ పేలి తమ పౌరులు గాయపడినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఇజ్రాయెల్ ఆర్మీ ఆదివారం లెబనాన్ రాజధాని బీరుట్‌పై భారీ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది.

పంజాబ్‌లో 105 కిలోల హెరాయిన్ పట్టివేత

చండీగఢ్: సరిహద్దుల్లో డ్రగ్స్ రాకెట్‌ను పంజాబ్ పోలీసులు ఛేదించారు. 105 కిలోల హెరాయిన్‌ను సీజ్ చేయడంతోపాటు తుర్కియే కేంద్రంగా పనిచేసే డ్రగ్స్ స్మగ్లర్ నవ్ భులార్ ముఠాలోని నవ్‌జ్యోత్ సింగ్, లవ్‌ప్రీత్ కుమార్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. హెరాయిన్‌తోపాటు సుమారు 32 కిలోల కెఫీన్ ఎన్‌హైడ్రస్, 17 కిలోల డెక్స్‌ట్రోమెథార్ఫాన్ (డీఎంఆర్) అనే నిషేధిత డ్రగ్స్‌ను కూడా పట్టుకున్నారు. ఈ మాదక ద్రవ్యాల విలువ రూ.100 కోట్ల పైమాటేనని చెబుతున్నారు. హెరాయిన్‌తోపాటు వీటిని కూడా వాడితే ఆ ప్రభావం నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుందని డీజీపీ గౌరవ్ యాదవ్ ఆదివారం చెప్పారు. విదేశీ తయారీ పిస్టళ్లు ఐదు, ఒక నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. పాకిస్తాన్ నుంచి ఈ మాదక ద్రవ్యాలను దొంగచాటుగా జల మార్గంలో తరలించేందుకు స్మగ్లర్లు భారీ రబ్బర్ ట్యూబ్‌లను వినియోగించారని వివరించారు.

జపాన్‌లో పాలక పక్షానికి ఎదురుదెబ్బ

టోక్యో: జపాన్ పార్లమెంట్‌లోని శక్తిమంతమైన దిగువ సభకు ఆదివారం జరిగిన ఎన్నికల ఫలితాల్లో అధికార పక్షం మెజారిటీకి గండిపడింది. 465 సీట్లకు గాను మెజారిటీకి 233 సీట్లు అవసరం. చివరి ఫలితాలు అందేటప్పటికీ అధికార లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ, మిత్రపక్షం కొమెయిటో కలిపి 211 సీట్లు గెలుచుకున్నాయి. ఈ సంఖ్య కొంత పెరిగేలా ఉన్నా అధికార పక్షానికి మెజారిటీ కష్టమేనని భావిస్తున్నారు. ప్రతిపక్షం, ఇతరులు కలిసి 224 వరకు స్థానాలను దక్కించుకున్నారు. స్వతంత్రులుగా పోటీ చేసి, విజయం సాధించిన తమ వారిని కూడా కలుపుకుంటే అధికార పక్షం బలం పెరగొచ్చు. అయితే, అవినీతి ఆరోపణల నేపథ్యంలో వారిని చేర్చుకునేందుకు ఎల్‌డీపీ సిద్ధంగా లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంలోని మరో పార్టీ సాయంతో ప్రధానమంత్రి షిగెరు ఇషిబా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు.

శ్రీనగర్‌లో ఎన్‌సీ ఎమ్మెల్యే అరెస్టు

శ్రీనగర్: అధికార నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ)కి చెందిన ఎమ్మెల్యే బషీర్ అహ్మద్ వీరిని శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఇండిగో విమానంలో జమ్మూ వెళ్లేందుకు రాగా ఎయిర్‌పోర్టులోని ఎక్స్ రే స్కాన్ మెషీన్ ఆయన బ్యాగులో రెండు బుల్లెట్లు ఉన్నట్లు గుర్తించింది. దీంతో, బుల్లెట్లను స్వాధీనం చేసుకుని, ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవలి ఎన్నికల్లో బషీర్ అహ్మద్ శ్రీగుఫ్వారా– బిజ్‌బెహర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు.

మతతత్వ, అవినీతి శక్తులే... మా శత్రువులు

బీజేపీ, డీఎంకేలపై 'తళపతి' విజయ్ వాగ్బాణాలు

2026 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుస్తామని వ్యాఖ్యలు

టీవీకే తొలి మహానాడుకు భారీగా వచ్చిన జనం



ఆదివారం టీవీకే తొలి సభకు హాజరైన అశేష జనసందోహం (ఇన్‌సెట్‌లో) వాళ్లనుద్దేశించి ప్రసంగిస్తున్న విజయ్

సాక్షి, చెన్నై: కేంద్రంలో, తమిళనాట అధికార పార్టీలైన బీజేపీ, డీఎంకేలపై తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, ప్రముఖ తమిళ హీరో విజయ్ వాగ్బాణాలు ఎక్కుపెట్టారు. ''మతం, భాష అంటూ ప్రజల్ని చీల్చి రాజకీయం చేసే శక్తులు, ద్రవిడ నమూనా అంటూ రాష్ట్రాన్ని దోచుకుంటున్న అవినీతిపరులే మా పార్టీకి ప్రధాన శత్రువులు'' అని ప్రకటించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తమతో కలిసి వచ్చే వారిని అధికారంలో భాగస్వాములను చేస్తామని ప్రకటించారు. ఆయన 8 నెలల క్రితం సొంత పార్టీ ఏర్పాటు చేయడం తెలిసిందే. టీవీకే తొలి మహానాడు విల్లుపురం జిల్లా వీ సాలై గ్రామంలో ఆదివారం జరిగింది. సభకు అభిమానులు, కార్యకర్తలు అసంఖ్యాకంగా పోటెత్తారు. ఈ సందర్భంగా విజయ్ ఆవేశపూరితంగా సుదీర్ఘ ప్రసంగం చేశారు. ''ద్రవిడ సిద్ధాంతకర్త ఈవీఆర్ పెరియార్, కర్మ యోగి కామరాజ్, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, వీర నారీ వేలూ నాచియార్ ఆదర్శంగా టీవీకే సాగుతుంది. లౌకిక, సామాజిక, న్యాయ సిద్ధాంతాలతో పార్టీని నడుపుతాం. అందరం సమానమని చాటే సరికొత్త రాజకీయాలను తమిళనాడులో చూస్తారు'' అని అన్నారు. ''నన్ను విమర్శించిన వాళ్ల పేర్లను ప్రస్తావించబోను. వాళ్లలా అమర్యాదకరంగా మాట్లాడబోను. సంస్కారయుత రాజకీయాలు చేస్తా'' అని చెప్పారు.

ఎంజీఆర్, ఎన్టీఆరే స్ఫూర్తి

తమిళనాడులో ఎంజీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ సినీ రంగం నుంచి రాజకీయంగా చరిత్ర సృష్టించారని విజయ్ గుర్తు చేశారు. ''ఆ దిశగా తమిళనాడులో మరో కొత్త అధ్యాయం లిఖిస్తాం. శాస్త్రసాంకేతి రంగాల్లో మాత్రమే మార్పు రావాలా? రాజకీయాలూ మారాలి. కానీ నన్ను ఈ స్థాయికి తెచ్చిన ప్రజలకు ఏదోఒకటి చేయాలనే అన్నింటికీ సిద్ధపడి రాజకీయాల్లోకి అడుగుపెట్టా. అత్యున్నత స్థాయిలో కొనసాగుతున్న సినిమా కెరీర్‌ను వదిలి వచ్చా''. అన్నారు. నీట్ పరీక్ష విధానాన్ని విజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. తన చెల్లెలి మరణం ఎంతగా బాధించిందో 'నీట్' కారణంగా అరియలూర్‌లో ఆత్మహత్య చేసుకున్న అమ్మాయి ఉదంతమూ అంతే బాధించిందన్నారు.

అశేష జనవాహిని

మహానాడుకు నిర్వాహకులే ఊహించని రీతిలో జనసందోహం పోటెత్తింది. సభ సాయంత్రం నాలుగింటికి కాగా ఉదయం నుంచే వేలాదిగా అభిమానుల రాక మొదలైంది. దాంతో సభను ముందుగానే ప్రారంభించారు. రాత్రి ఏడింటికి సభ ముగిసినా రాత్రి 9 దాకా జనం వస్తూనే ఉన్నారు. దాంతో చెన్నై–తిరుచ్చి జాతీయ రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం । 28 । అక్టోబర్ । 2024




రైల్.. కార్

రైలు, వందలాది కార్లు పక్కపక్కనే ప్రయాణిస్తున్నట్లు చమత్కార దృశ్యం ఇది. దాబస్‌పేట నుంచి కొత్త కార్లను గూడ్స్‌లో తరలిస్తున్న చిత్రం

న్యూస్‌రీల్

కండక్టర్‌పై పోకిరీ దాడి



దాడి చేస్తున్న దుండగుడు

కృష్ణరాజపురం: బెంగళూరు నగరంలో బీఎంటీసీ డ్రైవర్, కండక్టర్‌ల తరచూ ఎక్కడో ఒకచోట దాడులు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం ట్యానరీ రోడ్డులో బీఎంటీసీ బస్ వెళ్తుండగా, బైక్‌పై ఇద్దరు యువకులు అడ్డుగా వచ్చారు. బస్సు డ్రైవర్ వారిని పక్కకు వెళ్లమని వారించాడు. దీంతో యువకుల్లో ఒకరు డ్రైవర్‌ను దూషించాడు. అడ్డుకోవడానికి వెళ్లిన కండక్టర్‌పై యువకుడు పిడిగుద్దులతో దాడి చేశాడు. స్థానికులు దుండగున్ని అడ్డుకున్నారు. కండక్టర్‌కు ముఖం, నడుం భాగంలో గాయాలయ్యాయి. ఆ సమయంలో యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. స్థానికులు వచ్చి కండక్టర్‌ను ఆస్పత్రికి తరలించారు. కేజీ హళ్ళి పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి కేసును మోదు చేశారు. కాగా దుండగులు పరారయ్యారు. అక్కడి సీసీ కెమెరాలలో దాడి దృశ్యాలు రికార్డయ్యాయి.

ఉచిత ప్రయాణానికి డబ్బులు వసూలు

మైసూరు: కేఎస్ ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళల నుంచి కండక్టర్ డబ్బులు తీసుకొని ఉచిత టికెట్ ఇచ్చాడు. ఈ సంఘటన చామరాజనగరలో జరిగింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని కొందరు ఇలా సొమ్ము చేసుకుంటున్నారు. బేడరపుర నుంచి చామరాజనగరకు వెళ్లే బస్సులో ఈ తంతు జరిగింది. కొంతమంది ఇంజినీరింగ్ విద్యార్థినులు ఇదేమిటని కండక్టర్‌ను ప్రశ్నించగా సమర్థించుకున్నాడు. కొందరు కండక్టర్లు డబ్బులు తీసుకుని ఉచిత టికెట్ ఇస్తున్నారంటూ అనేక మంది ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదులు చేశారు.

భార్యపై భర్త వేధింపులు

శివాజీనగర: భార్య, ఆమె మాజీ ప్రియుని ప్రైవేట్ వీడియోలను ఇంటర్నెట్‌లో ఉంచుతానని భర్త బెదిరిస్తున్న విచిత్రమైన కేసు బెంగళూరులో నమోదైంది. భర్త ప్రసన్నపై భార్య (25) ఈ మేరకు బ్యాడరహళ్ళి ఠాణాలో ఫిర్యాదు చేసింది. ప్రసన్న ఏ పనీ చేయకుండా క్రికెట్ బెట్టింగ్, మద్యపానంలో మునిగి తేలేవాడు. ఇంట్లో భార్యతో గొడవపడి కొట్టేవాడు. నిందితుడు తన భార్య మొబైల్‌ను చూస్తుండగా అందులో మాజీ ప్రియునితో కూడిన ప్రైవేటు ఫోటోలు, వీడియోలు కనిపించాయి. వాటిని తన ఫోన్‌కు పంపించుకొన్న నిందితుడు భర్త, నెట్‌లో సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని భార్యను వేధించసాగాడు. ఆ వీడియోలను స్నేహితులకు పంపాడు. నిన్ను, నీ ప్రియున్ని చంపేస్తానని భార్యను బెదిరించేవాడు. దీంతో ఆమె ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

నేడు దర్శన్ బెయిలుపై తీర్పు

సాక్షి, బెంగళూరు: చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టు అయి బళ్లారి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న కన్నడ నటుడు దర్శన్ బెయిల్‌పై సోమవారం నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. హైకోర్టులో సోమవారం విచారణ జరగనుంది. దర్శన్ మెడికల్ రిపోర్టును జైలు అధికారులు కోర్టులో సమర్పించనున్నారు. దర్శన్ వెన్నునొప్పి ఉందని చెబుతున్నారు. ఇటీవలే వైద్యులు ఎంఆర్‌ఐ స్కాన్ చేశారు. ఈ వైద్య నివేదికను జడ్జి పరిశీలిస్తారు.

చల్లని బీరు.. గిరాకీ జోరు

- బెంగళూరులో ఏడాదిలో 10 కోట్ల లీటర్ల వినియోగం
- ఏటేటా పెరుగుదల
- సర్కారుకు దండిగా రాబడి



బనశంకరి: బెంగళూరు చల్లగా ఉంటుంది కాబట్టి అక్కడ మందుబాబులు విస్కీ బ్రాందీ వంటి హాట్ హాట్ మద్యం తాగుతారు, బీర్లు కొనరేమో అని చాలా మంది అనుకుంటారు. కానీ అది అపోహ మాత్రమే. ఎన్నిసార్లు ధరలు పెంచినా, రాజధానిలో బీరు విక్రయాలు రికార్డు సృష్టించాయి. ఎక్సైజ్ శాఖకు తద్వారా సర్కారుకు భారీ ఆదాయం చేరుతోంది. ఏటేటా బీరు విక్రయాలు 49 శాతం పెరుగుతున్నాయి. 2021–22లో కరోనా సమయంలో అమ్మకాలు 32 శాతం పడిపోయింది. ఆ ఏడాది 6.05 కోట్ల లీటర్లు బీరు విక్రయమైంది. 2021–22లో కరోనా ప్రభావం తగ్గడంతో, పబ్, బార్ అండ్ రెస్టారెంట్లు తెరవడంతో 6.79 కోట్ల లీటర్లకు పెరిగింది.

ఏమిటీ కారణాలు

2022–23లో 10.17 కోట్ల లీటర్ల బీర్లను తాగేశారు. ఈసారి వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, లోక్‌సభ ఎన్నికలు, వరుసగా సెలవులతో పాటు అనేక కారణాలతో బీర్లకు గిరాకీ ఏర్పడింది. మద్యం కంటే బీర్ల అమ్మకాలే ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం పదేపదే దేశీయ మద్యం రేట్లను పెంచుతోంది. బీర్లను తాగడానికి ఇదో కారణమని అబ్కారీ అధికారులు తెలిపారు. ఐటీ బీటీ ఉద్యోగులు, యువత ఎక్కువగా కొంటూ ఉంటారు. బీర్‌లో తక్కువ మొత్తంలో ఆల్కహాల్ ఉంటుంది.

మద్యం తక్కువే

నగర మార్కెట్లలో బీర్లతో పోలిస్తే మద్యం విక్రయాలు తక్కువే. బ్రాందీ, విస్కీ, రమ్, జిన్, వోడ్కా తదితరాల డిమాండ్ తగ్గింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు చివరి వరకు 77 లక్షల పెట్టెలు అంటే.. 667 లక్షల లీటర్ల మద్యం విక్రయమైంది. ఈ ఏడాది ఇదే అవధిలో సుమారు 666 లక్ష లీటర్లు (77.27 లక్షపెట్టెలు) ఐఎంఎల్ విక్రయమైంది.



బీర్ గ్లాసులు గలగల

ధర పెరిగినా తగ్గని ఖరీదు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సార్లు బీర్ల ధరను పెంచింది. 20 శాతం అదనంగా సుంకం విధించింది. దీనివల్ల కంపెనీలు భారాన్ని తగ్గించుకోవడానికి బాటిల్ పై రూ.10 వరకూ ధర పెంచాయి. ప్రభుత్వం పన్ను పేరిట రూ.8 నుంచి గరిష్టం రూ.15 వరకు పెంచింది. ఇలా బాటిల్ ధర రూ.40 వరకు పెరిగినా మందుబాబులు వెనుకాడడం లేదు.

నాయకురాలు కాదు.. కిలేడీ



- హనీ ట్రాప్ కేసులో పట్టుబడిన మహిళ
- మొబైల్‌లో 8 మంది వీడియోలు
- బాధితుల్లో ప్రముఖులు



నిందితురాలు మంజుల

శివాజీనగర: ప్రముఖ పార్టీలో నాయకురాలిగా చలామణి అవుతూ ఉండేది. సమాజంలో ప్రముఖురాలిగా కనిపించే ఆమె డబ్బు కోసం పెద్ద మనుషులకు వల విసిరేదని తెలిసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. భార్య చేసే ఘనకార్యాలకు భర్త వంతపాడడం విశేషం.

మాజీ మంత్రి మాలికయ్య గుత్తేదార్‌ను హనీ ట్రాప్‌లో పడేసిన కేసులో నలపాడ్ బ్రిగేడ్ కల్బుర్గి అధ్యక్షురాలు మంజులా పాటిల్, ఆమె భర్త శివరాజ్ పాటిల్‌ల లీలలు బయటకు వస్తున్నాయి.

ఫోన్లలో పలువురి వీడియోలు

మాలికయ్యనే కాదు అనేక మందికి వలవేసినట్లు ఆమె మొబైల్‌ఫోన్‌లో ఫోటోలు వీడియోలు లభించాయి. మంజులా పాటిల్ బ్యాగ్‌లో 6 మొబైల్‌లు దొరికాయి. సీసీబీ పోలీసులు వాటిని శోధించినప్పుడు ఎనిమిది మంది ప్రైవేట్ వీడియోలు చిక్కాయి. మాజీ జిల్లా పంచాయతీ సభ్యుడు, పోలీస్ అధికారి, పీడబ్ల్యూడీ అధికారి వారిలో ఉన్నారు. ఒక్కొక్కటిగా పరిశీలన చేస్తున్నారు. చాలా సంవత్సరాల నుంచి కాంగ్రెస్‌లో ఉన్న మంజుళా, జిల్లాలో మహమ్మద్ నలపాడ్ బ్రిగేడ్ అధ్యక్షురాలిగా ఉన్నారు.

బెంగళూరులో అరెస్టు

పార్టీలో సమావేశాల్లో మాలికయ్యను ఆమె పరిచయం చేసుకుంది. తరువాత ఇద్దరు మొబైల్‌లు గంటల తరబడి మాట్లాడుకునేవారు. వీడియో కాల్స్ కూడా చేసుకునేవారు. తరువాత వీటిని ముందుంచుకొని సొమ్ము కోసం బ్లాక్‌మెయిల్ చేయసాగింది. 2 రోజుల క్రితం బెంగళూరులో ఉన్న మాలికయ్య కుమారుడు రితీశ్‌ను కలవాలని మంజులా దంపతులు వచ్చారు. రితేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులను వైద్య పరీక్షలు జరిపి, న్యాయస్థానంలో హాజరుపరచారు. న్యాయస్థానం నిందితులను ఎనిమిది రోజులు పోలీస్ కస్టడీకి ఆదేశించింది. విచారణలో మరిన్ని విషయాలు వెలుగు చూసే అవకాశముంది.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- సీఎం, మంత్రుల భేటీ



శివాజీనగర: రాష్ట్రంలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు సాధనపై సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి రణదీప్ సింగ్ సుర్జేవాలా మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు ఎంపీలో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం నివాసం కృష్ణాలో జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ఎన్నికల్లో గెలుపు చాలా ముఖ్యం. ప్రతి ఒక్కరు కూడా గంభీరంగా తీసుకొని ఎన్నికల్లో పని చేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో ఎవరూ కూడా వివాదాస్పద వ్యాఖ్యలను చేయాలని తెలిపారు.

మంత్రుల గైర్హాజరు

ఈ సమావేశంలో చాలా తక్కువ మంది మంత్రులు పాల్గొనడంపై సుర్జేవాలా ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మూడు రోజుల నుండి సమాచారం ఇచ్చినా కూడా గైర్హాజరయ్యారని మండిపడ్డారు. వారికి సంజాయషీ నోటీసులు ఇవ్వాలని సూచించారు.

దీపావళి శోభ



అందరూ ఎదురుచూసే దీపావళి పండుగ దగ్గరలోనే ఉంది. అంతటా పండుగ షాపింగ్ సందడి నెలకొంది. ప్రమిదలు, అలంకార సామగ్రి విక్రయాలు జరుగుతున్నాయి.



బెంగళూరులో ముచ్చటైన ప్రమిదలు



ఆదివారం సాయంత్రం బెళగావిలో మార్కెట్ వీధిలో విద్యుద్దీప అలంకారం

చినుకు చాటున ప్రకృతి సౌందర్యం

- భారీ వర్షాలకు ముత్యాల మడుగు జలపాతం హొయలు
- బెంగళూరు సమీపంలో టూరిస్టు స్పాట్

బొమ్మనహళ్లి: గత కొన్నిరోజులుగా బెంగళూరు నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కురిసిన కుండపోత వర్షాలతో నదులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండుగా మారాయి. కొండప్రాంతాలలో జలపాతాలు సందడి చేస్తున్నాయి. బెంగళూరు నగర జిల్లా పరిధిలోని ఆనేకల్ తాలూకాలో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ముత్యాల మడుగు జలపాతం సౌందర్యం మిన్నంటుతోంది. ముత్యాల మడుగు జలపాతం సుమారు 250 అడుగుల ఎత్తున కొండల పై నుంచి తెల్లని నురగతో జాలువారుతోంది. దీనిని చూడడానికి వందలాది మంది పర్యాటకులు వస్తున్నారు. కొందరు డ్రోన్‌లు ఎగరేసి చిత్రీకరణ చేస్తున్నారు. అలాగే 300 మెట్ల కొండను ఎక్కి అక్కడి నుంచి దూకే జలపాతాన్ని వీక్షించడం మరో మధురానుభూతి. ఈ జలపాతాన్ని చూడాలంటే సుమారు రెండు కిలోమీటర్ల దూరం అడవిలో నడిచి వెళ్లాలి. అయినా కూడా పర్యాటకులు తగ్గడం లేదు. ఎక్కువగా యువత తరలివస్తోంది.



ముత్యాలమడుగు చెక్ డ్యాం నుంచి ప్రవాహం



జలపాతంలో ఓ భాగం



కనులు తిప్పుకోనివ్వని ముత్యాలమడుగు ఫాల్స్

రూ. 6.56 కోట్లు హుష్‌కాకి

- పారిశ్రామికవేత్తకు సైబర్ మోసగాళ్ల శఠగోపం
- పోలీసుల దర్యాప్తు



బనశంకరి: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే ఇబ్బడిముబ్బడిగా లాభం వస్తుందని పారిశ్రామికవేత్తను నమ్మించిన సైబర్ నేరగాళ్లు రూ.6.56 కోట్లు దోచేశారు. బెంగళూరు శాంతినగర నివాసి మోహిత్ గోయల్ బాధితుడు. వివరాలు.. గత నెల 8వ తేదీన గుర్తుతెలియని నెంబరు నుంచి మోహిత్‌గోయల్ వాట్సాప్‌కు స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి ప్రకటన వచ్చింది. తరువాత ఆయనను మోసగాళ్లు తమ వాట్సాప్ గ్రూప్‌లో చేర్చుకున్నారు. అందులో నిత్యం స్టాక్‌మార్కెట్ గురించి పోస్టులు వచ్చేవి. కొందరు తమకు ఎంత మొత్తంలో లాభం వచ్చిందీ చిలవలు పలవలుగా చెప్పేవారు.

తరువాత బాధితునికి ఓ లింక్‌ను పంపించి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అకౌంట్ తెరిచి నగదు పెట్టుబడి పెట్టాలని సూచించారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో బ్యాంక్ అకౌంట్ వివరాలు నమోదు చేసి పెట్టుపెడ్డి పెట్టసాగాడు. పలు బ్యాంకు అకౌంట్ల నుంచి ఒకటిన్నర నెలలో రూ.6.56 కోట్లు పెట్టుబడి పెట్టాడు. బాగా లాభం వచ్చినట్లు యాప్‌లో కనిపించేది. డబ్బు విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించగా సాధ్యం కాలేదు. దీనిపై విచారించడానికి ఫోన్ చేయగా సమాధానం లభించకపోవడంతో ఇది సైబర్ వంచన అని గుర్తించి కేంద్ర విభాగ సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏయే బ్యాంకు అకౌంట్లకు పారిశ్రామికవేత్త నగదు బదిలీ చేశాడు అనేదానిపై పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు. ఆయా బ్యాంకులకు సమాచారం పంపించి అకౌంట్లను పరిశీలిస్తున్నారు. ఇది అంతర్జాతీయ సైబర్ వంచన కాగా స్థానికులు, విదేశీయుల హస్తం ఉందని పోలీసులు తెలిపారు.

మహిళకు రూ.10.42 లక్షలు వంచన

టెలిగ్రామ్ గ్రూప్‌లో బంగారు, వెండి, ప్లాటినం కాయిన్లను బిడ్ చేస్తే లాభం లభిస్తుందని ఆశ చూపించి మహిళకు రూ.10.42 లక్షలు టోపీ వేశారు. వివేక్‌నగరవాసి ఎన్.సుకన్య. ఆమెకు టెలిగ్రామ్ యాప్‌లో లింక్ పంపించిన వంచకులు ఆన్‌లైన్‌లో బంగారం, వెండి, ప్లాటినం విక్రయం, కొనుగోలు చేస్తే తక్కువ అవధిలో అధిక లాభం వస్తుందని ఆశపెట్టారు. ఆసక్తి కనబరిచిన మహిళ తన వద్ద ఉన్న నగదు, స్నేహితుల వద్ద కొంత అప్పుచేసి ఆన్‌లైన్‌లో గోల్డ్‌కాయిన్‌లు కొనుగోలుచేసి విక్రయించారు. కొన్న ప్రతిసారీ డబ్బు కట్ అవుతోంది తప్ప బంగారు ఏదీ కేటాయించలేదు. టెలిగ్రామ్ గ్రూప్ సైతం బ్లాక్ అయింది. దీంతో ఆమె సైబర్ ఠాణాలో ఫిర్యాదు చేసింది.

నిఖిల్ అభిమన్యుడా: సీఎం

సాక్షి, బెంగళూరు: నిఖిల్ రెండుసార్లు ఓడిపోయాడని, అలాంటి వాడు అభిమన్యుడు ఎలా అవుతాడని సీఎం సిద్ధరామయ్య ఎద్దేవా చేశారు. ప్యాలెస్ మైదానంలో ఆదివారం మీడియాతో సీఎం మాట్లాడుతూ నిఖిల్ అభిమన్యుని వంటివాడని, ఇప్పుడు అర్జునునిలా వస్తాడని హెచ్‌డీ కుమారస్వామి చెప్పడంపై స్పందించారు. గతంలో మండ్య, రామనగరల్లో రెండు సార్లు ఓడిపోయినప్పుడు అభిమన్యుడు కాలేకపోయాడని, ఇప్పుడు అర్జునుడు అవుతాడా అంటూ ఎగతాళి చేశాడు. ఉప ఎన్నికల గురించి సమావేశంలో చర్చించామని, దీపావళి పండుగ ఉండడంతో కొందరు నేతలు గైర్హాజరయ్యారని తెలిపారు.

మంత్రిపై శోభా ఫైర్

శివాజీనగర: కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె, బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి భైరతి సురేశ్ మధ్య మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకొంది. ఆదివారం మీడియాతో మాట్లాడిన శోభా కరంద్లాజె తాను అవినీతికి పాల్పడినట్లు చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాలని సవాల్ చేశారు. మంత్రి భైరతి ముడాకు సంబంధించి వేలాది ఫైల్స్‌ని కాల్చి వేశారు. దాని గురించి మాట్లాడితే నాపై ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తాను ఏనాడు అవినీతికి పాల్పడలేదన్నారు.

క్లుప్తంగా

ఉల్లి రైతు కంట కన్నీరు


కుళ్లిన పంటను చూపుతున్న రైతు

హొసపేటె: ఉల్లి సాగు చేసిన రైతులు ఆశించిన లాభం రాకుండా నష్టపోయారు. రైతులు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఉల్లిపాయను తొలగించిన తర్వాత రైతు పొలంలో పంట కుళ్లిపోయింది. జిల్లాలోని హొసపేటె, కూడ్లిగి, హడగలి, హరపనహళ్లి, హగరిబొమ్మనహళ్లి, కొట్టూరు తాలూకాల్లో ఉల్లి పంటకు దెబ్బపడింది. కూడ్లిగిలో హిరేహెగ్డాళ, పూజారహళ్లి, సుల్తాన్‌పుర, సిద్ధాపుర, ఆలూరు, గుండుముణుగు, కడకోళ, భీమసముద్ర, కొట్టూరు తాలూకాలోని అలబూరు, అయ్యనహళ్లి, కందగల్లుల్లో ఉల్లిపాయ పంట కుళ్లిపోయింది.

అధిక లాభాలంటూ రూ.12.56 లక్షల వంచన

హుబ్లీ: షేర్ మార్కెట్‌లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలతో పాటు ఐపీఓ ఇస్తామంటూ ధార్వాడ నివాసి ఎం.సోరన్‌ను నమ్మించి రూ.12.56 లక్షలను ఆన్‌లైన్‌లో కేటుగాళ్లు తమ ఖాతాలోకి బదలాయించుకొన్నారు. సోరన్‌ను వాట్సప్ ద్వారా సంప్రదించిన వంచకులు మెండుగా లాభాలు వస్తాయని తమ వాట్సప్ గ్రూపులో చేరిపించుకున్నారు. అనంతరం బాధితుడి వివిధ బ్యాంక్ ఖాతాల నుంచి రూ.12,56,136లను తమ ఖాతాకు బదలాయించుకొన్నట్లు బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విషం తాగి విద్యార్థి ఆత్మహత్య


దర్శన్(ఫైల్)

హొసపేటె: వ్యక్తిగత కారణాలతో దర్శన్(21) అనే విద్యార్థి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కూడ్లిగి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఎస్ఏటీ ప్రథమశ్రేణి కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దర్శన్ శుక్రవారం ఉదయం తమ ఊరు నుంచి వచ్చి కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల కళాశాలకు వెళ్లగా అస్వస్థతకు గురికావడంతో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తదుపరి మెరుగైన చికిత్స కోసం బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఘటనపై కూడ్లిగి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

భూస్వాధీన ప్రక్రియ షురూ

హుబ్లీ: హుబ్లీ- ధార్వాడ ఆరు లైన్ల బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి తాలూకాలోని కొన్ని గ్రామాల్లో అవసరమైన అదనపు భూమిని స్వాధీనం చేసుకొనే ప్రక్రియ ప్రారంభమైంది. తొలిదశలో తీర్పు ప్రకటించిన నేపథ్యంలో సదరు భూమిలో పొలం, కట్టడాలు, వృక్షాలను స్వాధీనం చేసుకొనేందుకు సంబంధితులకు ఇప్పటికే నోటీసులు పంపారు. రోడ్డు నిర్మాణం కోసం సదరు పొలాల సేకరణ అవసరమైనందు వల్ల తగిన పరిహారం తీసుకోవడానికి రికార్డులను దాఖలు చేసిన 7 రోజుల్లో పరిహారం అందజేస్తారు. లేదా నోటీసు జారీ అయిన 60 రోజుల్లో సంబంధిత కేసుల పరిహారధనాన్ని నియమానుసారంగా కోర్టులో డిపాజిట్ చేస్తామని జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార నెం-48వ భూస్వాధీన అధికారి ఓ ప్రకటనలో తెలిపారు.

బైక్‌పై కమిషనర్ సిటీ రౌండ్స్


బైకుపై రాత్రి వేళ సంచరిస్తున్న కమిషనర్

హుబ్లీ: జంట నగరాల్లో నేరాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక కార్యాచరణ మొదలు పెట్టారు. ఈమేరకు శనివారం రాత్రి పోలీసు కమిషనర్ శశికుమార్ స్వయంగా బైకుపై హుబ్లీ నగరంలో వివిధ చోట్ల సంచరించి పరిశీలించారు. ఈక్రమంలో పోలీసులు మద్యపానం చేసి అల్లర్లకు పాల్పడుతున్న, రికార్డు లేని వాహనాలకు సంబంధించి యువకులకు చురుకు ముట్టించారు. అనుమానాస్పద వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. అలాగే కొన్ని బైకులను, కార్లను కూడా సీజ్ చేశారు. ప్రస్తుతం జంటనగరాల్లో రౌడీల ఆగడాలు కొంత తగ్గాయి.

కళలను కాపాడుకోవాలి

రాయచూరు రూరల్: నేటి రోజుల్లో నశించి పోతున్న నాటక రంగ కళలకు ప్రాధాన్యత కల్పించాలని రాయచూరు విశ్వవిద్యాలయం సిండికేట్ సభ్యుడు చెన్నబసవ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి పండిత సిద్దరామ జంబలదిన్ని రంగ మందిరంలో కళాదేవి కలా బళగ, కన్నడ సంస్కృతి శాఖ ల ఆధ్వర్యంలో ఎడదొరె నాడు కళా ఉత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత కళాకారులు వేసే నాటకాలను గుర్తించి వారి కళానైపుణ్యతకు ప్రస్థానం కల్పించాలన్నారు. అధ్యక్షురాలు మమత, రాజ్‌గోపాల్, మహదేవ, శివశరణేగౌడ, హనుమంతప్ప, బసవరాజ్, బషీరుద్దీన్, శరణప్ప, నరసింహలున్నారు.

ఆస్తి కోసం బెదిరింపులు

హుబ్లీ: ఇళ్ల మధ్యలో ఉన్న ఆస్తులకు సంబంధించి సదరు స్థలాన్ని తమకే అమ్మాలని ముగ్గురు మహిళలు కలిసి ఇద్దరిపై దాడి చేసి చంపుతామని బెదిరించిన ఘటన పాత హుబ్లీ జిడ్డి వీధిలో చోటు చేసుకుంది. అల్తాఫ్ అహమ్మద్, దస్తగిరిసాబ్‌తో పాటు ఓ మహిళతో కలిసి ముగ్గురు పక్కీరప్పరెడ్డి, శ్రీదేవిరెడ్డిలపై దాడి చేసినట్లు పాత హుబ్లీ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

త్వరలో ఈఎస్ఐ ఆస్పత్రి కల సాకారం

- 29న నిర్మాణ పనులకు శంకుస్థాపన
- కోలారుకు మణిహారం కానున్న వైద్యశాల

కోలారు: జిల్లాలో అత్యధిక పరిశ్రమలు ఉండడం వల్ల జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని స్థాపించాలనే డిమాండ్ చాలా రోజుల నుంచి వినిపిస్తోంది. ఎట్టకేలకు ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ కల సాకారం అవుతోంది. తాలూకాలోని నరసాపురం పారిశ్రామిక ప్రాంతంలో 100 పడకల కార్మికుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) ఆస్పత్రి నిర్మాణానికి ఈ నెల 29వ తేదీ మంగళవారం ఉదయం శంకుస్థాపన జరుగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జి మంత్రి భైరతి సురేష్, ఎంపీ ఎం.మల్లేష్‌బాబు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొంటున్నారు.

రూ.120 కోట్లతో నిర్మాణం



నరసాపుర పారిశ్రామికవాడ ప్రవేశద్వారం

నరసాపుర పారిశ్రామికవాడలోని భారత్ పెట్రోలియం వద్ద ఉన్న 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.120 కోట్ల వ్యయంతో అన్ని హంగులతో కూడిన ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం జరుగనుంది. 29 రోజుల్లో ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే 80 వేల మందికి పైగా కార్మికులకు సహాయం కానుంది. జిల్లాలో ఇంతవరకు ఎక్కడా ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి లేదు. జిల్లాలో నరసాపుర, వేమగల్, మాలూరు పారిశ్రామికవాడలు ఉండడం వల్ల ఇక్కడ ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలనే ఆలోచన చాలా రోజుల నుంచి ఉంది. ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం సీపీఎం, సీఐటీయూ తదితర కార్మిక సంఘాలు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నాయి. ఇందుకు అనేక పోరాటాలు కూడా చేశారు.

> **కార్మిక కుటుంబాలకు ఉచిత చికిత్స**
>
> ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అన్ని రకాల చికిత్స సౌకర్యాలు లభ్యం కానున్నాయి. కార్మిక కుటుంబాలకు ఉచిత చికిత్స అందనుంది. ఆస్పత్రి నిర్మాణం కోసం 5 ఎకరాల స్థలం గుర్తించాం. నిర్ణీత ఫీజులు చెల్లించి ఇతరులు కూడా చికిత్స పొందవచ్చు, ఆస్పత్రి నిర్మాణానికి రూ.120 కోట్లు ప్రత్యేకించారు. దశల వారీగా నిధులు విడుదల చేస్తారు.
>
> -రవిచంద్రశేఖర్, జిల్లా సూపరింటెండెంట్, రాష్ట్ర కార్మిక బీమా విభాగం

నగరంలో మలబార్ కొత్త షోరూం


ప్రారంభోత్సవంలో ప్రముఖులు

సాక్షి బెంగళూరు: ప్రముఖ అంతర్జాతీయ బంగారు, వజ్రాభరణాల రీటైల్ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తన వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తూ సాగుతోంది. బెంగళూరులో 19వ, కర్ణాటక రాష్ట్రంలో 37వ షోరూమ్‌ను తాజాగా ప్రారంభించింది. హెసరఘట్ట మెయిన్ రోడ్డులో కొత్త షోరూమ్‌ను శనివారం ప్రారంభించింది. ఈ సినీ నటి శ్రీనిధి శెట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టి.దాసరహళ్లి ఎమ్మెల్యే ఎస్. మునిరాజు రిబ్బన్ కటింగ్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ప్రాంతీయ అధిపతి ఫిల్సార్ బాబు, ఇతర కార్య నిర్వాహక బృందం సభ్యులు పాల్గొన్నారు. కొత్త షోరూమ్ ప్రారంభోత్సవంపై మలబార్ గ్రూపు ఛైర్మన్ ఎంపీ అహ్మద్ హర్షం వ్యక్తం చేశారు. పండుగ సీజన్‌ను పురస్కరించుకుని రూ. 50 వేలు విలువైన కొనుగోళ్లు చేసే వినియోగదారులకు సంస్థ ఆఫర్లను అందిస్తోంది. నవంబర్ 3 వరకు పలు ఆఫర్లు అందుబాటులో ఉంటాయి.

మార్కెట్లు కిటకిట


దీపావళి పండుగకు సమయం దగ్గర పడుతుండటంతో మార్కెట్లకు లక్ష్మీకళ వచ్చింది. గృహ అలంకరణ వస్తువులు, దుస్తుల దుకాణాలు జనంతో రద్దీగా మారాయి. ఆదివారం బెగళూరులో అలంకరణ వస్తు సామగ్రి దుకాణం వద్ద జన సందడి

గజ దొంగలను బంధించిన గ్రామస్తులు

శివాజీనగర: చోరీల కోసం వచ్చిన దొంగలను గ్రామస్తులు సినీ ఫక్కీలో బంధించి పోలీసులకు అప్పగించారు. విచారణలో వారు గజ దొంగలని తేలింది. ఈ ఘటన బెళగావి జిల్లా అథిణి తాలూకా ఐడచి గ్రామంలో జరిగింది. ఐదు మంది వ్యక్తులు శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గ్రామంలోకి చొరబడ్డారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించగానే యువకులు సెల్‌ఫోన్ల ద్వారా గ్రామస్తులందరికీ సమాచారం ఇచ్చారు. వీధుల్లోకి వచ్చిన జనం ప్రతి వీధి గాలించారు. దీంతో ఆ వ్యక్తులు పరారయ్యారు. అయినా గ్రామస్తులు మిన్నకుండిపోలేదు. గాలింపు చేపట్టి విజయపుర, సంకేశ్వర్ రాష్ట్ర రహదారిపై ఇద్దరిని పట్టుకున్నారు. మిగతా ముగ్గురు తప్పించుకున్నారు. అనంతరం ఐగళి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఆ వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మూడేళ్లుగా బెళగావి జిల్లాలో ఆలయాలు, ఇళ్లలో చోరీలకు పాల్పడి భారీగా బంగారు, నగదు దోచుకున్న ముఠాలోని సభ్యులుగా గుర్తించారు. పట్టుబడిన నిందితులు కృష్ణన్, రమేశ్ అని తేలింది.

నామినేటెడ్ సభ్యుడి నియామకం


గురప్ప

మండ్య: మండ్య జిల్లా ఎస్సీ, ఎస్టీ సముదాయాల జిల్లా స్థాయి జాగృతి, ఇన్‌చార్జ్ సమితికి నామినేటెడ్ సభ్యుడిగా మండ్య భారతీయ బోవి సముదాయ పరిషత్ జిల్లా అధ్యక్షుడు టి.సి. గురప్పను నియమించారు. ఈమేరకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ


యశ్వంత్ ప్రియ

పావగడ: తాలూకాలోని అరసికెరె గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కుమారి యశ్వంత్ ప్రియ జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో విజయం సాధించి బెంగుళూరు డివిజన్ విభాగం పోటీలకు ఎంపికైంది. మధుగిరిలో జరిగిన జిల్లా స్థాయి గ్రామీణ ఐటీ క్విజ్ పోటీల్లో సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచింది. యశ్వంత్ ప్రియ ప్రతిభపై పాఠశాల హెచ్‌ఎం రామచంద్రప్ప, సహ ప్రధానోపాధ్యాయుడు రేణుకారాజ్, ఉపాధ్యాయులు హనుమేశ్, మోహన్ కుమార్, జికె కుమార్, అభిషేక్, విమల, రశ్మి, మానస, శ్రీలక్ష్మి తదితరులు హర్షం తెలిపారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి

పావగడ: స్థానిక జిల్లా పాల ఉత్పత్తి సహకార సంఘం డైరెక్టర్ స్థానానికి జరిగే ఎన్నికల్లో బీజేపీ , జేడీఎస్ కూటమి అభ్యర్థి చన్న మల్లప్పను గెలిపించాలని చిత్రదుర్గం ఎంపీ గోవింద కారజోళ విజ్ఞప్తి చేశారు. స్థానిక అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మునుగుతున్న పడవ అని ఎద్దేవా చేశారు. గడినాడు పావగడ ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ప్రతి తాలూకాలో పర్యటించి అతివృష్టితో నష్ట పోయిన పంటల పై పూర్తి సమాచారం సేకరించి నష్ట పరిహారాన్ని బాధిత రైతులకు అందించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, చన్నమల్లప్ప, కోటగుడ్డ అంజినప్ప, బీజేపి శివకుమార్ సాకేల్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోదకుడు మృతి

హుబ్లీ: హుబ్లీ తాలూకా కంప్లికొప్ప గ్రామానికి వెళ్తున్న వ్యక్తి బైకు మీద గడ్డిమోపును పెట్టుకొని వెళ్తుండగా ట్రాక్టర్ బైకును ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మృతుడిని కంప్లికొప్ప గ్రామానికి చెందిన బసనగౌడ పాటిల్‌గా గుర్తించారు. గాయపడిన గణేష్ వాల్మీకిని చికిత్స కోసం కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనలో శంకరప్ప కల్లమ్మనవర్‌పై హుబ్లీ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

అదుపులో అతిసార కేసులు

- కోలుకున్న 22 మంది
- ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్

హుబ్లీ: కలఘటిగి తాలూకా ముత్తగి గ్రామంలో అతిసార కేసులు ఎట్టకేలకు నియంత్రణలోకి వచ్చాయి. ఆదివారం మూడు వీధుల్లో కలుషిత నీటిని తాగడంతో వాంతులు, విరేచనాల బారిన పడిన 22 మంది కోలుకొని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు జిల్లాధికారి దివ్యప్రభు ఓ ప్రకటనలో తెలిపారు. సదరు గ్రామంలో రక్షిత తాగునీటిని ప్రత్యేక ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తామన్నారు. డీహెచ్‌ఓ డాక్టర్ శశిపాటిల్ నేతృత్వంలో ఇంటింటికీ ఆరోగ్య బృందం వెళ్లి సమీక్ష చేపట్టిందన్నారు. ప్రజల్లో పరిశుభ్రత, నైర్మల్యంతో పాటు రక్షిత తాగు నీటి వాడకం గురించి జాగృతి పరిచారన్నారు. తాలూకా ఆస్పత్రిలో ముఖ్యవైద్యాధికారి డాక్టర్ యశ్వంత్ మదీనాకర పర్యవేక్షణలో రోగులకు చికిత్స అందించి రోజు మూడు పూటలా వైద్యసేవలు అందించారన్నారు. తాలూకా ఆస్పత్రిలో అదనంగా అంబులెన్స్ వసతి ఏర్పాటు చేశామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను తాలూకా ఆస్పత్రిలో రాత్రి వేళల్లో విధుల నిర్వహణకు సూచించామన్నారు. మొత్తం 51 మందికి చికిత్స అందించామన్నారు. హుబ్లీ కిమ్స్ ఆస్పత్రిలో 13 మందికి, కలఘటిగి తాలూకా ఆస్పత్రిలో 38 మందికి చికిత్సలు కొనసాగుతున్నాయన్నారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. రోగులు కోలుకునేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందన్నారు.

పిల్లల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు పునాది

రాయచూరు రూరల్: పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు పునాది కావాలని రాయచూరు శాసన సభ్యుడు శివరాజ్ పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని గాజగారపేట శృంగేరి శారద కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యా శాఖలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు పిల్లల సంక్షేమ కోసం పాటుపడాలన్నారు. ప్రతిభకు తార్కాణంగా విద్యార్థుల భవిష్యత్తును రూపొందించాలన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈసందర్భంగా శాంత మల్ల శివాచార్య స్వామీజీ, గోవిందు, ఆంజనేయ, శశిరాజ్, నాగరాజ్, చంద్రశేఖర్ తదితరులున్నారు.


జ్యోతి వెలిగిస్తున్న శివరాజ్ పాటిల్

మానవత చాటిన బస్సు డ్రైవర్

- గర్భిణిని ఆస్పత్రిలో చేర్పించిన వైనం

హొసపేటె: బస్సులో ప్రసవ వేదనతో బాధపడుతున్న ఓ గర్భిణిని ఆర్టీసీ బస్సు డ్రైవర్ నాగరాజు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి మానవతను చాటుకొన్న ఘటన విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకాలో జరిగింది. కొప్పళ జిల్లాలోని కారటగికి చెందిన సుల్తాన్‌బీ అనే మహిళ ఆపరేషన్ చేయించుకొన్న తన భర్తను చూసి శనివారం రాత్రి బస్సులో బెంగళూరు నుంచి ఒంటరిగా స్వగ్రామానికి తిరిగి వస్తోంది. ఈ సమయంలో దొణ్ణెహళ్లి సమీపంలో ఆమెకు ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. అదే సమయంలో బస్సులో ఉన్న ఆలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నాగమణి సహకారంతో బస్సులో ప్రసవ వేదనకు గురైన గర్భిణిని ఆర్టీసీ బస్సు డ్రైవర్ గమనించి వెంటనే హైవే పెట్రోలింగ్ సిబ్బంది సహాయంతో బస్సును కూడ్లిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో సుల్తాన్‌బీ క్షేమంగా ప్రసవించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.


ఆస్పత్రిలో తల్లీబిడ్డతో వైద్యసిబ్బంది, డ్రైవర్

కోలారు వార్తలు...

అనీమియా రహిత దేశ నిర్మాణమే లక్ష్యం

కోలారు: ప్రభుత్వ లక్ష్యమైన అనీమియా రహిత దేశ నిర్మాణానికి సమాజంతో కలిసి అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు వారధిలా పని చేయాలని తాలూకా ఆరోగ్య అధికారి ఏవీ నారాయణస్వామి సూచించారు. ఆదివారం నగరంలోని టీపీ కార్యాలయంలో పంచాయతీ రాజ్, ఆరోగ్య శాఖ, స్త్రీశిశు సంక్షేమ శాఖల సహకారంతో కర్ణాటక హెల్త్ ప్రమోషన్ ట్రస్టు, ఐటీసీ మిషన్ ఆధ్వర్యంలో పీడీఓ ఆరోగ్య అధికారులు, సీఆర్‌పీ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులకు నిర్వహించిన సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. పిల్లల్లో అనీమియా రాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. దీనిపై తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. బీఈఓ, శిశు అభివృద్ధి అధికారి వినోద్‌రాజ్, హెల్త్ ప్రమోషన్ ట్రస్టు ధనంజయ, డాక్టర్ అగ్నితా, ట్రస్టు సభ్యుడు సురేంద్ర, బ్లాక్ కో ఆర్డినేటర్ సందీప్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నైపుణ్య శిక్షణతో స్వతంత్ర జీవితం

కోలారు: వృత్తికౌశల్య శిక్షణ పొందిన మహిళలు స్వతంత్ర జీవితం సాగించాలని ప్రభుత్వ మహిళా పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ కె.గోపాల్ పిలుపు నిచ్చారు. నగరంలోని ప్రభుత్వ మహిళా శిక్షణా సంస్థ సభాంగణంలో న్యూఢిల్లీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్, డీజీటీ ఆదేశాల మేరకు 2023-24వ విద్యా సంవత్సరంలో అఖిల భారత వృత్తి పరీక్షలో వివిధ వృత్తుల్లో పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన వారికి ప్రమాణ పత్రాలను అందించి మాట్లాడారు. నేడు పదవి శిక్షణ మన జ్ఞాన వృద్ధికి సహాయకారి అవుతుందన్నారు. ఇక్కడ అందించే కౌశల్య ఆధారిత శిక్షణ మన జీవితానికి దారి దీపం అవుతుందన్నారు. నేడు నరసాపురం, వేమగల్ తదితర ప్రాంతాల్లో పారిశ్రామిక జోన్లు వచ్చాయి. బీఈ డిగ్రీ పొందిన వారి కంటే ఐటీఐ, డిప్లొమా విద్యార్హత కలిగిన వారికే విపులమైన అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సంస్థ శిక్షకులు శివకుమార్, ఎస్.చిన్నప్ప, పుష్ప, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణ పత్రాలను అందిస్తున్న దృశ్యం

పశువులకు టీకాలు తప్పనిసరి

కోలారు: పాడి రైతులు తమ పశువులకు తప్పకుండా టీకాలు వేయించి పశువులు రోగాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్య శిబిరం వైద్యాధికారి డాక్టర్ బీ ఎస్ సతీష్ తెలిపారు. ఆదివారం తాలూకాలోని అరాభికొత్తనూరు గ్రామంలో గాలికుంటు వ్యాధికి టీకాలు వేసే అభియాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో గత వారం రోజుల నుంచి నిరంతరంగా వానలు కురుస్తున్నందున వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్న సమయంలో పశువులు ఎక్కువగా వ్యాధుల బారిన పడతాయన్నారు. పాడి రైతులు తమ పశువులకు సకాలంలో టీకాలను వేయించి రక్షించుకోవాలన్నారు. గాలికుంటు వ్యాధి వైరస్ వల్ల సోకుతుందన్నారు. ఒక పశువు నుంచి మరో పశువుకు సోకే అవకాశం ఉన్నందున రోగం రాకముందే టీకాలు వేయించాలని సూచించారు. వ్యాధి సోకిన పశువులు విపరీతంగా నోటి నుంచి జొల్లు కారుస్తుంటాయన్నారు. దీనిని గుర్తించి ఇతర పశువులకు దూరంగా ఉంచి సరైన చికిత్సను అందించాలన్నారు. 3 నెలలు పైబడిన దూడల నుంచి అన్ని పశువులకు టీకాలు వేయించాలన్నారు.


పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

నగరసభలో అవినీతి తాండవం

కేజీఎఫ్: నగరసభ కార్యాలయంలో అవినీతి అక్రమాలు తాండవిస్తున్నాయని ఆర్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు మోహనకృష్ణ తెలిపారు. ఆదివారం నగరంలోకి కింగ్ జార్జి హాల్‌లో దీపావళి పండుగ సందర్భంగా నగరంలోని 35 వార్డుల ప్రజలకు ఉచితంగా బాణసంచా బాక్సులను, స్వీట్లను పంచి పెట్టి మాట్లాడారు. తమ పేరులోని ఆస్తికి అన్ని దాఖలాలు ఉన్నా ఇ-ఖాతా చేయడానికి వేల రూపాయల లంచం ఇవ్వాల్సి వస్తోందన్నారు. నగరసభలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజేంద్రన్ అవధిలో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఉండేది కాదన్నారు. అయితే ప్రస్తుతం ఏ కార్యాలయానికి వెళ్లినా లంచం ఇవ్వనిదే పనులు జరిగే అవకాశం లేదన్నారు. తాను అధికారంలోకి వస్తే అవినీతిని పూర్తిగా నిర్మూలిస్తానన్నారు. వచ్చే నగరసభ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో పార్టీ అభ్యర్థులను గెలిపించి నగరసభలో అవినీతికి తావు లేని పాలన అందిస్తానని తెలిపారు.

అనాథలను ఆదుకోవాలి

తుమకూరు: నేటి సమాజంలో అనేక కారణాల వల్ల ఎంతో మంది అనాథలుగా ఉన్నారని,
అలాంటి వారికి జీవనం చాలా కష్టంగా ఉంటుందని, వారికి సహాయం చేయాలని మాజీ మంత్రి ఎంటీబీ నాగరాజు అన్నారు. జిల్లాలోని శిర తాలూకాలో గాణద హుణసెలో వృద్ధాశ్రమాన్ని ఆయన సందర్శించారు. అనాథలకు పండ్లు, బ్రెడ్డు అందజేశారు. ప్రతి ఒక్కరూ అనాథాశ్రమాలకు వెళ్లి సహాయం చేయాలని అన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


బాలాజీని సన్మానిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: నిరంతరంగా కన్నడ భాషకు సేవలు అందించి కన్నడ సాహిత్య పరిషత్ నుంచి కన్నడ కాయక ప్రశస్తి అందుకున్న చిక్కబళ్లాపురానికి చెందిన బాలాజీని మిత్రులు ఘనంగా సన్మానించారు. ఏటా ఘనంగా కన్నడ రాజ్యోత్సవాలు జరిపి కన్నడ భాషపై ప్రజల్లో చైతన్యం తెచ్చారని కొనియాడారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


పాదచారులకు జాగ్రత్తలు చెబుతున్న ట్రాఫిక్ పోలీసులు

కృష్ణరాజపురం : కృష్ణరాజపురం ట్రాఫిక్ పోలీసులు ఆదివారం భట్టరహళ్లి ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ ప్రాంతంలో రోడ్డు ఉల్లంఘనలు ఎక్కువగా జరుగుతుండటంతో పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. సిగ్నల్ జంప్ చేయరాదని, ఓవర్ టేక్ చేయరాదని, పాదచారులు రోడ్డు దాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కన్నడ భవన్ నిర్మిస్తాం


సమావేశంలో పాల్గొన్న పదాధికారులు

కోలారు: జిల్లాలోని సరిహద్దు ప్రాంతమైన బంగారుపేటలో కన్నడ భవన్ నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తామని, ఇందుకోసం ప్రత్యేక సమితిని రచించామని కన్నడ అభిమానుల సంఘం పదాధికారులు తెలిపారు. ఆదివారం పురసభ అధ్యక్షుడు గోవింద నేతృత్వంలో నిర్వహించిన కన్నడాభిమానుల సంఘం సభ్యుల సమావేశంలో ఈ తీర్మానం చేసినట్లు తెలిపారు. కన్నడ చళువళి నాయకుడు రంగశామయ్య మాట్లాడుతూ బంగారుపేటె కన్నడ సంఘానికి ఒక చరిత్ర ఉందన్నారు. జిల్లా మొత్తానికి కన్నడ సంఘం ఆదర్శమన్నారు. ఇలాంటి కన్నడ సంఘానికి కన్నడ భవనం అవసరం ఎంతో ఉందన్నారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి మాట్లాడుతూ పట్టణంలో కన్నడ భవనం నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా కన్నడ సంఘం పదాధికారులు పల్లవి మణి, బీజేపీ చంద్రారెడ్డి, పురసభ ఉపాధ్యక్షురాలు చంద్రవేణి మంజునాథ్, ముఖ్యాధికారి సత్యనారాయణ, సీఐ నంజప్ప, పలువురు పురసభ సభ్యులు, కన్నడాభిమానులు పాల్గొన్నారు.

గొప్ప కవి వాల్మీకి మహర్షి

హొసపేటె: చిత్తవాడిగిలో ఆదివారం జరిగిన వాల్మీకి జయంతి వేడుకల్లో భాగంగా విజయనగర ఎమ్మెల్యే హెచ్‌ఆర్.గవియప్ప, వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని గొప్ప కవుల్లో వాల్మీకి ఒకరని అన్నారు. ఆయన సాధించిన అపూర్వమైన సాధనల ఫలితంగానే నేడు ప్రపంచంలో రాముడు, రామాయణాన్ని చూస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా వాల్మీకి జయంతిని ఆచరిస్తున్నారన్నారు. వాల్మీకి మహర్షి సందేశాలు ఆదర్శప్రాయం అన్నారు. వాల్మీకి సమాజ ప్రజలు విద్యావంతులై అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నారు. వాల్మీకి సమాజ అధ్యక్షుడు శ్రీనాథ్ గుజ్జల్, వసంత జంబనహళ్లి, మంజునాథ్, హుడా అధ్యక్షుడు ఇమామ్, వాల్మీకి సమాజ నేతలు జంబయ్యనాయక్, కొట్రేష్, హనుమంతప్ప, అంజినప్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదిశంకర సభా భవనం ప్రారంభం



విధుశేఖర భారతి స్వామీజీని ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

శిడ్లఘట్ట : సదృఢమైన నసనాతన ధర్మానికి భద్రమైన పునాది వేసిన ఆది శంకరాచార్యుల పేరుతో నిర్మించిన సభా భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని శృంగేరి మఠాధిపతి విధుశేఖర భారతీ స్వామీజీ అన్నారు. పట్టణంలో నిర్మించిన ఆదిశంకర సభాభవనాన్ని స్వామీజీ ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ధర్మశాస్త్రంలో ఎలాంటి లోపం లేదని, నేను, నాదే అనే భావనలను వీడి సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అంతకు ముందు స్వామీజీని పట్టణ ప్రజలు ఘనంగా ఊరేగించారు.

గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

శివమొగ్గ : జిల్లాలోని హోళె హొన్నూరు సమీపంలోని అగరదహళ్లి క్యాంపులో గంజాయి నిల్వ చేసిన సంజీవరాజు(40), భద్రావతిలోని సిద్దరకాలనీవాసి గురు ప్రసాద్(24)ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులనుంచి రూ. 2.80 లక్షల విలువైన 5 కిలోల ఎండు గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ లక్ష్మీపతి తెలిపారు.

హొసకోటెలో స్వచ్ఛతా పనులు



చెత్తా చెదారం తొలగిస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం : బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటె పట్టణంలో ఆదివారం స్వచ్ఛతా పనులు చేపట్టారు. నగరసభ అధ్యక్షురాలు ఆశారాజశేఖర్ నగరసభ సిబ్బందితో కలిసి వార్డుల్లో పర్యటించి స్వచ్ఛతా పనులు పరిశీలించారు. ఉపాధ్యక్షుడు పాల్గొన్నారు.

దొంగల అరెస్టు



చోరీసొత్తుతో పోలీసులు

మండ్య: జిల్లాలోని కీరుగావలు పోలీసులు ఇద్దరు దోపిడీ దొంగలను అరెస్టు చేశారు. ఒకరు స్థానికుడైన మహ్మద్ సుమేద్ (27), మరొకరు బెంగళూరువాసి సయ్యద్ సైఫ్ (26). వారి నుంచి రూ. 8.50 లక్షల విలువచేసే 114 గ్రాముల బంగారు నగలు, బైక్‌ను సీజ్ చేశారు. వీరు ఆగస్టులో ఇంటి తాళాలు పగలగొట్టి సొత్తు ఎత్తుకెళ్లారు. ఫిర్యాదు మేరకు పోలీసులు గాలించి అరెస్టు చేశారు.

తెలుగు విజ్ఞాన సమితి భేటీ

శివాజీనగర: తెలుగు విజ్ఞాన సమితి 60వ సర్వసభ్య సమావేశం సమితి ప్రాంగణంలోని శ్రీ కృష్ణదేవరాయ కళా మందిరంలో ఆదివారం అధ్యక్షుడు ఏ రాధాకృష్ణరాజు అధ్యక్షతన జరిగింది. రాధాకృష్ణరాజు మాట్లాడుతూ తెలుగు భాషా సంస్కృతుల మనుగడకు తెలుగు పాఠశాలల ఉనికిని కాపాడుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజు రాష్ట్రంలోని తెలుగు పాఠశాలల ఉపాధ్యాయులందరినీ ఆహ్వానించాలని, అదే వేదికపై ఎస్ఎస్ఎల్‌సీలో టాపర్లుగా నిలిచిన తెలుగు విద్యార్థులను సత్కరించాలని నిర్ణయించామని తెలిపారు. సమితి ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మీరెడ్డి, ఉపాధ్యక్షులు కే.గంగరాజు, ఆర్.ఆదికేశవులు నాయుడు, సీఏ వరదరాజు, చంద్రమోహన్, లక్ష్మీ శరత్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

రూ.45 లక్షలతో శవాగారానికి కొత్త భవనం



శవాగారాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర

మండ్య : మండ్య జిల్లా మళవల్లి పట్టణ ప్రభుత్వ ఆస్పత్రిలో శిథిలావస్థలో ఉన్న శవాగారం స్థానంలో రూ.45లక్షలతో కొత్త భవనం నిర్మిస్తామని ఎమ్మెల్యే నరేంద్ర స్వామి అన్నారు. ఆదివారం ఆయన అధికారులతో కలిసి శవాగారాన్ని పరిశీలించారు. కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. గుర్తు తెలియని మృతదేహాలను భద్రపరిచేందుకు కొత్త భవనంలో ప్రత్యేక గదిని కేటాయిస్తామని తెలిపారు.



హంపీ మ్యూజియం



హంపీలో శిల్ప కళాఖండం



బెంగళూరులోని మ్యూజియంలో పురాతన విగ్రహాలు

వారసత్వ సంపదతో మ్యూజియంలు కళకళ

- సందర్శకులను ఆకట్టుకుంటున్న పురాతన కళాఖండాలు
- విజ్ఞానంతోపాటు వినోదం పంచుతున్న మ్యూజియంలు

బనశంకరి: వేల ఏళ్లనాటి సంస్కృతి, నాగరికతలు, కళలు, ప్రాచీన కాలం ప్రజలు జీవన విధానం, ఆనాటి రాజుల చరిత్ర, వారి పాలన, పురాతన నాణేలు, కళాఖండాలు తదితర వివరాలు తెలుసుకోవాలంటే మ్యూజియంలకు వెళ్లాల్సిందే. శోధించడం, సేకరించడం, భద్రపరచడం అనే అర్థంతో ఉన్న వస్తు సంగ్రహాలయాలు ఒకప్పుడు సంపన్నులకు మాత్రమే అందుబాటులో ఉండేవి. కాల క్రమంలో సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చాయి. ప్రజల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు, కొత్త ఆవిష్కరణలకు మ్యూజియంలు బాటలు వేస్తున్నాయి.

బెంగళూరులో పురాతన మ్యూజియం

దేశంలోనే పురాతన మ్యూజియంలలో ఒకటి బెంగళూరులో ఉంది. ఇది ఎడ్వర్డ్ బాల్‌ఫోర్ మార్గదర్శనంలో 1865లో ఏర్పాటైంది. దాదాపు 4వేల ఏళ్ల కాలం నాటి అవశేషాలు ఇక్కడ ఉన్నాయి. వృత్తాకారతోరణాలు, పారాపెట్‌గోడలతో సొగసైన అద్భుతమైన మ్యూజియం ఇది.

బొగ్గుతో నడిచే రైళ్లు చూడాలంటే...

పురాతన కాలం నాటి రైలు, పట్టాలను చూడాలంటే మైసూర్ రైల్వే మ్యూజియం వెళ్లాల్సిందే. పాత కాలం నాటి లోకోమోటివ్‌లు, సిగ్నల్స్, లైట్లు ఇక్కడ చూడవచ్చు. ఇక్కడ మినీ రైలు కూడా ఉంది. ఆస్టిన్ రైలుకారు నుంచి టికెట్ విండో, 1963 మోడల్ రాయల్‌బోగీ వరకు ఇక్కడ ఉన్నాయి. మ్యూజియం ప్రాంగణంలో బ్యాటరీ రైలులో ప్రయాణించవచ్చు.

హంపీ పురావస్తు మ్యూజియం

హంపీ పురావస్తు మ్యూజియం భారత దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందింది. అనేక శతాబ్దాల పురాతన కళాఖండాలు, విగ్రహాలు, విజయనగర రాజులు వినియోగించిన ఆయుధాలు ఉన్నాయి. సతీరాళ్లు, గార విగ్రహాలు, ఛాయాచిత్రాలు ఉన్నాయి. మైసూరులో 1861లో నిర్మించిన రాజభవనాన్ని 1915లో కళా ప్రదర్శనలకు వేదికగా మార్చి జగన్‌మోహన్ ప్యాలెస్ ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియంగా నామకరణం చేశారు. ఇందులో అద్భుతమైన పెయింటింగ్స్, శిల్పాలు, పురాతన కళాఖండాలకు నిలయం. మొఘల్ పెయింటింగ్స్, హిందూ ఇతిహాసాలకు సంబంధించిన వర్ణ చిత్రాలు, యుద్ధ పరికరాలు, నాణేలు, ఇత్తడి దుస్తులను ఇక్కడ వీక్షించవచ్చు. అందమైన ప్యాలెస్ చుట్టూ రంగురంగుల పూల తోటలు ఉన్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు సంగీత ఉత్సవాలు నిర్వహిస్తారు.

విశ్వేశ్వరయ్య మ్యూజియం

బెంగళూరులోని కబ్బన్‌పార్కు క్యాంపస్‌లో ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరుతో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ అండ్ టెక్నికల్ మ్యూజియం ఆకట్టుకుంటోంది. దీనిని 1962లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. ఈ మ్యూజియంలో సైన్స్, శాస్త్ర సాంకేతిక రంగాలకు చెందిన వస్తు సామగ్రి ఇక్కడ చూడవచ్చు. ఆవిరి ఇంజన్ల నుంచి మొట్టమొదటి విమానం, జలాశయాల ఆనకట్ట నమూనాలు ఉన్నాయి. ఈ మ్యూజియంలో అంతరిక్షానికి సంబంధించి మార్స్ రోవర్ నమూనాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా విద్యార్థులకు ఈ మ్యూజియం సందర్శన ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.







విశ్వేశ్వరయ్య మూజియం, మైసూరు రైల్వే మ్యూజియంలో బొగ్గుతో నడిచే పురాతన రైలింజిన్



మైసూరులో జగన్‌మోహన్ ప్యాలెస్ ఆర్ట్ గ్యాలరీ, గ్యాలరీలో ఆకట్టుకుంటున్న వర్ణచిత్రం

గుబ్బి రైల్వే స్టేషన్ అభివృద్ధికి చర్యలు

తుమకూరు: గుబ్బి రైల్వే స్టేషన్‌ను రూ. 16.73 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర రైల్వే సహాయ శాఖ మంత్రి వి.సోమణ్ణ అన్నారు. శనివారం ఆయన గుబ్బి రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. రైల్వే నిర్మాణం పనులు పూర్తి చేసిన అనంతరం ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేసి చెన్నబసవేశ్వర స్వామి పేరు పెడతామన్నారు. అంతకుముందు గుబ్బి వద్ద నిర్మాణం అవుతున్న రింగ్ రోడ్డుపనులను పరిశీలించారు.

నగరసభ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

గౌరిబిదనూరు: చిక్కబళ్లాపురం నగరసభ నూతన కమిషనర్‌గా నియమితులైన మన్సూర్ ఆలీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన మంజునాథ్ ఈ పదవికి అర్హుడు కాదని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయన్ను పదవినుంచి తొలగించారు. ఆ స్థానంలో మంగళూరు కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మన్సూర్ అలీని కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. బాధ్యతల స్వీకరణ అనంతరం కమిషనర్ మాట్లాడుతూ చిక్కబళ్లాపురం నగర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సహకారంతో శ్రమిస్తానని తెలిపారు. అనంతరం నగరసభ ఉపాధ్యక్షుడు నాగరాజు కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

చెరువుకు వాయనం



వాయనం సమర్పిస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం : ఇటీవల కురిసిన వర్షాలకు మహదేవపుర నియోజకవర్గం బీదర అగ్రహార గ్రామంలో చెరువు నిండుకుండలా మారింది. దీంతో మాజీ మంత్రి అరవిందలింబావళి ఆదివారం చెరువుకు వాయనం సమర్పించారు.

జనజాగృతి జాతా



జాతాను ప్రారంభిస్తున్న ఎస్ఐ ప్రభాకర్

గౌరిబిదనూరు: ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మంచేనహళ్లిలో జనజాగృతి కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీని ఎస్ఐ ప్రభాకర్ ప్రారంభించారు. సంస్థ చేపట్టిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మహిళా స్వయం సంఘాలకు తక్కువ వడ్డీలకు రుణాలు ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందని సంస్థ జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ తెలిపారు. లాయర్ లక్ష్మీనారాయణ, సంస్థ అధికారి తిమ్మయ్య, రైతు నారాయణగౌడ, సాహితీవేత్త ప్రభానారాయణ గౌడ, ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగరాజనాయక్, ప్రియాంక, జీపీ అధ్యక్షుడు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై చర్చించా



అధికారులతో చర్చిస్తున్న డాక్టర్ సుధాకర్

గౌరిబిదనూరు: చిక్కబళ్లాపురం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో పెండింగ్‌లో ఉన్న 60కి పైగా ప్రాజెక్టులపై శనివారం బెంగళూరులో రైల్వే ఉన్నతాధికారులతో చర్చించినట్లు ఎంపీ డాక్టర్ సుధాకర్ తెలిపారు. చిక్కబళ్లాపురం పుట్టపర్తి, చిక్కబళ్లాపురం-గౌరిబిదనూరు, చిక్కబళ్లాపురం, దొడ్డబళ్లాపురం రైల్వే లైన్లపై చర్చించినట్లు తెలిపారు. కొత్త రైల్వే మార్గాలు, విద్యుదీకరణ, డబ్లింగ్, లెవెల్ క్రాసింగ్‌ల వద్ద పై వంతెనల నిర్మాణాలపై చర్చించినట్లు తెలిపారు. కొన్ని పనులు నిర్ణీత అవధిలో పూర్తి చేస్తామని, మరికొన్ని పనులపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించాల్సి ఉందని అధికారులు తెలిపారన్నారు.

హళ్లికార సముదాయ డిమాండ్లను పరిశీలిస్తాం

- సీఎం సిద్దరామయ్య హామీ

శివాజీనగర: హళ్లికార సముదాయాన్ని కేటగిరి 1లోకి చేర్చాలనే డిమాండ్‌పై నివేదికను తెప్పించుకున్న తర్వాత తీర్మానిస్తామని సీఎం సిద్దరామయ్య భరోసానిచ్చారు. రాష్ట్ర హళ్లికారుల సంఘం నగరంలోని పూర్ణిమా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన సముదాయ సమావేశాన్ని సీఎం ప్రారంభించి హళ్లికార విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ హళ్లికార సముదాయంపై తనకు సానుభూతి ఉందన్నారు. హళ్లికార సముదాయాన్ని కేటగిరి 3ఎలో చేర్చటం సరికాదని, కేటగిరి 1లో చేర్చాలని సముదాయ ప్రజలు డిమాండ్ చేస్తున్నారన్నారు. దీనిపై నివేదిక తెప్పించుకున్న తరువాత ఏం చేయాలనేది తీర్మానిస్తామని తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు కే.ఎం.నాగరాజు, మాజీ సీఎం వీరప్ప మొయిలీ, డీసీఎం డీ.కే.శివకుమార్, గ్యారంటీ పథకాల అమలు కమిటీ అధ్యక్షుడు హెచ్.ఎం.రేవణ్ణ, రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి టీ.బీ.జయచంద్ర, చీఫ్ విప్ అశోక్ పట్టణ్, మంత్రులు రామలింగారెడ్డి, డీ.సుధాకర్, మాజీ మంత్రి ఎస్.టీ.సోమశేఖర్ పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని యువతకు తెలియజేయాలి

బొమ్మనహళ్లి: నేటి యువత దేశానికి గొప్ప సంపద అని, వారికి సనాతన సాంప్రదాయాలపై అవగాహన కల్పించాలని శృంగేరి శారదా మఠం విధుశేఖర భారతి స్వామి అన్నారు. బెంగళూరు నగరంలోని ప్యాలెస్ గ్రౌండ్‌లో జరిగిన ఓం నమహ శివాయ స్తోత్రం మహా సమర్పణ కార్యక్రమంలో స్వామీజీ పాల్గొని భక్తులకు సందేశం ఇచ్చారు. భగవన్నామ స్మరణతో జీవితాన్ని సార్థకత చేసుకోవాలని, సనాతన ధర్మాన్ని రక్షించుకోవాలన్నారు. ఆది శంకరాచార్యుల నామస్మరణతో మన పనులన్నీ నిరాటంకంగా సాగుతాయన్నారు. రామాయణ, మహాభారత పఠనం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సుమారు లక్షా యాభైవేల మంది భక్తులు పాల్గొన్నారు.ఈ సమావేశం గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు చేసుకుంది. కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ప్రహ్లాద్ జోషి తదితరులు పాల్గొన్నారు.

పారా మిలటరీ బలగాల కవాతు

శివాజీనగర: ఉప ఎన్నికలు జరుగుతున్న చెన్నపట్టణ తాలూకాలో పోలీసులు, పారా మిలటరీ బలగాలు ఆదివారం పథ సంచలనం చేపట్టాయి. ఓటర్లలో భయాందోళనలు తొలగిస్తూ శాంతిభద్రతలను కాపాడే దిశలో చెన్నపట్టణ గ్రామీణ పోలీస్ స్టేషన్ వ్యాప్తిలో హొంగనూరు, తగచగెర, కోడంబళ్లి, మొళెదొడ్డి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ టీ.వీ.సురేశ్, చెన్నపట్టణ డీఎస్పీ కే.సీ.గిరి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అక్క పెడదారి.. చిన్నారితో బాలుడు పరార్

- ఇద్దరినీ రక్షించిన పోలీసులు

శివాజీనగర: అక్క పెడదారి పట్టడంతో విసిగి వేసారిన తమ్ముడు ఆమె మూడేళ్ల చిన్నారిని తీసుకొని రైలు ఎక్కాడు. దావణగెర పోలీసులు గుర్తించి వారిని సొంతదారులకు అప్పగించారు. ఈ ఘటన బెంగళూరులో జరిగింది. నగరానికి చెందిన 17 సంవత్సరాల వయసున్న తరుణ్ అనే బాలుడి అక్క వేరే వ్యక్తితో కలిసి ఉంటోంది. ఎంత చెప్పినా ఆమె నడత మార్చుకోలేదు. దీంతో విసుగు చెందిన సోదరుడు తరుణ్ తన అక్క బిడ్డను తీసుకొని నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి దావణగెరకు చేరుకున్నాడు. దావణగెర ఆర్‌పీఎఫ్ పోలీసులు బాలుడిని విచారణ చేయగా తన అక్క వ్యవహారాన్ని తెలియజేశాడు. దీంతో బెంగళూరు పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే సీఐ ఏకే రెడ్డి, సిబ్బంది శివానంద, అమిత్, బిందు మాధురి వెళ్లి బాలుడిని, మూడేళ్ల చిన్నారిని స్వాధీనం చేసుకొని బెంగళూరుకు వచ్చారు. చిన్నారిని తల్లిదరికి చేర్చారు.

ఆరోగ్యాలను కాపాడుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

విజయపుర(బెంగళూరు గ్రామీణ) : విజయపుర పట్టణంలోని చెన్నరాయ పట్టణ రోడ్డులో ఉన్న నందిని విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో ఆ పాఠశాల సీనియర్ విద్యార్థులు, లక్ష్య ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ మోహిత్‌గౌడ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇలాంటి శిబిరాలను రోగులు వినియోగించుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని నిర్వాహకులు సూచించారు.

హోసూరు వార్తలు..

ఫిర్యాదుదారుడికి ఈడీ నోటీసులు

మైసూరు : ముడాలో సీఎం కుటుంబానికి అక్రమంగా ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు ఫిర్యాదు చేసిన ఆర్‌టీఐ క్యాకర్త గంగరాజుకు ఈడీ అధికారులు నోటీసు జారీ చేశారు. అక్రమాలపై తగిన దాఖలాతో బెంగళూరులోని ఈడీ కార్యలయంలో సోమవారం విచారణకు హాజరు కావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారని నాగరాజు తెలిపారు.

క్యాషియర్‌పై దాడి

శివాజీనగర: మద్యం మత్తులో ఓ వ్యక్తి దుకాణ క్యాషియర్‌పై దాడి చేసిన ఘటన శనివారం బెంగళూరులోని విజయనగర వద్ద హంపినగరలో జరిగింది. మద్యం మత్తులో వచ్చిన ఆ వ్యక్తి తనకు అవసరమైన వాటన్నిటిని ఆర్డర్ చేశాడు. నగదు ఇవ్వాలని క్యాషియర్ కోరగా కన్నడ భాష తెలియదా అని ప్రశ్నించాడు. తనకు తెలియదని క్యాషియర్ చెప్పడంతో ఆ వ్యక్తి దాడికి పాల్పడి దూషించాడు.

హాసనాంబను దర్శించుకున్న కుమారస్వామి

సాక్షి బెంగళూరు: చెన్నపట్టణ విధానసభ ఉప ఎన్నికల్లో బరిలో నిలిచిన తన కుమారుడు నిఖిల్‌కు అంతా మంచి జరగాలని కోరుతూ కేంద్రమంత్రి కుమారస్వామి హాసనాంబ అమ్మవారిని ఆశ్రయించారు. ఆదివారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలసి హాసనాంబను దర్శనం చేసుకున్నారు. ఆలయ యాజమాన్యం, అర్చక బృందం కేంద్ర మంత్రికి సాదరంగా స్వాగతం పలికింది. కుమారస్వామి, ఆయన సతీమణి అనితా, కోడలు రేవతి, మనవడితో కలసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ హాసనాంబ మహత్యం తనకు చిన్నప్పటినుంచే తెలుసన్నారు. అప్పట్లో ఏకంగా నెలన్నర పాటు జాతర జరిగేదని గుర్తు చేశారు. మంచిగా వర్షాలు కురిసి, పంటలు పండి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. కొన్ని కారణాలతో గతంలో తన కుమారుడు ఎన్నికల్లో ఓడిపోయాడని, ఈసారి చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో గెలవాలని హాసనాంబను కోరుకున్నట్లు తెలిపారు. ఆ దేవీ ఆశీస్సులు తమ మీద ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు.

కేబీఎస్ఎస్ అధ్యక్షుడిగా రెవరెండ్ ఎం.ఎస్.రామయ్య



శివాజీనగర: కర్ణాటక బాప్టిస్ట్ సంఘాల సమాఖ్య (కేబీఎస్ఎస్) అధ్యక్షుడిగా పాస్టర్ రెవరెండ్ ఎం.ఎస్.రామయ్య ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రెవరెండ్ ఎఫ్రతా సారథి, సహ కార్యదర్శిగా రెవరెండ్ జీ.వై.విజయకుమార్, కోశాధికారిగా రెవరెండ్ వై.ప్రభుదాస్‌ను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా పాస్టర్ ఎం.బజాక్, రెవరెండ్ అబ్రహామ్ కోటికల, పాస్టర్ నాగరాజ్, రెవరెండ్ కే.ఎం.సతీశ్, బ్రదర్ యోహాన్ గుంటురి, పాస్టర్ వై.ఆర్.దినాకర్, పాస్టర్ రవి దాన్‌ను ఎంపిక చేశారు. నూతన కమిటీ ఈ నెల 31న బాధ్యతలు చేపట్టనుంది. మిస్సా తెలుగు చర్చిలో అధ్యక్షుడు, కమిటీ సభ్యులు బాధ్యతల స్వీకార కార్యక్రమాన్ని జరుపనున్నట్లు కేబీఎస్ఎస్ ప్రస్తుత ప్రధాన కార్యదర్శి శనివారం తెలిపారు. నూతన అధ్యక్షుడు ఎం.ఎస్.రామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 250 చర్చిలు కేబీఎస్ఎస్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. ఈ చర్చిల అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి అన్ని జిల్లాల్లో బాప్టిస్ట్ సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని రామయ్య తెలిపారు.

ఉత్సాహంగా మారథాన్



మారథాన్ జన సందోహం

హోసూరు: హోసూరులో ఆదివారం ఉదయం మారథాన్ పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 1600 మందికి పైగా పిల్లలు, విద్యార్థులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని రామనాయకుని చెరువు వద్ద నుంచి పరుగు ప్రారంభమై సబ్‌కలెక్టర్ కార్యాలయం, ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు మీదుగా వెళ్లి మళ్లీ రామనాయకునిచెరువు పార్కు వద్దకు చేరుకొంది. విజేతలకు మేయర్ ఎస్.ఏ. సత్య బహుమతులు అందజేశారు. ఉపమేయర్ ఆనందయ్య, కార్పొరేటర్ ఇంద్రాణి పాల్గొన్నారు.

టపాసుల షాపుల్లో రద్దీ



దుకాణాల్లో క్రిక్కిరిసిన జనం

హోసూరు: దీపావళి వస్తుండడంతో హోసూరు ప్రాంతంలో టపాకాయల విక్రయాలు జోరందుకున్నాయి. దీపావళి పండుగను సందర్భంగా ప్రతి సంవత్సరం తమిళనాడు- కర్ణాటక సరిహద్దు జూజువాడి చెక్‌పోస్ట్ నుంచి అత్తిపల్లి వరకు జాతీయ రహదారి ప్రక్కన టపాసుల దుకాణాలు ఏర్పాటవుతుంటాయి. రెండు రోజులుగా కర్ణాటక, ఆంధ్ర తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలుదారులు వస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చి పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. పండుగ రోజు రద్దీలో రావడం కష్టమని ముందే వచ్చినట్లు కొందరు తెలిపారు.

యువతి అదృశ్యం

క్రిష్ణగిరి: యువతి అదృశ్యంపై మిస్సింగ్ కేసు నమోదైంది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా బర్గూరు సమీపంలోని మహారాజగడ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల యువతి బర్గూరులోని ప్రైవేట్ పాఠశాలలో ప్లస్‌టూ చదువుతోంది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు అంతటా గాలించారు. స్థానికుల సమాచారం మేరకు అదే ప్రాంతానికి చెందిన సూర్య (24) కిడ్నాప్ చేసినట్లు తెలిసింది. తల్లిదండ్రు బర్గూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం విక్రేత అరెస్టు

కెలమంగలం: కెలమంగలం సమీపంలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. కెలమంగలం సమీపంలోని కుందుమారనపల్లి గ్రామంలో శనివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో అక్రమంగా కర్ణాటక మద్యం బాటిళ్లను ఇంట్లో దాచి విక్రయిస్తున్న రాజప్ప భార్య వసంతమ్మ (40) పట్టుబడింది. ఈమె వద్ద ఉన్న 55 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనపరుచుకొని అరెస్ట్ చేశారు.

సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం



ప్రమాదానికి గురైన ఇల్లు



సిలిండర్ పేలడంతో లేచిపోయిన పైకప్పు

కెలమంగలం: వంటగ్యాస్ సిలిండర్ పేలి పైకప్పు ధ్వంసమైన ఘటన డెంకణీకోట వద్ద చోటు చేసుకొంది. డెంకణీకోట సమీపంలోని చాపరాండపల్లి గ్రామంలో వీరక్షద్రాచారి (73), భార్య నారాయణమ్మ (60), కొడుకు క్రిష్ణన్, కోడలు జ్యోతిక, మనుమడు అనిల్ కుమార్ (22), మనువరాలు తేజస్విని (19)లు కలిసి ఒకే ఇంట్లో నివాసముంటున్నారు. శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఏర్పడిన ప్రమాదంలో పైకప్పు ధ్వంసమైంది. ఎవరికీ గాయాలు కాలేదు.

విద్యాబోధనపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మండ్య: మండ్య నగరంలోని సెయింట్ జోసెఫ్ బాలికల పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులకు పాఠాలు, ఆటలు నేర్పించడంలో మెళకువలను బోధించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మహాదేవ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ ప్రతిభను తమ విద్యార్థులకు నేర్పించడం ద్వారా వారిని ప్రతిభావంతులను చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.దేవరాజు, నాగరాజు, మంగళా శివన్న, శివకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఇసుకపై ఫిర్యాదు ఇస్తే రాజీ చేసుకోమంటున్నారు

- సెల్ఫీ వీడియోలో టీడీపీ సానుభూతిపరుడు వెల్లడి


సెల్ఫీ వీడియోలో కృష్ణార్జునరావు

కుక్కునూరు: తనపై దాడి చేసిన టీడీపీ నేతలపై ఫిర్యాదు చేస్తే.. రాజీపడాలంటూ పోలీసులు ఒత్తిడి తెస్తున్నారని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం కివ్వాక గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు చిలకాల కృష్ణార్జునరావు ఆరోపించాడు. తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయడం లేదంటూ ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో సెల్ఫీ వీడియో తీసుకొని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. బాధితుడు కథనం ప్రకారం.. ఈ నెల 17న అర్ధరాత్రి కొందరు టీడీపీ నాయకులు ఇసుకను ట్రాక్టర్లలో తరలించి అమ్ముకుంటుండగా కృష్ణార్జునరావు నిలదీశాడు. సామాన్యుడికి ఇసుక అవసరమైతే అనుమతి ఇవ్వని అధికారులు అర్ధరాత్రి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నా పట్టించుకోవడం లేదని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించాడు. దీనిని మనసులో పెట్టుకున్న టీడీపీ కుక్కునూరు మండల అధ్యక్షుడి సోదరుడు ఈ నెల 18న తాను కంచె విత్తన కర్రను తీసుకొస్తుండగా వాహనాన్ని అడ్డగించి తనపై దాడి చేసినట్టు కృష్ణార్జునరావు తెలిపాడు. తనపై దాడి చేసిందే కాక అక్రమ కేసులు బనాయించారని చెప్పాడు. తనపై జరిగిన దాడిపై 19న కుక్కునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎస్‌ఐ కేసు నమోదు చేయకుండా రాజీ చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారన్నారు. అందుకే పోలీస్ స్టేషన్ సాక్షిగా తనకు జరిగిన అన్యాయాన్ని సెల్ఫీ వీడియో తీసుకొని సోషల్ మీడియాలో పోస్ట్ చేశానన్నాడు. టీడీపీ సానుభూతిపరుడనైన తన పరిస్థితే ఇలా ఉంటే, సామాన్యుల పరిస్థితి ఏంటన్నది అర్థం చేసుకోవాలని పేర్కొన్నాడు. ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని కోరాడు.

కొల్లేరును నాశనం చేయాలని చూస్తున్నారా!?

- ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై టీడీపీ నేత ఫైర్



ఏలూరు రూరల్: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఉన్నారా లేదా అన్నది స్పష్టంచేయాలని ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం శ్రీపర్రు గ్రామ టీడీపీ నేత సైదు గోవర్ధన్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ఇందులో.. పవన్‌కళ్యాణ్ కొల్లేరును సర్వనాశనం చేయాలని చూస్తున్నారా అని ప్రశ్నిస్తూ.. దీనికి ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుడిగా తనకు ఇలా అడిగే హక్కుందన్నారు. ఇటీవల జనసేన నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి కొల్లేరు గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులను వారి పార్టీలోకి ఆహ్వానించారని చెబుతూ.. దొంగలను పార్టీలోకి ఆహ్వానిస్తుంటే ఎక్కడ దాక్కున్నారని అసభ్య పదజాలంతో దూషించారు. జనసేన నాయకుల కారణంగా కొల్లేరు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. వారి పనితీరును అడ్డుకుంటానని గోవర్ధన్ హెచ్చరించారు. ఇప్పుడు ఈ వీడియో కొల్లేరు గ్రామాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. జనసేన నేతల తీరుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టేందుకు కొందరు టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

దళిత మహిళపై టీడీపీ వర్గీయుల దాడి

శ్రీకాకుళం జిల్లాలో దారుణం



సాక్షి టాస్క్‌ఫోర్స్: టీడీపీ నేతల అరాచకాలకు అంతు ఉండటం లేదు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం కిష్టుపురంలో దళిత మహిళపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారు. బాధిత మహిళ కోటబొమ్మాళి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి.. శనివారం రాత్రి అప్పలరాజు మూత్ర విసర్జనకు వెళ్లగా, తమ కారుపై మూత్ర విసర్జన చేశావంటూ గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు ధర్మాన శ్రీను, ధర్మాన ప్రసాద్, తంగి షణ్ముఖ, తంగి చిన్నారావు ఆయనతో గొడవకు దిగారు. ఆదివారం ఉదయం కూడా 70 మందికిపైగా అప్పలరాజు ఇంటిపైకి వచ్చి ఆయన భార్య దమయంతిని గాయపరచడంతోపాటు ఊరి నుంచి వెలివేస్తామని బెదిరించారు. ప్రస్తుతం దమయంతి కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. స్థానిక పోలీసులు తమకు న్యాయం చేయకపోతే సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని ఆమె తెలిపారు.

ఉల్లి రైతుల్ని ఆదుకోండి

- ఏపీ రైతు సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: ఉల్లి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనామ్ మార్కెటింగ్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవడంతో వారం రోజులుగా కర్నూలు జిల్లాలో ఉల్లి దిగుబడులతో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ నిండిపోయిందన్నారు. ఈనామ్ సర్వర్ సమస్య పరిష్కరించకపోవడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు.

కోరలు చాస్తున్న క్యాన్సర్

కేవలం రొమ్ము క్యాన్సర్‌తోనే 2022లో 98,337 మంది మృతి

- నోటి క్యాన్సర్‌కు 79,979 మంది బలి
- 2045 నాటికి క్యాన్సర్ కేసులు, మరణాల్లో గణనీయమైన వృద్ధి
- క్యాన్సర్ కేసుల్లో 2025లో భారత్‌లో 12.8 శాతం వృద్ధి ఉంటుందని అంచనా



సాక్షి, అమరావతి: దేశంలో క్యాన్సర్ రక్కసి కోరలు చాస్తోంది. 2022 సంవత్సరంలో ఒక్క రొమ్ము క్యాన్సర్ కారణంగానే దేశంలో 98,337 మంది మహిళలు మృతి చెందినట్లు గ్లోబల్ క్యాన్సర్ అబ్జర్వేటరీ (గ్లోబోకాన్) నివేదిక వెల్లడించింది. అదే ఏడాది నోటి క్యాన్సర్ బారినపడి 79,979 మరణించినట్లు ఆ నివేదిక తెలిపింది. ఇది కచ్చితంగా ప్రమాద సూచికేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. 2045 నాటికి క్యాన్సర్ కేసులు, మరణాల్లో గణనీయమైన వృద్ధి నమోదయ్యే ప్రమాదం ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) కూడా హెచ్చరించింది. ముఖ్యంగా బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల్లో క్యాన్సర్ విజృంభణపై ఐసీఎంఆర్ అధ్యయనం చేసింది. ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న రొమ్ము క్యాన్సర్ కేసుల్లో 33.6 శాతం, మరణాల్లో 36.9 శాతం బ్రిక్స్ దేశాల్లోనే ఉన్నట్టు వెల్లడించింది. అన్ని రకాల క్యాన్సర్ మరణాల్లో 42 శాతం ఈ దేశాల్లోనే సంభవించినట్లు ఐసీఎంఆర్ తెలిపింది.

12.8 శాతం పెరుగుదల


2020తో పోలిస్తే 2025లో దేశంలో 12.8 శాతం మేర క్యాన్సర్ కేసుల్లో వృద్ధి నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మన దేశంలో పొగాకు వినియోగం వల్ల పురుషుల్లో నోటి క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అధికంగా ఉన్నాయి. వీటి కారణంగానే అత్యధిక మరణాలు నమోదవుతున్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇక భారత్ మినహా మిగిలిన బ్రిక్స్ దేశాల్లో మరణాలకు ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రధాన కారణమని వెల్లడైంది.

గ్లోబల్ క్యాన్సర్ అబ్జర్వేటరీ (గ్లోబోకాన్) నివేదిక ప్రకారం 2022 సంవత్సరంలో దేశంలో క్యాన్సర్ మరణాలు



2022 సంవత్సరంలో దేశంలో కొత్తగా క్యాన్సర్ కేసులు





మహిళలు 40 ఏళ్ల నుంచి జాగ్రత్తలు పాటించాలి



మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. 10 శాతం రొమ్ము క్యాన్సర్‌లు వంశపారంపర్యంగా వస్తాయి. 90 శాతం కేసులు సాధారణంగా వస్తుంటాయి. కుటుంబంలో ఒక తరం స్త్రీకి 50 ఏళ్లలో క్యాన్సర్ బయటపడితే తర్వాతి తరంలోని ఆమె కూతుళ్లు, వారి సంతానం 10 ఏళ్ల ముందే అంటే 40 ఏళ్లకే జాగ్రత్త పడాలి. బ్రాకాజీన్ టెస్ట్ చేయించుకుంటే వంశపారంపర్యంగా వ్యాధి సంక్రమణను గుర్తించవచ్చు. మిగిలిన మహిళలైతే 40 ఏళ్ల నుంచే నెలసరి సమయంలో కాకుండా మిగిలిన రోజుల్లో ఇంట్లోనే బ్రెస్ట్ ఎగ్జామినేషన్ చేసుకోవాలి. గడ్డలు ఉన్నట్లతై వెంటనే వైద్యులను సంప్రదించాలి. 45 ఏళ్ల వయస్సు నుంచి రొమ్ము క్యాన్సర్‌కు మామోగ్రామ్, గర్భాశయ క్యాన్సర్‌కు పాప్‌స్మియర్ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. గర్భాశయ క్యాన్సర్ నుంచి రక్షణ కోసం బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. గతంతో పోలిస్తే వైద్య రంగం అభివృద్ధి చెందింది. అధునాతన చికిత్సలు, మందులు అందుబాటులో ఉన్నాయి. అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో క్యాన్సర్ బయటపడినా చికిత్స చేయొచ్చు.

– డాక్టర్ జి.విజయకృష్ణ, క్లినికల్ అంకాలజిస్ట్, విజయవాడ

నాతో వస్తే.. పిల్లలు పుట్టిస్తా..

- బరితెగించి మహిళను వేధించిన టీడీపీ నేత
- గుళికలు తిని బాధితురాలు ఆత్మహత్యాయత్నం
- నెల్లూరు జిల్లాలో ఘటన

చేజర్ల: కూటమి ప్రభుత్వం వచ్చినప్పటినుంచి రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నేతల వేధింపులతో కొందరు మహిళలు ప్రాణాలు తీసుకోగా అనేకమంది ఆత్మహత్యాయత్నం చేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ నేతల అరాచకాలు, దాష్టీకాలు పరాకాష్టకు చేరాయి. ఇంటర్ విద్యార్థినిని ప్రేమపేరుతో లొంగదీసుకుని ఆమెతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు వైరల్ చేయడంతో బాధితురాలు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనను మరువకముందే అదే నియోజకవర్గంలోని చేజర్ల మండలంలో మరో దుర్మార్గం వెలుగు చూసింది. నాతో వస్తే పిల్లలు పుట్టిస్తా.. అంటూ టీడీపీ నేత వేధిస్తుండటంతో బాధిత గిరిజన మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. చేజర్ల మండలం యనమదల గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన ఒక గిరిజన మహిళకు ఏడాదిన్నర కిందట పెళ్లయింది. ఆమెకు ఇంకా పిల్లలు కలగలేదు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత మల్లినేని పెంచలయ్య కన్ను ఆమెపై పడింది. ఎలాగైనా ఆమెను లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. తరచు లైంగికంగా వేధిస్తున్నాడు. తరచూ ఆమె ఇంటికి వచ్చి 'నీకు పెళ్లై ఇంతకాలమైనా పిల్లలు పుట్టలేదు.. నాతో వస్తే పిల్లలు పుట్టిస్తా' అంటూ అసభ్యకరంగా మాట్లాడుతూ వేధించసాగాడు. 'నేను చెప్పినట్లు వినకపోతే నీ సంగతి తేలుస్తా' అంటూ బెదిరిస్తున్నాడు. ఈ విషయాన్ని బాధితురాలు స్థానిక పెద్దలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం గుళికలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను స్థానిక చేజర్ల పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స తరువాత మెరుగైన చికిత్స కోసం 108లో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతోంది. ఈ విషయంపై చేజర్ల పోలీసులను అడగగా.. తమకు సమాచారం లేదని చెప్పారు. సమాచారం వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీసీ రైతుపై టీడీపీ నేతల దౌర్జన్యం

- ప్రకాశం జిల్లా వెంకటేశ్వరపురంలో కంది పొలం దున్నేసిన దుర్మార్గులు
- ప్రశ్నించినందుకు గుంపులుగా ఇంటి పైకి వచ్చి దాడి
- దంపతులకు గాయాలు


చికిత్స పొందుతున్న నర్సయ్య, నారాయణమ్మ

కనిగిరి రూరల్: బీసీ సామాజికవర్గానికి చెందిన రైతు కుటుంబం కష్టపడి సాగు చేసుకున్న కంది పంటను టీడీపీ నేతలు దౌర్జన్యంగా రాత్రికి రాత్రే దున్నేశారు. ప్రశ్నించినందుకు ఆ రైతు ఇంటిపైకి గుంపులుగా వచ్చి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా కనిగిరి మండలం బొమ్మిరెడ్డిపల్లి పంచాయతీ, వెంకటేశ్వరపురంలో శనివారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన మేరకు.. వెంకటేశ్వరపురానికి చెందిన రజకులు, మరికొందరు 40 ఏళ్ల నుంచి తమ గ్రామంలోని ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్నారు. వారికి 2013–14లో ప్రభుత్వం డీకే పట్టాలిచ్చింది. వారిలో చీమలదిన్నె నారాయణమ్మ (భర్త నర్సయ్య) పేరుతో నాలుగెకరాలు మంజూరు చేసింది. వారు అప్పటి నుంచి రెండెకరాలు సాగుచేసుకుంటున్నారు. రెండెకరాలను ఖాళీగా ఉంచారు. బీసీ సామాజికవర్గానికి చెందిన నారాయణమ్మ, నర్సయ్య దంపతులు వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరులుగా ఉన్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీకి చెందిన పెత్తందార్లు... నారాయణమ్మకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని కాజేసేందుకు తరచూ ప్రయత్నిస్తూ వారితో గొడవకు దిగుతున్నారు. ఇప్పటికి మూడుసార్లు ఆ భూమి నారాయణమ్మదేనని తహసీల్దార్లు నివేదికలు ఇచ్చారు. అయినా శనివారం రాత్రి నారాయణమ్మ పొలంలోని కంది పైరును ట్రాక్టర్‌తో టీడీపీ నేతలు దున్నేశారు. తాము వెళ్లి అడ్డుకోవడంతో టీడీపీ నేతలు అందరూ ఒక్కసారిగా తమ ఇంటిపైకి వచ్చి కర్రలతో కొట్టి గాయపరిచినట్లు బాధితులు తెలిపారు. గాయపడిన నారాయణమ్మ, నర్సయ్య కనిగిరి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో టీడీపీ నాయకులు రేగల హరిబాబు, గురే రాంబాబు, సంగం శింగయ్య, తోటా బ్రహ్మయ్య, గుదే వెంకట రమణలతోపాటు మరికొందరు వచ్చి తమను కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

కూటమి నేతల మధ్య 'మట్టి' రగడ

- ధర్మవరం మండలం రేగాటిపల్లిలో అక్రమంగా మట్టి తవ్వుతున్న టీడీపీ నాయకులు
- తమ అనుమతి లేకుండా తవ్వకూడదని జనసేన నేత హుకుం
- టీడీపీ నాయకుల జేసీబీ ధ్వంసం చేసిన జనసేన నాయకులు


జనసేన నాయకులు ధ్వంసం చేసిన టీడీపీ నాయకుల జేసీబీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో కూటమి నాయకుల మధ్య 'మట్టి వార్' తారాస్థాయికి చేరింది. ధర్మవరం మండలం రేగాటిపల్లిలో ఆదివారం మట్టిని అక్రమంగా తవ్వుతున్న టీడీపీ నాయకులకు చెందిన జేసీబీని జనసేన నాయకులు ధ్వంసం చేశారు. ఇక్కడ మట్టిని తాము తప్ప మరెవ్వరూ తవ్వకూడదని జనసేన నాయకులు హెచ్చరించినట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ధర్మవరం మండలం రేగాటిపల్లిలో జనసేనకు చెందిన ముఖ్య నేత ఆధ్వర్యంలో జేసీబీ, హిటాచీ వాహనాలతో పెద్ద ఎత్తున అక్రమంగా మట్టి తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రోజూ రూ.లక్షల్లో ఆదాయం గడిస్తున్నారు. మట్టి కోసం ఈ పంచాయతీ దరిదాపుల్లోకి ఇతరులెవరినీ రానీయకుండా సదరు జనసేన నేత హుకుం జారీ చేస్తున్నారు. ఇదే పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ నాయకులు తాము కూడా ఎన్నికల్లో కూటమి గెలిచేందుకు కృషి చేశామని, తామూ మట్టి తవ్వుకుంటామని పలుమార్లు జనసేన కీలక నేతకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఆయన అంగీకరించలేదు. అయితే టీడీపీ నాయకులు ఆదివారం సొంతంగా జేసీబీతో రేగాటిపల్లి కొండ సమీపంలో మట్టి అక్రమ తవ్వకాలకు పూనుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన తమ పార్టీకి చెందిన పదిమందిని పంపి దౌర్జన్యం చేయించారు. మట్టి తవ్వుతున్న జేసీబీపై రాళ్ల వర్షం కురిపించి ధ్వంసం చేయించారు. ఇంత గొడవ జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించినట్లు సమాచారం. ఆ తర్వాత తీరిగ్గా రెండు వర్గాల మధ్య రాజీకి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. దీన్ని తీవ్ర అవమానంగా భావించిన టీడీపీ నాయకులు తమ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి అక్కడే ఈ మట్టి గొడవ తేల్చుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. కాగా, మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలో యథేచ్ఛగా మట్టి, ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా, ఈ విషయంలో కూటమి నాయకులు గొడవపడుతున్నా పోలీస్, మైనింగ్ అధికారులు కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హత్యకు యత్నం.. స్టేషన్‌కెళ్తే అక్కడా దాడి..

శ్రీకాకుళం జిల్లాలో బరితెగించిన టీడీపీ నేతలు


పోలీసు స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్మథరావు చొక్కా చించేసి కొడుతున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/కాశీబుగ్గ: కూటమి అధికారంలోకి వచ్చినప్పటినుంచి రెచ్చిపోయి ప్రవర్తిస్తున్న తెలుగుదేశం నేతలు మరింత బరితెగించారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో వైఎస్సార్‌సీపీ వర్గీయులపై హత్యాయత్నం చేయడమేగాక ఫిర్యాదు చేసేందుకు వెళ్లినవారిపై పోలీస్ స్టేషన్‌లోనే దాడిచేసి తీవ్రంగా కొట్టారు. వారిస్తున్న పోలీసుల్ని పక్కకు తోసేశారు. పోలీసు స్టేషన్‌లో కూడా బాధితులకు రక్షణ లేకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తన అనుచరులపై దాడిని ఖండిస్తూ పోలీస్ స్టేషన్‌కు బయలుదేరిన మాజీ మంత్రి అప్పలరాజును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డులోని నిత్య ప్రైవేటు ఆస్పత్రి ఎదురుగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అనుచరుడు, పాత్రికేయుడు అల్లు రమణ, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యుడు వేణుగోపాలరెడ్డి, మరో ఇద్దరు శనివారం రాత్రి మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో పలాస మండలం వీరభద్రాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొర్ల విష్ణుచౌదరి తన కారులో అక్కడికి వచ్చాడు. కారునుంచి దిగి వారిపై దాడిచేశాడు. వారిని కొట్టి, కారులోంచి కత్తి తెచ్చి హత్యాయత్నం చేశాడు. అక్కడి నుంచి తప్పించుకున్న రమణ తన స్నేహితుడు మొదలవలస మన్మథరావును తీసుకుని ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.

పోలీసు స్టేషన్‌లోనే..

విష్ణుచౌదరి తమను హత్యచేయడానికి ప్రయత్నించిన కత్తిని పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ వద్ద అప్పగించిన రమణ, మన్మథరావు ఫిర్యాదు రాయసాగారు. అదే సమయంలో విష్ణుచౌదరి, టీడీపీకి చెందిన బడ్డ నాగరాజు, జోగ మల్లి, బడ్డ నాగరాజు బంధువులు ఇద్దరు, మరికొందరు పోలీసు స్టేషన్‌లోకి వచ్చి రమణ, మన్మథరావుపై దాడిచేశారు. వారి దుస్తులను చించేసి, పిడిగుద్దులతో రెచ్చిపోయి భయానక వాతావరణం సృష్టించారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులను పక్కకు తోసేసి, హెచ్చరించారు. మీరిలా పోలీసు స్టేషన్‌లో కొడుతుంటే తమ ఉద్యోగాలు పోతాయని పోలీసులు ప్రాధేయపడినా టీడీపీ రౌడీలు వెనక్కి తగ్గలేదు. టీడీపీ నాయకుల దాడిని ఒకరు సెల్‌ఫోన్‌లో రికార్డు చేయడంతో బయట ప్రపంచానికి తెలిసింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో పలాస ప్రజలు భయభ్రాంతులవుతున్నారు. పోలీస్ స్టేషన్‌కు బయలుదేరిన మాజీ మంత్రి అప్పలరాజును పోలీసులు అడ్డుకోవడంతో ఆయన రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ వర్గీయులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది.

పోలీస్‌స్టేషన్‌లో దాడిపై కేసు నమోదు

కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన దాడికి సంబంధించి నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ దాడి మోహనరావు తెలిపారు. టీడీపీ నాయకులు విష్ణు చౌదరి, వంశీతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లు రమణ, మొదలవలస మన్మథ.. కానిస్టేబుల్ నారాయణ విధులకు ఆటంకం కలిగించినట్లు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఎస్పీగారూ.. ఏం జరుగుతోంది?



ఎస్పీగారూ.. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఏం జరుగుతోంది. పోలీసుల సమక్షంలో చోటుచేసుకున్న ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జరిగిన ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోండి.

– విజయసాయిరెడ్డి, ఎంపీ, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు



రాష్ట్రంలో.. ముఖ్యంగా పలాస నియోజకవర్గంలో ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లలో అభివృద్ధి పనులు జరిగిన పలాసలో ఇప్పుడు మళ్లీ అరాచకం రాజ్యమేలుతోంది. టీడీపీ నాయకుడు బాలికపై దాడి చేస్తే పోక్సో కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. తమపై హత్యాయత్నం జరిగిందని పోలీస్ స్టేషన్‌కు వెళ్లినవారిపై టీడీపీ వర్గీయులు దాడిచేసినా పోలీసులు ఏమీ చేయలేకపోయారన్నారు. ఇక్కడి గూండాలను స్థానిక ఎమ్మెల్యే కాపాడుతున్నారని మండిపడ్డారు.

– సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

సామాజిక సేవలో కార్పొరేట్స్


క్రీడలు, ఆర్ట్, లింగ వివక్ష నిర్మూలనకు భారీగా పెరిగిన సీఎస్ఆర్ నిధులు

- ఆరోగ్యం, పర్యావరణంకు తగ్గిన నిధులు
- 2022–23లో రూ. 29,987 కోట్లు ఖర్చు చేసిన కార్పొరేట్స్
- ఇందులో ఒక్క విద్యారంగానికే అత్యధికంగా రూ.10,085 కోట్లు కేటాయింపు
- ముందంజలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, రిలయన్స్

సాక్షి, అమరావతి: దేశ ప్రగతిలో తమవంతు పాత్రను పోషిస్తూ సమాజ శ్రేయస్సు కోసం వివిధ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న కార్పొరేట్ సంస్థలు తమ సేవానిరతిని చాటుకుంటున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో సామాజిక భద్రతను కల్పించేందుకు ఈ కంపెనీలు పెద్దపీట వేస్తున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో దేశీయ కార్పొరేట్ కంపెనీలు తమ సామాజిక నిధుల (సీఎస్ఆర్) వ్యయాలను పరిశీలిస్తే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా క్రీడలు, కళలు–సంప్రదాయాలు, మహిళా సాధికారిత, జంతువుల సంక్షేమం, లింగ వివక్ష రూపుమాపడం వంటి కార్యక్రమాలకు నిధులు క్రమేపీ పెరుగుతున్నట్లు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గణాంకాలు పరిశీలిస్తే స్పష్టమవుతోంది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఈ ఐదు రంగాలకు కేటాయింపులు ఏకంగా 48 శాతం పెరిగాయి. ఈ ఐదు రంగాలకు 2021–22లో రూ.174 కోట్లు వ్యయం చేస్తే ఇపుడు రూ.1,800 కోట్లు వ్యయం చేశాయి. ముఖ్యంగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి శిక్షణ ఇవ్వడానికి కార్పొరేట్ సంస్థలు పెద్ద ఎత్తున ముందుకొస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే సీఎస్ఆర్ నిధులు క్రీడలకు 80 శాతంగా రూ.292 కోట్ల నుంచి రూ.526 కోట్లకు పెరిగాయి. అదే విధంగా దేశ సంస్కృతిని కళలను ప్రోత్సహిస్తూ ఈ రంగానికి నిధులను రూ.248 కోట్ల నుంచి రూ.441 కోట్లకు పెంచడం గమనార్హం.

అత్యధికంగా విద్యారంగానికే..

మొత్తం సీఎస్ఆర్ నిధుల వినియోగం చూస్తే విద్యారంగానికే కార్పొరేట్ సంస్థలు భారీగా కేటాయింపులు చేశాయి. 2021–22లో విద్యారంగానికి రూ.6,557 కోట్లు కేటాయిస్తే ఈ సారి ఈ మొత్తం రూ.10,085 కోట్లకు చేరింది. విద్యారంగం తర్వాత అత్యధికంగా వైద్య రంగానికి కేటాయించినా గతేడాదితో పోలిస్తే నిధుల కేటాయింపు తగ్గింది. ఆరోగ్యరంగానికి సీఎస్ఆర్ నిధుల కేటాయింపు రూ.7,806 కోట్ల నుంచి రూ.,6830 కోట్లకు తగ్గింది. ఇదే బాటలో పర్యావరణం రంగానికి కూడా నిధుల కేటాయంపు రూ.2,432 కోట్ల నుంచి రూ.1,960 కోట్లకు తగ్గాయి. గ్రామీణాభివృద్ధికి, జీవన ప్రమాణాలు పెరుగుదల వంటి రంగాలకు కూడా కార్పొరేట్ సంస్థలు భారీగానే వ్యయం చేస్తున్నాయి.



సీఎస్ఆర్‌లో హెచ్‌డీఎఫ్‌సీదే పెద్ద పీట



కార్పొరేట్ సంస్థలు తమకు వచ్చిన లాభాల్లో కనీసం రెండు శాతం నిధులను సామాజిక బాధ్యతకు వినియోగించాల్సి ఉంది. 2022–23 సంవత్సరంలో దేశవ్యాప్తంగా కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ ఫండ్ ద్వారా రూ.29,987 కోట్లు వ్యయం చేసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో అత్యధికంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రూ.803 కోట్లు వ్యయం చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా టాటా కన్సల్టెన్సీ సంస్థ (టీసీఎస్) రూ. 774 కోట్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.743 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంకు రూ.477 కోట్లు, టాటాస్టీల్ రూ.454 కోట్లు వ్యయం చేశాయి.



మంచిమాట

చూసి రమ్మంటే కాల్చి వచ్చాడు అని ఒక సామెత ఉంది. అంటే చెప్పిన పని కాక ఎక్కువ చేసి వచ్చాడు అని అర్థం. సందర్భానుసారంగా దీనిని మెచ్చుకోటానికి, తప్పు పట్టటానికి కూడా ఉపయోగిస్తారు. దీనికి పూర్తి వ్యతిరేకం "పుల్లయ్య వేమవరం" - రాకపోకల శ్రమ తప్ప ఏ మాత్రం ప్రయోజనం లేదు అని. ఈ రెండు కూడా యజమాని చేత ఆదేశించ బడిన దాసుడు పనిని ఏవిధంగా నిర్వర్తించాడు? అనే దాన్ని తెలిపేవే.

కార్యసాధన

''రేపు పుల్లయ్యని వేమవరం పంపాలి'' అని యజమాని ఇంట్లో వాళ్ళతో చెపుతుంటే విని తెల్లవారేసరికి, వెళ్ళి తిరిగి వచ్చాడు. యజమాని పిలిచి వెళ్ళమని చెప్పే లోపే తాను చేసిన నిర్వాకం చెప్పాడు. వెళ్ళి ఏం చేశావు? అని అడిగితే సమాధానం లేదు. మళ్ళీ వెళ్ళవలసి వచ్చింది.

మరొక వ్యక్తి చెప్పిన పని మాత్రం పూర్తి చేసి రావటం జరిగింది. ఫలానా వారు ఉన్నారో లేదో చూసి రమ్మంటే ఉన్నదీ లేనిదీ కనుక్కొని వచ్చేయటం జరిగింది. లేరు అంటే మళ్ళీ ఎప్పుడు ఉంటారు? అని తెలుసుకుంటే మరొక మారు వెళ్ళవలసిన పని ఉండదు.

వేరొక వ్యక్తి యజమాని చెప్పిన పని చేసి, దానికి అనుబంధంగా ఉన్న మరిన్ని వివరాలు సేకరించి తిరిగి వచ్చి, యజమాని అడిగిన ప్రశ్నలకి తగిన సమాధానాలు ఇచ్చి మరొకమారు వెళ్ళవలసిన పని లేకుండా చేయటం జరిగింది.

అంటే చూసి రమ్మన్న వ్యక్తి లేకపోతే ఎక్కడికి వెళ్లారు? ఎప్పుడు వస్తారు? అప్పుడు మా యజమాని రావచ్చా? మొదలైన వివరాలు తెలుసుకుంటే ఉపయోగంగా ఉంటుంది.

అక్కడి వారితో మాట్లాడి తమ వివరాలన్నీ చెప్పి వచ్చే తెలివితక్కువ వారూ, అనవసర ప్రసంగం చేసి అతితెలివితో వ్యవహారాన్ని చెడగొట్టే వారూ కూడా ఉంటారు. ఇటువంటి వారితో ప్రమాదం.

ఈ నలుగురిలో యజమానికి ప్రీతిపాత్రమైన వారు ఎవరు? తెలుస్తూనే ఉంది కదా! ఇటువంటి కార్యసాధకుడికి నిలువెత్తు ఉదాహరణ హనుమ. ముందు తనంతట తాను సముద్ర లంఘనం చేస్తాను అనలేదు. జాంబవంతుడు ప్రేరేపిస్తే కాదని కూడా అనలేదు. నిజానికి వెళ్ళింది సీతని చూడటానికి.కాని, చూసి రాలేదు. మాట్లాడాడు. అప్పుడు, తరువాత ప్రతిపని చేస్తున్నప్పుడు తాను ఇది చేయవచ్చునా? లేదా? అని వితర్కించి, ఆ పని తాను చేయవలసిన పనిలో భాగం అని నిర్ధారించుకుని మరీ చేశాడు. తన ప్రభువు లక్ష్యం తెలుసు. తాను చేసే ప్రతి పని దానికి సహకరించేదిగా ఉన్నదీ, లేనిదీ విచారించి, అందులో భాగమేనని నిర్ధారించుకుని మరీ చేశాడు. ఆయా సందర్భాలలో దూత అయిన వాడు ఏమి చేయవచ్చు, ఏమి చేయ కూడదు అని వితర్కించుకుని, అది శాస్త్ర సమ్మతమే అనినిశ్చయించుకున్నాక మాత్రమే చేశాడు. దూతగా వెళ్ళేవారు శారీరిక బలంతో పాటు, మానసిక ధైర్యం, శాస్త్రపరిజ్ఞానం కూడా కలిగి ఉండాలి. ఒక దేశ దౌత్య, రాయబార కార్యాలయాల్లో ఉండేవారికి ఉండవలసిన లక్షణాలు ఇవే. అప్పుడు మాత్రమే దేశ ప్రతిష్ఠని పెంపొందించే విధంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు.

దూతగా వెళ్ళేవారు శారీరిక బలంతో పాటు, మానసిక ధైర్యం, శాస్త్రపరిజ్ఞానం కూడా కలిగి ఉండాలి. ఒక దేశ దౌత్య, రాయబార కార్యాల యాల్లో ఉండేవారికి ఉండవలసిన లక్షణాలు ఇవే. అప్పుడు మాత్రమే దేశ ప్రతిష్ఠని పెంపొందించే విధంగా నిర్ణయాలు తీసుకో గలుగుతారు.

''చూడబడినది నా చేత సీత'' అని చెప్పగానే ''ఆమె ఎట్లా ఉన్నది? ఏమన్నది?'' అని అడిగాడు రాముడు. నేను దూరం నుంచి చూశానే కాని, దగ్గరగా చూడలేదు, మాట్లాడలేదు అని చెపితే ఏం బాగుంటుంది? లంకా నగరం గురించి, రావణుడి సైన్యం గురించి అడిగినప్పుడు అవి తెలుసుకోమని చెప్ప లేదు కనుక నేను పట్టించుకో లేదు అంటే బాధ్యతాయుతంగా ప్రవర్తించినట్టు కాదు కదా అది!

అందుకే సమర్థులు చూసి రమ్మంటే కాల్చి వస్తారు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

గృహస్థాశ్రమంలో నిత్యం జరిగే పంచ మహా యజ్ఞాలలో ఐదవది – '....నృయజ్ఞోతిథిపూజనమ్'. అతిథిని పూజించే వాడు ఒక్క గృహస్థు మాత్రమే. నేను ఆహ్వానిస్తే నా ఇంటికి వచ్చినవాడు అతిథి. నేను ఆహ్వానించకుండా వచ్చినవాడు– అభ్యాగతుడు. అతిథి పూజనమ్...పూజించడం అంటే గౌరవించడం. ఇంటికి వచ్చినవారిపట్ల మర్యాదగా మెలుగుతూ గౌరవించి పంపడం నేర్చుకో...



తన ఇంటికి వచ్చినవాడు గొప్పవాడా, నిరక్షరాస్యుడా, సామాన్యుడా అన్న

రాలేదు నీదగ్గరికి. ఆయన హాయిగా అవన్నీ అనుభవిస్తున్న స్తోమత ఉన్నవాడే. కానీ ఆయన ఏదో కార్యం మీద వచ్చాడు. భగవంతుడు శంఖ చక్ర గదా పద్మాలు పట్టుకుని రాడు నీ ఇంటికి. అతిథి రూపంలో వస్తాడు. ఆ సమయంలో నీవిచ్చిన నీళ్ళు తాగవచ్చు, పట్టెడన్నం తినవచ్చు, బట్టలు కూడా పుచ్చుకోవచ్చు. కానీ ఆయన పుచ్చుకున్న వాడిగా ఉంటాడు. అలా ఉండి నీ ఉద్ధరణకు కారణమవుతాడు. అందునా నీవు పిలవకుండానే వచ్చాడు. అభ్యాగతీ స్వయం విష్ణుః– విష్ణుమూర్తే నీ

ఊరకరారు మహాత్ములు...

వివక్ష గృహస్థుకు ఉండదు. భోజనం వేళకు వచ్చాడు. భోజనం పెట్టు. లేదా ఏ పండో కాయో లేదా కాసిని మంచినీళ్లయినా ఇవ్వు.. అన్ని వేళలా అన్ని పెట్టాలనేం లేదు. వచ్చిన వారిని ప్రేమగా పలకరించు. నీకూ పరిమితులు ఉండవచ్చు. వాటికి లోబడే ఎంత సమయాన్ని కేటాయించగలవో అంతే కేటాయించు. కానీ ఒట్టి చేతులతో పంపకు. పండో ఫలమో ఇవ్వు. లేదా కనీసం గుక్కెడు చల్లటి నీళ్ళయినా ఇవ్వు. నీకు సమయం లేకపోతే ఆ బాధ్యతలను కుటుంబ సభ్యులకు అప్పగించు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అతిథి సేవతో గృహస్థు పాపాలు దహించుకు పోతున్నాయి. కారణం – ఆయన ఏది పెడుతున్నాడో దానిని 'నేను పెడుతున్నాను' అన్న భావనతో పెట్టడు. వచ్చిన అతిథి నీ దగ్గరకు వచ్చి గుక్కెడు నీళ్ళు తాగాడు, ఫలహారం చేసాడు, భోజనం చేసాడు...అంటే అవి అతనికి లేక దొరకక

ఇంటికి వచ్చాడని గుర్తించు. మహితాత్ములైనవారు, భాగవతోత్తములు, భగవద్భక్తి కలవారు నీ ఇంటికి వస్తే.. గృహదేవతలు కూడా సంతోషిస్తారు.


అంటే దేవతలను ప్రసన్నం చేసుకోవడానికి సులువైన మార్గం అతిథి పూజనమే. అతిథికి నీవు పెట్టలేదు. భగవంతుడే అతిథి రూపంలోవచ్చి నీదగ్గర తీసుకున్నాడు. అతిథిని మీరు విష్ణు స్వరూపంగా భావించి పెట్టినప్పుడు మీ అభ్యున్నతికి కారణమవుతుంది. మహాత్ములయిన వారు మనింటికి వస్తూండడమే దానికి సంకేతం. శ్రీ కృష్ణుడి క్షేమ సమాచారం తెలుసుకురమ్మని వసుదేవుడు పంపిన పురోహితుడితో నందుడు ''ఊరకరారు మహాత్ములు/ వారథముల యిండ్ల కడకు వచ్చుట లెల్లం/గారణము మంగళములకు/ నీ రాక శుభంబు మాకు, నిజము మహాత్మా !'' అంటాడు. అతిథి ఇంట అడుగు పెట్టడం అంత గొప్పగా భావిస్తుంది మన సమాజం.

రామకార్యంమీద పోతున్న హనుమకు మైనాకుడు ఆతిథ్యం స్వీకరించమని అర్థిస్తాడు. ఇప్పుడు వీలుపడదంటే...కనీసం ఒక్క పండయినా తిని కాసేపు విశ్రాంతయినా తీసుకువెళ్ళమంటాడు. ఇంటి ముందు నిలిచిన బ్రహ్మచారి 'భవతీ భిక్షాందేహి' అంటే... ఇంట్లో ఏవీ లేవంటూ ఇల్లంతా వెతికి ఒక ఎండిపోయిన ఉసిరికాయ తెచ్చి శంకరుడి భిక్షాపాత్రలో వేస్తుంది ఒక పేదరాలు. ఆ మాత్రం అతిథి పూజకే ఆమె ఇంట బంగారు ఉసిరికకాయలు వర్షంలా కురిసాయి.

అమృత బిందువులు

- జీవితం అంటే ఉరుకులు పరుగులతో నడిపించే చక్రాల బండి కాదు... ఉల్లాస ఉత్సాహాలతో ఆడుతూ పాడుతూ గడిపే రంగుల రాట్నం వంటిది.
- ఆవేశం ఆరోగ్యానికి మంచిది కాదు. ఇది ఆత్మీయుల మధ్య సంబంధాలను తుంచి వేస్తుంది.
- నోటినుంచి వచ్చే అపశబ్దాల ప్రవాహం కోలుకోలేని, వెనక్కు తీసుకోలేని కష్ట నష్టాలను తెచ్చి పెడుతుంది.
- చెప్పడు మాటలను విని ఆవేశపడే కంటే చేతనను చైతన్యపరిచే శుద్ధ ఆలోచనలు చేయడం చాలా ఉత్తమం.
- చిన్న వారికి ప్రేమను, పెద్దవారికి గౌరవాన్నీ ఇవ్వాలి. ఏది ఇస్తామో, అదే పొందుతాము అనే ఆధ్యాత్మిక సూత్రాన్ని ఎప్పుడూ మరచిపోకూడదు.

సిద్ధ గురువులు ప్రసాదించిన వరం యోగం



మన దేహం ఆలయం లాంటిది. అందుకే తమ దేహాన్నే ఒక పవిత్ర క్షేత్రంగా చేసుకుని సాధన చేసుకున్నారు చేసుకున్నారు యోగులు. శరీరమనే ఈ క్షేత్రంలో సుషుమ్న అనే ఏకైక దైవనాడి ఉంటుంది. శరీరంలో మొత్తం 72,000 నాడులు ఉంటే అందులో సుషుమ్న నాడి ఒక్కటే దైవనాడి. నాడులు అంటే శరీరమంతటికీ శక్తిని ప్రసారం చేసే వాహికలు. యోగ శాస్త్రం మూడు శరీరాలను గురించి వివరిస్తుంది. భౌతిక దేహం, శక్తి దేహం, కారణ దేహం. ఈ మూడూ కలిసి పని చేస్తూ ఉంటాయి. భౌతిక శరీరానికి ఆహార అసమతౌల్యం కారణంగా అనేక రుగ్మతలు వచ్చినట్లు, శక్తి శరీరంలో లోపాల వల్ల కూడా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ప్రధానమైన అవయవాల పనితీరుకు, శక్తి శరీరానికి ప్రగాఢమైన సంబంధం ఉంటుంది.

ఈ సకల సృష్టి విశ్వశక్తి పైనే ఆధారపడి ఉంటుంది. జీవులన్నీ నిద్రావస్థలో విశ్వం నుంచి శక్తిని గ్రహిస్తాయి. అయితే మానవులకు నిద్రలో స్వీకరించే శక్తి మాత్రమే సరిపోదు. ఇప్పటి వేగయుగంలో అదనపు శక్తి అవసరం. ఆ శక్తి కేవలం ధ్యాన సాధన ద్వారా మాత్రమే లభిస్తుంది.

వెన్నుపాము అడ్డంగా ఉన్న జీవులను తిర్యక్ జీవులని, వెన్నెముక నిలువుగా ఉన్న జీవులను మానవులనీ తెలియజేస్తుంది యోగ శాస్త్రం. జీవులన్నింటిలోకీ మానవుడు అగ్రగణ్యుడు. వజ్ర సమానమైన వెన్నెముక వల్లే మానవుడికి పరమోన్నతమైన స్థితికి చేరుకోగలిగే అద్భుతమైన శక్తిని, అవకాశాన్నీ ఈ సృష్టి ప్రసాదిస్తుంది. నిద్రాణంగా ఉన్న సుషుమ్న నాడి ఉత్తేజితమై, ఈ దివ్య నాడిలో కుండలిని జాగరణ జరిగి, మూలాధార చక్రం నుండి సహస్రారం చేరినప్పుడు మనిషికి దివ్యానంద స్థితి అనుభవంలోకి వస్తుంది.

ఈ విధంగా జరిగినప్పుడు మానవ శరీరమే ఒక మహాశక్తి క్షేత్రంగా మారుతుంది. భగవత్ తత్త్వాన్ని బాహ్యంగా గాక అనుభవ పూర్తిగా అర్థం చేసుకునే ఏకైక మార్గమే ధ్యానసాధన. సుషుమ్నా క్రియా యోగసాధన ద్వారా తక్కువ సమయంలోనే అపారమైన శక్తిని స్వీకరించవచ్చు.



సుషుమ్నా క్రియ యోగధ్యానం నాలుగు ప్రక్రియల కలయిక. ఈ సాధనకు ఎటువంటి కఠిన నియమాలూ లేవు. ఈ ధ్యానం మానవులందరి కోసం సిద్ధ గురువులు ప్రసాదించిన గొప్ప వరం.

– ఆత్మానందమయి

సినిమా

డబ్బింగ్ స్టార్ట్



● వెంకటేశ్

హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా ఫిల్మ్‌లో మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో మాజీ పోలీసాఫీసర్ పాత్రలో వెంకటేశ్ కనిపిస్తారు. ఈ పోలీసాఫీసర్ భార్యగా ఐశ్వర్యా రాజేష్, ఆయన మాజీ ప్రేయసిగా మీనాక్షీ చౌదరి కనిపిస్తారు. కాగా ఈ సినిమా డబ్బింగ్ వర్క్స్ మొదలయ్యాయి. ''ఇప్పటివరకూ జరిపిన షూటింగ్‌తో తొంభై శాతం సినిమా పూర్తయింది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే డబ్బింగ్ ఆరంభించాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

దుల్కర్ తన రోడ్డు తాను వేసుకున్నాడు – దర్శకుడు త్రివిక్రమ్



● వెంకీ అట్లూరి, దుల్కర్ సల్మాన్, త్రివిక్రమ్, విజయ్ దేవరకొండ, సూర్యదేవర నాగవంశీ

''మమ్ముట్టీగారు మర్రి చెట్టు. మర్రి చెట్టు నీడలో మొక్కలు బతకవు అని చెబుతుంటారు. కానీ దాన్నుంచి బయటకు వచ్చి, తన రోడ్డు తాను వేసుకున్నాడు దుల్కర్. 'మహానటి, సీతా రామం' సినిమాలకు భిన్నమైన పాత్రను దుల్కర్ ఈ సినిమాలో చేశాడు. వన్నాఫ్ మై ఫేవరెట్ యాక్టర్స్ విజయ్ దేవరకొండ. తక్కువ వయసులోనే ఎంతో ప్రేమను... అంతే ద్వేషాన్ని చూశాడు విజయ్.. చాలా గట్టివాడు'' అని అన్నారు దర్శకుడు త్రివిక్రమ్. దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 'లక్కీ భాస్కర్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు దర్శకుడు త్రివిక్రమ్, హీరో విజయ్ దేవరకొండ అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో త్రివిక్రమ్ మాట్లాడుతూ– ''లక్కీభాస్కర్' సినిమా చూశాను. ఈ సినిమాలోని ప్రతి పాత్ర కథను ఇంపాక్ట్ చేస్తుంది. ఓ మధ్య తరగతివాడు ఓ సాహసం చేస్తే నెగ్గాలని మనకు కచ్చితంగా అనిపిస్తుంటుంది. నేనూ అక్కడ్నుంచే వచ్చాను. ఆ అడ్వెంచర్‌ను వెంకీ సక్సెస్‌ఫుల్‌గా తీశాడు. ఈ సినిమా చూసిన తర్వాత తడిసిన కళ్లతో, నవ్వుతున్న పెదాలతో ఆడియన్స్ థియేటర్స్ నుంచి బయటకు వస్తారు'' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''పెళ్లిచూపులు' సినిమా తర్వాత నాకు ఫస్ట్ చెక్ సితార ఎంటర్‌టైన్మెంట్స్ నుంచి వచ్చింది. త్రివిక్రమ్‌గారు పిలిపించి, మాట్లాడి చెక్ ఇప్పించారు. సితారలో ఇప్పుడు 'వీడీ 12' సినిమా చేస్తున్నాను. 'లక్కీ భాస్కర్'ను వెంకీ బాగా తీశాడనిపించింది. 'మహానటి, కల్కి 2898 ఏడీ' సినిమాల్లో నేను, దుల్కర్ నటించాం. కానీ స్క్రీన్ షేర్ చేసుకోలేదు. 'లక్కీ భాస్కర్' బ్లాక్‌బస్టర్ కావాలని కోరుకుంటున్నాను'' అని తెలిపారు. దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ– ''నాకు నచ్చిన చిత్రాల్లో 'అల.. వైకుంఠపురములో..' ఒకటి. త్రివిక్రమ్ గారి రైటింగ్‌లో మంచి డెప్త్ ఉంటుంది. విజయ్ నా లక్కీ చార్మ్. తెలుగులో నేను చేసిన తొలి సినిమా 'మహానటి' ఈవెంట్‌లో ఇతను దుల్కర్ అంటూ ఆడియన్స్‌కు నన్ను పరిచయం చేశాడు. ఆ తర్వాత 'సీతారామం' ఈవెంట్‌లో ఉన్నాడు. ఇప్పుడు 'లక్కీ భాస్కర్' ఈవెంట్‌లో ఉన్నాడు. ఈ సినిమా కూడా విజయం సాధిస్తుందని అనుకుంటున్నాను. వెంకీ స్క్రిప్ట్‌లోని పాత్రలు మెచ్యూర్డ్‌గా ఉంటాయి. ఇలాంటి సినిమాను నిర్మించాలంటే చాలా ధైర్యం కావాలి. నాగవంశీ ధైర్యంతో ఈ సినిమా తీశాడు'' అని పేర్కొన్నారు దుల్కర్ సల్మాన్. ''బ్యాంకింగ్ వరల్డ్‌పై సినిమా తీయాలని 'లక్కీ భాస్కర్' తీశాను. డబ్బు అంటే ఇష్టం, అవసరం అనుకునే ప్రతి ఒక్కరికీ ఈ సినిమా నచ్చుతుంది'' అని తెలిపారు వెంకీ అట్లూరి. పాటల రచయిత రామజోగయ్యశాస్త్రి, నిర్మాత చినబాబు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో...



● ప్రభాస్

హీరో ప్రభాస్ రైలు ప్రయాణం చేస్తున్నారు. ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోందని తెలిసింది. హైదరాబాద్‌లో వేసిన ఓ రైల్వేస్టేషన్ సెట్‌లో ప్రభాస్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. ఇలా ఈ సినిమా కోసం రైలు ప్రయాణం చేస్తున్నారు ప్రభాస్. మిథున్ చక్రవర్తి, జయప్రద ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ పీరియాడికల్ అండ్ హిస్టారికల్ ఫిల్మ్‌కు సంగీతం: విశాల్ చంద్రశేఖర్.

హనుమంతుని నేపథ్యంలో రణమండల



● టీజీ విశ్వప్రసాద్

''నా స్వస్థలం ఆదోనిలో షూటింగ్ చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. 'రణమండల' సినిమాతో అది నెరవేరుతోంది. ఈ చిత్రం షూటింగ్‌ని పూర్తిగా ఆదోని పరిసర ప్రాంతాల్లోనే జరుపుతాం'' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించనున్న 46వ చిత్రానికి 'రణమండల' టైటిల్ ఖరారు చేసి, ఆదోని రణమండల దేవాలయంలో ప్రకటించి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. హనుమంతుని నేపథ్యంలో భారీ యాక్షన్ డివోషనల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ''రణమండల ఆంజనేయుని దేవాలయ క్షేత్ర నామాన్నే మా చిత్రానికి టైటిల్‌గా పెట్టడం హ్యాపీగా ఉంది. ఈ చిత్రంలో వీఎఫ్ఎక్స్, యాక్షన్, ఎమోషనల్ సీన్స్ కీలకంగా ఉంటాయి. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియజేస్తాం. ఇక మా సంస్థ నుంచి రానున్న 47వ చిత్రం షూటింగ్‌ని కూడా ఆదోనిలోనే జరుపుతాం'' అని టీజీ విశ్వప్రసాద్ అన్నారు.

దేశభక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ ఫౌజా నచ్చుతుంది – దర్శకుడు ప్రమోద్ కుమార్



● కాంతి డి. సురేష్, డి. సురేష్, అజిత్ దాల్మియా, కార్తీక్ దమ్ము, ప్రమోద్ కుమార్

''డబ్బులిచ్చి బ్రాండెడ్ బట్టలు కొన్నంత సులువుగా ఆర్మీ యూనిఫామ్‌ని కొనలేం. కష్టంతో, ఇష్టంతో సాధించుకోవాలి. దేశభక్తి ఉంటేనే అది సాధించగలం. దేశం అంటే ప్రేమ, భక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ మా 'ఫౌజా' నచ్చుతుంది. త్వరలో ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తాం'' అని ప్రమోద్ కుమార్ పున్వానా అన్నారు. కార్తీక్ దమ్ము, పవన్ మల్హోత్రా, ఐశ్వర్యా సింగ్ ముఖ్య తారలుగా ప్రమోద్ కుమార్ పున్వానా దర్శకత్వంలో అజిత్ దాల్మియా నిర్మించిన హిందీ చిత్రం 'ఫౌజా'. ఇండియన్ ఆర్మీ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం మూడు జాతీయ అవార్డులు సాధించింది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళంలో విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా 'ఫౌజా'ని హైదరాబాద్‌లో ప్రదర్శించారు. ఈ చిత్రాన్ని వీక్షించిన వారిలో హీరో విజయ్ ధరన్ దాట్ల, ఏపీ అడిషనల్ చీఫ్ సెక్రటరీ దమ్ము మురళీమోహన్, హర్యానా ప్రిన్సిపల్ సెక్రటరీ డా. డి. సురేష్, కాంతి డి. సురేష్ తదితరులు ఉన్నారు. ''ఫౌజీ' లాంటి చిత్రానికి భాషతో సంబంధం ఉండదు'' అని ఈ సందర్భంగా హీరో కార్తీక్ చెప్పారు. ''హిందీలో మా చిత్రానికి మంచి ఆదరణ లభించింది. తెలుగు ప్రేక్షకులూ ఆదరించాలని కోరుకుంటున్నాను'' అని అజిత్ దాల్మియా అన్నారు.

నిర్మాత జాగర్లమూడి రాధాకృష్ణ మూర్తి కన్నుమూత



నిర్మాత–నటుడు జాగర్లమూడి రాధాకృష్ణ మూర్తి (85) బాపట్ల జిల్లా కారంచేడులోని స్వగృహంలో కన్ను మూశారు. చిన్నతనం నుంచి నాటకాలపై మక్కువతో రంగస్థలంపై నటించారు. ఆ తర్వాత డా. రామానాయుడు నిర్మించిన పలు చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించారు. అనంతరం నిర్మాతగా మారి 'ఒక దీపం వెలిగింది, వియ్యాల వారి కయ్యాలు, ప్రతిబింబాలు, శ్రీవినాయక విజయం, కోడళ్లు వస్తున్నారు జాగ్రత్త' తదితర సినిమాలు నిర్మించారు. ఇక అక్కినేని నాగేశ్వరరావు హీరోగా రాధాకృష్ణమూర్తి నిర్మించిన 'ప్రతిబింబాలు' (1982)కి అడుగడుగునా అడ్డంకులు ఎదురయ్యాయి. దాంతో అప్పట్లో విడుదలకు నోచుకోలేదు. చివరికి ఆ చిత్రాన్ని 2022లో విడుదల చేశారు. కాగా రాధాకృష్ణ మూర్తి భార్య గతంలోనే మృతి చెందారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. రాధాకృష్ణమూర్తి మృతి పట్ల తెలుగు నిర్మాతల మండలి సంతాపం వ్యక్తం చేసింది.

జాతర



● సతీష్ బాబు, దియా రాజ్

సతీష్ బాబు రాటకొండ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'జాతర'. ఈ సినిమాలో దియా రాజ్ హీరోయిన్. గల్లా మంజునాథ్ సమర్పణలో రాధాకృష్ణా రెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నవంబరు 8న విడుదలకానుంది. సతీష్ బాబు రాటకొండ మాట్లాడుతూ– ''చిత్తూరు జిల్లాలోని ఓ జాతర నేపథ్యంలో ఈ సినిమా రూపొందింది. ఈ చిత్రంలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్, ఇంటెన్స్ డ్రామా ఉంటుంది. ఫస్ట్ లుక్ అందర్నీ ఆకట్టుకుంది. సినిమా కూడా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

థ్రిల్ అవుతారు



● నయన్ సారిక, తన్వీ రామ్

కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన పీరియాడికల్ థ్రిల్లర్ మూవీ 'క'. ఈ చిత్రంలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సుజీత్–సందీప్ ద్వయం ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీని తెరకెక్కించారు. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. తెలుగులో వంశీ నందిపాటి రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ సందర్భంగా నయన్ సారిక మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో నేను పల్లెటూరి అమ్మాయి సత్యభామగా నటించాను. వాసుదేవ్‌గా కిరణ్ అబ్బవరం కనిపిస్తారు. కథలో థ్రిల్‌కి గురి చేసే మలుపులు ఉంటాయి. క్లైమాక్స్ ఆడియన్స్‌కు గుర్తుండిపోతుంది. నటీమణులు సావిత్రి, శ్రీదేవిగార్లు చేసిన పాత్రలను రిఫరెన్స్‌లుగా తీసుకుని నేను సత్యభామ పాత్ర చేశాను'' అన్నారు. తన్వీ రామ్ మాట్లాడుతూ – ''ఈ చిత్రంలో స్కూల్ టీచర్ రాధ పాత్రలో నటించాను. అభినయ వాసుదేవ్, సత్యభామ ఒక టైమ్ ఫ్రేమ్‌లో కనిపిస్తే, మరో పీరియడ్ టైమ్‌లో నా రోల్ ఉంటుంది. వాసుదేవ్, సత్యభామల పాత్రలకు నా రోల్ ఎలా కనెక్ట్ అవుతుందనేది థియేటర్స్‌లో చూడండి. ఈ సినిమా చూసి ఆడియన్స్ థ్రిల్ అవుతారని నమ్ముతున్నాం'' అని తెలిపారు.



పోరాడి ఓడిన సుమిత్ నగాల్

పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు నిరాశ ఎదురైంది. ప్రపంచ 71వ ర్యాంకర్ క్రిస్టోఫర్ ఒకానెల్ (ఆస్ట్రేలియా)తో జరిగిన క్వాలిఫయింగ్ సింగిల్స్ తొలి రౌండ్‌లో 81వ ర్యాంకర్ సుమిత్ 4-6, 6-7 (3/7)తో పోరాడి ఓడిపోయాడు. గంటా 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ నాలుగు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. సుమిత్‌కు 6,380 యూరోల (రూ. 5 లక్షల 79 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

చిరాగ్ చికారా 'పసిడి' పట్టు



ప్రపంచ అండర్-23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో చివరిరోజు భారత్‌కు ఏకైక స్వర్ణ పతకం దక్కింది. అల్బేనియాలో ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో భారత రెజ్లర్ చిరాగ్ చికారా పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. అబ్దిమాలిక్ కరాచోవ్ (కిర్గిస్తాన్)తో జరిగిన ఫైనల్లో చిరాగ్ 4-3 పాయింట్ల తేడాతో విజయం సాధించాడు. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అమన్ సెహ్రావత్ (2022లో) తర్వాత ప్రపంచ అండర్-23 చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం నెగ్గిన రెండో భారతీయ రెజ్లర్‌గా చిరాగ్ గుర్తింపు పొందాడు.

సోఫీ డివైన్ 'షో'

- ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన న్యూజిలాండ్ మహిళల జట్టు కెప్టెన్
- 79 పరుగులు చేయడంతోపాటు 3 వికెట్లు సొంతం
- రెండో వన్డేలో భారీ విజయంతో సిరీస్‌లో నిలిచిన కివీస్
- 76 పరుగుల తేడాతో ఓడిపోయిన భారత జట్టు



హర్మన్‌ప్రీత్



సోఫీ డివైన్

అహ్మదాబాద్: వరుస విజయాలతో సిరీస్ నెగ్గాలనుకున్న భారత మహిళల జట్టును న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డివైన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన దెబ్బ కొట్టింది. మొదట బ్యాటింగ్‌లో (86 బంతుల్లో 79; 7 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోర్ చేసిన ఆమె తర్వాత బౌలింగ్ (3/27)లో కీలకమైన వికెట్లను పడగొట్టింది. దీంతో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం తేలిపోయింది. ఆదివారం జరిగిన రెండో వన్డేలో కివీస్ జట్టు 76 పరుగుల తేడాతో భారత్‌పై జయభేరి మోగించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసి రేసులో నిలిచింది. టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసింది. కెప్టెన్ సోఫీ డివైన్, సుజీ బేట్స్ (70 బంతుల్లో 58; 8 ఫోర్లు) అర్ధసెంచరీలతో రాణించారు. ఆతిథ్య బౌలర్లలో స్పిన్నర్ రాధా యాదవ్ 4, దీప్తి శర్మ 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత మహిళల జట్టు 47.1 ఓవర్లలో 183 పరుగులే చేసి ఆలౌటైంది. టెయిలెండర్ రాధా యాదవ్ (64 బంతుల్లో 48; 5 ఫోర్లు) ఒక్కతే ప్రత్యర్థి బౌలింగ్‌కు ఎదురునిలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సోఫీతో పాటు లియా తహుహు కూడా 3 వికెట్లు తీసింది. జెస్ కెర్, ఎడెన్ కార్సన్ చెరో 2 వికెట్లు తీశారు. మంగళవారం ఇరు జట్ల మధ్య ఇదే వేదికపై జరిగే ఆఖరి పోరుతో సిరీస్ ఫలితం తేలనుంది.

శుభారంభం

ఓపెనర్లు సుజీ బేట్స్, జార్జియా ప్లిమర్ (50 బంతుల్లో 41; 6 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 87 పరుగులతో చక్కని ఆరంభాన్నిచ్చారు. దీప్తి ఈ జోడీని విడగొట్టగా, లౌరెన్ (3) రనౌటైంది. అర్ధసెంచరీ పూర్తయ్యాక జట్టు స్కోరు 114 వద్ద సుజీ మూడో వికెట్‌గా నిష్క్రమించింది. బ్రూక్ హాలిడే (8) కూడా స్వల్ప వ్యవధిలో అవుటైంది. ఈ దశలో సోఫీ, మ్యాడీ గ్రీన్ (41 బంతుల్లో 42; 5 ఫోర్లు) ఐదో వికెట్‌కు 82 పరుగులు జోడించడంతో న్యూజిలాండ్ మంచి స్కోరు చేయగలిగింది. స్కోరు పెంచే ప్రయత్నంలో ధాటిగా ఆడిన సోఫీ డెత్ ఓవర్లో పెవిలియన్ చేరింది. 49వ ఓవర్లో రాధా యాదవ్ వరుస బంతుల్లో కెప్టెన్ సోఫీతో పాటు లియా తహుహు (0)లను అవుట్ చేసింది. ప్రియా, సైమాలకు చెరో వికెట్ దక్కింది.

రాధ ఒంటరి పోరాటం

స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (0) వైఫల్యం కొనసాగుతోంది. ఈ మ్యాచ్‌లో ఖాతానే తెరువలేదు. టాపార్డర్‌లో షఫాలీ వర్మ (11), యస్తిక భాటియా (12) విఫలమవడంతో 26 పరుగులకే భారత్ 3 వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్ కూడా బాధ్యత కనబరచలేదు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (35 బంతుల్లో 24; 1 ఫోర్, 1 సిక్స్), జెమీమా రోడ్రిగ్స్ (17), తేజల్ హసబ్నిస్ (15), దీప్తి శర్మ (15) చెప్పుకోదగ్గ స్కోర్లే చేయలేదు. 108 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి భారీ పరాజయానికి సిద్ధమైంది. ఈ దశలో స్పిన్ బౌలింగ్‌తో 4 వికెట్లు పడగొట్టిన రాధా యాదవ్ బ్యాటింగ్‌లోనూ భారత్ పరువు నిలిపే పోరాటం చేసింది. తొమ్మిదో వరుసలో బ్యాటింగ్‌కు దిగిన రాధ, సైమా ఠాకూర్ (54 బంతుల్లో 29; 3 ఫోర్లు)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 70 పరుగులు జోడించింది. భారత ఇన్నింగ్స్‌లో ఇదే అత్యధిక పరుగుల భాగస్వామ్యం. సైమాను జెస్ కెర్ అవుట్ చేయగా, కాసేపటికే సోఫీ డివైన్... రాధను అవుట్ చేసి భారత్ ఇన్నింగ్స్‌కు తెరదించింది.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ మహిళల ఇన్నింగ్స్: సుజీ బేట్స్ (సి అండ్ బి) రాధ 58; జార్జియా (సి) రాధ (బి) దీప్తి 41; లౌరెన్ (రనౌట్) 3; సోఫీ డివైన్ (సి) జెమీమా (బి) రాధ 79; హాలిడే (సి) రాధ (బి) ప్రియా 8; మ్యాడీ గ్రీన్ (సి) అరుంధతి రెడ్డి (బి) రాధ 42; ఇసాబెల్లా (స్టంప్డ్) యస్తిక (బి) దీప్తి 11; జెస్ కెర్ (నాటౌట్) 12; తహుహు (సి) దీప్తి (బి) రాధ 0; కార్సన్ (బి) సైమా 1; ఫ్రాన్ జోనస్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు)** 259. **వికెట్ల పతనం:** 1-87, 2-98, 3-114, 4-139, 5-221, 6-239, 7-245, 8-245, 9-252. **బౌలింగ్:** సైమా ఠాకూర్ 10-0-58-1, అరుంధతి రెడ్డి 10-0-52-0, దీప్తి శర్మ 10-3-30-2, ప్రియా మిశ్రా 10-1-49-1, రాధా యాదవ్ 10-0-69-4.



రాధా యాదవ్

భారత మహిళల ఇన్నింగ్స్: షఫాలీ (ఎల్బీడబ్ల్యూ) (బి) జెస్ కెర్ 11; స్మృతి (సి) జార్జియా (బి) తహుహు 0; యస్తిక (సి) ఇసాబెల్లా (బి) తహుహు 12; హర్మన్‌ప్రీత్ (సి) కార్సన్ (బి) సోఫీ 24; జెమీమా (సి) ఇసాబెల్లా (బి) సోఫీ 17; తేజల్ (బి) కార్సన్ 15; దీప్తి శర్మ (సి) ఇసాబెల్లా (బి) తహుహు 15; అరుంధతి (సి) ఇసాబెల్లా (బి) కార్సన్ 2; రాధా యాదవ్ (సి) లౌరెన్ (బి) సోఫీ 48; సైమా (బి) సుజీ బేట్స్ (బి) జెస్ కెర్ 29; ప్రియా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (47.1 ఓవర్లలో ఆలౌట్) 183. వికెట్ల పతనం:** 1-5, 2-19, 3-26, 4-64, 5-77, 6-100, 7-102, 8-108, 9-178, 10-183. **బౌలింగ్:** లియా తహుహు 10-1-42-3, జెస్ కెర్ 10-0-49-2, ఫ్రాన్ జోనస్ 10-2-33-0, సోఫీ డివైన్ 7.1-0-27-3, ఎడెన్ కార్సన్ 10-2-32-2.

అర్జున్‌ది అరుదైన ఘనత

ప్రధాని నరేంద్ర మోదీ కితాబు



ప్రధాని మోదీ, అర్జున్ గేమ్ ఆడుతున్న దృశ్యం (ఫైల్)

న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) లైవ్ ఎలో రేటింగ్స్‌లో తెలంగాణ స్టార్ చెస్ ప్లేయర్, గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 2800 పాయింట్ల మైలురాయిని అందుకోవడం అరుదైన ఘనత అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. '2800 ఎలో రేటింగ్ మైలురాయిని చేరుకున్న అర్జున్‌కు అభినందనలు. ఇది అసాధారణ ఘనత. మొక్కవోని పట్టుదల, నిలకడైన ప్రదర్శనతోనే ఇది సాధ్యమవుతుంది. జాతి గర్వపడే క్షణాలివి. వ్యక్తిగతంగానూ గొప్ప స్థాయికి చేరావు. మరెంతో మంది యువత చెస్ ఆడేందుకు, ఈ క్రీడను ఎంచుకొని ప్రపంచ వేదికలపై రాణించేందుకు స్ఫూర్తిగా నిలిచావు. భవిష్యత్తులోనూ ఇదేరకంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా' అని మోదీ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. సెర్బియాలో జరిగిన యూరోపియన్ చెస్ క్లబ్ కప్ టోర్నీలో మూడు రోజుల క్రితం అర్జున్ 2800 ఎలో రేటింగ్స్‌ను అందుకున్నాడు. భారత్‌లో చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా, ఓవరాల్‌గా 16వ ప్లేయర్‌గా అర్జున్ గుర్తింపు పొందాడు. ఆదివారం యూరోపియన్ చెస్ క్లబ్ కప్ టోర్నీ ముగిశాక అర్జున్ లైవ్ రేటింగ్ 2800 లోనికి వచ్చింది. ప్రస్తుతం అతని లైవ్ రేటింగ్ 2798కు చేరింది. యూరోపియన్ చెస్ క్లబ్ కప్ టోర్నీలో అర్జున్ ప్రాతినిధ్యం వహించిన అల్కాలాయిడ్ క్లబ్ ఓపెన్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది.

పింక్ పాంథర్స్, తలైవాస్ మ్యాచ్ 'టై'



సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో రెండో 'టై' నమోదైంది. ఆదివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జైపూర్ పింక్ పాంథర్స్, తమిళ్ తలైవాస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 30-30తో సమంగా ముగిసింది. తలైవాస్ తరఫున సచిన్ 11 పాయింట్లతో విజృంభించగా... జైపూర్ జట్టు తరఫున అర్జున్ దేశ్వాల్ (7 పాయింట్లు), వికాస్ ఖండోలా (6) రాణించారు. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 35-29 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్ జట్టును ఓడించింది. యూపీ జట్టు తరఫున భరత్ 13 పాయింట్లతో సత్తా చాటగా... అతడికి భవాని రాజ్‌పుత్ (9 పాయింట్లు) చక్కటి సహకారం అందించాడు. గుజరాత్ జెయింట్స్ తరఫున హిమాన్షు (9 పాయింట్లు), రాకేశ్ (8 పాయింట్లు) పోరాడినా ఫలితం లేకపోయింది. ఈ విజయంతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకున్న యూపీ యోధాస్ పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లింది. లీగ్‌లో భాగంగా నేడు జరిగే మ్యాచ్‌ల్లో హరియాణా స్టీలర్స్‌తో దబంగ్ ఢిల్లీ (రాత్రి 8 గంటల నుంచి)... పట్నా పైరేట్స్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 9 గంటల నుంచి) తలపడతాయి.

భారత్‌కు చుక్కెదురు

కట్మాండు: దక్షిణాసియా సీనియర్ మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఐదుసార్లు చాంపియన్ భారత జట్టు వరుసగా రెండోసారి సెమీఫైనల్లోనే నిష్క్రమించింది. ఆతిథ్య నేపాల్ జట్టుతో ఆదివారం జరిగిన సెమీఫైనల్లో భారత జట్టు 'పెనాల్టీ షూటౌట్'లో 2-4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. నిర్ణీత సమయంలో రెండు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్' నిర్వహించారు.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూనియన్ బ్యాంక్, ముంబైలో 1500 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ఉన్న యూబీఐ శాఖల్లో లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1500.
» **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-200, అస్సాం-50, గుజరాత్-200, కర్ణాటక-300, కేరళ-100, మహారాష్ట్ర-50, ఒడిశా-100, తమిళనాడు-200, తెలంగాణ-200, పశ్చిమ బెంగాల్-100.
» **వయసు:** 01.10.2024 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **బేసిక్ పే స్కేల్:** నెలకు రూ.48,480 నుంచి రూ.85,920.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, అప్లికేషన్స్ స్క్రీనింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అమరావతి, అనంతపురం, ఏలూరు, గుంటూరు/విజయవాడ, కడప, కాకినాడ, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపుకు చివరితేది:** 13.11.2024.
» **వెబ్‌సైట్:** www.unionbankofindia.co.in

యంత్ర ఇండియా లిమిటెడ్‌లో 3,883 అప్రెంటిస్‌లు

నాగ్‌పూర్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న యంత్ర ఇండియా లిమిటెడ్.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని ఆర్డినెన్స్, ఆర్డినెన్స్ ఎక్విప్‌మెంట్ ఫ్యాక్టరీల్లో 58వ బ్యాచ్ ట్రేడ్ అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

» **ప్రాంతాల వారీగా ఫ్యాక్టరీలు:** ఆర్డినెన్స్ కేబుల్ ఫ్యాక్టరీ-చండీగఢ్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ-నలంద, గన్ క్యారేజ్ ఫ్యాక్టరీ-జబల్‌పూర్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ-ఇటార్సీ, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ-ఖమారియా, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ-కట్నీ, హై ఎక్స్‌ప్లోజివ్ ఫ్యాక్టరీ-కిర్కీ, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ-అంబఝరి, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ప్రాజెక్ట్-అంబర్‌నాథ్ తదితరాలు.
» **ట్రేడులు:** మెషినిస్ట్, ఫిట్టర్, టర్నర్, వెల్డర్, పెయింటర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, మేసన్, ఎలక్ట్రోప్లేటర్, మెకానిక్, ఫౌండ్రీ మ్యాన్, బాయిలర్ అటెండెంట్, అటెండెంట్ ఆపరేటర్ కెమికల్ ప్లాంట్ తదితరాలు.
» **అర్హత:** ఐటీఐ కేటగిరికి సంబంధించి అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి లేదా తత్సమానం, నాన్-ఐటీఐ కేటగిరికి సంబంధించి అభ్యర్థులు 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **గరిష్ట వయో పరిమితి:** 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
» **స్టైపెండ్:** నెలకు నాన్-ఐటీఐలకు రూ.6000, ఐటీఐలకు రూ.7000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** నాన్-ఐటీఐ కేటగిరికి పదో తరగతి, ఐటీఐ కేటగిరికి పదో తరగతి, ఐటీఐలో సాధించిన మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.11.2024
» **వెబ్‌సైట్:** www.recruitgov.com/Yantra2024

ఐఐటీ గోవాలో నాన్ టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గోవాలో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09.
» **పోస్టుల వివరాలు:** స్టూడెంట్ కౌన్సిలర్-01, మెడికల్ ఆఫీసర్-01, స్పోర్ట్స్ సూపరింటెండెంట్-01, జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-01, టెక్నికల్ సూపరింటెండెంట్(ఎలక్ట్రికల్)-01, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం కలిగి ఉండాలి.
» **వయసు:** అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్(గ్రూప్-సి) పోస్టులకు 27 ఏళ్లు, మెడికల్ ఆఫీసర్, స్టూడెంట్ కౌన్సిలర్(గ్రూప్-ఎ) పోస్టులకు 42 ఏళ్లు, మిగతా(గ్రూప్-బి) పోస్టులకు 34 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.11.2024
» **వెబ్‌సైట్:** https://iitgoa.ac.in

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కొలువుల పిలుపు

» 200 ఏఓ పోస్టులకు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ నోటిఫికేషన్
» బ్యాచిలర్, ప్రొఫెషనల్ డిగ్రీ, పీజీతో పోటీ పడే అవకాశం
» జనరలిస్ట్, స్పెషలిస్ట్ విభాగాల్లో ఉద్యోగాలు
» ఎంపికైతే నెలకు రూ.88 వేల వేతనం



ఇన్సూరెన్స్ రంగంలో.. కొలువుదీరాలనుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. ప్రభుత్వ రంగ బీమా సంస్థ.. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్.. 200 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైతే నెలకు రూ.88 వేల వేతనం అందుకోవచ్చు!! ఈ నేపథ్యంలో.. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఏఓ ఉద్యోగాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

మొత్తం పోస్టులు 200

తాజా నోటిఫికేషన్ ద్వారా యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్.. రెండు విభాగాల్లో 200 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనుంది. స్పెషలిస్ట్ కేడర్‌లో 100 పోస్టులు, జనరలిస్ట్ కేడర్‌లో మరో 100 పోస్టులు అందుబాటులో ఉన్నాయి. స్పెషలిస్ట్ కేడర్‌లో 100 పోస్టుల్లో రిస్క్ మేనేజ్‌మెంట్-10 పోస్టులు, ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్-20 పోస్టులు, ఆటోమొబైల్ ఇంజనీర్స్-20 పోస్టులు, కెమికల్ ఇంజనీర్స్/మెకట్రానిక్స్ ఇంజనీర్స్-10 పోస్టులు, డేటా అనలిటిక్స్-20 పోస్టులు, లీగల్-20 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఆయా విభాగాలను అనుసరించి సంబంధిత సబ్జెక్ట్‌లో బీటెక్/ఎంటెక్/బ్యాచిలర్/ పీజీ డిగ్రీ/ సీఏ/ఐసీడబ్ల్యూఏ/రిస్క్ మేనేజ్‌మెంట్ కోర్సులు ఉత్తీర్ణులవ్వాలి. • వయసు:2024 సెప్టెంబర్ 30 నాటికి 21-30 ఏళ్ల ఉండాలి. గరిష్ట వయో పరిమితిలో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రాత పరీక్షల వివరాలు

ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను స్పెషలిస్ట్, జనరలిస్ట్ కేడర్‌లకు వేర్వేరు విధానాల్లో నిర్వహిస్తారు.

250 మార్కులకు స్పెషలిస్ట్ రాత పరీక్ష

స్పెషలిస్ట్ రాత పరీక్షను ఆరు విభాగాల్లో 250 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో రీజనింగ్ (25 ప్రశ్నలు-25మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్(40 ప్రశ్నలు-40 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు-25 మార్కులు), జనరల్ అవేర్‌నెస్ (20 ప్రశ్నలు-20 మార్కులు), కంప్యూటర్ నాలెడ్జ్ (30 ప్రశ్నలు-20 మార్కులు), సంబంధిత సబ్జెక్ట్ నాలెడ్జ్ (60 ప్రశ్నలు-120 మార్కులు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు కేటాయించిన సమయం గంటన్నర.

జనరలిస్ట్ ఏఓ రాత పరీక్ష ఇలా

జనరలిస్ట్ ఏఓ పోస్టులకు అయిదు విభాగాల్లో 250 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో రీజనింగ్ (50 ప్రశ్నలు-50 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ (50 ప్రశ్నలు- 60 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (40 ప్రశ్నలు-50 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(40 ప్రశ్నలు-50 మార్కులు), కంప్యూటర్ నాలెడ్జ్ (20 ప్రశ్నలు-40 మార్కులు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. రెండు విభాగాలకు నిర్వహించే రాత పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.

డిస్క్రిప్టివ్ టెస్ట్

ఆబ్జెక్టివ్ టెస్ట్‌తోపాటు అదనంగా 30 మార్కులకు డిస్క్రిప్టివ్ టెస్ట్ కూడా నిర్వహిస్తారు. లెటర్ రైటింగ్(10 మార్కులు),ఎస్సే రైటింగ్ (20 మార్కులు) విభాగాల్లో ఈ వ్యాస రూప పరీక్ష ఉంటుంది.

మలి దశలో ఇంటర్వ్యూ

రాత పరీక్షలోని ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విభాగాల్లో చూపిన ప్రతిభ ఆధారంగా.. మలి దశలో 100 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులో ఇన్సూరెన్స్ రంగంపై ఉన్న పరిజ్ఞానం, ఆసక్తి, భవిష్యత్తు లక్ష్యాలు, ఆయా స్పెషలైజ్డ్ విభాగాల్లో ఉన్న పని అనుభవం, నైపుణ్యంపై ప్రశ్నలు అడుగుతారు.

తుది జాబితా

పర్సనల్ ఇంటర్వ్యూ ముగిసిన తర్వాత తుది జాబితా రూపకల్పనలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. రాత పరీక్షలో పొందిన మార్కులకు 75 శాతం వెయిటేజీ, పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 25 శాతం వెయిటేజీ కల్పించి.. తుది జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

ఏడాది ప్రొబేషన్

నియామకం ఖరారు చేసుకున్న అభ్యర్థులకు ఏడాదిపాటు ప్రొబేషనరీ పీరియడ్ నిబంధన ఉంది. ఈ సమయంలో అభ్యర్థులు ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిర్వహించే లైసెన్సియేట్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అదే విధంగా.. ప్రొబేషన్ పీరియడ్‌తో కలిపి అయిదేళ్లపాటు సంస్థలో విధులు నిర్వహిస్తామని సర్వీస్ బాండ్ కూడా ఇవ్వాలి.

ఆకర్షణీయ వేతనం

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కొలువులు సొంతం చేసుకున్న వారికి ఆకర్షణీయ వేతనం అందిస్తారు. నెలకు రూ.50,925-రూ.96,765 శ్రేణిలో ప్రారంభ వేతనం ఉంటుంది. దీనికి అదనంగా ఇతర భత్యాలు లభిస్తాయి. నికరంగా నెలకు రూ.88 వేల వేతనం చేతికందుతుంది.

జీఎం స్థాయికి చేరుకునే అవకాశం

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించిన వారు భవిష్యత్తులో ఆయా విభాగాల్లో ఉన్నత హోదాలకు చేరుకునే అవకాశం ఉంది. తొలుత అయిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నాక.. పదోన్నతికి అర్హత లభిస్తుంది. అసిస్టెంట్ మేనేజర్/బ్రాంచ్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్/డివిజనల్ మేనేజర్; సీనియర్ డివిజనల్ మేనేజర్, చీఫ్ మేనేజర్, రీజనల్ మేనేజర్; డీజీఎం, జీఎం వంటి హోదాలకు చేరుకోవచ్చు. సీఏఐఐబీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిసేత వేగంగా పదోన్నతులు పొందే అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:2024, నవంబర్5
- ఆన్‌లైన్ రాత పరీక్ష తేదీ: 2024, డిసెంబర్ 14
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.uiic.co.in, https://uiic.co.in/recruitment/details/16167

రాత పరీక్షలో రాణించేలా

రీజనింగ్

రీజనింగ్ ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు పకడ్బందీగా వ్యవహరించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా బాగా ప్రాక్టీస్ చేస్తే.. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగం కోసం అభ్యర్థులు మరింత ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలి. ఇన్సూరెన్స్, ఆర్థిక రంగంలో మార్పులు, ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మ్యూచువల్ ఫండ్స్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.

స్పెషలిస్ట్ స్ట్రీమ్

స్పెషలిస్ట్ స్ట్రీమ్ విభాగంలో రాణించడానికి అభ్యర్థులు తమ సబ్జెక్ట్ స్పెషలైజేషన్‌కు సంబంధించి.. బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేస్తూ అడుగులు వేయాలి. ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
28-10-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
663	219
79,402	24,181

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	18,519	△	103
డోజోన్స్	42,114	▽	260
ఎఫ్‌టీఎస్ఈ 100	8,248	▽	21
డాక్స్	19,464	△	21
షాంఘై	3,300	△	19
నికాయ్	37,914	▽	229

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.67	84.68
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.73	110.57
€	యూరో	ఎస్‌బీఐ	89.80	92.42
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.76	56.17
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.71	56.90
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.57	66.24
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.52	23.08
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.00	23.78
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.92	12.75

ఈక్విటీ రాబడులపై పన్ను సునామీ!



చట్టంలో పలు వెసులుబాట్లు

- వీటిని అనుసరిస్తే పన్ను భారం పడదు
- పన్ను తగ్గించుకునే మార్గాలూ ఉన్నాయ్
- తద్వారా దీర్ఘకాలంలో అదనపు రాబడి
- ఏడాదికి మించిన పెట్టుబడుల పైనే ప్రయోజనం

కొన్నేళ్ల క్రితం విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలు మొదలు పెడితే మన ఈక్విటీలు బేల చూపు చూసేవి. కానీ, నేడు ఆ పరిస్థితి లేదు. ఫారిన్ ఇన్వెస్టర్లు అమ్మిన మేర ఇని స్టిట్యూషన్స్, రిటైల్ ఇన్వెస్టర్లు కొనుగోలు చేస్తున్నారు. మన దేశ ఈక్విటీల్లో రిటైల్ ఇన్వెస్టర్ల ప్రాతినిధ్యం గతంతో పోల్చితే గణనీయంగా పెరిగిందని చెప్పడానికి ఈ ఒక్క నిదర్శనం చాలు. నేరుగా స్టాక్స్‌లో, మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి ఎక్కువ మంది ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. కరోనా తర్వాత నుంచి ఈక్విటీ మార్కెట్ మంచి బుల్ ర్యాలీ చేయడం.. ఎంతో మంది ఇన్వెస్టర్లు అటు వైపు అడుగులు **వేసేలా చేసింది. ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్స్‌లో క్రమానుగత పెట్టుబడుల (సిప్) ప్రాధాన్యాన్ని ఇన్వెస్టర్లు అర్థం చేసుకుంటున్నారు. తమ భవిష్యత్ ఆర్థిక లక్ష్యాల్లో** ఈక్విటీలకు చోటు కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఈక్విటీ రాబడులపై పన్ను బాధ్యతను ప్రతి ఇన్వెస్టర్ తప్పకుండా అర్థం చేసుకోవాలి. 2024-25 బడ్జెట్‌లో ఈక్విటీ లాభాలపై స్వల్ప, దీర్ఘకాల మూలధన లాభాల పన్నును కేంద్ర సర్కారు పెంచేసింది. ఈ భారం సాధ్యమైన మేర తగ్గించుకునేందుకు ఇన్వెస్టర్ల ముందు పలు మార్గాలున్నాయి. వాటి గురించి వివరించే కథనమే ఇది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

ఆదాయపన్ను చట్టంలో ఇటీవలి మార్పుల అనంతరం స్వల్పకాల లాభాలపై 20 శాతం, దీర్ఘ కాల లాభాలపై 12.5 శాతం చొప్పున పన్ను చెల్లిం చాల్సి ఉంటుంది. కొనుగోలు చేసిన తేదీ నుంచి ఏడాది నిండకుండా విక్రయించిన స్టాక్స్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌పై వచ్చే లాభం స్వల్పకాల మూలధన లాభం (ఎస్‌టీసీజీ) అవుతుంది. దీనిపై 20 శాతం పన్ను చెల్లించాలి. ఏడాది పూర్తయిన అనంతరం విక్రయించినప్పుడు వచ్చిన లాభం దీర్ఘ కాల మూలధన లాభం (ఎల్‌టీసీజీ) కిందకు వస్తుంది. ఎల్‌టీసీజీ ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షలకు మించకపోతే ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. రూ.1.25 లక్షలకు మించిన లాభం పై 12.5 శాతం ఎల్‌టీసీజీ చెల్లించాల్సి ఉంటుంది.



పన్ను తగ్గించుకునే మార్గాలు..

ఈక్విటీల్లో స్వల్పకాల మూలధన లాభాలపై (ఎస్‌టీసీజీ) 20 శాతం పన్ను చెల్లించాల్సిందే. పన్ను భారాన్ని తగ్గించుకునేందుకు ఎలాంటి వెసులుబాట్లు లేవు. ఏడాదికి మించి పెట్టుబడులు కొనసాగిం చడం ద్వారానే మూలధన లాభాలపై పన్ను భారం లేకుండా చూసు కునేందుకు లేదా తగ్గించుకునేందుకు మార్గాలున్నాయి. ముఖ్యంగా ఈక్విటీలు మూడేళ్లు అంతకుమించిన కాలానికే అనుకూలం. మూడే ళ్లలోపు పెట్టుబడులకు ఈక్విటీలు సూచనీయం కాదు. ఎందుకంటే స్వల్పకాలంలో ఈక్విటీలు స్థూల ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, విధాన నిర్ణయాలు తదితర ఎన్నో అంశాల ఆధారంగా అస్థిరతలకు లోనవుతూ ఉంటాయి. మూడు నుంచి ఐదేళ్ల అంతకు మించిన కాలంలో ఈ అస్థిరతలను అధిగమించి స్టాక్స్ ర్యాలీ చేస్తుంటాయి. కనుక స్వల్పకాలంలో ఆటుపోట్లు ఉన్నప్పటికీ.. దీర్ఘకాలంలో మెరుగైన రాబడులకు భరోసా ఉంటుంది. కనుక రిటైల్ ఇన్వెస్టర్లు తమ మధ్య, దీర్ఘకాల లక్ష్యాల కోసమే ఈక్విటీలు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. తద్వారా అధిక రాబడులకు తోడు, ఆ మొత్తంపై పన్ను భారాన్ని తగ్గించుకోవడానికి అవకాశాలుంటాయి.



ట్యాక్స్ హార్వెస్టింగ్



ఒక ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీల్లో దీర్ఘకాల మూలధన లాభం రూ.1.25 లక్షల వరకు పన్ను లేదు కనుక, ఏటా తమ పెట్టుబడులపై ఈ మేరకు లాభాలను స్వీకరించడం ట్యాక్స్ హార్వెస్టింగ్ అవుతుంది. తిరిగి అంతే మొత్తాన్ని మళ్లీ ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఒక ఉదాహరణ చూద్దాం. ఉదాహరణకు 2023 సెప్టెంబర్ 1న స్టాక్స్ లేదా ఈక్విటీ ఫండ్స్‌లో రూ.6 లక్షలు ఇన్వెస్ట్ చేశారు. 2024 సెప్టెంబర్ 1 నాటికి ఈ విలువ 12 శాతం రాబడి అంచనా ప్రకారం రూ.6,75,305 అవుతుంది. ఇందులో లాభం రూ.75,305. రూ.1.25లక్షల వరకు లాభం ఉన్నా పన్ను లేదు కనుక, ఈ మొత్తాన్ని విక్రయించి తిరిగి ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల ఎలాంటి పన్ను భారం పడదు. ఇలా ఏటా రూ.1.25లక్షల మేరకు దీర్ఘకాలిక మూలధన లాభాన్ని స్వీకరిస్తూ.. తిరిగి ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లడం ఒక మార్గం.

ఇల్లు కొనడం..

ఈక్విటీ దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను లేకుండా ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 54ఎఫ్ మార్గం చూపిస్తోంది. ఈ సెక్షన్ కింద గరిష్ట ప్రయోజనం రూ.10 కోట్లు. దీర్ఘకాల ఈక్విటీ పెట్టుబడులు విక్రయించినప్పుడు వచ్చిన మొత్తం రూ.10 కోట్ల వరకు ఉంటే, దీనిపై భారీగా పన్ను చెల్లించాల్సి వస్తుంది. దీనికి బదులు ఆ మొత్తంతో ఒక నివాస గృహం కొనుగోలు చేస్తే సరి. ఇలా చేయడం వల్ల ఎలాంటి పన్ను లేకుండా సెక్షన్ 54ఎఫ్ కింద పూర్తి ప్రయోజనం పొందొచ్చు. వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలే (హెచ్‌యూఎఫ్) ఈ ప్రయోజనానికి అర్హులు. దీర్ఘకాలిక ఈక్విటీ పెట్టుబడులే అని కాదు, ప్లాట్, వాణిజ్య భవనం, బంగారం, ట్రేడ్ మార్క్‌లు, పేటెంట్లు, మెషినరీ సైతం లాంగ్ టర్మ్ క్యాపిటల్ అస్సెట్ కిందకు వస్తాయి. వీటిపైనా ఇదే ప్రయోజనం పొందొచ్చు.

షరతులు ఉన్నాయ్...

దీర్ఘకాల ఈక్విటీ మూలధన లాభాలపై సెక్షన్ 54ఎఫ్ కింద పన్ను మినహాయింపు పొందాలంటే కొన్ని షరతులు పాటించాల్సి ఉంటుంది. దీర్ఘకాల ఈక్విటీ పెట్టుబడులు విక్రయించే తేదీకి ఏడాది ముందు కాలంలో లేదా విక్రయించిన తేదీ నుంచి తర్వాతి రెండేళ్లలోపు నివాస అవసరాలకు వినియోగించే ఇల్లు (పాతది లేదా కొత్తది) కొనుగోలు చేయాలి. ఇల్లు నిర్మించుకునేట్టు అయితే దీర్ఘకాల క్యాపిటల్ అసెట్స్ విక్రయించిన నాటి నుంచి మూడేళ్ల వరకు వ్యవధి ఉంటుంది. మూలధన లాభాలే కాకుండా, విక్రయించినప్పుడు వచ్చిన మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా కొంత మొత్తంతోనే ఇల్లు కొనుగోలు లేదా ఇంటి నిర్మాణంపై వెచ్చిస్తే, అప్పుడు మిగిలిన మూలధన లాభాలపై నిబంధనల మేరకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒక ఇంటి కొనుగోలుకే ఈ ప్రయోజనం పరిమితం. ఈక్విటీ దీర్ఘకాల పెట్టుబడులు విక్రయించగా వచ్చిన మొత్తం రెండిళ్ల కొనుగోలుపై వెచ్చిస్తే.. ఒక ఇంటిపై చేసిన వ్యయాన్నే సెక్షన్54ఎఫ్ కింద పరిగణనలోకి తీసుకుంటారు.

సెక్షన్ 54ఎఫ్ కింద పన్ను మినహాయింపు పొందాలంటే, ఈక్విటీ దీర్ఘకాల పెట్టుబడులు విక్రయించే నాటికి ఒక ఇంటిని మించి కలిగి ఉండకూడదు. రెండో ఇంటిని జాయింట్‌లో కలిగి ఉన్నా అర్హత కోల్పోయినట్టే. ఈక్విటీ దీర్ఘకాల పెట్టుబడులను విక్రయించినప్పుడు పన్ను మినహాయింపు కోసం ఇంటిపై వెచ్చించాలని చెప్పుకున్నాం. అయితే, విక్రయించిన ఆర్థిక సంవత్సరం రిటర్నులు దాఖలు చేసే నాటికి ఇల్లు కొనుగోలు లేదా నిర్మాణంపై వెచ్చించడం సాధ్యపడలేదు అనుకుందాం. అలాంటప్పుడు ప్రభుత్వరంగ బ్యాంకుల్లో క్యాపిటల్ గెయిన్స్ అకౌంట్ స్కీమ్ కింద ఆ మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయాలి. ఆ తర్వాత దీని నుంచి ఉపసంహరించుకుని నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత కాలం లోపు ఇంటి కోసం వెచ్చించి, పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఒకవేళ నిర్ణీత కాలంలోపు ఇంటి కొనుగోలు లేదా నిర్మాణంపై వెచ్చించలేకపోయారని అనుకుందాం. అటువంటప్పుడు ఆ మొత్తాన్ని క్రితం ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎల్‌టీసీజీగా చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

బాండ్లు



సెక్షన్ 80ఈసీ కింద ఈక్విటీ దీర్ఘకాల మూలధన లాభాలను క్యాపిటల్ గెయిన్స్ బాండ్లలో ఇన్వెస్ట్ చేసినా పన్ను భారం నుంచి తప్పించుకోవచ్చు. ఆర్ఈసీ, ఎన్‌హెచ్ఏఐ తదితర ప్రభుత్వరంగ సంస్థలు జారీ చేసే బాండ్లలో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. వీటిలో పెట్టుబడులపై రాబడి 6 శాతం వరకు ఉంటుంది. దీర్ఘకాల ఈక్విటీ పెట్టుబడులు విక్రయించిన తేదీ నుంచి ఆరు నెలలు దాటకుండా ఈ బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తేనే ప్రయోజనం లభిస్తుంది. గరిష్ఠంగా రూ.50 లక్షల పెట్టుబడులకే ఈ ప్రయోజనం పరిమితం. ఈక్విటీ దీర్ఘకాల పెట్టుబడులు విక్రయించినప్పుడు వచ్చిన మొత్తం రూ.50 లక్షలకు మించి ఉంటే, అదనపు మొత్తంపై నిబంధనల మేరకు పన్ను చెల్లిస్తే సరిపోతుంది. బాండ్లలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత ఐదేళ్లలోపు వాటిని విక్రయిస్తే.. గతంలో పొందిన పన్ను ప్రయోజనం కోల్పోతారు. అంటే ఆ మొత్తంపై పన్ను చెల్లించాల్సి వస్తుంది. అంతేకాదు ఈ బాండ్లపై ఐదేళ్లలోపు రుణం పొందినా ఈ ప్రయోజనం కోల్పోతారు.

సరైన నిర్ణయమేనా?



మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్ లాభాలపై పన్ను తప్పించుకునేందుకు సెక్షన్ 54ఎఫ్‌ను వినియోగించుకుని ఇంటిపై ఇన్వెస్ట్ చేయడం సరైన నిర్ణయమేనా..? అంటే, అందరికీ కాకపోవచ్చన్నదే సమాధానం. పిల్లల ఉన్నత విద్య, వారి వివాహం, రిటైర్మెంట్ తదితర లక్ష్యాల కోసం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసిన వారు, పన్ను మినహాయింపు కోసం తీసుకెళ్లి ఇంటిపై వెచ్చించడం సరైనది అనిపించుకోదు. కనుక ఈ విషయంలో ఇన్వెస్టర్లు అందరికీ ఒక్కటే సలహా నప్పదు. సొంతిల్లు సమకూర్చుకోవాలని కోరుకునే వారికి సెక్షన్ 54ఎఫ్ మంచి ఆప్షన్ అవుతుంది. అలాగే, పన్ను మినహాయింపు కోసం ఇంటిపై ఇన్వెస్ట్ చేసి వృద్ధాప్యంలో ఆ ఇంటిని రివర్స్ మార్ట్‌గేజ్ కోసం వినియోగించుకునే ఆలోచన ఉన్న వారికి కూడా 54ఎఫ్ ప్రయోజనం అనుకూలమే.

నష్టాలతో భర్తీ..



ఈక్విటీల్లో మూలధన లాభాలపై పన్ను తగ్గించుకునేందుకు.. మూలధన నష్టాలతో భర్తీ చేసుకోవడం మరో ఆప్షన్. ఏడాదికి మించని ఈక్విటీ పెట్టుబడులు విక్రయించగా వచ్చిన స్వల్పకాల మూలధన నష్టాన్ని.. తిరిగి స్వల్పకాల మూలధన లాభం లేదా దీర్ఘకాల మూలధన లాభంలో సర్దుబాటు చేసుకోవచ్చు. ఇలా సర్దుబాటు చేయగా మిగిలిన మొత్తంపై పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ఇలా సర్దుబాటు చేసుకున్న తర్వాత కూడా నష్టం మిగిలి ఉంటే దాన్ని అప్పటి నుంచి తదుపరి ఎనిమిదేళ్లపాటు లాభాలతో సర్దుబాటు చేసుకోవచ్చు. పన్ను రిటర్నులు దాఖలు చేయడం ద్వారానే ఇందుకు అవకాశం ఉంటుంది. కానీ, దీర్ఘకాల మూలధన నష్టాన్ని.. కేవలం దీర్ఘకాల మూలధన లాభంతోనే సర్దుబాటు చేసుకోగలరు.

ఎస్‌బీఐకి బెస్ట్ బ్యాంక్ అవార్డు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కి భారత్‌లోనే అత్యుత్తమ బ్యాంక్‌గా పురస్కారం దక్కింది. అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ ఈ అవార్డును ప్రకటించింది. వాషింగ్టన్‌లో అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు సమావేశాల సందర్భంగా నిర్వహించిన 31వ వార్షిక బెస్ట్ బ్యాంక్ అవార్డుల కార్యక్రమంలో ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి దీన్ని అందుకున్నారు. అత్యుత్తమ సేవలు అందిస్తూ, అందరికీ బ్యాంకింగ్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నందుకు గాను 'బెస్ట్ బ్యాంక్ ఇన్ ఇండియా' పురస్కారం లభించిందని ఎస్‌బీఐ వివరించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మార్కెట్లో మతాబులు వెలిగేనా? నిపుణుల విశ్లేషణ	కోల్ ఇండియా క్యూ2 లాభం 22 శాతం డౌన్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-10-2024

విశాఖ	545-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	545-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

బిజినెస్ సైకిల్ ఫండ్స్ భేష్..

- ఏడాది వ్యవధిలో 56 శాతం వరకు రాబడులు
- పరిశ్రమ గణాంకాల్లో వెల్లడి



న్యూఢిల్లీ: పెట్టుబడుల ప్రపంచంలో బిజినెస్ సైకిల్ మ్యూచువల్ ఫండ్స్‌కి క్రమంగా ఆదరణ పెరుగుతోంది. విస్తృత మార్కెట్‌తో పోలిస్తే ఇవి మెరుగ్గా రాబడులు అందిస్తుండటం ఇందుకు కారణం. గత ఏడాది వ్యవధిలో ఈ ఫండ్స్ 56 శాతం వరకు రాబడులు ఇచ్చినట్లు పరిశ్రమ గణాంకాల్లో వెల్లడైంది. వీటి ప్రకారం హెచ్‌ఎస్‌బీసీ, మహీంద్రా మాన్యులైఫ్, క్వాంట్ మొదలైన ఫండ్ హౌస్‌ల స్కీములు 50 శాతం పైగా రాబడులు అందించాయి. ఇదే వ్యవధిలో నిఫ్టీ 500 టీఆర్ఐ సూచీ 35.11 శాతం రాబడులు అందించింది. ఈ నేపథ్యంలో బిజినెస్ సైకిల్ ఫండ్స్‌పై ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతోందని ఆనంద్ రాఠీ వెల్త్ డిప్యూటీ సీఈవో ఫిరోజ్ అజీజ్ తెలిపారు. నిర్దిష్ట ఆర్థిక, మార్కెట్ పరిస్థితుల్లో రాణించే రంగాలకు చెందిన స్టాక్స్‌ని గుర్తించి, ఇన్వెస్ట్ చేసేందుకు బిజినెస్ సైకిల్ ఫండ్స్ ప్రయత్నిస్తాయి. ఆర్థిక వ్యవస్థలో మాంద్యం, రికవరీ తొలినాళ్లు, వృద్ధి మధ్య దశ, చివరి దశ వంటి పరిస్థితులను బట్టి వివిధ రంగాల్లో పెట్టుబడులను మారుస్తుంటాయి. ఉదాహరణకు మాంద్యం దశలో యుటిలిటీస్, ఫార్మా వంటి డిఫెన్సివ్ రంగాలు మెరుగ్గా రాణించగలవు. అతే వృద్ధి ప్రారంభమయ్యే తొలినాళ్లలో ఆటోమొబైల్స్, ఫైనాన్షియల్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాలకు చెందిన స్టాక్స్ లాభపడే అవకాశాలు ఉంటాయి. ఇలా వ్యూహాత్మకంగా వివిధ రంగాల్లో పెట్టుబడులను అటూ-ఇటూ మారుస్తుండటమనేది ఇన్వెస్టర్లకు లాభాలను పంచుతోందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

స్వల్ప సమయంలో అధిక రాబడులు అందిస్తుండటంతో బిజినెస్ సైకిల్ ఫండ్స్‌పై ఆసక్తి పెరుగుతోందని ఎప్పిలాన్ గ్రూప్‌లో భాగమైన మల్టీ ఆర్క్ వెల్త్ ఏఎంసీ సిద్ధార్థ్ ఆలోక్ తెలిపారు. పరిస్థితులను బట్టి వివిధ సెక్టోరల్ ఫండ్స్‌కి మారేందుకు, ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లను పట్టుకునేందుకు వ్యక్తిగతంగా పరిశోధిస్తూ, అవకాశాల కోసం ఎదురుచూస్తూ కూర్చునే భారాన్ని ఈ ఫండ్స్ తగ్గిస్తాయని విస్‌డమ్ ఎడ్జ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వ్యవస్థాపకుడు భావేష్ దమానియా తెలిపారు. అయితే, సాధారణంగా థీమ్యాటిక్ ఫండ్స్ పనితీరును లెక్కగట్టేందుకు కనీసం అయిదేళ్ల పాటైనా కార్యకలాపాలు ఉండాలని, ఇవన్నీ ఈ మధ్యే వచ్చాయి కాబట్టి ఇటీవలి కాలంలో పనితీరుపైనే ఆధారపడటం సరికాకపోవచ్చని ఆయన పేర్కొన్నారు.

16 ఫండ్స్..

ప్రస్తుతం దేశీయంగా 16 బిజినెస్ సైకిల్ ఫండ్స్ ఉండగా, 10 ఫండ్స్‌కి ఏడాది పైగా ట్రాక్ రికార్డు ఉంది. వీటిలో ఒక్కటి మినహా మిగతా అన్నీ కూడా గత 12 నెలల్లో నిఫ్టీ 500 టీఆర్ఐకి మించిన రాబడులు అందించాయి. పరిశ్రమ డేటా ప్రకారం 10 ఫండ్స్ సగటున 42 శాతం రాబడి అందించాయి. గత ఏడాది వ్యవధిలో అక్టోబర్ 17 వరకు.. హెచ్‌ఎస్‌బీసీ బిజినెస్ సైకిల్స్ ఫండ్ 56.3 శాతం, మహీంద్రా మాన్యులైఫ్ బిజినెస్ సైకిల్ ఫండ్ 56.17 శాతం, క్వాంట్ బిజినెస్ సైకిల్ ఫండ్ 50.8 శాతం రాబడులు అందించాయి.



మరిన్ని విశేషాలు..

- అధిక రాబడులు అందించిన వాటిలో బరోడా బీఎన్‌పీ పారిబా బిజినెస్ సైకిల్ ఫండ్ (44.58 శాతం రాబడి), ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ (42.27 శాతం), టాటా బిజినెస్ సైకిల్ ఫండ్ (41.26 శాతం), కోటక్ బిజినెస్ సైకిల్ ఫండ్ (40.03 శాతం), యాక్సిస్ బిజినెస్ సైకిల్ ఫండ్ (39.02 శాతం), ఆదిత్య బిర్లా సన్ లైఫ్ బిజినెస్ సైకిల్ ఫండ్ (36.33 శాతం), హెచ్‌డీఎఫ్‌సీ బిజినెస్ సైకిల్ ఫండ్ (31.97 శాతం) ఉన్నాయి.
- గత ఆరు నెలల వ్యవధిలో హెచ్‌ఎస్‌బీసీ బిజినెస్ సైకిల్స్ ఫండ్ 26.72 శాతం, మహీంద్రా మాన్యులైఫ్ బిజినెస్ సైకిల్ ఫండ్ 20.88 శాతం, క్వాంట్ బిజినెస్ సైకిల్ ఫండ్ 17.7 శాతం రిటర్న్‌లు ఇచ్చాయి. ఇదే వ్యవధిలో నిఫ్టీ 500 టీఆర్ఐ ఇండెక్స్ 15.2 శాతమే రాబడినిచ్చింది. మిగతా ఏడు ఫండ్స్ 13 శాతం నుంచి 23 శాతం వరకు రిటర్నులు ఇచ్చాయి.

సాక్షి ప్లస్ స్టాక్స్ వ్యూ

బజాజ్ ఫైనాన్స్ | యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 6,905
టార్గెట్: రూ. 8,030

ఎందుకంటే: ఆర్థిక సేవల రంగ దిగ్గజం బజాజ్ ఫైనాన్స్ పట్టణాలలో 1,500కుపైగా, గ్రామీణ ప్రాంతాలలో 2,600 బ్రాంచీలను నిర్వహిస్తుండటం ద్వారా కార్యకలాపాలను భారీగా విస్తరించింది. రెండు లక్షలకుపైగా రుణ పంపిణీ పాయింట్లతో సేవలందిస్తోంది. తద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం(క్యూ1) చివరికల్లా 8.81 కోట్ల కస్టమర్ల బేస్‌ను ఏర్పాటు చేసుకుంది. క్యూ1(ఏప్రిల్-జూన్)లో నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) వార్షికంగా 31 శాతం, త్రైమాసికం వారీగా(2023-24 క్యూ4తో పోలిస్తే) 7 శాతం చొప్పున ఎగశాయి. వివిధ విభాగాలలో వృద్ధి ఇందుకు సహకరించింది. డిజిటల్ లెండింగ్ ప్రొడక్టులు.. ఈకామ్, ఇన్‌స్టాఈఎంఐలపై ఆర్‌బీఐ ఆంక్షలను ఎత్తివేయడంతో జూన్ మధ్య నుంచి అన్ని ప్లాట్‌ఫామ్‌లపైనా లైవ్ ఆఫరింగ్‌ను ప్రారంభించింది. వెరసి రానున్న మూడు త్రైమాసికాలలో ఈ ప్రభావం ప్రతిఫలించనుంది. అయితే క్యూ1లో సీవోఎఫ్ పెరుగుదల, పోర్ట్‌ఫోలియో మిక్స్‌లో మార్పుల కారణంగా నికర వడ్డీ మార్జిన్లు(ఎన్ఐఎం) నీరసించాయి. మూడేళ్ల కాలం(2025-27)లో ఎన్ఐఎం 9.5-9.6 శాతంలో స్థిరపడవచ్చు. ప్రస్తుతం 9.8 శాతంగా నమోదయ్యాయి. క్యూ1లో స్థూల(0.86 శాతం), నికర(0.38 శాతం) మొండిబకాయిలు త్రైమాసికవారీగా నిలకడను చూపడం ద్వారా ఆస్తుల(రుణాలు) నాణ్యతలోనూ స్థిరత్వం కనిపించింది. ప్రస్తుతం రుణ నాణ్యతలో కనిపిస్తున్న సమస్యలు తాత్కాలికమే. రానున్న రెండు త్రైమాసికాలలో తిరిగి స్థిరత్వం సంతరించుకోనున్నట్లు కంపెనీ యాజమాన్యం భావిస్తోంది. 2025-27 కాలంలో ఏయూఎం 26 శాతం, నికర వడ్డీ ఆదాయం 25 శాతం, నికర లాభం 23 శాతం చొప్పున వృద్ధి చూపగలవని అంచనా.

బంధన్ బ్యాంక్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 169
టార్గెట్: రూ. 260

ఎందుకంటే: బ్యాంక్ సీఈవో, ఎండీగా పార్థ ప్రతిమ్ సేన్‌గుప్తా ఎంపికకు రిజర్వ్ బ్యాంక్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ప్రయివేట్ రంగ సంస్థ బంధన్ బ్యాంక్ వెల్లడించింది. నవంబర్ 10లోగా పదవిని స్వీకరించే అవకాశముంది. మూడేళ్లపాటు బాధ్యతలు నిర్వర్తించేందుకు ఆర్‌బీఐ అంగీకరించినట్లు బ్యాంక్ తెలియజేసింది. దీంతో ఇటీవలి కాలంలో బ్యాంక్ యాజమాన్య నిర్వహణ, కార్యకలాపాలలో ఏర్పడిన సందిగ్ధతకు తెరపడనుంది. కార్పొరేట్ బ్యాంకింగ్, రిటైల్ క్రెడిట్(రుణ) విభాగాలలో సేన్‌గుప్తాకున్న అనుభవం బ్యాంక్‌కు తోడ్పాటునివ్వనుంది. దీంతో గత కొన్నేళ్లుగా క్రెడిట్ బిజినెస్‌లో బంధన్ బ్యాంక్ ఎదుర్కొంటున్న సవాళ్లకు చెక్ పడే అవకాశముంది. మరోవైపు బ్యాంక్ కోవిడ్-19 కాలంలో సీజీఎఫ్ఎంయూ, ఈసీఎల్‌జీఎస్ పథకాల పేరుతో చేసిన క్లెయిములపై నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌ను విడుదల చేసింది. బ్యాలన్స్‌షీట్‌లో నిర్వహిస్తున్న వీటి పోర్ట్‌ఫోలియోపై బ్యాంక్ రూ. 228 కోట్లమేర రికవరీలను సాధించింది. వెరసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికం(జులై-సెప్టెంబర్)లో వీటి ద్వారా రూ. 543 కోట్లమేర ఇతర ఆదాయంగా నమోదు చేసేందుకు వీలుంది. ఇది బ్యాంక్ క్యూ2 పన్నుకుముందు లాభం(పీబీటీ)లో 38 శాతంగా అంచనా. ఈసీఎల్‌జీఎస్ పథకంలో భాగంగా రూ. 347 కోట్ల తాజా క్లెయిములను నమోదు చేసేందుకు ఎన్‌సీజీటీసీ అనుమతించింది. మైక్రోఫైనాన్స్ విభాగం ఆస్తుల నాణ్యత విషయంలో సవాళ్లు కొనసాగుతున్న కారణంగా ఈ విభాగంలో బంధన్ తక్కువ వృద్ధిని సాధించే అవకాశముంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే



సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట టోకరా

గుంటూరులోని సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వాకం

రోడ్డునపడ్డ వందలాది మంది ఉద్యోగులు

ఏపీ, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ బాధితులు

గుంటూరు: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటూ 'డెవలప్ ట్రీస్ డీఎస్ఆర్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థ ఫేస్‌బుక్ ద్వారా ప్రచారం హోరెత్తించింది. భారీ వార్షికాదాయం చెల్లిస్తామని, ఉద్యోగ భద్రత, పీఎఫ్, బీమా ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తామని నిరుద్యోగులకు ఆ సంస్థ ఎర వేసింది. ఏపీ, తెలంగాణతోపాటు పాండిచ్చేరి, కన్యాకుమారి, బెంగళూరు, తమిళనాడు, మహారాష్ట్ర నిరుద్యోగులు ఆ ప్రకటనకు ఆకర్షితులయ్యారు. సుమారు 600 మంది రూ.లక్షల్లో డిపాజిట్ చెల్లించి ఉద్యోగాల్లో చేరారు. ఎవరికీ జీతాలు, పీఎఫ్ చెల్లింపులు లేకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల కథనం ప్రకారం.. గుంటూరు అమరావతి రోడ్డులో ఆ ప్రైవేట్ కంపెనీని 2021లో స్థాపించారు. ఫేస్‌బుక్ ద్వారా నిరుద్యోగులను ఆకర్షించారు. దాదాపు 600 మంది చేరగా.. 100 నుంచి 150 మంది గుంటూరులోని కార్యాలయంలో విధులు నిర్వర్తించేవారు. పొరుగు రాష్ట్రాల్లో వారు వర్క్‌ఫ్రమ్ హోం చేసే వారున్నారు.

భారీగా వసూళ్లు

ఆ సంస్థ ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వసూలు చేసింది. ఆ తరువాత ఉద్యోగంలో చేరిన వారికి కష్టాలు మొదలయ్యాయి. జీతం అడిగితే ట్రెనింగ్ అంటూ దాటవేసేవారు. గట్టిగా అడిగితే బూతులు తిట్టేవారు. మహిళలతో అసభ్యంగా మాట్లాడేవారు. 3 నెలల శిక్షణ అనంతరం నెలకు రూ.40 వేల జీతం, వార్షిక ఆదాయం రూ.6 లక్షలు చెల్లిస్తామని చెప్పేవారు.

పురందేశ్వరి, పెమ్మసాని బంధువులంటూ..

తమకు బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిన్ని వరుస అని, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బంధువని నిర్వాహకులు చెప్పుకునేవారు. పోలీస్ ఉన్నతాధికారులు బాగా తెలుసునని, హైదరాబాద్‌లో ఓ రౌడీషీటర్ పేరు కూడా చెప్పి బెదిరించేవారని బాధిత ఉద్యోగులు తెలిపారు. ఈ విషయాన్ని బాధితులు గుంటూరు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా.. అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని గుంటూరుకు చెందిన షేక్.రసూల్ తెలిపారు. తాము డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను కలవగా.. రాజోలు ఎమ్మెల్యేతో మాట్లాడించారని చెప్పారు. ఆ తరువాత ఎమ్మెల్యే గల్లా మాధవికి విన్నవించామని తెలిపారు. తమకు న్యాయం జరుగుతుందనే ఆశలేదని బాధితులు సీహెచ్.సాయి (విజయనగరం), జగదీష్, ఝాన్సీ (శ్రీకాకుళం), హేమంత్, మహేందర్ (తెలంగాణ) వాపోయారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మార్గనిర్దేశకులు

నేటి నుంచి ఉపాధ్యాయులకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

సాక్షి, అమరావతి: విద్యార్థులను ఉన్నత చదువులు, ఉత్తమ భవిష్యత్ వైపు ప్రోత్సహించేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి ప్రభుత్వ పాఠశాలలోను విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్ నిపుణులను అందుబాటులో ఉంచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనుంది. యునిసెఫ్ ప్రాజెక్టులో భాగంగా కెరీర్ గైడెన్స్ కంటెంట్ రూపకల్పనపై మొదటి విడత శిక్షణను సోమవారం నుంచి మూడు రోజుల పాటు విజయవాడలో నిర్వహించనున్నట్టు సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత తెలుగు వెర్షన్ శిక్షణ పూర్తయ్యాక, ఇంగ్లిష్ మీడియంలో కూడా అందిస్తామని, దీనిద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేసేందుకు ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థుల రిపోర్టింగ్‌కు గడువు పెంపు

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా మూడో దశ కౌన్సెలింగ్‌లో సీటు పొందిన విద్యార్థులు కళాశాలల్లో రిపోర్టు చేయడానికి మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు గడువు పొడిగించారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారంతో రిపోర్టింగ్‌కు గడువు ముగియనుంది. అయితే, కళాశాలల్లో రిపోర్టింగ్‌కు మరో రోజు గడువు పొడిగించినట్లు తెలియజేస్తూ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

విశ్వవిద్యాలయాలు పరిశోధనా కేంద్రాలుగా వెలుగొందాలి

ఐసీఎస్ఎస్ఆర్ డిప్యూటీ డైరెక్టర్ అభినవ్ పీయూష్



ఏఎన్‌యూ: విశ్వవిద్యాలయాలు పరిశోధనా కేంద్రాలుగా వెలుగొందాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) న్యూఢిల్లీ డిప్యూటీ డైరెక్టర్ అభినవ్ పీయూష్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర విశ్వవిద్యాలయాల విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగింది. ఈ సమ్మేళనాన్ని ప్రారంభించిన అనంతరం అభినవ్ మాట్లాడుతూ పరిశోధనల ద్వారా మాత్రమే భారతదేశం పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్న వికసిత్ భారత్ 2047 సాధ్యం కావాలంటే పరిశోధనలు ఎంతో కీలకమన్నారు. భారత ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో పరిశోధనల కోసం వేల కోట్ల రూపాయలు కేటాయిస్తోందని తెలిపారు. నంబూరు వీవీఐటీ విద్యాసంస్థల అధినేత వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవిత ఆదర్శంతో ఏబీవీపీ పనిచేస్తుందన్నారు. భారత రక్షణ శాఖ ముజుగాన్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ బైరిశెట్టి మల్లికార్జున మాట్లాడుతూ ఏబీవీపీ ఉద్యమాల కారణంగానే 370 ఆర్టికల్ రద్దు జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ దక్షిణ మధ్య సంఘటన కార్యదర్శి శివకుమార్, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ మురళీధర్, రాష్ట్ర కార్యదర్శి యాచంద్ర, ఏబీవీపీ గుంటూరు జిల్లా కన్వీనర్ మల్లవరపు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని 'ధర'వు

నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించలేని కూటమి ప్రభుత్వం

ప్రత్యేక కేంద్రాల్లో కందిపప్పు, బియ్యం, పామాయిల్ తక్కువ ధరకే అంటూ ప్రచారం

నాణ్యత లేకపోవడంతో కొనేందుకు ప్రజల విముఖత

మండల కేంద్రాల్లో నేటికీ తెరచుకోని ప్రత్యేక కేంద్రాలు



కాకినాడ సిటీ: రోజురోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరలు నియంత్రిస్తామని చెప్పిన ప్రభుత్వం మాటలకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన కందిపప్పు, బియ్యం అందుబాటులోకి తెస్తామన్న కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. ఓ వైపు కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. కందిపప్పు ధర డబుల్ సెంచరీ దగ్గరకు చేరింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం ఇస్తామంటే ఆశపడిన పేద, మధ్యతరగతి ప్రజలు వాటి నాణ్యత, ధరలు చూసి విస్తుపోయారు. ఇంతోటి సంబరానికి అంతటి డప్పెందుకని విమర్శిస్తున్నారు. పామాయిల్ బయట మార్కెట్‌లో కిలో రూ. 110కి, సన్‌ఫ్లవర్ రూ.134కు దొరుకుతుంటే ప్రత్యేక కౌంటర్లలో ధర రూ.110, రూ.124లు అమ్మే విధంగా నిర్ణయించడం విడ్డూరంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.

మాటలకే పరిమితమైన నాణ్యత

మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో కందిపప్పు, బియ్యం అందించే ప్రత్యేక కేంద్రాలను స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు ఆగస్టు నెలలో అట్టహాసంగా ప్రారంభించారు. కానీ ఆ కేంద్రాలతో ప్రజలకు ఒనగూరిందేమీ లేదని, ఇప్పుడు పామాయిల్ అమ్మకాల కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కౌంటర్ల వల్ల ప్రజలకు ఏ ఉపయోగం ఉండదన్న అభిప్రాయం వినిపిస్తోంది. కేజీ కందిపప్పు రూ.160, స్టీమ్ బియ్యం కేజీ రూ.49 వంతున ప్రత్యేక కేంద్రాల్లో అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. బయట మార్కెట్‌లో కందిపప్పు రకాలను బట్టి రూ.160 నుంచి రూ.225 వరకు లభిస్తున్నాయి. బియ్యం కూడా రకాలను బట్టి రూ.42 నుంచి లభ్యమవుతున్నాయి. ప్రత్యేక కేంద్రాల్లో కందిపప్పు, బియ్యం నాణ్యత లేకపోవడంతో పాటు ధరలలో వ్యత్యాసం నామమాత్రంగా ఉండటంతో ప్రజలు వాటి వైపు వెళ్లడమే మానేశారు.

కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తం

జిల్లాలో పలు మండలాల్లో మొదటి నెలలో ప్రత్యేక కేంద్రాలకు పప్పు, బియ్యం సరఫరా కాలేదు. రెండో నెలలో తూతూ మంత్రంగా కందిపప్పు, బియ్యం చేరాయి. అదీ నాణ్యత లేని రెండో రకం బియ్యం, కందిపప్పు సరఫరా చేశారని వినియోగదారులు అంటున్నారు. ఒక్క కాకినాడ రైతుబజారు మినహా జిల్లాలో ఏ ఒక్క మండలంలోనూ కందిపప్పు, బియ్యం పంపిణీలకు ప్రత్యేక కౌంటర్లు తెరచుకోలేదు. కొన్ని మండలాలకు సరకు పంపేందుకు రవాణా చార్జీల చెల్లింపుల్లో స్పష్టత లేక సరకుల పంపిణీ ఆగినట్టు సమాచారం. పెద్దాపురం, జగ్గంపేట, తుని, పిఠాపురం, తాళ్లరేవు, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో కందిపప్పు, బియ్యం పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు తెరచుకోనే లేదు. అదేవిధంగా ఇప్పుడు నూనె (పామాయిల్) సరఫరా కూడా ఉంటుందని ప్రజలు పెదవి విరుస్తున్నారు. తమకు ప్రత్యేక కేంద్రాల ద్వారా కందిపప్పు, నూనె, బియ్యం పంపిణీ అమ్మకాలు వద్దని, నేరుగా రేషన్ షాపుల్లోనే వీటిని గతంలో మాదిరిగా ప్రభుత్వం నిర్ణయించిన సబ్సిడీ ధరలకు అందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాకినాడ రైతుబజార్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో ప్రజలు కొనుగోలు చేయని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎప్పుడు చూసినా ఆ షాపు ఖాళీగానే దర్శనమిస్తోంది.

రేషన్ దుకాణాల్లో సరకులేవీ?

రేషన్ కార్డుదారులకు కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేసున్న రాష్ట్ర ప్రభుత్వం కందిపప్పు, పంచదార, గోధుమ పిండి, పామాయిల్ తదితర సరుకుల పంపిణీకి ఎగనామం పెట్టడంపై విమర్శలు వ్యక్తమవున్నాయి. రేషన్ దుకాణాల్లో రూ.67కే లభించాల్సిన కేజీ కందిపప్పును ప్రత్యేక కేంద్రాల పేరుతో రూ.160కు విక్రయించడమేంటని ప్రజలు వేస్తున్న ప్రశ్నకు సమాధానమిచ్చే వారే లేరంటున్నారు. గతంలో రూ.50కే ఇచ్చే పామాయిల్ 910 గ్రాముల ప్యాకెట్ ఇప్పుడు రూ.110 అంటూ ప్రచారం చేస్తున్నారంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సరకులను డీలర్ షాపుల ద్వారా అమ్మాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



పండగలు వస్తున్నాయంటే నిత్యావసర సరుకుల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. గత నాలుగు నెలలుగా నిత్యావసర వస్తువులు, పప్పులు, కూరగాయల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దుకాణానికి వెళ్లి సరకులు కొనుగోలు చేయాలంటే భయమేస్తోంది. ప్రభుత్వం కందిపప్పు, బియ్యం అమ్మకాలకు రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్ తెరిచినా రేట్లలో పెద్దగా తేడా లేదు. రేషన్ షాపుల ద్వారా గతంలో మాదిరిగా సబ్సిడీ రేట్లకు నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తే పేదలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఆతం భద్రం, కాకినాడ

రేట్లు పెరిగినా కొనుగోలు తప్పదు



అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నేతలు ధరలు తగ్గించకపోగా రోజురోజుకూ పెంచుకుంటూ పోతున్నారు. ఈ ప్రభుత్వం ధరల నియంత్రణలో పూర్తిగా విఫలం అయింది. నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగి భారంగా మారినా కొనుగోలు చేయక తప్పడం లేదు. రెండు నెలల క్రితం బియ్యం, కందిపప్పు, ఇప్పుడు పామాయిల్‌ను ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు చేస్తామని ప్రకటించారు. రైతుబజార్ ఎక్కడో దూర ప్రాంతంలో ఉండడం, అక్కడ నాణ్యమైన సరకు ఉండకపోవడంతో ప్రజలు వాటిని దరి దాపులకే వెళ్లడంలేదు. ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్ల ద్వారా అందించే సరుకులు పేదలకు అంటుబాటులో లేవు. రేషన్ షాపుల్లో గతంలో మాదిరిగా సబ్సిడీ ధరలకు నిత్యావసర సరకులు అందించాలి.

– జగడం శ్రీహరి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, తూరంగి

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

ఉల్లి రైతు కంట కన్నీరు


కుళ్లిన పంటను చూపుతున్న రైతు

హొసపేటె: ఉల్లి సాగు చేసిన రైతులు ఆశించిన లాభం రాకుండా నష్టపోయారు. రైతులు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఉల్లిపాయను తొలగించిన తర్వాత రైతు పొలంలో పంట కుళ్లిపోయింది. జిల్లాలోని హొసపేటె, కూడ్లిగి, హడగలి, హరపనహళ్లి, హగరిబొమ్మనహళ్లి, కొట్టూరు తాలూకాల్లో ఉల్లి పంటకు దెబ్బపడింది. కూడ్లిగిలో హిరేహెగ్డాళ, పూజారహళ్లి, సుల్తాన్‌పుర, సిద్ధాపుర, ఆలూరు, గుండుముణుగు, కడకోళ, భీమసముద్ర, కొట్టూరు తాలూకాలోని అలబూరు, అయ్యనహళ్లి, కందగల్లుల్లో ఉల్లిపాయ పంట కుళ్లిపోయింది.

అధిక లాభాలంటూ రూ.12.56 లక్షల వంచన

హుబ్లీ: షేర్ మార్కెట్‌లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలతో పాటు ఐపీఓ ఇస్తామంటూ ధార్వాడ నివాసి ఎం.సోరస్‌ను నమ్మించి రూ.12.56 లక్షలను ఆన్‌లైన్‌లో కేటుగాళ్లు తమ ఖాతాలోకి బదలాయించుకొన్నారు. సోరస్‌ను వాట్సప్ ద్వారా సంప్రదించిన వంచకులు మెండుగా లాభాలు వస్తాయని తమ వాట్సప్ గ్రూపులో చేరి్పంచుకున్నారు. అనంతరం బాధితుడి వివిధ బ్యాంక్ ఖాతాల నుంచి రూ.12,56,136లను తమ ఖాతాకు బదలాయించుకొన్నట్లు బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విషం తాగి విద్యార్థి ఆత్మహత్య


దర్శన్(ఫైల్)

హొసపేటె: వ్యక్తిగత కారణాలతో దర్శన్(21) అనే విద్యార్థి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కూడ్లిగి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఎస్‌ఏటీ ప్రథమశ్రేణి కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దర్శన్ శుక్రవారం ఉదయం తమ ఊరు నుంచి వచ్చి కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల కళాశాలకు వెళ్లగా అస్వస్థతకు గురికావడంతో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తదుపరి మెరుగైన చికిత్స కోసం బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఘటనపై కూడ్లిగి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

భూస్వాధీన ప్రక్రియ షురూ

హుబ్లీ: హుబ్లీ– ధార్వాడ ఆరు లైన్ల బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి తాలూకాలోని కొన్ని గ్రామాల్లో అవసరమైన అదనపు భూమిని స్వాధీనం చేసుకొనే ప్రక్రియ ప్రారంభమైంది. తొలిదశలో తీర్పు ప్రకటించిన నేపథ్యంలో సదరు భూమిలో పొలం, కట్టడాలు, వృక్షాలను స్వాధీనం చేసుకొనేందుకు సంబంధితులకు ఇప్పటికే నోటీసులు పంపారు. రోడ్డు నిర్మాణం కోసం సదరు పొలాల సేకరణ అవసరమైనందు వల్ల తగిన పరిహారం తీసుకోవడానికి రికార్డులను దాఖలు చేసిన 7 రోజుల్లో పరిహారం అందజేస్తారు. లేదా నోటీసు జారీ అయిన 60 రోజుల్లో సంబంధిత కేసుల పరిహారధనాన్ని నియమానుసారంగా కోర్టులో డిపాజిట్ చేస్తామని జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార నెం–48వ భూస్వాధీన అధికారి ఓ ప్రకటనలో తెలిపారు.

బైక్‌పై కమిషనర్ సిటీ రౌండ్స్


బైకుపై రాత్రి వేళ సంచరిస్తున్న కమిషనర్

హుబ్లీ: జంట నగరాల్లో నేరాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక కార్యాచరణ మొదలు పెట్టారు. ఈమేరకు శనివారం రాత్రి పోలీసు కమిషనర్ శశికుమార్ స్వయంగా బైకుపై హుబ్లీ నగరంలో వివిధ చోట్ల సంచరించి పరిశీలించారు. ఈక్రమంలో పోలీసులు మద్యపానం చేసి అల్లర్లకు పాల్పడుతున్న, రికార్డు లేని వాహనాలకు సంబంధించి యువకులకు చురుకు ముట్టించారు. అనుమానాస్పద వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. అలాగే కొన్ని బైకులను, కార్లను కూడా సీజ్ చేశారు. ప్రస్తుతం జంటనగరాల్లో రౌడీల ఆగడాలు కొంత తగ్గాయి.

కళలను కాపాడుకోవాలి

రాయచూరు రూరల్: నేటి రోజుల్లో నశించిపోతున్న నాటక రంగ కళలకు ప్రాధాన్యత కల్పించాలని రాయచూరు విశ్వవిద్యాలయం సిండికేట్ సభ్యుడు చెన్నబసవ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి పండిత సిద్దరామ జంబలదిన్ని రంగ మందిరంలో కళాదేవి కలా బళగ, కన్నడ సంస్కృతి శాఖ ల ఆధ్వర్యంలో ఎడదొరె నాడు కళా ఉత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత కళాకారులు వేసే నాటకాలను గుర్తించి వారి కళానైపుణ్యతకు ప్రస్థానం కల్పించాలన్నారు. అధ్యక్షురాలు మమత, రాజ్‌గోపాల్, మహదేవ, శివశరణేగౌడ, హనుమంతప్ప, బసవరాజ్, బషీరుద్దీన్, శరణప్ప, నరసింహలున్నారు.

ఆస్తి కోసం బెదిరింపులు

హుబ్లీ: ఇళ్ల మధ్యలో ఉన్న ఆస్తులకు సంబంధించి సదరు స్థలాన్ని తమకే అమ్మాలని ముగ్గురు మహిళలు కలిసి ఇద్దరిపై దాడి చేసి చంపుతామని బెదిరించిన ఘటన పాత హుబ్లీ జిడ్డి వీధిలో చోటు చేసుకుంది. అల్తాఫ్ అహమ్మద్, దస్తగిరిసాబ్‌తో పాటు ఓ మహిళతో కలిసి ముగ్గురు పక్కీరప్పరెడ్డి, శ్రీదేవిరెడ్డిలపై దాడి చేసినట్లు పాత హుబ్లీ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

270 టీఎంసీల నీరు నది పాలు

- తుంగభద్ర డ్యాం నుంచి వృథాగా పోతున్న వైనం
- ఏటేటా బయటకు వెళుతున్న వందలాది టీఎంసీలు
- పాలకులు పట్టించుకోకపోతే రైతుల పరిస్థితి అధోగతే


తుంగభద్ర డ్యాం(ఫైల్)

సాక్షి బళ్లారి: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజల జీవనాడిగా పేరొందిన తుంగభద్ర జలాశయం నుంచి ఈ ఏడాది దాదాపు 270 టీఎంసీలకు పైగా నీరు నది ద్వారా వృథాగా బయటకు వెళ్లాయి. తుంగభద్ర డ్యాం నిర్మాణం జరిగినప్పటి నుంచి ఇంతవరకు 75 సంవత్సరాలకు పైగా డ్యాంలో పూడిక చేరడం వల్ల 30 టీఎంసీల వరకు డ్యాంలో నీటిమట్టం క్రమేణ తగ్గుతూ వచ్చింది. తుంగభద్ర డ్యాం గరిష్ట నీటి నిల్వ 131 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వ సామర్థ్యం 101 టీఎంసీలకు పడిపోయింది. తుంగభద్ర డ్యాం నిర్మాణం జరిగినప్పటి నుంచి డ్యాం నుంచి ప్రతి సంవత్సరం వందలాది టీఎంసీలు దిగువకు వెళ్తున్నాయి. ఈనేపథ్యంలో పూడిక ద్వారా నష్టపోతున్న నీటిని రైతులకు చేర్చేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవడం లేదు. డ్యాంలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడం వల్ల దామాషా ప్రకారం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు కేటాయించిన నీటి నిల్వలు కూడా తగ్గించి ఆయా ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు.

చొరవ చూపని ప్రభుత్వాలు

డ్యాంలో పూడిక చేరడం వల్ల నష్టపోతున్న నీటిని కాపాడుకునేందుకు కర్ణాటక, ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులకు శాపంగా మారింది. సమాంతర కాలువ, కొప్పళ జిల్లాలో నవలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణాలు చేపడుతామని ప్రభుత్వ పాలకులు మాటలకే పరిమితం అవుతున్నారే కానీ ఆ దిశగా పనులను, అందుకు సంబంధించిన కార్యాచరణ, నిధుల కేటాయింపుపై దృష్టి పెట్టకపోవడంతో సమాంతర కాలువ నిర్మాణం జరగకపోవడంతో ఏటేటా డ్యాం నుంచి వృథాగా నీరు బయటకు వెళ్తున్నాయి. సమాంతర కాలువ నిర్మాణం జరిగితే అనంతపురం జిల్లాలో దాదాపు 30 టీఎంసీల నీరు నిల్వ ఉంచేందుకు రిజర్వాయర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. పీఏబీఆర్(పెన్నఅహోబిలం రిజర్వాయర్) 10 టీఎంసీలు, ఎంపీఆర్(మిడ్‌పెన్నార్ రిజర్వాయర్) 5 టీఎంసీలు, చాగల్లు బ్యారేజీ 1.5 టీఎంసీలు, పెండేకల్ రిజర్వాయర్ 0.5 టీఎంసీ, సుబ్బరాయ సాగర్, ముచ్చుకోట రిజర్వాయర్లు 1 టీఎంసీ, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 10 టీఎంసీలు నిల్వ ఉంచుకునేందుకు అవకాశాలున్నాయి.

ముందుకు సాగని నిర్మాణాలు

సమాంతర కాలువ నిర్మాణం జరిగితే కరువు జిల్లాలకు నీటిని మళ్లించి రిజర్వాయర్లకు తరలించేందుకు నేతలు చొరవ తీసుకుంటే ఆ ప్రాంత రైతులకు మేలు చేకూరుతుంది. గత 50 రోజుల నుంచి తుంగభద్ర డ్యాం ద్వారా నదికి నిరంతరంగా గేట్ల ద్వారా 270 టీఎంసీల నీరు బయటకు వెళ్లాయి. సమాంతర కాలువ నిర్మాణం జరిగి ఉంటే రోజుకు అర టీఎంసీ నీటిని కాలువల ద్వారా రిజర్వాయర్లకు మళ్లించి ఉంటే 30 టీఎంసీల నీరు, రిజర్వాయర్లలో నిల్వ చేరేది. ఏపీకి సమాంతర కాలువ, కర్ణాటకకు నవలి ప్రాజెక్టు రెండు నిర్మాణాలు జరిగితే దామాషా ప్రకారం నష్టపోతున్న నీటిని, డ్యాం నుంచి వృథాగా నదికి వెళ్తున్న సమయంలో నీటిని నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు, ఆ ప్రాంత సీనియర్ ఇంజినీర్లు, సూచిస్తున్నారు. అయితే ఈ రెండు విషయాలపై మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు మాటలకే పరిమితమవుతున్నందున ఏటేటా డ్యాం నుంచి వందలాది టీఎంసీలు వృథాగా దిగువకు వెళ్తున్నాయి. ఇకనైనా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వ పాలకులు పరస్పరం సహకరించుకుని సమాంతర కాలువ, నవలి ప్రాజెక్టు నిర్మాణాలపై దృష్టి సారిస్తే పూడిక ద్వారా నష్టపోతున్న నీటిని నిల్వ ఉంచుకునేందుకు దోహదం చేస్తుందని చెప్పవచ్చు.

బైక్ చోదకుడు మృతి

హుబ్లీ: హుబ్లీ తాలూకా కంప్లికొప్ప గ్రామానికి వెళ్తున్న వ్యక్తి బైకు మీద గడ్డిమోపును పెట్టుకొని వెళ్తుండగా ట్రాక్టర్ బైకును ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మృతుడిని కంప్లికొప్ప గ్రామానికి చెందిన బసనగౌడ పాటిల్‌గా గుర్తించారు. గాయపడిన గణేష్ వాల్మీకిని చికిత్స కోసం కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనలో శంకరప్ప కల్లమ్మనవర్‌పై హుబ్లీ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

చేనేత పథకం మంజూరుకు డిమాండ్


విజయ్ కుమార్ భాప్రి

రాయచూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిరిగా కర్ణాటకలో కూడా చేనేతలకు సమ్మాన్ పథకాన్ని మంజూరు చేయాలని చేనేతకారుల సంఘం ఉత్తర కర్ణాటక యువ సంచాలకుడు విజయ్ కుమార్ భాప్రి పేర్కొన్నారు. ఆదివారం నగరంలో విలేఖరులతో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో నేతన్న నేస్తం పథకం కింద గత మూడేళ్లుగా ప్రతి కుటుంబానికి ఏటా రూ.24 వేలు ఇస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో రూ.5 వేలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో 60 లక్షల మంది చేనేతకారులున్నారని తెలిపారు. చేనేతలకు సమ్మాన్ పథకంలో అన్యాయం జరిగితే బెంగళూరులో మగ్గాలు చేతపట్టి ఆందోళన చేస్తామన్నారు.

అభివృద్ధి కోసం పట్టం కట్టండి

- తుకారాం సండూరు అభివృద్ధిని విస్మరించారు
- వాల్మీకి మండలి నిధులతో ఎంపీగా గెలిచారు
- గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి ఆరోపణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి


ఎన్నికల ప్రచార సభకు హాజరైన జనం

సాక్షి బళ్లారి: సండూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక్కసారి కాదు, రెండు సార్లు కాదు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం నాలుగోసారి కూడా గెలుపొందినా తుకారాం సండూరును ఏమీ అభివృద్ధి చేయలేదని గంగావతి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గాలిజనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం సండూరు నియోజకవర్గ పరిధిలోని వెంకటగిరి, దౌలత్‌పుర, కృష్ణానగర తదితర గ్రామాల్లో మాజీ మంత్రి శ్రీరాములు, అభ్యర్థి బంగారు హనుమంతుతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఓటర్లను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులకు జనం బ్రహ్మరథం పట్టి స్వాగతం పలికారు. అనంతరం ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఇక్కడి ప్రజలు ఎంతో నమ్మకంతో ఓటు వేస్తే తన అభివృద్ధికే ప్రాధాన్యతను ఇస్తూ సండూరును పూర్తిగా నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుకారాం సతీమణి అన్నపూర్ణను ఓడించి ఈ ప్రాంత అభివృద్ధికి బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. బళ్లారి జిల్లాలో ఐదు మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, లోక్‌సభ మెంబరు కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినే గెలిపించడంతో ఈ ప్రాంత, జిల్లా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడే ప్రతిపక్షానికి చెందిన ఎమ్మెల్యే లేడన్నారు.

ఆడిందే ఆట, పాడిందే పాట

దీంతో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు ఆడిందే ఆట, పాడిందే పాటగా వ్యవహరిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే ప్రశ్నించేందుకు ఒక ఎమ్మెల్యే అసెంబ్లీలో కాలుపెడతారన్నారు. దీంతో సండూరు అభివృద్ధే కాక, జిల్లా సమస్యలను కూడా అసెంబ్లీలో లేవనెత్తేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ ఉప ఎన్నికలు ఎవరి కారణంగా వచ్చాయో జనం తెలుసుకోవాలన్నారు. ఉప ఎన్నికల్లో ప్రజల సొమ్మును ఖర్చు చేయాల్సిన అవసరం ఉంటుందని గుర్తు చేశారు. వాల్మీకి అభివృద్ధి మండలి నిధులతో లోక్‌సభ మెంబర్‌గా గెలుపొంది, మళ్లీ తన భార్యకు కాంగ్రెస్ టికెట్ దక్కించుకొని సండూరు ప్రజలను మోసం చేయడానికి ఎన్నికల ప్రచారంలో ఇంటింటా తిరుగుతున్న లోక్‌సభ సభ్యుడు తుకారాంకు బుద్ధి చెప్పాలంటే బీజేపీని గెలిపించాలన్నారు. సండూరులో తాము ఏం చెబితే అది జరుగుతుందని మంత్రి సంతోష్‌లాడ్, తుకారాం రెండు కుటుంబాలు వ్యవహరిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర బీజేపీ కార్యదర్శి కేఎస్.దివాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యర్థి తరపున జోరుగా ప్రచారం

హొసపేటె: సండూరు ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతు తరపున గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి యశ్వంత్ నగర, సోమలాపుర, బంఢ్రి, బంఢ్రి గొల్లాపుర, కోడిహళ్లి, కాటినకంబ, ఉత్తరమలై గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి ఇప్పటి వరకు అవినీతిలో కూరుకుపోయిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. ఈసారి నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని, మోడల్ నియోజకవర్గంగా సండూరును తీర్చిదిద్దేందుకు, మౌలిక వసతుల కల్పన కోసం బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈసందర్భంగా పార్టీ అభ్యర్థి బంగారు హనుమంతు, మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేఎస్.దివాకర్, మండల అధ్యక్షుడు నానాసాహెబ్ నిక్కం, కాటినకంబ గ్రామ నాయకులు భీమేష్, దుర్గప్ప, భరమప్ప, లక్ష్మప్ప, బి.నాగరాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన బస్సు, టాటా ఏస్


పండ్ల దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ

రాయచూరు రూరల్: జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలయ్యాయి. ఆదివారం సిరవార తాలూకా అత్తనూరు వద్ద ఆర్టీసీ రాజహంస బస్సు, టాటా ఏస్‌ను ఢీకొంది. లింగసూగూరు నుంచి రాయచూరుకు వెళుతున్న బస్సు, రాయచూరు నుంచి అత్తనూరుకు వస్తున్న టాటా ఏస్‌ను ఢీకొంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సిరవార ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై సిరవార పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టైర్ పేలి అదుపు తప్పిన లారీ

ఆదివారం నగర పరిధిలోని బైపాస్ వద్ద లారీ టైర్ పేలడంతో పండ్ల దుకాణంలోకి దూసుకు పోయింది. రాయచూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న లారీ టైర్ పేలడంతో డ్రైవర్ అదుపు తప్పింది. ఆ సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణాపాయం సంభవించలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ సీఐ సాబయ్య తెలిపారు.

నాలుగు చోట్ల టార్పాళ్ల చోరీ

- పుండు మీద కారంలా చౌర్యం
- అయోమయంలో అన్నదాతలు

హుబ్లీ: నిరంతరం వానలతో పంటను రక్షించుకునేందుకు, అంతో ఇంతో మిగిలిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు కష్టపడుతున్న రైతులకు దొంగల బెడద పుండు మీద కారం చల్లిన చందంగా మారింది. జిల్లాలోని కుందగోళ, హుబ్లీ, హావేరి జిల్లా శిగ్గావి, సవణూర తాలూకాల్లో రైతుల పొలాల్లోని గడ్డివాములు వర్షానికి తడవకుండా వేసిన టార్పాళ్లతో పాటు తాళ్లను దొంగలు చోరీ చేసిన ఘటనలు పెరుగుతున్నాయి. దీంతో రైతులు వానల నుంచి పంటను రక్షించుకొన్నా దొంగల నుంచి ఎలా కాపాడుకోవాలో తెలియక అయోమయంలో పడ్డారు. సాధారణంగా రైతులు సోయాబీన్, వేరుశెనగ, మినుము పంటను కోతకోసి గడ్డివాముగా వేసి వర్షానికి తడవకుండా టార్పాళ్లను కప్పుతారు.

టార్పాల్ ధర రూ.2 వేలు పైమాటే

ఒక్కొక్క టార్పాలు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు ధర పలుకుతాయి. ఎడతెరిపి లేని వర్షాల వల్ల రైతులు తమ పొలాల్లోకి వెళ్లడానికి కుదరకపోవడంతో దీన్ని పసిగట్టిన దొంగలు సదరు టార్పాళ్లను రాత్రికి రాత్రే చోరీకి పాల్పడుతున్నారు. దీంతో గడ్డివాము వర్షానికి తడిసి నాశనం అవుతోంది. మళ్లీ రైతులు కొత్త టార్పాళ్లను కొని గడ్డివాముకు కప్పుతున్నారు. వీటిని కూడా దొంగతనం చేస్తే తమ గతి ఏమిటని రైతులు వాపోతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, పోలీసులు తగిన చర్యలు తీసుకొని దొంగలను పట్టుకోవాలని కుందగోళ తాలూకా హిరేఅరకుణి గ్రామ రైతులు ఈరప్ప, మంజు, ముత్తు, నాగరాజ్, ఈశ్వర్ తెలిపారు.

దొంగల బెడద అరికట్టాలి

ఈవిషయమై సదరు గ్రామ పంచాయతీ సభ్యుడు సంగనగౌడ పాటిల్ మాట్లాడుతూ టార్పాళ్లు, తాళ్ల చోరీలు పెరుగుతున్నాయన్నారు. దీంతో రైతులు పంటలను రక్షించుకోవడం కష్టంగా మారిందని, తక్షణమే పోలీసులు తగిన చర్యలు తీసుకొని దొంగల బెడద నుంచి కాపాడాలని కోరారు. కాగా హుబ్లీ తాలూకాలోని హలియాళ, అదరగుంచి, నూల్వి, శరేవాడ, కుందగోళ తాలూకా సంశీ, హుడగేరి, కమడొళ్లి, హిరేఅరకుణి, శిగ్గావి తాలూకా అత్తిగేరి, బసవనాళ, అలగూరు గ్రామాల్లో ఈ చోరీలు జరుగుతున్నాయి. ఈనెల 25న కుందగోళ తాలూకాలో నాలుగు చోట్ల చోరీలు జరిగాయి. మాయ నాయకర్, సిద్ధప్ప, శివకల్లప్ప, సంగనగౌడ పాటిల్ అనే రైతుల పొలాల్లో టార్పాళ్లతో పాటు తాళ్లు చోరీకి గురయ్యాయి.

అదుపులో అతిసార కేసులు

- కోలుకున్న 22 మంది
- ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్

హుబ్లీ: ధార్వాడ జిల్లా కలఘటిగి తాలూకా ముత్తగి గ్రామంలో అతిసార కేసులు ఎట్టకేలకు నియంత్రణలోకి వచ్చాయి. ఆదివారం మూడు వీధుల్లో కలుషిత నీటిని తాగడంతో వాంతులు, విరేచనాల బారిన పడిన 22 మంది కోలుకొని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు జిల్లాధికారి దివ్యప్రభు ఓ ప్రకటనలో తెలిపారు. సదరు గ్రామంలో రక్షిత తాగునీటిని ప్రత్యేక ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తామన్నారు. డీహెచ్‌ఓ డాక్టర్ శశిపాటిల్ నేతృత్వంలో ఇంటింటికీ ఆరోగ్య బృందం వెళ్లి సమీక్ష చేపట్టిందన్నారు. ప్రజల్లో పరిశుభ్రత, నైర్మల్యంతో పాటు రక్షిత తాగునీటి వాడకం గురించి జాగృతి పరిచారన్నారు. తాలూకా ఆస్పత్రిలో ముఖ్యవైద్యాధికారి డాక్టర్ యశ్వంత్ మదీనాకర పర్యవేక్షణలో రోగులకు చికిత్స అందించి రోజు మూడు పూటలా వైద్యసేవలు అందించారన్నారు. తాలూకా ఆస్పత్రిలో అదనంగా అంబులెన్స్ వసతి ఏర్పాటు చేశామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను తాలూకా ఆస్పత్రిలో రాత్రి వేళల్లో విధుల నిర్వహణకు సూచించామన్నారు. మొత్తం 51 మందికి చికిత్స అందించామన్నారు. హుబ్లీ కిమ్స్ ఆస్పత్రిలో 13 మందికి, కలఘటిగి తాలూకా ఆస్పత్రిలో 38 మందికి చికిత్సలు కొనసాగుతున్నాయన్నారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. రోగులు కోలుకునేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి


పాల్గొన్న ప్రిన్సిపాల్, విద్యార్థినులు

రాయచూరు రూరల్: దేశంలో నేటి యువత అన్ని రంగాల్లో ప్రతిభను కనబరిచి రాణించాలని ఎన్‌ఎస్‌ఎస్ అధికారి సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాల, నెహ్రూ యువక కేంద్రం, నగరసభ ఆధ్వర్యంలో జరిగిన యువ సంవాదాన్ని జ్యోతి వెలిగించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి లభించే పథకాలను తీసుకొని వాటిని సక్రమంగా యువత వినియోగించుకోవాలన్నారు. ఈనెలాఖరులో న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో మహిళా కళాశాల విద్యార్థినులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పుష్ప, నమ్రత, పూర్ణిమ, రాజేశ్వరి, సంగీత, ఐశ్వర్య, దీపిక, అంజలి, ప్రతిమలున్నారు.

పిల్లల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు పునాది


జ్యోతి వెలిగిస్తున్న శివరాజ్ పాటిల్

రాయచూరు రూరల్: పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు పునాది కావాలని రాయచూరు శాసన సభ్యుడు శివరాజ్ పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని గాజగారపేట శృంగేరి శారద కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యా శాఖలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు పిల్లల సంక్షేమ కోసం పాటుపడాలన్నారు. ప్రతిభకు తార్కాణంగా విద్యార్థుల భవిష్యత్తును రూపొందించాలన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈసందర్భంగా శాంత మల్ల శివాచార్య స్వామీజీ, గోవిందు, ఆంజనేయ, శశిరాజ్, నాగరాజ్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఆటో డ్రైవర్లు అన్ని దాఖలాలు చూపాలి


మాట్లాడుతున్న సీఐ ఉమేష్ కాంబ్లే

రాయచూరు రూరల్: జిల్లాలోని ఆటో డ్రైవర్లు నవంబర్‌లోగా అన్ని దాఖలాలు చూపించాలని సదర్ బజార్ పోలీస్ స్టేషన్ సీఐ ఉమేష్ నారాయణరావ్ కాంబ్లే ఆదేశించారు. శనివారం రాత్రి సదర్ బజార్ పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. లైసెన్సు, వాహనాల ఫిట్‌నెస్, ఇన్సూరెన్సు, పొల్యూషన్, నంబర్ ప్లేట్లు, హెడ్‌లైట్ల అమరిక, సౌండ్ ఇతరత్ర సర్టిఫికెట్లను పూర్తి చేయాలన్నారు. వాటిని పూర్తి చేయని ఆటోలకు జరిమానా విధిస్తామన్నారు. ఈ సందర్భంగా 15 ఆటోలకు రూ.200 చొప్పున జరిమానా విధించారు. ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ నగరంలో వివిధ ప్రాంతాల్లో సంచరించి వాహన యజమానులకు ప్రచారం చేసి వారిని చైతన్యపరుస్తున్నామన్నారు. మరో 10 రోజుల్లో ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనదారులు తలకు తప్పకుండా హెల్మెట్లు ధరించాలని ప్రచారం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుళ్లు తోటప్ప, మోతీలాల్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సాహిత్య రంగంలో కవులు రాసే కవితలు పాఠకులను మెప్పించేలా ఉండాలని సీనియర్ సాహితీవేత్త మహంతేష్ మస్కి పేర్కొన్నారు. ఆదివారం కన్నడ భవనంలో జిల్లా, తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో యువ సాహితీవేత్త వేణు రాసిన గజల్ కృతి మాతిగె సిగద నవిలు(మాటలకు దొరకని నెమలి) పుస్తకాన్ని విడుదల చేసి మాట్లాడారు. కవితలను రాసేటప్పుడు భవిష్యత్తు తరాలకు అర్థమయ్యేలా రాయాలన్నారు. కార్యక్రమంలో కసాప తాలూకా అధ్యక్షుడు వెంకటేష్, చంద్రశేఖర్, రావుత్ రావు, వీర హనుమాన్, ఆంజనేయ, బసవరాజ్, భాగ్యరాజ్, బాబు భండారిగల్, మ్యాదర్, హక్కి తదితరులు పాల్గొన్నారు.

మానవత చాటిన బస్సు డ్రైవర్

- గర్భిణిని ఆస్పత్రిలో చేర్పించిన వైనం


ఆస్పత్రిలో తల్లీబిడ్డతో వైద్యసిబ్బంది, డ్రైవర్


హొసపేటె: బస్సులో ప్రసవ వేదనతో బాధపడుతున్న ఓ గర్భిణిని ఆర్టీసీ బస్సు డ్రైవర్ నాగరాజు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి మానవతను చాటుకొన్న ఘటన విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకాలో జరిగింది. కొప్పళ జిల్లాలోని కారటగికి చెందిన సుల్తాన్‌బీ అనే మహిళ ఆపరేషన్ చేయించుకొన్న తన భర్తను చూసి శనివారం రాత్రి బస్సులో బెంగళూరు నుంచి ఒంటరిగా స్వగ్రామానికి తిరిగి వస్తోంది. ఈ సమయంలో దొబ్బిహళ్లి సమీపంలో ఆమెకు ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. అదే సమయంలో బస్సులో ఉన్న ఆలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నాగమణి సహకారంతో బస్సులో ప్రసవ వేదనకు గురైన గర్భిణిని ఆర్టీసీ బస్సు డ్రైవర్ గమనించి వెంటనే హైవే పెట్రోలింగ్ సిబ్బంది సహాయంతో బస్సును కూడ్లిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో సుల్తాన్‌బీ క్షేమంగా ప్రసవించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

గొప్ప కవి వాల్మీకి మహర్షి


వాల్మీకి చిత్రపటానికి ఎమ్మెల్యే పుష్పాంజలి

హొసపేటె: చిత్తవాడిగిలో ఆదివారం జరిగిన వాల్మీకి జయంతి వేడుకల్లో భాగంగా విజయనగర ఎమ్మెల్యే హెచ్‌ఆర్.గవియప్ప, వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని గొప్ప కవుల్లో వాల్మీకి ఒకరని అన్నారు. ఆయన సాధించిన అపూర్వమైన సాధనల ఫలితంగానే నేడు ప్రపంచంలో రాముడు, రామాయణాన్ని చూస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా వాల్మీకి జయంతిని ఆచరిస్తున్నారన్నారు. వాల్మీకి మహర్షి సందేశాలు ఆదర్శప్రాయం అన్నారు. వాల్మీకి సమాజ సోదరులు విద్యావంతులై అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నారు. వాల్మీకి సమాజ అధ్యక్షుడు శ్రీనాథ్ గుజ్జల్, వసంత జంబానహళ్లి, మంజునాథ్, హుడా అధ్యక్షుడు ఇమామ్, వాల్మీకి సమాజ నేతలు జంబయ్యనాయక్, కొట్రేష్, హనుమంతప్ప, అంజినప్ప పాల్గొన్నారు.

కాంతరాజ్ నివేదిక అమలు తగదు


మాట్లాడుతున్న చంద్రశేఖర్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కాంతరాజ్ నివేదికను అమలు చేయకుండా తిరస్కరించాలని వీరశైవ లింగాయత సమాజం అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్కార్ నియమించిన కాంతరాజ్ నివేదిక తప్పులతడకగా ఉందని, సామాజిక, ఆర్థిక సమీక్షలో పలు లోపదోషాలున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రభుత్వం కాంతరాజ్ నివేదిక అమలుకు సిద్ధంగా ఉండటాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. దశాబ్దం కిందట వెనుక బడిన వర్గాల నాయకుడు కాంతరాజ్ రూపొందించిన సమీక్షలో పలు దోషాలున్నాయని, వాటిని సవరించకుండా ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వీరశైవ లింగాయత ఉపకులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆయన ఒత్తిడి చేశారు.